


పెరుగుతున్న కుక్కకాటు బాధితులు

- రేబిస్ వ్యాధి బారిన పడితే బతకడం అసాధ్యం
- అందుబాటులో ఏఆర్‌వీ వ్యాక్సిన్
- పీహెచ్‌సీలలో వైద్య సేవలు

మధ్యపేజీలలో


ఆంధ్రజ్యోతి
ANDHRAJYOTHY



16 కడప
శనివారం 5 ఆగస్టు 2017

బ్యాంక్‘రిక్తహస్తం’

2016-17లో దరఖాస్తులు, బ్యాంకర్లు రుణాలిచ్చిన యూనిట్లు



గ్రౌండింగ్‌కు నోచుకోని యూనిట్లు

ప్రభుత్వం వెనుకబడిన వర్గాలకు చెందిన యువతీ యువకులకు స్వయం ఉపాధి కల్పించేందుకు వివిధ కార్పొరేషన్ల ద్వారా కోట్లాది రూపాయలను ఖర్చు చేస్తోంది. సబ్సిడీ రూపంలో నిధులు ఏటా కేటాయిస్తోంది. అయితే ప్రభుత్వాశయానికి తగ్గట్లుగా బ్యాంకులు పనిచేయడం లేదు. అర్హులైన వారికి బ్యాంకులు రుణాలివ్వడం లేదు. దీంతో ప్రభుత్వ లక్ష్యం నీరుగారుతోంది. రుణ దరఖాస్తుల ప్రాసెసింగ్‌లో ఉన్నంత వేగం రుణాలు మంజూరు కావడంలో కనిపించడం లేదు.

6 లో





వైఎస్ జగన్ సభకు వెళ్లి వస్తూ రోడ్డు ప్రమాదం

ఒకరి మృతి... అయిదుగురికి గాయాలు

3 లో

దుబాయ్ పేరుతో మహిళకు మోసం

ఏజెంట్‌పై పోలీసు కేసు నమోదు

3 లో

రైల్వేకోడూరులో కర్నూలు జిల్లా స్మగ్లర్లు

అటవీ శాఖ అదుపులో 22 మంది

3 లో

43 మంది ఎస్‌జీటీలకు షోకాజ్ నోటీసులు

బదిలీల కౌన్సెలింగ్‌కు గైర్హాజరైన ఫలితం

6 లో

ఎర్రచందనం అక్రమ రవాణాకు

అడ్డుకట్ట వేయండి

రాయలసీమ ఐజీ మహ్మద్ ఇక్బాల్



సమావేశంలో ఐజీ ఇక్బాల్, ఎస్పీ బాబూజీ అట్టాడ

6 లో

అటెండరే అక్కడ డాక్టర్!



దేవళంపల్లె పీహెచ్‌సీలో రోగికి రక్తపోటును చూస్తున్న అటెండర్

ఈ చిత్రంలో రోగికి రక్తపోటును పరీక్షిస్తున్నది వైద్యుడు కాదు సుమా... మరెవరవయ్యుంటారు? ఆ ఆస్పత్రిలో తాత్కాలిక ప్రాతిపదికన పనిచేస్తున్న అటెండర్. ఈయనే అక్కడికి వచ్చే రోగులకు దిక్కు. ఇదీ... లక్కిరెడ్డిపల్లె మండలం దేవళంపల్లె ప్రాథమిక ఆరోగ్యకేంద్రంలో పరిస్థితి. ఈ ఆసుపత్రి నుంచి డాక్టర్ ఒకటిన్నర నెల క్రితం బదిలీపై వెళ్లారు. 2005 నుంచి ఇక్కడ పనిచేస్తున్న అటెండరే రాత్రి, పగలు ఈ ప్రాంత రోగులకు దిక్కుగా నిలుస్తున్నాడు.

6 లో

వాటర్‌షెడ్ రైతులకు కుచ్చుటోపీ

● రైతుపేరుతో నాబార్డును దోచేస్తున్న స్వచ్ఛంధ సంస్థ ● మూడేళ్లుగా రైతులకు అందని శాశ్వత డిపాజిట్ పత్రాలు
● రుణాలిస్తామన్నారు ఆర్థిక స్థితిగతులు మారుస్తామన్నారు ● మూడేళ్లుగా కనిపించని రైతుల పురోగతి





పనిచేయని ఆర్‌వో ప్లాంట్, రైతులకు నాబార్డు కింద అందజేసిన శాశ్వత డిపాజిట్ పత్రం

సంబేపల్లె : గ్రామీణ ప్రాంత ప్రజల ఆర్థిక జీవన స్థితిగతులను పెంచడమే లక్ష్యంగా నాబార్డు సంస్థ కోట్ల రూపాయలు పెట్టుబడిగా పెడుతోంది. గ్రామీణ ప్రాంత రైతుల్లో ఆర్థిక జీవన స్థితిగతుల మార్పుకు వ్యక్తిగత రుణాలతో రైతులను నీటి పరివాహక ప్రాంత పరస్పర సహకార సంఘాలను ఏర్పాటు చేసి వారికి శాశ్వత డిపాజిట్ కల్పించి ఏడాదికి శాశ్వత డిపాజిట్‌కు 6 శాతం వడ్డీ ఇస్తూ సంఘాల బలోపేతంతో పాటు వ్యక్తిగత ఆర్థిక రుణాలను ప్రోత్సహిస్తోంది. ఈ వ్యవహారాలను చేపట్టేందుకు రాయచోటి పట్టణానికి చెందిన ఆర్‌హెచ్‌జీబీఎంఎస్‌ఎస్ సంస్థ ఆధ్వర్యంలో చేపడుతోంది. అయితే అడవికమ్మపల్లె నీటి పరివాహక పరస్పర సహకార సంఘం పరిధిలో వాటర్‌షెడ్ రైతులకు కుచ్చుటోపి పెట్టిందని చెప్పవచ్చు. మూడు ఏళ్లు గడుస్తున్నా రైతులకు సంబంధించిన శాశ్వత డిపాజిట్ పత్రాలను రైతులకు అందించలేదు. మీ బ్యాంకు మీ నేస్తం అన్నారు. గోడలపై పెద్ద అక్షరాలతో బోర్డులు రాయించారు. హడావుడిగా అధ్యక్షులను నియమించారు. రైతులందరినీ పిలిచారు. జీవితాల్లో వెలుగు నింపుతామని ఖాతా తెరవాలంటూ ఒక్కొక్క రైతు దగ్గర రూ.120 వసూలు చేశారు. సుమారు 300 మంది వారి మాటలపై నమ్మకంతో అడవికమ్మపల్లె నీటి పరివాహక పరస్పర సహకార సంఘంలో సభ్యులుగా చేరారు. ఒక్కొక్క రైతుకు నాబార్డు 3100 రూపాయలు శాశ్వత డిపాజిట్ పత్రాలు అందించారు. అయితే 50 మంది రైతులకు మాత్రం అందించారు. మిగిలిన రైతులకు మూడు ఏళ్లు గడుస్తున్నా అందించలేదు. శాశ్వత డిపాజిట్‌పై వచ్చే 6 శాతం వడ్డీ ఏమయ్యిందో తెలియదు. గురిగింజకుంట గ్రామం దిన్నెపల్లెలో నీటిశుద్ధి జలం పెట్టారు. రెండు సంవత్సరాలుగా బోరు లేక పనిచేయడం లేదు. నాబార్డు అధికారులు వస్తున్నారంటే హడావుడిగా నీరు కల్పిస్తున్నట్లు హంగు ఆర్భాటాలుచేస్తూ వారికి గంతలు కడుతున్నట్లు స్థానిక రైతులు ఆరోపిస్తున్నారు. దీన్నిబట్టి స్వచ్ఛంధ సంస్థ పేరుతో రైతులకు ఏదో చేస్తున్నట్లు చెబుతూ నాబార్డు నిధులు దోచేస్తున్నారని ఆరోపించారు. ఇప్పటికైనా రైతులకు అందజేయాల్సిన శాశ్వత డిపాజిట్ పత్రాలను వడ్డీతో కలిసి చెల్లించాలని కోరారు.

స్వచ్ఛంధ సంస్థ ప్రతినిధి వివరణ

స్వచ్ఛంధ సంస్థ ప్రతినిధిని వివరణ కోరగా అది ఏమి లేదన్నా సారు తరువాత మాట్లాడుతారన్నా అని అన్నారు.

రుణాలు ఇస్తామన్నారు, ఎక్కడ



రైతు మార్స్‌లో పేరుతో నాబార్డు నిధుల కింద ఆర్థిక రుణాలు ఇస్తామన్నారు. మూడేళ్లు గడుస్తున్నా ఒక్క రూపాయి ఇవ్వలేదు. ఎవరికి ఇచ్చారు తెలియదు. సమావేశాలు పెట్టలేదు. రైతులను అభివృద్ధి చేస్తామని చెప్పి ఏమి చేశారో చెప్పాలి.

\- ద్వారకనాథరెడ్డి, దిన్నెపల్లె

జిల్లాలో అదుపులోనే మలేరియా

● జిల్లా మలేరియా అధికారి త్యాగరాజ్

రామాపురం/లక్కిరెడ్డిపల్లె: జిల్లాలో మలేరియా అదుపులో ఉందని జిల్లా మలేరియా అధికారి త్యాగరాజ్ అన్నారు. శుక్రవారం రామాపురం మండలంలోని గువ్వలచెరువు, కొత్తపల్లె, అలాగే లక్కిరెడ్డిపల్లె మండలంలోని బూడిదగుంటపల్లె, లక్కిరెడ్డిపల్లెల్లో పర్యటించారు. ఈ సందర్భంగా ఇంటింటికి వెళ్లి నీటి తొట్లలో నిల్వ ఉన్న నీటిని పరిశీలించారు. అనంతరం ఆయన స్థానిక పీహెచ్‌సీలో విలేకరులతో మాట్లాడుతూ జిల్లాలో ఇప్పటికి 161 మలేరియా, 16 డెంగ్యూ కేసులు నమోదైనట్లు తెలిపారు. ప్రస్తుత సీజన్‌లో జ్వరాలు అదుపులోనే ఉన్నాయని, జిల్లా వ్యాప్తంగా వైద్య సిబ్బంది గ్రామాల్లో పర్యటించి ఆరోగ్యం పట్ల అప్రమత్తంగా



మలేరియా జ్వరం వచ్చిన పిల్లవాడిని పరిశీలిస్తున్న త్యాగరాజు

ఉండాలని ప్రజలకు వివరిస్తూ నివారణ చర్యలు తీసుకుంటున్నారన్నారు. సీజనల్ వ్యాధుల పట్ల డీఎంహెచ్‌వో, కలెక్టర్ ప్రతిరోజు సమీక్షిస్తున్నట్లు తెలిపారు. గ్రామాల్లో ప్రజలు ఆరోగ్య సూత్రాల పట్ల అవగాహన పెంచుకొని వారంలో ఒకరోజు విధిగా డ్రైడే పాటించాలన్నారు. అలాగే పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలని, రాత్రివేళల్లో దోమతెరలు వాడాలన్నారు. వేపాకు పొగ వేసుకోవడం చాలా మంచిదన్నారు. వ్యాధి సోకిన తరువాత వేల రూపాయలు ఖర్చు చేసుకోవడం కంటే ముందుగా కొన్ని జాగ్రత్తలు తీసుకోవడం ఉత్తమమన్నారు. లక్కిరెడ్డిపల్లె మండలంలోని చింతకుంటవాండ్లపల్లె గ్రామంలో సందర్శించి మలేరియా జ్వరానికి చికిత్స పొందుతున్న ఆసిఫ్ అలీ బాషాలతో కలిసి మాట్లాడి 14 రోజులు మాత్రలు వేసుకోవాలని సూచించారు. ఆయన వెంట మలేరియా సబ్‌యూనిట్ అధికారి ప్రసాద్, సహాయ మలేరియా అధికారి రామచంద్రారెడ్డి, మండల వైద్యాధికారి చంద్రశేఖర్, సీహెచ్‌వో రామాంజులు, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

'ఆంధ్రజ్యోతి' వార్తతో బ్యాంక్ అధికారుల్లో అలజడి

● క్రిమినల్ చర్యల నిలుపుదలకు స్టే కోసం ప్రయత్నాలు

ఆంధ్రజ్యోతి ఎఫెక్ట్

ప్రొద్దుటూరు పుట్టపర్తి సర్కిల్ : చింతలమడుగుపల్లె సొసైటీ అక్రమాల అధికారులపై క్రిమినల్ చర్యలపై శుక్రవారం 'ఆంధ్రజ్యోతి'లో వచ్చిన వార్తపై డీసీసీ బ్యాంక్ అధికారుల్లో అలజడి మొదలైంది. బోగస్ పాస్ పుస్తకాలతో బోగస్ రుణాలిచ్చిన డీసీసీ బ్యాంక్ అధికారులపై సొసైటీ అధికారులపై, రైతులపై క్రిమినల్ చర్యలు నమోదు చేసి వారిని జైలుకు పంపడానికి రంగం సిద్ధమవ్వడంతో వారందరిలో వణుకు పట్టుకుంది. ఇందులో కీలకపాత్రదారులైన బ్యాంక్ అధికారులను గతంలో సస్పెండ్ చేయగా వారు మళ్లీ విధుల్లోకి వచ్చారు. బోగస్ రుణాల మంజూరులో పెద్ద మొత్తంలో బ్యాంక్ నిధులను స్వాహా చేసిన ఆరోపణలపై వీరి నుంచి ఆ సొమ్ము రికవరికి సివిల్ చర్యలను చేపట్టగా దీనిపై బ్యాంక్ అధికారులు స్టే తెచ్చుకున్నారు. దీంతో రైతులపై సివిల్ చర్యలను చేపట్టారు. రెండవ విడత విచాణలో క్రిమినల్ చర్యలు ప్రారంభం అయ్యాయి. క్రిమినల్ చర్యలు ప్రారంభమైతే జైలుకు వెళ్లడం ఖాయమని అధికారులు భయపడుతున్నారు. సివిల్ చర్యల విచారణపై కోర్టు నుంచి స్టే తెచ్చుకున్నట్లుగానే క్రిమినల్ చర్యలపై విచారణపై కూడా స్టే కోసం అధికారులు ప్రయత్నిస్తున్నట్లు తెలిసింది. విచారణ లోతుగా జరిగితే మరికొంతమంది అధికారులపేర్లు బయటికి వస్తాయంటున్నారు. సహకార శాఖలోని ఓ అధికారి భార్య పేరుతో పొందిన ప్రభుత్వ భూముల వ్యవహారం బయటకు వస్తుందని ఆందోళన చెందుతున్నారు. విచారణను అడ్డుకోవడానికి ప్రయత్నిస్తున్నట్లు తెలిసింది.

అందరికీ ఒకేసారి పదోన్నతుల కౌన్సెలింగ్ నిర్వహించాలి

డీఈవోఛాంబరు ఎదుట బైఠాయించిన తెలుగు పండిట్లు
రెండుగంటల పాటు నిలిచిన పదోన్నతుల కౌన్సెలింగ్



బైఠాయించిన ఎల్‌పీలతో మాట్లాడుతున్న డీఈవో

కడప, ఎర్రముక్కపల్లె : లాంగ్వేజీ పండిట్లకు సంబంధించి హిందీ, ఉర్దూ, ఎల్‌పీతో పాటు తమకు కూడా జరపాలని తెలుగులాంగ్వేజీ పండిట్లు డిమాండ్ చేశారు. డీఈవో ఛాంబరు ఎదుట శుక్రవారం లాంగ్వేజీ పండిట్లు బైఠాయించారు. తమకు న్యాయం చేయాలని నినాధాలు చేశారు. డీఈవో శైలజ స్పందిస్తూ తెలుగు లాంగ్వేజీ పండిట్ల రోస్టర్ జాబితా సంబంధించి చిన్న సమస్యవుందని, దానిపై రాష్ట్రశాఖతో సంప్రదించామని వారిచ్చిన సమాచారం మేరకు లాంగ్వేజీ పండిట్లు హిందీ, ఉర్దూ ప్రస్తుతం జరిపించి తెలుగు శనివారం ఉదయం నిర్వహిస్తామన్నారు. దీనికి తెలుగు పండిట్లు ససేమిరా అని తమను కూడా వారితోసమానంగా కౌన్సెలింగ్ నిర్వహించాలని లేకుంటే వారికి కూడా శనివారం జరపాలని పట్టుపట్టారు. దీంతో డీఈవో లాంగ్వేజీ పండిట్ల మధ్య వాగ్వివాదం జరిగింది. కమిషనర్ చెప్పిందే చేస్తాను, ఇందులో నాఇష్టమేమీలేదని చెప్పారు. ఈరోజు నిర్వహించకుంటే పదోన్నతుల కౌన్సెలింగ్ వాయిదా పడుతుందన్నారు. దీంతో లాంగ్వేజీ పండిట్లు తగ్గి తమను శనివారం ఉదయం తప్పకుండా పదోన్నతుల కౌన్సెలింగ్ నిర్వహించాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో పలు సంఘాల నాయకులు పాల్గొన్నారు.



డీఈవోతో వాగ్వాదం చేస్తున్న తెలుగు పండిట్లు

ఫొటోల పోటీ తేదీ గడువు పెంపు

కడప, అర్బన్ : ప్రపంచ ఫొటోగ్రఫీ దినోత్సవం 2017 సందర్భాన్ని పురస్కరించుకొని వివిధ ఇతివృత్తాలలో ముందుకేటగిరీలలో రాష్ట్రస్థాయి ఫొటోగ్రఫీ పోటీలు మరింత మంది ఫొటోగ్రాఫర్లకు అవకాశం కల్పించాలన్న నిర్ణయం మేరకు ఎంట్రీల తుదిగడువును ఈ నెల 10 వరకు పొడిగించనున్నట్లు సమాచార పౌరసంబంధాల శాఖ కమిషనర్ ఒక ప్రకటనలో తెలిపారు.

వ్యక్తిపై హిజ్రాల దాడి

కడప, క్రైం : నగరంలోని ఏఎస్‌ఆర్‌నగర్‌కు చెందిన వ్యక్తిపై అదే ప్రాంతానికి చెందిన హిజ్రాలు దాడి చేసినట్లు తాలూకా ఎస్‌ఐ రాజరాజేశ్వర్‌రెడ్డి తెలిపారు. ఎస్‌ఐ వివరాల మేరకు ఏఎస్‌ఆర్ నగర్‌కు చెందిన ధనుంజయ శుక్రవారం భార్యతో గొడవ పడుతుండగా అక్కడే వున్న హిజ్రాలు సాయి, కల్కి, సిమ్రాన్, బువి మరికొందరు కలిసి ధనుంజయపై దాడి చేసి గాయపరచినట్లు తెలిపారు. బాధితుని ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు తెలిపారు.

వైఎస్ జగన్ సభకు వెళ్లి వస్తూ...

అదుపు తప్పిన వాహనం ● ఒకరు మృతి - ఐదుగురికి గాయాలు



పరామర్శిస్తున్న శాసనసభ్యులు రఘురామిరెడ్డి, మాజీ మంత్రి డీఎల్ రవీంద్రారెడ్డి

మైదుకూరు : నంద్యాలలో వైసీపీ అధినేత వైఎస్ జగన్ పాల్గొన్న ఎన్నికల సభ నుంచి తిరిగి వస్తూ గురువారం రాత్రి వాహనం అదుపు తప్పి బోల్తాపడిన సంఘటనలో స్టాంప్ రైటర్ జగన్మోహన్‌రెడ్డి మృతి చెందగా మరో ఐదుగురు గాయాలపాలయ్యారు. మైదుకూరు వాసి వసంతరామిరెడ్డి తన వాహనంలో స్నేహితులు స్టాంప్ రైటర్ జగన్మోహన్‌రెడ్డి, ఖాజీపేట మండలం మిడుతూరుకు చెందిన వెన్నపూస ఓబుళరెడ్డి, బుక్కాయపల్లెకు చెందిన తవ్వా ఓబుళరెడ్డి, చాపాడు మండలం చిన్నగురువలూరుకు చెందిన శంకర్‌రెడ్డి, భద్రిపల్లెకు చెందిన రామసుబ్బారెడ్డి, ఈశ్వరయ్య వెళ్లారు. సభ అనంతరం తిరిగి వస్తుండగా నంద్యాల సమీపంలోని గోవిందపల్లె వద్ద వాహనం టైరు పగలడంతో అదుపుతప్పి బోల్తాపడింది. ప్రమాదంలో తీవ్రంగా గాయపడ్డ స్టాంప్‌రైటర్ జగన్మోహన్‌రెడ్డిని, మిగిలిన వారిని చికిత్స నిమిత్తం కర్నూలు ఆస్పత్రికి తరలించగా చికిత్స పొందుతూ జగన్మోహన్‌రెడ్డి మృతి చెందారు. జగన్‌మోహన్‌రెడ్డి మృతదేహాన్ని శుక్రవారం సాయంత్రం సాయినాధపురంలోని ఆయన నివాసానికి తీసుకవచ్చారు. జగన్మోహన్‌రెడ్డికి భార్య ఇద్దరు కుమారులున్నారు.

పరామర్శించిన ఎమ్మెల్యే, మాజీ మంత్రి

రోడ్డు ప్రమాదంలో మృతి చెందిన స్టాంప్ రైటర్ జగన్మోహన్‌రెడ్డి భౌతికకాయాన్ని స్థానిక శాసనసభ్యులు ఎస్ రఘురామిరెడ్డి, మాజీ మంత్రి డీఎల్ రవీంద్రారెడ్డి ఇతర నేతలు సందర్శించారు. ఆయన కుటుంబ సభ్యులకు సంతాపం వెలిబుచ్చారు.

రైల్వేకోడూరులో కర్నూల్ జిల్లా స్మగ్లర్లు

22మందిని సమగ్రంగా విచారిస్తున్న అటవీ అధికారులు



కోడూరు రేంజి కార్యాలయంలో ఆళ్లగడ్డ స్మగ్లరును విచారించడానికి తీసుకుపోతున్న అటవీసిబ్బంది

రైల్వేకోడూరు: స్థానిక పాతవశిష్టడిగ్రీకాలేజి సమీప స్థలంలో ఎర్రస్మగ్లర్లు గుమికూడి అడవిలోకి వెళ్లేందుకు సిద్ధంగా ఉన్నారని శుక్రవారం ఉదయం సమాచారం రావడంతో రైల్వేకోడూరు రేంజర్ నయీంఆలీ, డీఆర్వో జయప్రసాద్ సిబ్బందితో దాడులు నిర్వహించారు. కర్నూలుజిల్లాఆళ్లగడ్డకు చెందిన 22మంది స్మగ్లర్లను పట్టుకున్నారు. వారికి స్థానిక స్మగ్లర్లతో సంబంధాల విషయం విచారిస్తున్నామని రేంజర్ నయిమ్‌ఆలీ తెలిపారు. వచ్చిన ఎర్రకూలీల వద్ద కత్తులు, గొడ్డళ్లు, తినుబండారాలు, కూరగాయాలు అటవీ అధికారులు స్వాధీనం చేసుకున్నట్లు తెలిసింది. సమగ్ర విచారణచేస్తున్నారు.

అడవుల్లో సిబ్బంది కష్టపడుతున్నారు

అడవుల్లో ఎర్రకూలీలు, స్మగ్లర్లను పట్టుకునేందుకు తమ సిబ్బంది కష్టపడుతున్నారు. నిద్రాహారాలు లేకుండా నిరంతరాయంగా అడవుల్లోనే కూంబింగ్ నిర్వహిస్తున్నారు. పుల్లంపేట అటవీప్రాంతంలో ఎర్రతమిళకూలీలున్నారన్న సమాచారంతో గాలిలోకి నాలుగురౌండ్లు కాల్పులు కాల్చామని దీంతో తమిళకూలీలు పరారీ అయ్యారని, దీంతో రాజంపేట డీఎస్పీ ఏ.రాజేంద్రకు సమాచారం ఇవ్వడంతో రైల్వేకోడూరు, పెనగలూరు, చిట్వేలి, రాజంపేట, ఓబులవారిపల్లె, సిద్ధవటం తదితర ప్రాంతాల్లో స్థానిక పోలీసులకు డీఎస్పీ సమాచారం అందించాము. అటవీఅధికారులు, సిబ్బంది అప్రమత్తంగా ఉండి ఎనిమిది మంది ఎర్రకూలీలను పట్టుకున్నాము. వీరిని పూర్తిస్థాయిలో విచారణ చేస్తున్నాము. పరారీలో ఉన్న తమిళకూలీల కోసం ముమ్మరంగా గాలింపు చర్యలు చేపడుతున్నాము. కర్నూలుజిల్లా ఆళ్లగడ్డకు చెందిన ఎర్రస్మగ్లర్లను పట్టుకున్నారన్న సమాచారంపై ఉదయాన్నే రైల్వేకోడూరు వచ్చేశా. స్మగ్లర్లను విచారించి పూర్తిస్థాయిలో ఆరాతీసేందుకు స్థానిక రేంజర్ నయంఆలీని ఆదేశించాను.

ఖాదర్‌వల్లి, రాజంపేట డీఎఫ్ఓ

దుబాయ్ పేరుతో మహిళలకు మోసం

ఏజెంట్‌పై కేసు నమోదు



ఎస్ఐ వెంకటేశ్వర్లుకు పిర్యాదు చేస్తున్న మహిళలు నారాయణమ్మ, శివమ్మ

రైల్వేకోడూరు: అయ్యవారిపల్లె వాసి రాజబోయిన శివమ్మకు మాయమాటలతో దుబాయ్‌కి పంపుతామంటూ రియాద్‌కు పంపిన ఘటన శుక్రవారం వెలుగు చూసింది. అక్కడ శివమ్మ పడుతున్న ఇబ్బందులు తట్టుకోలేక ఆత్మహత్యకు యత్నించినట్లు తెలిసింది. విషయం తెలుసుకున్న భర్త గంగాధర్ ఆమెను ఇండియాకు రప్పించారు. ఇందుకు ఆమెకు సుమారు లక్షన్నర వరకు ఖర్చు అయినట్లు బాధితురాలు వాపోయింది. ఇదిలా ఉండగా ట్రావెల్స్ నిర్వాహకుడు కుమార్ అయ్యవారిపల్లెలోని మరో బాధితురాలు నారాయణమ్మను మోస పుచ్చుతుండగా పసిగట్టిన ఆమె ఎస్ఐ వెంకటేశ్వర్లుకు సమాచారం ఇచ్చింది. దీంతో పోలీసు సిబ్బంది నారాయణమ్మ ఇంటికి వెళ్లి జరుగుతున్న తంతును పరిశీలించి కుమార్ ట్రావెల్స్ నిర్వాహకుడు కుమార్‌ను అదుపులోకి తీసుకున్నారు.

కఠిన చర్యలు తీసుకోవాలి



కోడూరుకు చెందిన ట్రావెల్స్ కుమార్‌పై పోలీసులు కఠిన చర్యలు తీసుకోవాలి. డబ్బు పోగొట్టుకున్నాం. సేట్‌ఇంట్లో దాడులకు గురయ్యాం. సమస్యలు ఎదుర్కొన్నాం. నరకయాతన అనుభవించాం. పనులు చేసినా జీతాలు ఇవ్వలేదు. ట్రావెల్స్‌పై చర్యలుతీసుకోవాలి. సేట్‌కు రూ.4లక్షలకు అమ్మేశారు. ఇలాంటివి ఏమహిళకు జరగరాదు.

రాజబోయినశివమ్మ, అయ్యవారిపల్లె, కోడూరు మండలం

ఇండియాలోనే నరకం చూపారు



నన్ను రూ.6లక్షలకు అమ్మేశారని తెలిసింది. సేట్‌ఇంట్లో ఇద్దరు ఉన్నారు. పని చేయాలని మొదట చెప్పారు. నరకానికి వెళ్లక ముందే నరకాన్ని చవిచూపారు. ఒకదేశంపేరుచెప్పి మరో దేశానికి పంపిస్తున్నారు. రైల్వేకోడూరులో మహిళలకు ఇలాంటి అన్యాయాలు జరగకుండా చేయాలి. ట్రావెల్స్ కుమార్‌పై కఠినంగా చర్యలు తీసుకోవాలి.

నారాయణమ్మ, అయ్యవారిపల్లెగ్రామం, కోడూరు మండలం

రోడ్డు ప్రమాదంలో యువకుడు మృతి

కొండాపురం: సుగుమంచిపల్లె వద్ద శుక్రవారం రాత్రి 7:30గంటలక ఆటోను లారీ ఢీకొన్న సంఘటనలో సురేష్ (24) మృతి చెందాడు. దత్తాపురం వాసి సురేష్ పాలవ్యాపారం చేసుకుని తన ఆటోలో తిరిగి వస్తున్నాడు. కాగా రోడ్డుపై గేదె పడి ఉండడంతో ఎదురుగా వస్తున్న లారీ ఆటోను ఢీకొనింది. దీంతో సురేష్‌కు తీవ్ర గాయాలయ్యాయి. అందులో ప్రయాణిస్తున్న మరొకరికి స్వల్ప గాయలయ్యాయి. వీరిని చికిత్స నిమిత్తం తాడిపత్రి ప్రభుత్వ ఆస్పత్రికి తరలించగా అక్కడ చికిత్స పొందుతూ సురేష్ మృతిచెందినట్లు స్థానికులు తెలిపారు.

కుమారుడు కన్పించలేదని ఫిర్యాదు



పోరుమామిళ్ల: తన కుమారుడు 2వ తేదీ నుంచి కన్పించకుండా పోయాడని బాలిరెడ్డిపల్లె వాసి దాకాల గురుస్వామి ఫిర్యాదు చేశారని ఎస్ఐ పెద్ద ఓబన్న తెలిపారు. గురుస్వామి కుమారుడు గురుప్రసాద్ 7వ తరగతి చదివేవాడని, గురుప్రసాద్ ఎత్తుగా ఉన్నాడన్నారు.

గుప్తనిధుల ముఠా అరెస్ట్



గుప్తనిధుల ముఠా, స్వాధీనం చేసుకున్న కార్లు, లొకేటర్‌తో పోలీసులు

సుండుపల్లె: పెదినేని కాల్వ బండకాడ ఈడిగపల్లె వద్ద వెలిసిన శ్రీనాగారపమ్మ తూర్పు వైపు శుక్రవారం గుప్త నిధుల వెలికి తీసే బృందాన్ని అరెస్టు చేసి తహసీల్దార్ ఎదుట హాజరుపర్చినట్లు సీఐ నరసింహారాజు, ఎస్ఐ నరసింహారెడ్డి తెలిపారు. ఈ సందర్భంగా విలేకర్లతో మాట్లాడు తూ గుప్త నిధుల కోసం నాగారపమ్మ ఆలయం తూర్పు భాగాన లొకేటర్‌తో కొందరు ప్రయత్నిస్తున్నారన్న సమాచారంతో తాము దాడులు చేశామన్నారు. సంఘటనా స్థలం నుంచి సుండుపల్లె మండలం నగిరికి చెందిన వెంకటమల్లయ్యనాయుడు, చిత్తూరు జిల్లాకు చెందిన నాగార్జు న, మస్తానయ్య, వాసుదేవ భట్టాచార్య, నరసింహారావు, శివను అదుపులోకి తీసుకుని వారి నుంచి లొకేటర్, రెండు కార్లు స్వాధీనపర్చుకున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో పోలీసు సిబ్బంది పాల్గొన్నారు.

ఏజెంట్ల మాటలకు మోసపోవద్దు : సీఐ



విలేకర్లతో మాట్లాడుతున్న సీఐ పుల్లయ్య

లక్కిరెడ్డిపల్లె: గల్ఫ్‌కు పంపిస్తామని మోసపూరిత మాటలు చెప్పి లక్షలకు లక్ష లు డబ్బు వసూలు చేస్తున్న ఏజెంట్ల మాటలు విని గల్ఫ్‌కు వెళ్లే మహిళలు మోసపోవద్దని సీఐ పుల్లయ్య పేర్కొన్నారు. శుక్రవారం గల్ఫ్ నుంచి సొంత ఊరికి రప్పించిన లక్షుమ్మ, నిర్మల, రాజేంద్రబాబును వారి వారి కుటుంబీకులకు అప్పగించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఏజెంట్ల మోసపూరిత మాటలతో పాలెం ఎగువపల్లె వాసులు లక్షుమ్మ, నిర్మల, రాజేంద్రబాబు, గాలివీడు మండలం గుండ్లచెరువుకు చెందిన మల్లమ్మ గల్ఫ్‌లో ఇబ్బందులు పడుతున్నారని బంధువుల ఫిర్యాదుపై ఎస్పీ ఆదేశాల మేరకు వారిని గల్ఫ్ నుంచి ఇంటికి రప్పించామన్నారు. లక్షుమ్మ, నిర్మల, రాజేంద్రబాబుకు ఎక్కువ జీతం అని నమ్మబలికి ఐదు నెలలు అన్నం, నీళ్లు లేక నానా అవస్థలు పడ్డారని వివరించారన్నారు. వీరిని ఏజెంటు ద్వారా వారి ఇళ్లకు పంపించామన్నారు. గాలివీడు మండలానికి చెందిన మల్లికార్జుననాయుడు గల్ఫ్‌లో ఏడాది కిం దట జరిగిన కాల్పుల్లో మృతి చెందినా మృ త దేహం ఇంతవరకు రాలేదన్నారు. అయితే వారంలోపు మృతదేహాన్ని తెప్పిస్తామన్నారు. కార్యక్రమంలో ఎస్ఐ సురేష్‌రెడ్డి, బాధితులు పాల్గొన్నారు.

సంపద సృష్టి కేంద్రాలు ఏర్పాటు చేయాలి

సిద్దవటం : మండలంలోని 18పంచాయతీలలో సంపద సృష్టి కేంద్రాలు ఏర్పాటు చేయాలని ఈవోపీ ఆర్డీ సోమశేఖర్‌రెడ్డి పేర్కొన్నారు. మండల పరిషత్ కార్యాలయంలో శుక్రవారం సంపద సృష్టికేంద్రాల ఏర్పాటుపై పంచాయతీ రాజ్ ఉపాధి హామీ పథకం శాఖల సమన్వయ సమావేశంలో ఈవోపీఆర్‌డి మాట్లాడుతూ మాచుపల్లి, మాధవరంలో సిద్దవటం, గ్రామ పంచాయతీల్లో సంపదసృష్టి కేంద్రాల ఏర్పాటుకు నిధులు మంజూరయ్యాయన్నారు. అక్టోబర్ 2కు అన్ని పంచాయతీలలో సంపద సృష్టి కేంద్రాలు నిర్మాణం కావాలన్నారు. ఎంపీడీవో జయసింహా, కార్యదర్శి, ఉపాధి సిబ్బంది పాల్గొన్నారు.

వైభవంగా శ్రీ మహాలక్ష్మీ శ్రీనివాస కల్యాణం

● ఆకేపాటి శ్రీ మహాలక్ష్మీ ఆలయంలో ఘనంగా సామూహిక వరలక్ష్మీ వ్రతం ● ఆకేపాటి సోదరులచే భక్తులకు భారీ అన్నదానం





కల్యాణానికి హాజరైన భారీ భక్తబృందం,ఆకేపాడులో జరిగిన శ్రీ మహాలక్ష్మీ శ్రీనివాస కల్యాణం, ఆకేపాడులో జరిగిన సామూహిక వరలక్ష్మీ వ్రతం

రాజంపేట రూరల్

రాజంపేట మండలం ఆకేపాడు గ్రామంలో కొలువు దీరి ఉన్న శ్రీ మహాలక్ష్మీ అమ్మవారి ఆలయంలో శుక్రవారం శ్రీ మహాలక్ష్మీ శ్రీనివాస కల్యాణాన్ని వైభవంగా నిర్వహించారు. వరలక్ష్మీ వ్రతం సందర్భంగా ఆలయంలో ఆలయ నిర్మాణ దాతలు, మండలాధ్యక్షుడు ఆకేపాటి రంగారెడ్డి, ఆయన సోదరులు ఆకేపాటి శ్రీనివాసులరెడ్డి(మురళి)లచే అమ్మవారి కల్యాణోత్సవంతోపాటు సామూహిక వరలక్ష్మీవ్రతాన్ని వైభవంగా నిర్వహించారు. ఉదయం 10గంటలకు సామూహిక వరలక్ష్మీ వ్రత పూజా కార్యక్రమాన్ని వేద పండితులు వేదమంత్రోచ్చారణల మధ్య వైభవపేతంగా నిర్వహించి వచ్చిన భక్తులకు తీర్థప్రసాదాలను అందజేశారు. వేడు కలకు హాజరైన భక్తులకు ఆకేపాటి రంగారెడ్డి, ఆకేపాటి శ్రీనివాసులరెడ్డి (మురళీ)ఆధ్వర్యంలో మధ్యాహ్నం, రాత్రి భారీ అన్నదాన కార్యక్రమాలు నిర్వహించారు. ఈ సందర్భంగా మహిళలు ఎక్కువ సంఖ్యలో పాల్గొని మహాలక్ష్మీ అమ్మవారికి ప్రత్యేకంగా మొక్కులు తీర్చుకున్నారు.

అన్న అమృతహస్తం వరం

ఐసీడీఎస్ సూపర్‌వైజర్ హసీనా.,
సెల్ : 7993676197



ఒంటిమిట్ట : రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా అమలు చేస్తున్న అన్న అమృతహస్తం పథకం గర్భవతులు, బాలింతలకు వరంలాంటిదని ఒంటిమిట్ట ఐసీడీఎస్ సూపర్‌వైజర్ కడప హసీనా అన్నారు. ప్రతి అంగన్‌వాడీ కేంద్రంలో సకాలంలో పౌష్టికాహారం అందించడమే లక్ష్యంగా పనిచేస్తున్నట్లు ఆమె ఆంధ్రజ్యోతి ఇంటర్వ్యూలో వివరించారు.



ప్రశ్న : అన్న అమృత హస్తం ఉద్దేశ్యం ఏమిటి.?

జవాబు : ఈ పథకం ఉద్దేశం గర్భిణులు, బాలింతలకు పౌష్టికాహారం అందించడంతోపాటు మాతాశిశు మరణాలు తగ్గించడమే ముఖ్యమన్నారు.

ప్రశ్న : పుట్టిన బిడ్డలకు ముర్రుపాలు అందేలా చర్యలు చేపట్టారా.?

జవాబు : పుట్టిన బిడ్డలకు ముర్రుపాలు అమృతంతో సమానమని ప్రతి బిడ్డకు ముర్రుపాలు తప్పకుండా అందించాలని అంగన్‌వాడీ వర్కర్ల ద్వారా బాలింతలకు ఈ నెల 1 నుంచి 20వతేదీ అవగాహన కల్పిస్తున్నామన్నారు.

ప్రశ్న : గర్భిణులు అంగన్‌వాడీ కేంద్రాలకు రావడానికి ఇబ్బందులు పడుతున్నట్లున్నారూ.... ?

జవాబు : నిజమే.. నెలలు నిండిన గర్భవతులు ఇబ్బందులకు గురవుతున్నారు. వారికి ఇళ్ల వద్దకే సరుకులు అందించాలని కోరుతున్నారు. ఈ విషయాన్ని ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్లాం.

ప్రశ్న : గర్భిణులకు ఏయే పోషకాలు ఇస్తున్నారు..?

జవాబు : కందిపప్పు, బియ్యం, నూనె, కోడిగుడ్లు వంటి పోషకాలు ఇస్తున్నాం.

ప్రశ్న : మండలంలో ఎన్ని అంగన్‌వాడీ కేంద్రాలు ఉన్నాయి.?

జవాబు : మండలంలోని 13 గ్రామ పంచాయతీల్లో 40అంగన్‌వాడీ కేంద్రాలతో పాటు రెండు మినీ కేంద్రాలున్నాయి.

ప్రశ్న : చిన్న పిల్లలను ప్రాథమిక పాఠశాలలో చేరేందుకు అంగన్‌వాడీలు ఎలాంటి చర్యలు తీసుకుంటున్నారు.?

జవాబు : 5సంవత్సరాల వయసు రాగానే ప్రాథమిక పాఠశాలలో చేర్పిస్తున్నాం.

ప్రశ్న : మండలంలో ఎన్ని ఆయా పోస్టులు ఖాళీగా ఉన్నాయి.?

జవాబు : మూడు పోస్టులు ఖాళీగా ఉన్నాయి. తప్పెటవారిపల్లె, కోనరాజుపల్లె, రాచపల్లెల్లోని అంగన్‌వాడీ కేంద్రాల్లో ఆయా పోస్టులను నియమించాల్సి ఉంది.

11న ఎస్సీ, ఎస్టీ, బీసీ రుణాల కోసం ఇంటర్వ్యూలు

రాజంపేట : మండల పరిధిలోని అన్ని గ్రామ పంచాయతీల్లో ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనారిటీ, కాపు కార్పొరేషన్‌కు సంబంధించి 2017-18సంవత్సరానికి గానూ బ్యాంకుల ద్వారా సబ్సిడీ రుణాల కోసం ఈ నెల 11వ తేదీన ఇంటర్వ్యూలు నిర్వహిస్తున్నట్లు ఎంపీడీవో బాలమునిస్వామి శుక్రవారం తెలిపారు. రాజంపేట ఎంపీడీవో కార్యాలయం జరిగే ఇంటర్వ్యూలకు ఆన్‌లైన్ ద్వారా దరఖాస్తు చేసుకున్న వారందరూ హాజరు కావాలన్నారు. కుల, ఆదాయ, రేషన్‌కార్డు, ఆన్ లైన్ దరఖాస్తు ఫాం, ఆధార్‌కార్డు సంబంధిత ధృవీకరణపత్రాలు తీసుకొని ఇంటర్వ్యూలకు రావాలన్నారు.

విధులు బహిష్కరించిన న్యాయవాదులు

రాజంపేట టౌన్ : రాజంపేట కోర్టులో న్యాయవాదిగా పనిచేస్తున్న వి.వి.రమణ గుండెపోటుతో మృతి చెందడని దీంతోబార్ అసోసియేషన్ ఆధ్వర్యంలో శుక్రవారం విధులు బహిష్కరించినట్లు అసోసియేషన్ అధ్యక్షుడు కొండూరు శరత్‌కుమార్‌రాజు తెలిపారు. మృతికి బార్ అసోసియేషన్ తరపున ప్రగాఢసానుభూతిని తెలిపి సంతాప సూచికంగా న్యాయవాదులు విధులను బహిష్కరించారని ఆయన వివరించారు.

బాలిక అదృశ్యంపై కేసు నమోదు

రాజంపేట : మండల పరిధిలోని కట్టాబ పలెకు చెందిన షేక్ షామీన్ అనే బాలిక అదృశ్యమైందని మన్నూరు పోలీస్‌స్టేషన్‌లో కేసు నమోదు చేయడం జరిగిందని మన్నూరు ఎస్ఐ మహేష్ తెలిపారు. ఎర్రబల్లికు చెందిన వెంకటేష్ అనే యువకుడు షామీన్‌ను జూలై 30వ తేదీన కిడ్నాప్ చేశాడని అందిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామని తెలిపారు.

వరాలిచ్చే వరలక్ష్మికి వైభవంగా వ్రతపూజలు



రాజంపేటలో నిర్వహించిన వరలక్ష్మీపూజలు



ఒంటిమిట్ట కోదండపాణి కోవెలలో వరలక్ష్మీదేవి వ్రతం

రాజంపేట : వరాలిచ్చే వరాల తల్లి వరలక్ష్మికి శుక్రవారం మండలం తోపాటు పట్టణ, గ్రామీణ ప్రాంతాల్లో వైభవంగా వ్రత పూజలు నిర్వహించారు. రాజంపేట ప్రాంతంలో శుక్రవారం మహిళలు వేకువ జామున 4గంటల నుంచి ఎంతో భక్తిశ్రద్ధలతో వరలక్ష్మీ వ్రత పూజలు చేశారు. ఈ సందర్భంగా ఇరుగు పొరుగు మహిళలకు వాయనాలు తాంబూలాలు సమర్పించి వారి ఆశీర్వాదలు తీసుకున్నారు. ఈ సందర్భంగా వరలక్ష్మీని అందంగా అలంకరించి ప్రత్యేక పూజలు నిర్వహించారు.

ఏకాశిలానగరి ఒంటిమిట్టలో..

ఒంటిమిట్ట : ఏకశిలా నగరి ఒంటిమిట్టలోని శ్రీకోదండపాణి కోవెలలో శుక్రవారం సామూహిక వరలక్ష్మీ వ్రతం వైభవంగా జరిగింది. శ్రావణ శుక్రవారాన్ని పురస్కరించుకొని టీటీడీ ఈ కార్యక్రమాన్ని నిర్వహించింది. కోవెల రంగ మండపంలో వరలక్ష్మీ ఉత్సవ మూర్తిని నూతన వస్త్రాలు, పుష్పమాలలు, ఆభరణాలతో అందంగా అలంకరించి పీఠంపై ఆశీనులు చేశారు. ప్రధాన అర్చకులు వీణారాఘవాచార్యుల ఆధ్వర్యంలో అర్చకులు శ్రావన్‌కుమార్, పవన్, మనోజ్‌ల బృందం విశ్వక్సేన పూజ, పుణ్యాహవచనం, షోడశోపచార పూజలు, కుంకుమార్చన, కలశ పూజతో వరలక్ష్మీ దేవి వ్రతాన్ని శాస్త్రోక్తంగా నిర్వహించారు. అమ్మవారికి మహామంగళహారతి చారుమతి దేవి కథను భక్తులకు చదివి వినిపించారు. వరలక్ష్మీదేవిపూజను ఆచరించినా చారుమతి దేవి కథను విన్నా సకల సుభాలు, సిరిసంపదలు కలుగుతాయని అర్చకులు వివరించారు. అనంతరం భక్తులకు తీర్థప్రసాదాలు, పూలుపండ్లు, కంకణా లు అందజేశారు. కార్యక్రమంలో ఆలయ పర్యవేక్షకులు లక్ష్మీనా గరాజు, టీటీడీ సిబ్బంది రాజేంద్రనాయక్, మహిళా భక్తులు పాల్గొన్నారు.

భక్తిశ్రద్ధలతో వరలక్ష్మి వ్రత వేడుకలు

సుండుపల్లె: వరాలనిచ్చే చల్లని తల్లి వరలక్ష్మి వ్రతం శ్రావణ శుక్రవారం మండల కేంద్రంలో మహిళలు భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. ఈ సందర్భంగా కోరుకున్న వరాలిచ్చే అమ్మవారి అనుగ్రహం పొందాలని సిరుల కల్పవల్లి లక్ష్మీదేవిని వరలక్ష్మిగా మహిళలు పూజించారు. ఇందులో భాగంగా వరలక్ష్మి అమ్మవారిని వివిధ ఆభరణాలతో, పట్టవస్త్రాలతో అలంకరించారు. అమ్మవారి మందిరాన్ని నాణెలతో అలంకరించి వరలక్ష్మి వరలక్ష్మి వ్రతంచేశారు. అలాగే స్థానిక వైశ్యబజారులో కన్యకాపరమేశ్వరి అమ్మవారిని వరలక్ష్మిగా అలంకరించి ప్రత్యేక పూజలు నిర్వహించారు.

వరాలిచ్చే అమ్మవారు

వీరబల్లి: వరాలను ఇచ్చే వరలక్ష్మి అమ్మవారిని శ్రావణమాసం పౌర్ణమి ముందు వచ్చే శుక్రవారం రోజు ముత్తైదువులు అమ్మవారికి కలశం పెట్టి ప్రత్యేక వ్రత పూజలు నిర్వహించారు. పలువురు ముత్తైదువులకు పసుపు, కుంకుమ, జాకెట్లును నిర్వాహకులు అందజేశారు. అలాగే సమీపంలోని ఆలయాలకు వెళ్లి దేవతలను దర్శనం చేసుకున్నారు. ఈ సందర్భంగా ప్రత్యేక అన్నదానం ఏర్పాటు చేశారు.



వీరబల్లిలో అన్నదానం చేస్తున్న దాతలు

అర్హులైన పేదలందరికీ పక్కా గృహాలు




కొండమాచుపల్లెలో జరిగిన గ్రామసభలో మాట్లాడుతున్న పీడీ ప్రసాద్, గ్రామసభకు హాజరైన ప్రజలు

ఒంటిమిట్ట : గ్రామీణ ప్రాంతాల్లో అర్హులైన పేదలందరికీ ప్రభుత్వం ఎన్‌టీఆర్ గృహాలను కేటాయించడం జరుగుతుందని జిల్లా గృహ నిర్మాణ శాఖ ప్రాజెక్ట్ డైరెక్టర్ ఎస్‌వీఆర్ ప్రసాద్ పేర్కొన్నారు. మండలంలోని కొండమాచుపల్లె, కొత్తమాధవరంలో శుక్రవారం హౌసింగ్ ఏఈ ఆధ్వర్యంలో జరిగిన గ్రామసభలను ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గ్రామాల్లో పక్కా గృహాలు లేని పేదలను గుర్తించేందుకు సర్వే జరుగుతోందని సర్వేకు ప్రజలు సహకరించి పక్కా గృహాల కోసం దరఖాస్తు చేసుకోవాలని ఆయన సూచించారు. అలాగే గతంలో నిధులు లేక ఆగిపోయిన పక్కాగృహాల నిర్మాణాలను పూర్తి చేసేందుకు ప్రభుత్వం రూ.25వేలు చొప్పున అదనపు నిధులు మంజూరు చేస్తోందని లబ్ధిదారులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు. కార్యక్రమంలో ఈఈ కృష్ణయ్య, ఎంపీడీవో వెంకటప్రసాద్, తహశీల్దార్ శ్రీనివాసులరెడ్డి, సర్పంచ్ సుబ్రమణ్యం, యానాదయ్య పాల్గొన్నారు.

భక్తిశ్రద్ధలతో వరలక్ష్మీ వ్రత పూజలు

సిద్ధవటం : మండల పరిధిలోని మాధవరం-1 గ్రామంలోని భద్రావతి భవన నారాయణ సమేత సీతారాముల ఆలయంలో శ్రావణ శుక్రవారం పురస్కరించుకుని వరలక్ష్మీవ్రత పూజలు భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. కార్యక్రమంలో దాత జొన్నాదుల వెంకటరంగయ్య మాధవరం గ్రామానికి చెందిన 50మంది మహిళా భక్తులకు చీర, జాకెట్, గాజులు, పసుపు, కుంకుమ, మరికొన్ని వస్తువులు వితరణగా అందజేశారు. అనంతరం మహిళా భక్తులు వరలక్ష్మీవ్రత పూజలు అష్టోత్తరం, దేవి ఖడ్గమాల, కర్పూర హారతి పూజలు చేశారు. అనంతరం స్వామి వారిని దర్శించుకున్నారు. రచయిత సంఘం సభ్యులు ఆలయంలో రుక్మిణీ కల్యాణంపై భక్తులకు వినిపించారు. మాధవరం శివారులోని గంగా భవాని మాత, ఆలయంలో కూడా వరలక్ష్మీ వ్రత పూజలు ఘనంగా జరిగాయి. మహిళాభక్తులు పెద్దఎత్తున పాల్గొని పూజలు నిర్వహించి అమ్మవారిని దర్శించుకున్నారు.

సినిమా గైడ్
రాజంపేట

సమద్ : నిన్నుకోరి
సుదర్శన్ : నాకు నేనే తోపు తురుము
పీవైపీ : ఫిదా
బీఎస్: డిజె (దువ్వాడ జగన్నాథమ్)
ఎన్ఎస్ఆర్: గౌతమ్‌నంద

వైఎస్ జగన్‌ను అరెస్ట్ చేయాలి

-రాష్ట్ర కల్లుగీత కార్మిక సంస్థ డైరెక్టర్ వెంకటనరసయ్య



మాట్లాడుతున్న వెంకటనరసయ్య

ఒంటిమిట్ట : రాష్ట్ర ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడును తుపాకీతో కాల్చినా పర్వా లేదంటూ నంద్యాల బహిరంగ సభలో ప్రజలను రెచ్చగొట్టేలా మాట్లాడిన ప్రతిపక్ష నేత వైఎస్ జగన్‌పై 307సెక్షన్ కింద కేసు నమోదు చేసి అరెస్ట్ చేయాలనిరాష్ట్ర కల్లుగీత కార్మిక సంస్థ డైరెక్టర్ కొమరా వెంకటనరసయ్య ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఆయన శుక్రవారం విలేకరుల తో మాట్లాడుతూ ఫ్యాక్షన్ కుటుంబానికి చెందిన జగన్ తన తాత అయిన వైఎస్ రాజారెడ్డిని ప్రత్యర్థులు అతి కిరాతకంగా హత్యచేసి చంపినా, ఇప్పటికీకూడా జగన్‌లో అదే ఫ్యాక్షనిజం నాటుకుని ఉందనడానికి నిన్నటి వ్యాఖ్యలే నిదర్శనమన్నారు. ప్రజాస్వామ్య వ్యవస్థలో విలువలను కాపాడాల్సిన ఒక ప్రతిపక్ష నేత ఎన్నికల బరిలో సహనం కోల్పోయి ఒక ముఖ్యమంత్రినే తుపాకీతో కాల్చినా పర్వాలేదనడం అతని దిగజారుడు రాజకీయాన్ని తెలియజేస్తోందన్నారు. రెచ్చగొట్టే వ్యాఖ్యలతో నిన్నటి విశాఖ తన సొంత తల్లి అయిన విజయమ్మ ఓటమికి కారణమైన వైఎస్ జగన్, రెచ్చగొడితే విజ్ఞులైన నంద్యాల ఓటర్లు రెచ్చిపోతారన్నారు. 11అవినీతి కేసుల్లో కూరుకుపోయిన జగన్, క్లీన్ ఇమేజ్ ఉన్న చంద్రబాబుపై విద్వేషాలు రెచ్చగొట్టడం రాష్ట్ర ప్రజలందరూ గమనిస్తున్నారన్నారు.

ప్రభుత్వ బంజరు భూములకు పట్టాలివ్వాలి



నందనగర్‌లో ప్రభుత్వ భూములను పరిశీలిస్తున్న నాయక్

ఒంటిమిట్ట : మండలంలోని నందానగర్ లో 30 ఎస్టీ కుటుంబాలు పది సంవత్స రాలుగా అనుభవించుకుంటున్న ప్రభుత్వ బంజరు భూములకు పట్టాలు మంజూరు చేయాలని ఏపీ వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా అధ్యక్షుడు దాసరి వెంకటేష్ డి మాండ్ చేశారు. ఆయన శుక్రవారం మండల కార్యదర్శి ప్రసాద్‌రావు, సీపీఎం కన్వీనర్ నరసయ్య, లబ్ధిదారులు లక్ష్మీనరసయ్య, అంజి, రమణ, వెంగయ్య, పెంచలమ్మలతో కలిసినందానగర్ ప్రాంతంలో ఉన్న బంజరు భూములను పరిశీలించారు. ఈ సందర్భంగా వెంకటేష్ మాట్లాడుతూ 313వారికి సర్వేనెంబర్‌లో ఉన్న 200ఎకరాల ప్రభుత్వ బంజరు భూములను ఆ ప్రాంతంలోని ఎస్టీలు స్వాధీనం చేసుకొని కంపచెట్లు తొలగించి హద్దులు వేసుకున్నారన్నారు. వారు అనేక మార్లు పట్టాల కోసం రెవెన్యూ కార్యాలయానికి తిరిగినా ఎవ్వరూ పట్టించుకోలేదని ఇప్పటికైనా పట్టాలు ఇవ్వకపోతే ఆందోళనలు ఉధృతం చేస్తామని హెచ్చరించారు.

రెవెన్యూ సేవలు వినియోగించుకోండి-ఆర్డీఓ

రాజంపేట రూరల్ : రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్ఠాత్మకంగా నిర్వహిస్తున్న రైతు రెవెన్యూ గ్రామ సభలను రైతులందరూ సద్వినియోగం చేసుకుని సమస్యలు పరిష్కరించుకోవాలని రాజంపేట ఆర్డీవో వీరబ్రహ్మం సూచించారు. రాజంపేట మండలం బ్రాహ్మణపల్లె గ్రామ పంచాయతీలో రైతు సేవలో రెవెన్యూ శాఖ కార్యక్రమం శుక్రవారం జరిగింది. ఈ కార్యక్రమానికి రాజంపేట ఆర్డీవో వీరబ్రహ్మం ముఖ్యఅతిథిగా హాజరై రైతుసేవలో రెవెన్యూ శాఖ కార్యక్రమాన్ని తనిఖీ చేసి పలు రికార్డులను పరిశీలించారు. ముఖ్యంగా గ్రామ పంచాయతీలు ఆన్‌లైన్ కాని భూముల వివరాలు, కోర్టుకు వెళ్ళిన భూ సమస్యలు, ప్రభుత్వ భూములకు సంబందించిన ఆన్‌లైన్ వ్యవహారంపై సమావేశానికి వచ్చిన ప్రజల వద్దకు వెళ్ళి వివరాలు సేకరించారు. అదే విధంగా ప్రతి రైతుకు అవసరమైన భూముల ఆన్‌లైన్ వ్యవహారం తహశీల్దార్, రెవెన్యూ సిబ్బంది తమ గ్రామాలకు వస్తున్న నేపథ్యంలో ఈ అవకాశాన్ని వినియోగించుకోవాలని గ్రామస్తులకు ఆయన వివరించారు. కార్యక్రమంలో తహశీల్దార్ శిరీష, ఆర్ఐ సునీల్, గ్రామస్తులు పాల్గొన్నారు.

గ్రామసభల ద్వారా సమస్యలు పరిష్కారం



రైతుల నుంచి అర్జీలు స్వీకరిస్తున్న దృశ్యం

నందలూరు : రైతుల భూ సమస్యల పరిష్కారం కోసమే ప్రభుత్వం రైతు సేవలో రెవెన్యూ శాఖ గ్రామసభలను నిర్వహిస్తోందని లేబాక సర్పంచ్ ఆవుల లక్ష్మీ నరసమ్మ పేర్కొన్నారు. శుక్రవారం లేబాక గ్రామంలో రైతు సేవలో రెవెన్యూ శాఖ గ్రామసభ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ రైతులకు ఎటువంటి భూ సమస్యలు ఉన్నా ఈ గ్రామసభల ద్వారా పరిష్కరించడం జరుగుతుందన్నారు. రాష్ట్ర ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు రాష్ట్రాన్ని అన్ని విధాల అభివృద్ధి పథంలో నడిపిస్తున్నారన్నారు. తహశీల్దార్ దార్ల చంద్రశేఖర్ మాట్లాడుతూ ఈ గ్రామ సభలో ఆన్‌లైన్ కోసం రైతుల నుంచి 6అర్జీలు వచ్చాయని, ఆ భూములను త్వరలోనే ఆన్‌లైన్ చేయడం జరుగుతుందన్నారు. కార్యక్రమంలో ఆర్ఐ సతీష్, సర్వేయర్ వెంకటసుబ్బయ్య, వీఆర్వో వెంకటేశ్వర్లు, ఏఎస్‌వో సుబ్బరాయుడు పాల్గొన్నారు.

వీరబల్లిలో 70శాతం భూముల ఆన్‌లైన్

వీరబల్లి: రెవెన్యూ గ్రామ సభల ద్వారా గ్రామాల్లోని రైతుల సమస్యలు పరిష్కారం అవుతాయని మండలంలో ఇప్పటిదాకా 70 శాతం భూములను ఆన్‌లైన్ చేసినట్లు తహసీల్దార్ ఎంవీ నారాయణరెడ్డి పేర్కొన్నారు. మండలంలోని గుర్రప్పగారిపల్లె పంచాయతీలో శుక్రవారం గ్రామ సభను నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గతంలో నిర్వహించిన గ్రామసభలో 70 శాతం భూములను పూర్తిపై చేసి ఆన్‌లైన్ చేశామని ఇంకాభూములను ఆన్‌లైన్ చేసుకోలేని వారిని గ్రామసభల ద్వారా గుర్తిస్తున్నామని ఇందులో వచ్చిన దరఖాస్తులను ప్రభుత్వం ఇచ్చిన గడువులోగా ఆన్‌లైన్ చేస్తామన్నారు.

రెవెన్యూ సమస్యల పరిష్కారమే రైతు సేవ

ఒంటిమిట్ట : రైతులు ఎదుర్కొంటున్న రెవెన్యూ పరమైన సమస్యలను పరిష్కరించేందుకే ప్రభుత్వం రైతు సేవలో రెవెన్యూశాఖ గ్రామసభలు నిర్వహిస్తున్నట్లు తహశీల్దార్ శ్రీనివాసులరెడ్డి తెలిపారు. మండలంలోని రాచగూడిపల్లెలో శుక్రవారం రైతు సేవలో రెవెన్యూ గ్రామసభ జరిగింది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ భూములను ఆన్‌లైన్ చేయించుకోని రైతులు సక్రమమైన రికార్డులను తీసుకువస్తే వెంటనే నమోదు చేస్తామని తెలిపారు. అనంతరం రైతుల నుంచి ఆయన వినతులను స్వీకరించారు. ఈ కార్యక్రమంలో సర్పంచ్ పుల్లమ్మ, ఆర్ఐ అర్చన, సర్వేయర్ రామ్మోహన్, వీఆర్వో వేణుగోపాల్, రైతులు పాల్గొన్నారు.

రెవెన్యూ సదస్సులో 22 దరఖాస్తులు

సుండుపల్లె: మండలంలోని జీరెడ్డివారిపల్లెలో శుక్రవారం నిర్వహించిన రైతుల వద్దకే రెవెన్యూ శాఖ కార్యక్రమంలో 22 దరఖాస్తులు అందినట్లు డిప్యూటీ తహసీల్దార్ పరమేశ్వరరావు తెలిపారు. ఈ సందర్భంగా ఆన్‌లైన్, డీకేటీ పట్టాలు మంజూరు చేయాలని, సర్వే చేయాలని పలు రకాల దరఖాస్తులు రైతుల వద్ద నుంచి అందాయని తెలిపారు. ఈ దరఖాస్తులను ప్రత్యేక రిజిస్టర్‌లో నమోదు చేసి త్వరితగతిన సమస్యలు పరిష్కరించేలా చూస్తామన్నారు. కార్యక్రమంలో ఆర్ఐ ప్రశాంతి, వీఆర్‌వో సౌమ్య, రెవెన్యూ సిబ్బంది పాల్గొన్నారు.

ఆటోబోల్తా - ఇద్దరికి గాయాలు

సిద్ధవటం : మండల పరిధిలోని నేకనాపురం రహదారి సమీపంలో శుక్రవారం ఆటో బోల్తాపడి ఇద్దరికి గాయాలయ్యాయి. బద్వేల్ మండలంలోని గొడుగునూరుకు చెందిన ఆటో సిద్దుగారి పల్లెకు చెందిన 8మందితో సిద్ధవటం మండలం భాకరాపేట సమీపంలోనున్న ప్రార్థనామం దిరానికి బయలుదేరారు. నేకనాపురం రహదారి వద్దకు రాగానే ఆటో అదుపు తప్పి బోల్తాపడటంతో సిద్దుగారిపల్లెకు చెందిన కొండయ్య, మేరయ్య గాయపడగా మిగిలిన వారు సురక్షితంగా బయటపడ్డారు. వారిని వైద్యం కోసం 108వాహనంలో కడప రిమ్స్‌కు తరలించారు.

అటెండరే అక్కడ డాక్టర్!

లక్కిరెడ్డిపల్లె: ఈ ఫోటోలో రోగులకు బీపీ చెక్ చేస్తున్నది ఓ డాక్టరనుకుంటున్నారా... ఆ ఆసుపత్రిలో తాత్కాలికంగా పనిచేస్తున్న ఓ అటెండర్. ఈ ఆసుపత్రి నుంచి డాక్టర్ ఒకటిన్నర నెల క్రితం బదిలీపై వెళ్లారు. స్టాఫ్‌నర్సు లేదు, సిబ్బంది లేదు. అన్నింటికీ ఆ అటెండరే అక్కడ దిక్కు. లక్కిరెడ్డిపల్లె మండలంలోని దేవళంపల్లె ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో పనిచేస్తున్న డాక్టర్ ఒకటిన్నర నెల క్రితం ఇక్కడి నుంచి బదిలీపై వెళ్లారు. అప్పటి నుంచి ఈ ఆసుపత్రిలో తాత్కాలికంగా నియమితులైన అటెండర్ అన్ని చేస్తున్నాడు. ఆయనే రోగిని పరీక్షిస్తాడు. బీపీ, షుగర్ పరిశీలించి సూదులు, సెలైన్ బాటిళ్లు ఆయనే చూసుకోవాలి. అయితే ఆయన జీతం నెలకు రూ.600 మాత్రమే. 2005లో తాత్కాలిక అటెండర్‌గా జాయిన్ అయిన ఈయన అన్ని వేళల్లో ఆసుపత్రిలో ఉంటూ రోగులకు అందుబాటులో ఉంటూ అన్ని పరీక్షలు చేస్తున్నారు. ఈ ఆసుపత్రిలో ఒక డాక్టర్, స్టాఫ్‌నర్సు ఈ ఆసుపత్రి కింద 14 మంది ఏఎన్‌యంలు పనిచేయాలి. అయితే స్టాఫ్‌నర్సు బదిలీపై వెళ్లడంతో అన్ని అటెండరే చూస్తున్నారు. ల్యాబ్ టెక్నీషియన్, ఫార్మసిస్టు మాత్రమే వచ్చి వారి విధులు వారు నిర్వహిస్తూ వెళుతున్నారు. మూడు నెలలకు ఒకసారి ఒక లక్షా 30 వేలు మందులకు నిధులు మంజూరయితే డాక్టరే లేకపోతే ఈ నిధులు ఎక్కడ ఖర్చు పెడుతున్నారో దేవుడికే ఎరుక. 36 వేల జనాభాకు ఈ మారుమూల ప్రాంతంలో ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని ఏర్పాటు చేశారు. అయితే ఒకప్పుడు మూడుపువ్వులు ఆరు కాయలుగా సాగిన ఈ దేవళంపల్లె ఆసుపత్రి రాను రాను సిబ్బంది లేక సరైన వసతులు లేక రోగులు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. అసలే వర్షాకాలం కావడంతో చాలా మంది రోగులు మలేరియా, టైఫాయిడ్ జ్వరాలతో ఆసుపత్రిని ఆశ్రయిస్తే ఇక్కడ దిక్కు అటెండరే. ప్రతిరోజు 150 నుంచి 200 మందికిపైగా రోగులు ఆసుపత్రికి వస్తూ పోతుంటారు. ల్యాబ్‌టెక్నీషియన్ రక్తపరీక్షలు నిర్వహించి ఫార్మసిస్టు మాత్రలు ఇస్తున్నారే తప్పా ఇక్కడ ఏ జబ్బు అని కనుక్కునే నాధుడే కరువయ్యారు.

రోగులు ఇన్ని ఇబ్బందులు ఎదుర్కొంటున్నా అధికారుల్లో మాత్రం ఏ మాత్రం చలనం లేదు. కేవలం ఆసుపత్రి తెరిచి ఉంచాలనే నెపంతో వచ్చిన రోగులకు పారాసిటిమాల్ మందు బిల్లలు ఇచ్చి పంపిస్తున్నారే తప్పా వారికి మెరుగైన చికిత్స అందడం లేదు. ఈ ఆసుపత్రికి వచ్చి మందు బిల్లులు మింగడానికి కూడా గుక్కెడు మంచినీరు లేదు. ఇదీ ఈ ఆసుపత్రి దుస్థితి. ఈ మధ్య కాలంలో అన్ని ఆసుపత్రులకు డాక్టర్లను నియమించినా దేవళంపల్లె, కోనంపేట ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలకు మాత్రం దిక్కులేరు. కోనం ఆసుపత్రి డిప్యూటేషన్‌పై ఉన్న డాక్టర్ ఎప్పుడు వస్తాడో... ఎప్పుడు వెళతాడో వారికే తెలియక కోనంపేట వాసులు ఆర్‌యంపీని ఆశ్రయిస్తున్నారు. అసలు ఆసుపత్రినే తెరవరు. ఆసుపత్రికి వస్తున్న నిధులు ఏమవుతున్నాయో దేవుడికే ఎరుక. మండలంలో రెండు ఆసుపత్రుల పరిస్థితి ఇలా ఉంటే జిల్లా వైద్యారోగ్యశాఖ అధికారులు మాత్రం ఏమీ పట్టనట్లు వ్యవహరిస్తున్నారు. ఇప్పటికైనా జిల్లా అధికారులు స్పందించి ఇక్కడ డాక్టర్‌ను, స్టాపు నర్సులను నియమించాలని స్థానికులు రాధమ్మ, చంద్రశేఖర్‌రెడ్డి తదితరులు కోరుతున్నారు.



దేవళంపల్లె ప్రాథమిక ఆరోగ్య కేంద్రం


పది మంది రోగులకు సెలైన్ బాటిళ్లు ఎక్కిస్తున్న అటెండర్



ఖాళీగా ఉన్న డాక్టర్ల కుర్చీలు



వైద్యులు లేక కోనంపేటలో మూతపడ్డ ఆసుపత్రి

అటెండరే మాకు దిక్కు



ఎప్పుడు ఆసుపత్రికి వచ్చినా మాకు అటెండరే దిక్కు. సూది మందులు వేసి మాత్రలు ఇస్తాడు. డాక్టర్ వద్ద చికిత్స చేయించుకుందామనుకుంటే ఎవ్వరూ ఉండరు. మాత్రలు మింగడానికి నీళ్లే ఉండవు.

-రాధమ్మ, చాగలగుట్టపల్లె

ఎర్రచందనం అక్రమ రవాణాకు అడ్డుకట్ట వేయండి

● శాంతి భద్రతలకు విఘాతం కలిగిస్తే కఠిన చర్యలు : రాయలసీమ ఐజీ మహ్మద్ ఇక్బాల్



పోలీసు అధికారుల సమావేశంలో మాట్లాడుతున్న రాయలసీమ ఐజీ ఇక్బాల్, చిత్రంలో ఎస్పీ అట్టాడ బాబూజీ

కడప, క్రైం : ప్రపంచంలో అరుదైన ఎర్రచందనాన్ని పరిరక్షించి అక్రమ రవాణాకు అడ్డుకట్ట వేయాలని రాయలసీమ ఐజీ షేక్ మహమ్మద్ ఇక్బాల్ సిబ్బందిని ఆదేశించారు. జిల్లా పోలీసు కార్యాలయంలో శుక్రవారం ఎస్పీ అట్టాడ బాబూజీతో కలిసి పోలీసు అధికారులతో సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఐజీ మాట్లాడుతూ ఎర్రచందనం, స్మగ్లింగ్ కార్యకలాపాలకు పాల్పడేవారిపై నిఘా వుంచి స్మగ్లర్లపై కఠినంగా వ్యవహరించాలని సూచించారు. ఎర్రచందనం పరిరక్షించేందుకు అటవీశాఖ రెవెన్యూ అధికారులతో సంయుక్తంగా పనిచేయాలన్నారు. వాహన తనిఖీలు నిర్వహించాలన్నారు. రోడ్డు భద్రత చర్యలు చేపట్టాలని సూచించారు. వినాయకచవితి, బక్రీదు పండుగలు రానున్న సందర్భంగా ఎలాంటి గొడవలు జరగకుండా చర్యలు తీసుకోవాలన్నారు. ప్రజలకు అవగాహన కల్పించాలన్నారు. కార్యక్రమంలో ఏఎస్పీ శ్రీనివాసులురెడ్డి, ఏఆర్ డీఎస్పీ రుషీకేశ్వర్‌రెడ్డి, డీఎస్పీలు పాల్గొన్నారు.

బదిలీలకు గైర్హాజరైన 43 మంది ఎస్‌జీటీలకు షోకాజ్ నోటీసులు

కడప, ఎర్రముక్కపల్లె : ఉపాధ్యాయుల బదిలీలకు సంబంధించి కౌన్సెలింగ్ ప్రక్రియకు గైర్హాజరైన 43 మంది ఎస్‌జీటీలకు షోకాజ్ నోటీసులు జారీ చేస్తున్నట్లు డీఈవో శైలజ తెలిపారు. డీఈవో పూలింగ్‌లో ఉంటే లాబీయింగ్ తీసుకోవచ్చని భావిస్తున్నారు. అటువంటి అవకతవకలకు తావుండదని స్పష్టం చేశారు. శుక్రవారం ఆమె విలేకరులతో మాట్లాడుతూ 8 ఏళ్లు పూర్తయిన వారు రేషనలైజేషన్ ప్రక్రియల మిగులు ఉపాధ్యాయులు 43 మంది బదిలీ కౌన్సెలింగ్‌కు హాజరు కాలేదన్నారు. వీరు తప్పక హాజరు కావాల్సి వుందని సూచించారు. అయితే 8 ఏళ్లు పూర్తయిన ఎస్‌జీటీలకు మాత్రం ప్రస్తుతం బదిలీల్లో మిగిలిన ఖాళీల్లో రాండంగా బదిలీ జనరేట్ అవుతుందన్నారు. గైర్హాజరైనంత మాత్రాన డీఈవో పూలింగ్‌లోకిపోతే న్యాయం జరుగుతుందనుకోవడం అవివేకమని తెలిపారు. కడప డీసీఈబీ పాత సమావేశ మందిరంలో శనివారం మధ్యాహ్నం 2 గంటలకు లాంగ్వేజీ పండిట్లకు బదిలీల రీకౌన్సెలింగ్ నిర్వహిస్తున్నట్లు డీఈవో తెలిపారు.

బ్యాంక్‘రిక్తహస్తం’

ఆంధ్రజ్యోతి, కడప సిటీ : బ్యాంకర్లు రుణం మంజూరు చేయకపోవడంతో బీసీ, ఎస్సీ, ఎస్టీ లబ్ధిదారులు ఇబ్బందులు ఎదురుర్కొంటున్నారు. బీసీ కార్పొరేషన్, ఎస్సీ, ఎస్టీ, కాపు కార్పొరేషన్ ద్వారా సబ్సిడీ రుణాలను ప్రభుత్వం అందిస్తోంది. రుణాలు పొందిన వారు యూనిట్లను స్థాపించి ఆర్థికంగా అభివృద్ధి చెందాలన్నదే ప్రభుత్వ ఉద్దేశం. ప్రభుత్వం యూనిట్లను కేటాయించి సబ్సిడీ సొమ్మును కూడా విడుదల చేస్తోంది. బ్యాంకు వాటాగా ఇవ్వాల్సిన రుణం డబ్బును ఇవ్వడం లేదు. దీంతో ఒక అడుగు ముందుకు రెండడుగులు వెనక్కు అన్న చందంగా తయారైంది. గత ఏడాది కేటాయించిన యూనిట్లే పూర్తిస్థాయిలో ఇంకా గ్రౌండింగ్ కాలేదు. మళ్లీ ఇప్పుడు కొత్త యూనిట్ల ఏర్పాటు కోసం దరఖాస్తులను ఆహ్వానించింది. 2016-17 ఆర్థిక సంవత్సరంలో బీసీ కార్పొరేషన్ ద్వారా 2893 యూనిట్లను ప్రభుత్వం కేటాయించింది. రూ.37 కోట్లను కేటాయించింది. అయితే బ్యాంకులు 2148 యూనిట్లకు మాత్రమే రుణాలు ఇచ్చాయి. ఇక ఎస్సీ కార్పొరేషన్ ద్వారా 2645 యూనిట్లకు గాను 1592 యూనిట్లకు 20.59కోట్ల రుణాలు ఇచ్చాయి. ఎస్టీ కార్పొరేషన్ ద్వారా 168 యూనిట్లు వుంటే 135 యూనిట్లకు రూ.1.70కోట్లు రుణాలు ఇచ్చాయి. కాపు కార్పొరేషన్ ద్వారా 2535 యూనిట్లకు గాను 1846 యూనిట్లకు రూ.18.66 కోట్లు ఇచ్చాయి. ప్రభుత్వం వ్యక్తిగత రుణం రూ.లక్ష సబ్సిడీ ఇస్తుంది. మరో లక్షను బ్యాంకు ద్వారా అందించాల్సి వుంది. అయితే బ్యాంకులు రుణాలిచ్చేందుకు ఆసక్తి చూపడం లేదనే విమర్శలు వున్నాయి. 2017-18 ఆర్థిక సంవత్సరానికి బీసీ కార్పొరేషన్ ద్వారా 3688 యూనిట్లు, కాపు 3500, ఎస్సీ 4548, ఎస్టీ 306 యూనిట్లను కేటాయించింది. వీటికి సంబంధించి ఇంటర్వ్యూలు నిర్వహిస్తున్నారు. గత ఏడాది దరఖాస్తు చేసుకుని రుణాలు అందని వారు మళ్లీ దరఖాస్తు చేసుకోవాలని సూచించారు. దీంతో మళ్లీ లక్ కోసం లబ్ధిదారులు దరఖాస్తు చేసుకున్నారు.

మినీ లోకం



కాల్ మీ డాడ్ అండ్ మామ్..డోంట్ యూజ్ టెలుగు.

జీఎస్టీతో ప్రింటింగ్‌ప్రెస్‌లకు చేతినిండా పని

కడప, వినాయకనగర్ : కేంద్ర ప్రభుత్వం ఒకదేశం ఒక పన్ను పేరుతో వస్తున్న సేవల పన్ను విధానం ప్రవేశపెట్టడంతో వ్యాపారులకు అదనపుభారం, ప్రింటింగ్ ప్రెస్ యజమానులకు చేతినిండా పని దొరికింది. జిల్లాలో వివిధ రంగాల్లో వ్యాపారం నిర్వహిస్తున్న 14వేల మంది వ్యాపారులు ఇప్పటికే వ్యాట్ పన్నుపరిధి నుంచి వస్తువుసేవ పన్ను విధానంలోకి మారారు. వీరితో పాటు అనేక మంది వ్యాపారులు కూడా జీఎస్టీ పరిధిలోకి వచ్చారు. వీరందరు గతంలో వున్న బిల్లులో వ్యాట్ టిన్ నెంబరు వుండేది. ప్రస్తుతం వ్యాట్ టిన్ నెంబరు రద్దు కావడంతో వ్యాపారులు కొత్తగా జీఎస్టీ టిన్ నెంబరుతో బిల్లులు ముద్రించుకుంటున్నారు. దీంతో వ్యాపారులు జీఎస్టీ టిన్ పేరుతో బిల్లు బుక్కులు ప్రింటింగ్ ప్రెస్‌లకు ఆర్డరు ఇవ్వడం జరిగింది. దీంతో గత నెల రోజుల నుంచి ప్రింటింగ్ ప్రెస్ యజమానులకు వ్యాపారులకు సంబంధించి బిల్లు బుక్కులు ముద్రించడంతో తలమునకలవుతున్నారు. వ్యాపారులు ఇప్పటికి కూడా వినియోగదారులకు కొత్త జీఎస్టీ బిల్లు ఇవ్వడం లేదు. కేవలం కొంత మంది వ్యాపారులు మాత్రమే కంప్యూటర్ అప్‌లోడ్ అయిన వారు మాత్రం వినియోగదారులకు జీఎస్టీతో కూడిన బిల్లులు ఇస్తున్నారు. మిగిలిన వ్యాపారులు పాత బిల్లులపైనే బిల్ చేస్తున్నారు. మరికొంతమంది వ్యాపారులు మాత్రం కొత్తగా ముద్రించిన జీఎస్టీ టిన్ నెంబరు కలిగిన వాటిపై కొనుగోలుదారులకు బిల్లులు ఇస్తున్నారు. అయితే జిల్లాలో చాలా మంది వ్యాపారులకు ఇంకా కొత్త జీఎస్టీ టిన్ నెంబరు కలిగిన బిల్లులు అందకపోవడంతో కొనుగోలుదారులకు ఎటువంటి బిల్లు ఇవ్వడం లేదు.

జీఎస్టీ పన్ను విధానం అమలై దాదాపు నెల రోజులు గడుస్తున్నా పన్ను విధానంపై అటు అధికారులకు గానీ ఇటు వ్యాపారులకు గానీ పూర్తి అవగాహన ఏర్పడకపోవడంతో ఇష్టానుసారంగా వ్యాపారులు కొనసాగుతున్నట్లు విమర్శలు వినిపిస్తున్నాయి.

ఇష్టంగా చదవాలి.. ఉన్నత శిఖరాలు అందుకోవాలి

● ఆత్మీయ సమ్మేళనంలో విద్యార్థులతో ఐజీ మహమ్మద్ ఇక్బాల్

ప్రొద్దుటూరు క్రైం : విద్య ఉంటేనే మనిషికి విలువ, గౌరవం... కాబట్టి ప్రతి విద్యార్థి ఇష్టంగా చదవాలని, అపుడే ఉన్నత శిఖరాలను అందుకుంటారని రాయలసీమ ఐజీ షేక్ మహమ్మద్ ఇక్బాల్ విద్యార్థులకు ఉద్బోధించారు. శుక్రవారం స్థానిక వన్‌టౌన్ సర్కిల్‌లో ఉన్న ప్రభుత్వ ఉర్దు జూనియర్ కళాశాలలో ఏర్పాటు చేసిన ఆత్మీయ సమ్మేళనం కార్యక్రమానికి రాయలసీమ ఐజీ మహమ్మద్ ఇక్బాల్, జిల్లా ఎస్పీ అట్టాడ బాబుజీలు ముఖ్య అతిథులుగా హాజరై, మొక్కలను నాటారు. అంతకు ముందు ఆత్మీయ సమ్మేళనం కార్యక్రమంలో ఐజీ మాట్లాడుతూ విద్యార్థుల్లో చదువుకోవాలన్న కసి ఉండాలని, దానికి తగినట్లు కృషి చేసినపుడే అనుకున్న లక్ష్యాన్ని సాధించగలరన్నారు. భగవద్గీత, బైబిల్, ఖురాన్ గ్రంథాలు చెప్పే సారాంశం ఒక్కటే అన్నారు. రాష్ట్ర ప్రభుత్వం ప్రభుత్వ పాఠశాలలు, కళాశాలలను దత్తత తీసుకుని, అభివృద్ధి చేసి, బడి రుణం తీర్చుకోవాలని పిలుపు ఇస్తోందన్నారు. ఈ క్రమంలో ఈ కళాశాలకు మినరల్ వాటర్ (ఆర్‌వో) ప్లాంట్, డిజిటల్ క్లాస్‌రూం, ఫర్నీచర్, ఐఐటీ మెటీరియల్స్ సమకూర్చేందకు కృషి చేస్తానని ఐజీ సభాముఖంగా హామీ ఇచ్చారు. సమావేశంలో ఎస్పీ మాట్లాడుతూ పీహెచ్‌డీ చేస్తే అనుకున్న లక్ష్యాన్ని చేరుకోగలరన్నారు. పీహెచ్‌డీ అంటే డాక్టరేట్ చేయడం కాదని, పీ అంటే ప్యాషన్ (దృఢమైన సంకల్పం), హెచ్ అంటే హ్యాంగ్రీ (ఆకలి), డీ అంటే డీసైర్ (తీవ్రమైన కోరిక) ప్రతి విద్యార్థిలో ఉండాలని, అపుడే ఉన్నత స్థానాలను అందుకోగలరన్నారు. ఈ సందర్భంగా ఆ కళాశాల ప్రిన్సిపాల్ చంద్రమౌళి, తమ కళాశాల అవసరాలు, విద్యార్థులు సాధించిన ప్రగతి గురించి ముఖ్య అతిథులకు వివరించారు. ఈ సందర్భంగా ఐజీ, ఎస్పీలను కళాశాల వారు సత్కరించారు. విద్యార్థినీ విద్యార్థులకు ఐజీ, ఎస్పీల చేత నోటు పుస్తకాలను పంపిణీ చేయించారు. కార్యక్రమంలో ప్రొద్దుటూరు ఇన్‌చార్జి డీఎస్పీ భక్తవత్సలం, వన్‌టౌన్ సీఐ వెంకటశివారెడ్డి, రూరల్ సీఐ ఓబులేసు, ఫ్యాక్షన్ జోన్ సీఐ సుధాకర్‌రెడ్డి, ఎస్ఐ చిన్నపెద్దయ్య, అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న ఐజీ మహమ్మద్ ఇక్బాల్

పేదల ఆర్థిక సామాజిక స్థితిని మార్చడమే మెప్మా ధ్యేయం

స్టేట్ మిషన్ డైరెక్టర్ చిన్న తాతయ్య

ప్రొద్దుటూరు అర్బన్ : పేదల ఆర్థిక సామాజిక స్థితిని మార్చడమే మెప్మా ధ్యేయమని, ప్రణాళికా బద్ధంగా పని చేయకుంటే ఫలితాలు రావని పట్టణ పేదరిక నిర్మూలన సంస్థ (మెప్మా) స్టేట్ మిషన్ డైరెక్టర్ చిన్నతాతయ్య సూచించారు. శుక్రవారం మెప్మా జిల్లాస్థాయి సమీక్ష సమావేశం స్థానిక ఆర్‌అండ్‌బీ గెస్ట్‌హౌస్‌లో జరిగింది. ఈ సమీక్ష సమావేశానికి విచ్చేసిన ఎండీ చిన్నతాతయ్య మాట్లాడుతూ జీవనోపాధులను పెంచి ప్రతి మహిళ రూ.10 వేలు ఆదాయం సంపాదించేలా కృషి చేయాలన్నారు. కమ్యూనిటీ లేకుండా సీవోలు ఆర్‌పీలపై ఆధారపడరాదన్నారు. సీవోలు ప్రతి రోజు ఎక్కడెక్కడికి వెళతారు, ఏ సంఘ సభ్యులతో మాట్లాడుతారో ఫొటో అప్‌డేస్ ఆన్‌లైన్‌లో పెట్టాలన్నారు. 6 లక్షల మందికి యూనిట్లు పెట్టించినా 16 శాతం మందికి మాత్రమే రూ.10 వేలు ఆదాయం వస్తున్నదన్నారు. దీన్ని బట్టి ఆర్‌పీలు, సీవో, టీఎంసీ, పీడీ వరకు కసితో కష్టపడాలన్నారు.

సంఘం ద్వారా చైతన్యం పెరుగుతుంది - కలెక్టర్

ప్రతి మహిళా స్వయం సహాయక సంఘంలో చేరితే చైతన్యం పెరుగుతుందని కలెక్టర్ బాబూరావునాయుడు అన్నారు. సీవోలు ఇంటింటికీ వెళ్లి సభ్యులు ఎలా జీవిస్తున్నారో తెలుసుకోవాలన్నారు. ప్రాథమిక సమాచారం లేకుండా సీవోలు పేదరికంను ఎలా రూపుమాపుతారన్నారు. 15 యేళ్ల క్రితం పీడీగా ఉన్నప్పుడు గోదావరి జిల్లా ఏలేశ్వరంలో కటిక పేద మహిళలు జిల్లా మహిళా సమాఖ్య అధ్యక్షురాలుగా చేశారన్నారు. ఆమె నేడు గవర్నరు కోటాలో ఎమ్మెల్సీగా ఎన్నికైందన్నారు. మెప్మా పీడీ రామ్మోహన్‌రెడ్డి, మున్సిపల్ చైర్మన్ ఆసం రఘురామిరెడ్డి, మున్సిపల్ కమిషనర్ శేషన్న, జిల్లాలోని కడప, ప్రొద్దుటూరు, జమ్మలమడుగు, మైదుకూరు, బద్వేలు, రాజంపేట, రాయచోటి, పులివెందుల, ఎర్రగుంట్ల మున్సిపాలిటీ పరిధిలోని మెప్మా సీవోలు, టీఎంసీలు పాల్గొన్నారు.




సమావేశంలో మాట్లాడుతున్న మెప్మా ఎండీ చిన్నతాతయ్య, చిత్రంలో కలెక్టర్

అలనాటి అపురూప

చిత్రాలకు విలువేదీ?

చింతకుంట ఆదిమానవుడి రేఖా చిత్రాలు మరిచారు


ఆదిమానవుడు చిత్రీకరించిన రేఖాచిత్రాలు

ముద్దనూరు: మండల పరిధి చింతకుంట గ్రామ కొండలో వెలుగులోకి వచ్చిన అపురూపమైన దేశం గర్వించదగ్గ ఆదిమానవుడి రేఖా చిత్రాలను ప్రభుత్వం మరిచిపోయిందని ప్రజలు అంటున్నారు. చింతకుంట ఆదిమానవుడి రేఖా చిత్రాలు వెలుగులోకి వచ్చి దాదాపు 10 సంవత్సరాలు అవుతోంది. ఇక్కడి కొండ ప్రాంతంలో 36 వేల సంవత్సరాలకు సంబంధించి ఆదిమానవుడు జీవన శైలికి సంబంధమైన ఎన్నో చిత్రాలు పర్యాటకులకు దర్శనమిస్తున్నాయి. పెద్ద పెద్ద రాతి గుండ్లకు ఆకు పసరు, రంగు రాళ్ళతో నాడు చిత్రీకరించిన చిత్రాలు కనులకు కట్టినట్లు కన్పిస్తున్నాయి. ఇక్కడి ఆధారాలను బట్టి నాడు ఎందరో ఆదిమానవులకు ఈ ప్రదేశం నివాస ప్రాంతంగా ఉండవచ్చని ఆర్కియాలజీ అధికారులు చెప్పుకొస్తున్నారు. అదిమానవుడు చిత్రీకరించిన అపురూపమైన రేఖా చిత్రాలు ఇప్పటికీ చెరిగిపోకుండా దర్శనమిస్తున్నాయి. నాడు ఆదిమానవుడు చూసిన జంతువులను, వాడిన పనిముట్లు, మానవ ఆకారం, ఆడ, మగ కలయిక లాంటి రేఖాచిత్రాలు దర్శనం ఇస్తున్నాయి. గత కొద్ది సంవత్సల క్రితం ఇక్కడి ఎంపీడీఓగా పనిచేసి, ప్రస్తుతం డ్వామా పథకం అదనపు సహాయ సంచాలకులు ఉన్న మొగిలి చెండు సురేష్ రేఖా చిత్రాలను వెలుగులోకి తెచ్చారు. ఆయనకు తోడుగా తెలుగు ఆధ్యాపకులు బూచుపల్లె పుల్లారెడ్డి, కొందరు పత్రికా విలేకరులు నిలిచారు. తరువాత ఇంటాక్ సీతారామయ్య, యోగివేమన ప్రొఫసర్లు రాంబ్రహ్మం, విద్యార్థులు, ఆర్కియాలజీ అధికారులు పరిశీలించారు. ప్రత్యేకించి పర్యాటక శాఖ ప్రాంతీయ సంచాలకులు గోపాల్, న్యాయమూర్తులు రేఖా చిత్రాలను పరిశీలించారు. ఇంకా ఎంతో మంది పాఠశాలల విద్యార్థులకు ఈ రేఖా చిత్రాలను తిలకించారు. 6వ తరగతి సోషియల్ పాఠ్యాంశంలో ఆదిమానవుడి రేఖా చిత్రాలను పొందుపరిచారు. ఆదిమానవుడు రేఖా చిత్రాలు ఉన్న ప్రదేశంలో టూరిజం రెస్టారెంట్ ఏర్పాటు చేస్తున్నట్లు ప్రచారం జరిగింది. అయితే అది ఇంతవరకు ఆచరణలోకి రాలేదు. వెలుగులోకి వచ్చి 10 సంవత్సరాలు అయినా వాటిని పట్టించుకునే నాధుడే కరువయ్యారు. తాడిపత్రి హైవేరోడ్డులో గండికోట ప్రాంతంలోని కొండకు అతీ సమీపంలో ఈ రేఖాచిత్రాలు ఉన్నాయి. ఈ ప్రాంతాన్ని పర్యాటక కేంద్రంగా చేయాల్సిన అవసరం ఎంతైనా ఉంది.

22 నుంచి పవిత్రోత్సవాలు



ఒంటిమిట్ట : ఏకశిలా నగిరి ఒంటిమిట్టలోని కోదండపాణి కోవెలలో ఈనెల 22 నుంచి పవిత్రోత్సవాలు వైభవంగా జరగనున్నాయి. ఈ మేరకు టీటీడీ అధికారులు ఏర్పాట్లు చేయనున్నారు. ఏడాది పొడవునా కోవెలలో జరిగే అర్చనలు, ఉత్సవాల్లో భక్తులు, సిబ్బంది వల్ల కానీ తెలిసీ తెలియక జరిగే దోషాల వల్ల ఆలయ పవిత్రతకు ఎలాంటి లోపం రానివ్వకుండా ఆగమశాస్త్రం ప్రకారం ఈ పవిత్రోత్సవాలను నిర్వహించడం ఆనవాయితీ. మూడు రోజుల పాటు జరిగే ఈ పవిత్రోత్సవాల్లో నిత్యం సీతారాముల లక్ష్మణ సమేత ఉత్సవవరులకు స్నపన తిరుమంజనం నిర్వహిస్తారు. ఉత్సవాల శ్రీకారానికి సూచికగా ఒకరోజు ముందే అంటే... ఈనెల 21వ తేదీ సాయంత్రం 6 నుంచి 9 గంటల వరకు విశ్వక్సేన ఆరాధన, పుణ్యాహవచనం, ప్రతిష్ఠ, రక్షాబంధనం, రుత్వికవరనం, మృత్తుసంగ్రహణం, అంకురార్పణ, వాస్తుపూజ, వాస్తుహోమం, బీజావసనం, అఖండదీపారాధన, షార్డ్మోర, మహామంగళహారతి నిర్వహిస్తారు. 22వ తేదీ ఉదయం విశ్వక్సేన ఆరాధన, చతుస్వానఅర్చన, పవిత్రప్రతిష్ఠ, పవిత్రహోమం, ఆరాధన, బలిహరణ, షార్డ్మొర, సాయంత్రం అర్చన, పవిత్రహోమం, నివేదన, మహామంగళహారతి. 23న ఆరాధన, పవిత్రాల సమర్పణ, పవిత్రహోమాలు, మహామంగళహారతి, 24న ఉదయం మహాపూర్ణాహుతి, పవిత్రాల విసర్జన, కుంభప్రోక్షణ, ఉద్వాసనలు, మహానివేదన, బలిహరణ, మహామంగళహారతి, తీర్థప్రసాదాల వినియోగం, అనంతరం సాయంత్రం వేళ శ్రీసీతారామలక్ష్మణ సమేత కోదండపాణి మాడవీధుల్లో విహరించి భక్తులకు దర్శనభాగ్యం కల్పిస్తారు.

నిర్లక్ష్యం చేస్తే

మృత్యుఒడిలోకే...



- జిల్లాలో పెరుగుతున్న కుక్కకాటు బాధితులు
- రేబిస్ వ్యాధి బారిన పడితే బతకడం అసాధ్యం
- అందుబాటులో ఏఆర్ వ్యాక్సిన్
- పీహెచ్‌సీలలో వైద్య సేవలు

కడప, వినాయకనగర్

పాము కాటేస్తేనే కాదు.. కుక్క కరచినా ప్రాణాపాయం అనే విషయాన్ని అందరూ గుర్తించాల్సిన విషయం. ఏమాత్రం నిర్లక్ష్యం చేసినా రేబిస్ వ్యాధి బారిన పడి మృత్యుఒడిలోకి చేరుకోవాల్సిందే. ఇప్పటికే జిల్లాలో కుక్క కాటుకు బలైన వారి సంఖ్య అధికంగానే ఉంటోంది. రేబీస్ వ్యాధి సోకిన వారు వెంటనే సమీపంలోని ప్రాథమిక ఆరోగ్య కేంద్రానికి వెళ్లి చికిత్స చేయించుకోవాలి. లేదంటే బతకడం అసాధ్యమని వైద్య నిపుణులు సూచిస్తున్నారు. జిల్లాలోని అన్ని ప్రభుత్వ ఆరోగ్య కేంద్రాల్లో (పీహెచ్‌సీలలో) కుక్క, పాము కాటుకు వ్యాక్సిన్ అందుబాటులో ఉందని అధికార యంత్రాంగం చెబుతోంది. గ్రామ సింహాలుగా పిలవబడువుతున్న కుక్కలను మునిసిపల్, పంచాయతీ అధికార సిబ్బంది పట్టుకుని వాటికి కుటుంబ నియంత్రణ శస్త్ర చికిత్సలు చేయాల్సి ఉంది. అయితే సంబంధిత అధికారులు పట్టీ పట్టనట్లు వ్యవరిస్తుండటంతో నగరాలు, పట్టణాలు, గ్రామాలలో కుక్కల సంఖ్య ఏటేటా పెరుగుతూనే ఉంది. ఇటీవల ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు సంబంధిత శాఖాధికారులను కుక్కలను పట్టి ఆయా ఊర్ల శివారుల్లో విడిచిపెట్టాలని ఆదేశాలు ఇచ్చారు. అయితే కుక్కలను ఊరు బయటకు పంపిన దాఖలాల్లేవ్. దీంతో కుక్కలు ఆయా ప్రాంతాల్లో స్వైర విహారం చేస్తూ ప్రజలను గాయపరుస్తూ భయాందోళనకు గురి చేస్తున్నాయి. గత ఏడాది జిల్లాలో 27,355 మంది కుక్క కాటుకు గురైనట్లు అధికారిక గణాంకాల ద్వారా తెలుస్తోంది.





ప్రమాదకరంగా రేబిస్ వ్యాధి...

కుక్క కరిస్తే వచ్చే రేబిస్ 14 రోజుల నుంచి 48 నెలల వరకు ఎప్పుడైనా రావచ్చు. రేబిస్ వైరస్ నరాల వ్యవస్థను చిన్నాభిన్నం చేస్తుంది. కుక్క కరిచిన కాటు తలకు దగ్గరగా ఉంటే అత్యంత వేగంగా రేబిస్ వ్యాధి వ్యాపిస్తుంది. ఈ వ్యాధి సోకి బతికి బట్టకట్టిన వారు ఇప్పటివరకు ప్రపంచంలో ఎవరూ లేరు.

ప్రాథమిక చికిత్స ఇలా...

కుక్క కరవగానే కరిచిన చోట సబ్బుతో శుభ్రంగా కడగాలి. కులాయి కింద గాయాన్ని ఉంచి ఆ గాయంపై నీళ్ల నేరుగా పడేలా చూడాలి. సబ్బు నీటితో కడగడం వల్ల వైరస్ లక్షణాలను వీలైనంత ఎక్కువగా నిర్మూలించవచ్చు. పొయోడిన్, డెటాల్ వంటి వాటిని గాయం వద్ద వేయడం మంచిది. కుక్క కాటుకు గాయానికి కుట్లు వేయడం, ఆయింట్‌మెంట్లు పూయడం చేయకూడదు.


రేబిస్ సోకిన మనిషి ప్రవర్తన ఇలా...

నీళ్లంటే విపరీతమైన భయం, శరీర కండరాల్లో విపరీతమైన నొప్పి, ప్రవర్తనలో తీవ్ర మార్పులు సంభవిస్తాయి. వ్యాధి ముదిరే కొద్దీ శ్వాస తీసుకోవడం కష్టం.




టీకాల నియమావళి...

కుక్క కరిచిన రోజు నుంచి 0 డోసు నుంచి ఏఆర్‌వీ వేయించుకోవాలి. కరిచిన రోజు, మూడవ రోజు, ఏడవరోజు, 14వ రోజు, 28వ రోజు, 90వ రోజున యాంటీ రేబీస్ వేయించుకోవాలి. పైన పేర్కొన్నట్లు 90 రోజుల వరకు సూచించిన డోస్‌లన్నీ వాడితే రేబీస్ వచ్చే అవకాశం ఉండదు.



అవసరమైన వ్యాక్సిన్ ఉంది..



జిల్లాలోని అన్ని ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల్లో కుక్క కాటుకు, పాము కాటుకు ఉచితంగా వ్యాక్సిన్ అందుబాటులో ఉంచాం. కుక్క కరిచిన వెంటనే ప్రాథమిక చికిత్స కింద కుక్క కరిచిన చోట సబ్బుతో శుభ్రంగా కడగాలి. తరువాత సమీప ప్రభుత్వ వైద్యశాలకు వెళ్లి టీటీ ఇంజక్షన్ వేయించుకోవాలి. తరువాత ఏఆర్‌వీ నిర్దేశించిన రోజుల్లో పూర్తి స్థాయి డోసులు వేసుకోవాల్సి ఉంటుంది. ఇదే వ్యాక్సిన్ బయట కొనాలంటే రూ.220 ధర పలుకుతోంది. అటువంటిది ప్రభుత్వం ప్రజలకు ఉచితంగా పూర్తి స్థాయి డోసులు వేసుకునే సౌకర్యం కల్పించింది. దీనిని ప్రజలు సద్వినియోగం చేసుకోవాలి.

- డాక్టర్ మోక్షేశ్వరుడు, జిల్లా వైద్య ఆరోగ్యశాఖాధికారి, కడప



పిచ్చికుక్క లక్షణాలు ఇవీ...

నోటి నుంచి లాలాజలం కారుతుండటం, నాలుక బయట పెట్టడం, మతి లేకుండా తిరుగుతుండటం, కనపడిన వస్తువులను, మనుషులను, పశువులను కరవడం వంటి లక్షణాలు కలిగిన కుక్క కరచిన 30 నిమిషాల్లోపు ఏఆర్‌వీ వ్యాక్సిన్ వేయించుకోవాలి. రేబిస్ వ్యాధి ఒకరికి సోకితే కుటుంబ సభ్యులకు ఇరుగు పొరుగు వారికి సోకే అవకాశం ఉంటుంది.

ఆలస్యమైతే ఆపదే...

వైద్యుల అభిప్రాయం ప్రకారం పాము, కుక్క విషానికి పెద్ద తేడా లేదు. పాము కాటు వేయగానే వెంటనే ఆసుపత్రికి వెళతారు. కుక్క కరిస్తే మాత్రం జాప్యం చేస్తారు. పాము తరహాలోనే కుక్క కాటుకు అత్యవసరంగా యాంటీ రేబీస్ వ్యాక్సిన్ వేయించుకోవాలి. దీనివల్ల రేబిస్ వైరస్‌తో ఉన్న కుక్క కరిచినా ఆ వైరస్ మనిషికి సోకే అవకాశం ఉండదు. వ్యాక్సిన్ వేయగానే రేబిస్ వ్యాధికి విరుగుడుగా కావాల్సిన యాంటిబాడీస్ శరీరంలో అభివృద్ధి చెందుతాయి. అందుకే కుక్క కరిస్తే వీలైనంత త్వరగా వ్యాక్సిన్ తీసుకోవాల్సి ఉంటుంది.



తెగిన గాలి పటాలు...

బాల కార్మిక జీవితాలు

- కుటుంబ పోషణ భారమై.. చదువుకు దూరమై
- కూలి పనులకు వెళితేనే జీవనం



కడప, కోటిరెడ్డిసర్కిల్

ఎగిరే గాలి పటానికి దారమే ఆధారం.. ఆ ఆధారం తెగితే అధోగతే! తల్లిదండ్రులు లేని బాల బాలికలు కొందరైతే, తల్లి ఉండి తండ్రి లేక, తండ్రి ఉండి తల్లి లేని వారి కుటుంబాల పిల్లల అడుగుజాడలను చూస్తుంటే తెగిన గాలి పటాల్లాంటి జీవితాలు ఎన్నో కనిపిస్తాయి. సామాజిక జీవన సౌందర్యానికి కుటుంబమే ఆధారం. ఆప్యాయతలు, ప్రేమానురాగాలు, అనుబంధాలతో కూడి ఉండే కుటుంబం చల్లగా ఉంటే సమాజం, దేశం బాగున్నట్టే. అమ్మ, నాన్న, అక్క, చెల్లి, అన్న, తమ్ముడు, నానమ్మ, అమ్మమ్మ, తాతయ్యల మధ్య అల్లుకున్న బంధాలతో సాగిపోయే కుటుంబంలో అయిన వారిని కోల్పోవడాన్ని మించిన విషాదం ఉండదు. భర్త చనిపోవడం వల్ల కుటుంబాన్ని ఎలా నడపాలో అర్థం కాని భార్యలు, భార్య చనిపోవడం వల్ల కుటుంబాన్ని ఎలా నెట్టుకురావాలో, పిల్లల్ని ఎలా సాకాలో అర్థం కాని భర్తలు ఈ కుటుంబాల్లో కనిపిస్తారు. దీంతో ఆ కుటుంబం భవిష్యత్తు ఏంటో తెలియని ఆగమ్యగోచర స్థితిలో పడిపోతుంది. ఫలితంగా కుటుంబ పోషణ భారమై పిల్లలు చదువుకోకుండా చేతి పనులకు వెళ్లాల్సిన పరిస్థితి ఏర్పడుతోంది. మెకానిక్ షెడ్లలోను, కార్పెంటరీ పనుల్లోను, హోటల్స్, టీ కొట్లు, వస్త్ర దుకాణాల్లోను, తోపుడుబండ్ల వ్యాపారుల వద్దనో పనిచేసి కుటుంబ పోషణలో తమ భారం మోస్తున్నారు. ఈ క్రమంలో వారు చదువుకు టాటా చెప్పి కూలి పనులకు వెళుతూ బాలకార్మికులగా మారుతున్నారు. కడప నగరం అక్కాయపల్లెకు చెందిన 8వ తరగతి చదివే ఓ విద్యార్థి సాయంత్రం వేలల్లో ఐటీఐ సర్కిల్‌లో ఓ తోపుడు బండి వ్యాపారుడి వద్ద పనిచేస్తున్నాడు. తనకు లభించే కొద్దిపాటి సొమ్ముతో కుటుంబ పోషణలో తన వంతు సహకారం అందిస్తున్నాడు. చిన్నపుడే తండ్రిని కోల్పోవడంతో ఆ కుటుంబం పెద్ద దిక్కును కోల్పోవలసి వచ్చింది. ముగ్గురు సంతానం కలిగిన ఆ కుటుంబానికి తల్లికి జీవనోపాధి కష్ట సాధ్యంగా మారింది. ఆమె చిన్నపాటి పనులకు వెల్లగా వచ్చే సంపాదన చాలకపోవడంతో తన ఇద్దరు కుమారుల్లో పెద్దబ్బాయిని పూర్తి స్థాయిలో కూలి పనులకు పంపించడం, రెండో అబ్బాయి మహమ్మద్‌ను ప్రభుత్వ పాఠశాలలో చదివిస్తోంది. ఇలా నగరంలో చాలా చోట్ల బాలలు కార్మికులుగా మారి కుటంబ పోషణ కోసం శ్రమిస్తున్నారు.

20 మందిపై లేబర్ యాక్టు కేసుల నమోదు..

ముష్కాన్ పేరుతో పోలీసు, కార్మిక, బాలల పరిరక్షణ కమిటీ అధికారులు ఇటీవల కడప నగరంలో సుమారు 63 మంది బాల కార్మికులను గుర్తించారు. వీరంతా వేర్వేరు చోట్ల మెకానిక్ షెడ్లు, హోటళ్లు, తోపుడు బండ్ల దుకాణాలు, టీ కొట్లు, కార్పెంటరీ పనుల్లో ఉండటంతో వారిని బాలల వసతి గృహానికి తరలించారు. వీరిలో 20 మందిపై బాల కార్మిక చట్టం పరిధిలోని కేసులను నమోదు చేశారు. దీంతో పిల్లల తల్లిదండ్రులు అధికారుల వద్దకు వచ్చి తమ ఆవేదన వ్యక్తం చేశారు. పిల్లలు పనులకెళ్లి వస్తేనే తమకు తినేందుకు తిండి ఉంటుందని లేదంటే ఇంటిల్లిపాది పస్తులు ఉండాల్సిన పేద బతుకులు తమవి అంటూ వాపోయారు. వారి పరిస్థితి తెలుసుకున్న పోలీసు అధికారులు కౌన్సెలింగ్ ఇచ్చి సొంత పూచీకత్తుపై పంపించిన సంఘటన లేకపోలేదు.

నిబంధనలు ఇలా..

బాల కార్మికుల నిషేద, నియంత్రణ చట్టం 1986 సవరణ బిల్లు 2016 (క్లప్రా యాక్టు) అమలుకు అందరూ సహకరించి నిఘా ఉంచాలనే నిబంధన ఉంది. అలాగే బాల కార్మిక రహిత ప్రాంతాలను ప్రోత్సహించేందుకు అవసరమైన చర్యలు తీసుకోవాల్సి ఉంటుంది.

ఇదీ పరిస్థితి...

జిల్లాలో 14 సంవత్సరాల లోపు బాల బాలికలు సుమారు 3 లక్షలకు పైగా ఉన్నారు. వీరిలో బాలలు 1.70 లక్షలు, బాలికలు 1.50 లక్షలకు పైగా ఉన్నట్లు సమాచారం. ఇందులో బడికి పోని పిల్లలు సుమారు 6 వేల మంది కాగా బడిమానేసిన వారు సుమారు 3 వేల మంది ఉన్నట్లు తెలుస్తోంది.





కోడ్ భాషలో TROUBLEను ఎలా రాస్తారు?

మెంటల్ ఎబిలిటి

1. ఒక కోడ్ భాషలో LAWYER ను ZHWNEC గా రాశారు. అదే కోడ్‌లో WONDER ను ఎలా రాస్తారు?
ఎ) EHWYST బి) WEYHTS
సి) TUSEWJ డి) ఏదీకాదు

2. ఒక కోడ్ భాషలో NUMBER ను ELXMHU గా రాశారు. అదే కోడ్ భాషలో UNINOR ను ఎలా రాస్తారు?
ఎ) LHLEQK బి) LQLKHE
సి) LELQHK డి) ఏదీకాదు

3. ఒక కోడ్‌లో MASTERను IVGHZNగా రాశారు. అదే కోడ్‌లో TALENTను ఎలా రాస్తారు?
ఎ) GZOGMV బి) GMVOZG
సి) GVOZMG డి) ఏదీకాదు

4. ఒక కోడ్‌లో EXCELను GBIMVగా రాశారు. అదే కోడ్‌లో SMILEను ఎలా రాస్తారు?
ఎ) IPPQT బి) IPTQP
సి) UQOTO డి) ఏదీకాదు

5. ఒక కోడ్‌లో STARను 170 గా రాశారు. అదే కోడ్‌లో UNITను ఎలా రాస్తారు?
ఎ) 92 బి) 108 సి) 126 డి) ఏదీకాదు

6. ఒక కోడ్ భాషలో PRIVATE ను BVHVOPF గా రాశారు. అదే కోడ్ భాషలో TROUBLE ను ఎలా రాస్తారు?
ఎ) CHUSPNL బి) HNCPLHU
సి) CNHUSPL డి) ఏదీకాదు

7 - 10
ఒక కోడ్ ప్రకారం HANDSOME ను 89431052 గాను, NICE ను 4672 గాను రాశారు. పై కోడ్ ఆధారంగా కింది ప్రశ్నలకు సమాధానాలు తెలపండి

7. NOSE కు సరైన కోడ్?
ఎ) 4012 బి) 2041 సి) 1024 డి) ఏదీకాదు

8. AIM కు సరైన కోడ్?
ఎ) 569 బి) 695 సి) 965 డి) ఏదీకాదు

9. MIND కు సరైన కోడ్?
ఎ) 5643 బి) 3456 సి) 5436 డి) ఏదీకాదు

10. HOME కు సరైన కోడ్?
ఎ) 8520 బి) 8052 సి) 5082 డి) ఏదీకాదు

11. 6, 7, 16, 51, ---------
ఎ) 208 బి) 504 సి) 416 డి) ఏదీకాదు

12. 8, 4.5, 5.5, 12.5, 52, ----------
ఎ) 416.5 బి) 418.5 సి) 420.5 డి) ఏదీకాదు

13. 8, 3, 2, 3, 10, --------
ఎ) 49 బి) 64 సి) 86 డి) ఏదీకాదు

14. 5, 4, 6, 15, 56, -------
ఎ) 285 బి) 275 సి) 280 డి) ఏదీకాదు

15. 9, 15, 43, 83, 247, -----------
ఎ) 192 బి) 921 సి) 291 డి) ఏదీకాదు

16. a - bc - ab - cdabc - da - cd - ----
ఎ) abbcdd బి) adbcbd
సి) abcdbd డి) ఏదీకాదు

17. ab - b - cacc - b - a - cb
ఎ) cbaab బి) aabbc
సి) adcab డి) ఏదీకాదు

18. d - dba - a - db - - a - ac
ఎ) bcdbcc బి) bbcccd
సి) bccdbc డి) ఏదీకాదు

19. ప్రకటనలు: అన్ని జిల్లాలు రాష్ట్రాలు
అన్ని రాష్ట్రాలు దేశాలు
సారాంశాలు: 1. కొన్ని దేశాలు జిల్లాలు
2. ఏ జిల్లా రాష్ట్రం కాదు
3. కొన్ని దేశాలు రాష్ట్రాలు కాదు
4. కొన్ని రాష్ట్రాలు జిల్లాలు
ఎ) 1, 4 సరైనవి బి) 1, 2, 4 సరైనవి
సి) 1, 3 సరైనవి డి) ఏవీ సరైనవి కావు


20. ప్రకటనలు: ఏ సెకను నిమిషం కాదు
కొన్ని నిమిషాలు గంటలు
సారాంశాలు: 1. కొన్ని గంటలు సెకన్లు కాదు
2. కొన్ని సెకన్లు నిమిషాలు కాదు
3. కొన్ని గంటలు నిమిషాలు
4. అన్ని సెకన్లు గంటలు
ఎ) 1, 3, 4 సరైనవి బి) 2, 4 సరైనవి
సి) 1, 2, 3 సరైనవి డి) ఏదీకాదు



Panditi Meenakshi Pavan
Senior Faculty


Competitive Exams Special

21. కింది రేఖాచిత్రంలో ఎన్ని త్రిభుజాలు ఉన్నాయి?



ఎ) 20 బి) 22 సి) 18 డి) 14

22. కింది రేఖాచిత్రంలో ఎన్ని దీర్ఘచతురస్రాలు ఉన్నాయి?



ఎ) 8 బి) 9 సి) 10 డి) 11

23 - 25
భిన్నమైనదాన్ని తెలపండి

23. ఎ) షిల్లాంగ్ బి) ఇంఫాల్ సి) అగర్తల డి) భోపాల్
24. ఎ) 4541 బి) 3973 సి) 8167 డి) 6345
25. ఎ) RN బి)SJ సి) FV డి) PH

26 - 30
A + B అంటే A కుమారుడు B
A ÷ B అంటే A భార్య B
A - B అంటే A కుమార్తె B
A X B అంటే A భర్త B
A @ B అంటే A తల్లి B
A $B అంటే A సోదరుడు B
పై సమాచారం ఆధారంగా కింది ప్రశ్నలకు సమాధానాలు తెలపండి

26. A@B$C÷D సమీకరణం ప్రకారం కిందివానిలో ఏది సత్యం?
ఎ) A మేనమామ C బి) C మేనల్లుడు A
సి) D మేనకోడలు A డి) ఏదీకాదు

27. A÷B@CXD సమీకరణం ప్రకారం కింది వానిలో ఏది సత్యం?
ఎ) A మామగారు C బి) D భర్త C
సి)D కుమార్తె B డి) A తండ్రి D

28. A+÷C$D సమీకరణం ప్రకారం కింది వానిలో ఏది సత్యం?
ఎ) A కోడలు C బి) C భార్య B
సి) B భర్త C డి) C మామగారుA

29. A$B@CXD సమీకరణం ప్రకారం కింది వానిలో ఏది సత్యం?
ఎ) D కుమారుడు A బి) D కుమార్తె B
సి) A తండ్రి D డి) D భర్త C

30. A-BXC@D సమీకరణం ప్రకారం కింది వానిలో ఏది సత్యం?
ఎ) D కోడలు B బి) C అత్తగారు A
సి) C తండ్రి D డి) D తండ్రి C

31. SKOHRILC పదంలోని అక్షరాల స్థానాలను మారిస్తే ఒక పానీయం పేరు వస్తుంది. ఆ పేరులోని మొదటి, చివరి అక్షరాలను సమాధానంగా తెలపండి
ఎ) R, I బి) H, S సి) C, R డి) ఏదీకాదు

32. కింది పదాలను నిఘంటువు ప్రకారం రాసిన తరవాత నాలుగో స్థానంలో వచ్చే పదాన్ని తెలపండి?
1. Honey 2. Heart 3. Home
4. Health 5. Help
ఎ) Help బి) Home
సి) Heart డి) Honey


33. ENVIRONMENT పదంలో వర్ణమాల ప్రకారం ఎన్ని జతలు ఉన్నాయి?
ఎ) నాలుగు బి) మూడు సి) ఆరు డి) ఐదు

34. వర్ణమాలలోని బేసి సంఖ్య అక్షరాలను చిన్న అక్షరాలుగాను, సరి సంఖ్య అక్షరాలను పెద్ద అక్షరాలుగాను రాస్తే జనవరి నెల అక్షరాలు ఎలా ఉంటాయి?
ఎ) JaNuaRy బి)JANuary
సి) JAnuARy డి) ఏదీకాదు

35. వర్ణమాలలోని మొదటి సగం అక్షరాలను అపసవ్యదిశలో రాసి రెండో సగం అక్షరాలను సవ్యదిశలో రాశారు. దీని ప్రకారం కుడి నుంచి పదో అక్షరానికి గల అయిదో ఎడమ అక్షరాన్ని తెలపండి?
ఎ)A బి) B సి) O డి) N

36. అచ్చులు తొలగించిన వర్ణమాల ప్రకారం కచ్చితంగా మధ్యలో గల అక్షరం?
ఎ) L బి) M సి) N డి) P


(37-40)



పై డయాగ్రమ్‌లకు కింది పదాల ప్రకారం సరైన దానిని సూచించండి

37. పురుషులు, తండ్రులు, ఉపాధ్యాయులు
38. వైద్యులు, మహిళలు, ఇంజనీర్లు
39. మానవుడు, న్యాయవాది, కుర్చీ
40. గంట, నిమిషం, సెకను

41. కింది డయాగ్రమ్‌ల ఆధారంగా 2 అంకె గల ముఖానికి ఎదురుగా ఉండే ముఖంలోని అంకె?



ఎ) 5 బి) 6 సి) 3 డి) 1

42. సెప్టెంబరు నెలలో ఏ తేదీకి ఏ వారం వస్తుందో అదే తేదీకి అదేవారం వచ్చే తదుపరి నెల?
ఎ) నవంబరు బి) అక్టోబరు
సి) జనవరి డి) డిసెంబరు

సమాధానాలు

1)	ఎ	7)	ఎ	13)	ఎ	19)	ఎ	27)	సి	35)	బి		
2)	సి	8)	సి	14)	బి	20)	సి	28)	ఎ	36)	సి		
3)	బి	9)	ఎ	15)	సి	21)	బి	29)	సి	37)	బి		
4)	సి	10)	బి	16)	బి	22)	బి	30)	ఎ	38)	డి		
5)	ఎ	11)	ఎ	17)	ఎ	23)	డి	31)	బి	39)	సి		
6)	సి	12)	బి	18)	సి	24)	సి	32)	బి	40)	ఎ		
						25)	బి	33)	సి	41)	బి		
						26)	ఎ	34)	ఎ	42)	డి		

ఉద్యోగాలు

ఐజిఐఎంఎస్

పట్నాలోని ఇందిరాగాంధీ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ మెడికల్ సైన్సెస్ (ఐజిఐఎంఎస్)- **సీనియర్ రెసిడెంట్/ ట్యూటర్** పోస్టుల భర్తీకి వాక్ ఇన్ ఇంటర్వ్యూలు నిర్వహిస్తోంది.

మొత్తం ఖాళీలు : 57

విభాగాలవారీ ఖాళీలు: అనెస్థీషియా 2, చెస్ట్ & టిబి 1, డెంటిస్ట్రీ 2, ఫోరెన్సిక్ మెడిసిన్ 1, జనరల్ మెడిసిన్ - ఎమర్జెన్సీ 5, జనరల్ సర్జరీ 1, జనరల్ సర్జరీ - ఎమర్జెన్సీ 1, మైక్రో బయాలజీ 1, ఆప్తల్మాలజీ 1, ఆర్థోపెడిక్స్ 1, ఫార్మకాలజీ 1, పీడియాట్రిక్స్ 3, ఫిజికల్ మెడిసిన్ 1, సైకియాట్రీ 1, రేడియాలజీ 6, కార్డియాలజీ 8, కార్డియో థోరాసిస్ వాస్క్యులర్ సర్జరీ 2, నెఫ్రాలజీ 11, న్యూరో మెడిసిన్ 1, న్యూరో సర్జరీ 3, మెడికల్ అంకాలజీ 1, పీడియాట్రిక్ సర్జరీ 2, యూరాలజీ 1

వయసు: ఆగస్టు 31 నాటికి 35 ఏళ్లు మించరాదు

అర్హత: ఎంసిఐ గుర్తింపు పొందిన సంస్థ నుంచి సంబంధిత విభాగంలో ఎండి/ ఎంఎస్ పూర్తిచేసి ఉండాలి. సెంట్రల్/ స్టేట్ మెడికల్ కౌన్సెల్ గుర్తింపు పొంది ఉండాలి.

దరఖాస్తు ఫీజు: రూ.500

ఇంటర్వ్యూ: ఆగస్టు 21 నుంచి 24 వరకు

వేదిక: Office Chamber of the Director, IGIMS, Patna - 14

వెబ్‌సైట్: www.igims.org

షిప్పింగ్ కార్పొరేషన్ ఆఫ్ ఇండియా

ముంబైలోని షిప్పింగ్ కార్పొరేషన్ ఆఫ్ ఇండియా- **'గ్రాడ్యుయేట్ మెరైన్ ఇంజనీర్స్'** పోస్టుల భర్తీకి ఉద్దేశించిన జిఎంఇ కోర్స్‌కు దరఖాస్తులు కోరుతోంది. ఇందులో భాగంగా ఎనిమిది నెలల జిఎంఇ షోర్ ట్రైనింగ్, పది నెలల షిప్ బోర్డ్ ట్రైనింగ్ ఉంటుంది. కోర్సు పూర్తిచేసుకొన్న అభ్యర్థులకు **'ఎంఇఒ క్లాస్ 4 పార్ట్ బి'** సర్టిఫికెట్ ప్రదానం చేస్తారు.

సీట్లు: 40(జనరల్ వర్గానికి 20, ఒబిసిలకు 11, ఎస్సీలకు 6, ఎస్టీలకు 3 సీట్లు కేటాయించారు)

క్యాంపస్: SCI' Maritime Training Institute, Powai, Mumbai

కోర్సు ఫీజు: రూ.4,50,000

స్టయిపెండ్: నెలకు రూ.15,000 ఇస్తారు

అర్హత: 50 శాతం మార్కులతో బిఇ/ బిటెక్ (మెకానికల్ ఇంజనీరింగ్) ఉత్తీర్ణులు/ ఆఖరు ఏడాది పరీక్షలు రాసి ఆగస్టు 31 నాటికి ఫలితాలు వెలవడే అవకాశం ఉన్న అభ్యర్థులు దరఖాస్తు చేసుకోవచ్చు. పదోతరగతి & పన్నెండో తరగతి లెవెల్ ఇంగ్లీషు సబ్జెక్టుల్లో 50 శాతం మార్కులు వచ్చి ఉండాలి.

వయసు: అక్టోబరు 1 నాటికి 28 ఏళ్లు మించరాదు

ఎంపిక: ఆల్ ఇండియా ఆన్‌లైన్ టెస్ట్, పర్సనల్ ఇంటర్వ్యూ ద్వారా

ఆన్‌లైన్ టెస్ట్: సెప్టెంబరు 9న

ఆన్‌లైన్ టెస్ట్ వివరాలు: పరీక్ష సమయం రెండు గంటలు. క్వాంటిటేటివ్ ఆప్టిట్యూడ్, ప్రొఫెషనల్ నాలెడ్జ్, ఇంగ్లీష్ లాంగ్వేజ్, రీజనింగ్ ఎబిలిటీకి సంబంధించిన మల్టిపుల్ చాయిస్ క్వశ్చన్స్ అడుగుతారు. అభ్యర్థులు ప్రతి విభాగంలో అర్హత సాధించాలి. అర్హులైనవారిని ఇంటర్వ్యూకి షార్ట్‌లిస్ట్ చేస్తారు.

పరీక్ష కేంద్రాలు: ముంబై, న్యూఢిల్లీ, కోల్‌కతా, చెన్నై

దరఖాస్తు ఫీజు: రూ.1000

అభ్యర్థులు ఆన్‌లైన్‌లో పూర్తిచేసిన దరఖాస్తు ఫారాన్ని ఆర్డినరీ పోస్ట్/ కొరియర్/ స్పీడ్ పోస్ట్/ రిజిస్టర్డ్ పోస్ట్ / బై హ్యాండ్ ద్వారా కింది చిరునామాకు పంపాలి.

ఆన్‌లైన్ దరఖాస్తుకు ఆఖరు తేదీ: ఆగస్టు 23


దరఖాస్తు హార్డు కాపీ చేరేందుకు ఆఖరు తేదీ: ఆగస్టు 25

చిరునామా: Vice President I/C, Flee Personnel Dept, Third Floor, The shipping Corporation of India, Shipping House 245, Madame Cama Road, Nariman Point, Mumbai- 400021

వెబ్‌సైట్: www.shipindia.com/careers

గుండె జబ్బు చికిత్సలో ఉపయోగించే ఔషధ మొక్క?

జంతు రాజ్యం, మొక్కలు - ఆర్థిక ప్రయోజనాలు



ఆర్. సురేష్
సీనియర్ ఫ్యాకల్టీ

1. క్రికెట్ బ్యాట్ తయారీలో ఉపయోగించే చెట్టు?
ఎ) విల్లో బి) హాల్లీ సి) హాక్‌బెర్రి డి) వెదురు
2. కింది ఏ రంగులను పత్రాల నుంచి సేకరిస్తారు?
ఎ) ఇండిగో బి) హెన్నా సి) క్లోరోఫిల్ డి) పైవన్నీ
3. ఆహారపదార్థాల్లో రంగుగా ఉపయోగించే అన్నెట్టోను ఏ భాగం నుంచి సేకరిస్తారు?
ఎ) వేరు బి) కాండం సి) విత్తనం డి) పత్రం
4. ఏ చెట్టు నుంచి రబ్బరు తయారు చేస్తారు?
ఎ) ఫైకస్ ఎలాస్టికా బి) కాస్టిల్లా ఎలాస్టికా
సి) హివియా బ్రెసిలెన్సిస్ డి) పైవన్నీ
5. కింది ఏ చెట్టు నుంచి గమ్(జిగురు)ను సేకరిస్తారు?
ఎ) ఫైకస్ బి) అకేసియా సి) పైనస్ డి) పైవన్నీ
6. టర్పెంటైన్‌ను కింది ఏ చెట్టు నుంచి సేకరిస్తారు?
ఎ) విల్లో బి) పైనస్ సి) అకేసియ డి) హివియా
7. 'లవంగం' మొక్కలోని ఏ భాగం?
ఎ) మొగ్గ బి) వేరు
బి) ఫలం
డి) పుష్ప విన్యాసం



8. మిరియాలు మొక్కలోని ఏ భాగం?
ఎ) మొగ్గ బి) ఫలం సి) వేరు డి) కాండం
9. చాక్లెట్ల తయారీలో ఉపయోగించే కోకోవాను మొక్కలోని ఏ భాగం నుంచి సేకరిస్తారు?
ఎ) ఫలం బి) మొగ్గ సి) విత్తనాలు డి) కాండం
10. కింది ఏ సుగంధ ద్రవ్యాన్ని విత్తనాల నుంచి సేకరిస్తారు?
ఎ) యాలకులు బి) లవంగం
సి) దాల్చిన చెక్క డి) పైవన్నీ
11. గుండె జబ్బు చికిత్సలో ఉపయోగించే ఔషధ మొక్క?
ఎ) యూకలిప్టస్ బి) డిజిలాలిస్
సి) బెల్లడోనా డి) క్వినైన్
12. సింకోనా అనే ఔషధ మొక్కలోని ఏ భాగం నుంచి మలేరియా చికిత్సలో ఉపయోగించే క్వినైన్ అనే ఔషధాన్ని సేకరిస్తారు?
ఎ) వేరు బి) బెరడు సి) పత్రం డి) విత్తనాలు
13. 'ముల్లంగి' మొక్కలోని ఏ భాగం?
ఎ) దుంప కాండం బి) నిల్వ చేసే వేరు
సి) ఫలం డి) పుష్ప విన్యాసం
14. కింది వాటిలో ఏక దళ బీజ మొక్క?
ఎ) చిక్కుడు బి) గోధుమ సి) బఠాని డి) ఏదీకాదు
15. అల్లం : భూగర్భ కాండం :: బీట్‌రూట్ : ....
ఎ) వేరు బి) ఫలం సి) లశునం డి) కొమ్ము
16. కింది వాటిలో చిరుధాన్యం?
ఎ) వరి బి) గోధుమ సి) రాగి డి) పైవన్నీ
17. విత్తన సుప్తావస్థను కలుగజేసే ఫైటోహార్మోన్?
ఎ) ఆక్సిన్ బి) సైటోకైనిన్
సి) జిబ్బరెల్లిన్ డి) ఆబ్‌సైసికామ్లం
18. కింది వాటిలో సంయుక్త ఫలం ఏది?
ఎ) పైనాపిల్ బి) సీతాఫలం
సి) కొబ్బరి డి) మామిడి
19. గోల్డెన్ రైస్ అనేది ఒక ....
ఎ) కీటక నిరోధకత కలిగిన మొక్క
బి) నీటి ఎద్దడిని తట్టుకోగలిగే మొక్క
సి) బీటా కెరోటిన్‌ను కలిగిన జన్యుపరివర్తన మొక్క
డి) పైవన్నీ

జనరల్ స్టడీస్ - బయాలజీ

20. ఊడ వేర్లను కలిగి ఉన్న చెట్టు?
ఎ) మొక్కజొన్న బి) చెరకు సి) మర్రి డి) పైవన్నీ
21. ఆడమ్స్ ఫిగ్, ఆపిల్ ఆఫ్ పారడైజ్ అనే ప్రతి నామాలు కలిగిన ఫలం?
ఎ) మామిడి బి) అరటి సి) జామ డి) సీతాఫలం
22. బంగినపల్లి, సువర్ణరేఖ అనేవి ఏ ఫలంలోని రకాలు?
ఎ) మామిడి బి) అరటి సి) జామ డి) పైనాపిల్
23. చక్కెరకేళి, అమృతపాణి అనేవి ఏ ఫలంలోని రకాలు?
ఎ) సీతాఫలం బి) జామ సి) మామిడి డి) అరటి
24. స్వర్ణ, మొతి అనేవి ఏ ధాన్యంలోని రకాలు?
ఎ) వరి బి) గోధుమ సి) జొన్న డి) సజ్జ
25. మర్రి చెట్టు జీవితకాలం?
ఎ) 50 సంవత్సరాలు బి) 80 సంవత్సరాలు
సి) 200 - 300 సంవత్సరాలు
డి) 100 - 150 సంవత్సరాలు
26. ఏనుగు సాధారణ శరీర ఉష్ణోగ్రత?
ఎ) 35.9°C
బి) 25°C
సి) 42.9°C డి) 51°C



27. కుక్క సాధారణ శరీర ఉష్ణోగ్రత?
ఎ) 125°F బి) 84 - 92°F
సి) 100 - 102.5°F డి) 110 - 114°F
28. గుర్రం సాధారణ శరీర ఉష్ణోగ్రత ఎంత?
ఎ) 99.5° - 101,5°F బి) 82° - 85°F
సి) 74.3° - 76.5°F డి) 105° - 107°F
29. నీలి తిమింగలం గుండె బరువు?
ఎ) 50 కి.గ్రా. బి) 150 కి.గ్రా.
సి) 750 కి.గ్రా. డి) 78 కి.గ్రా.
30. ఏనుగు గుండె సుమారుగా ఎన్ని కిలో గ్రాముల బరువు ఉంటుంది?
ఎ) 12 - 21 కి.గ్రా. బి) 5 - 6 కి.గ్రా.
సి) 35 - 39 కి.గ్రా. డి) 50 - 56 కి.గ్రా.
31. ఏనుగు గుండె నిమిషానికి ఎన్ని సార్లు కొట్టుకొంటుంది?
ఎ) 76 బి) 46 సి) 26 డి) 06
32. నీలి తిమింగలం గుండె నిమిషానికి ఎన్ని సార్లు కొట్టుకొంటుంది?
ఎ) 76 బి) 46 సి) 16 డి) 07
33. జంతువుల్లో ఎత్తయినది ఏది?
ఎ) ఏనుగు బి) జిరాఫీ సి) గుర్రం డి) గేదె
34. జలగ ఏ వర్గానికి చెందిన జీవి?
ఎ) మొలస్కా బి) నిడేరియ సి) అనెలిడా డి) కార్డేటా
35. 'గుడ్లగూబ' ఒక ....
ఎ) పక్షి
బి) క్షీరదం
సి) సరీసృపం
డి) అకశేరుకం



36. కింది వాటిలో స్వీయ మలభక్షక జంతువు?
ఎ) పంది బి) కుక్క సి) కుందేలు డి) ఏదీకాదు
37. సీతాకోకచిలుక జంతురాజ్యంలోని ఏ వర్గానికి చెందుతుంది?
ఎ) ఆర్థ్రోపొడా బి) మొలస్కా సి) అనెలిడా డి) కార్డేటా
38. ఏ జంతువు కంటిలో టపేటమ్ లుసిడమ్ ఉంటుంది?
ఎ) పిల్లి బి) కుక్క సి) గుర్రం డి) పైవన్నీ
39. ఊసరవెల్లి ఏ తరగతికి చెందిన జంతువు?
ఎ) క్షీరదం బి) సరీసృపం
సి) ఉభయచరం డి) అకశేరుకం
40. కింది ఏ జంతువు కళ్లు పరస్పరం స్వతంత్రంగా (రెండోదానితో సంబంధం లేకుండా) పనిచేస్తాయి?
ఎ) ఊసరవెల్లి బి) కుందేలు సి) గుడ్లగూబ డి) పిల్లి
41. కింది ఏ జంతువులో మూడు కనురెప్పలు ఉంటాయి?
ఎ) ఏనుగు బి) ఒంటె సి) గుర్రం డి) జిరాఫీ
42. పిల్లికి సుమారు ఎన్ని ఎముకలు ఉంటాయి?
ఎ) 230 - 250 బి) 310 - 330
సి) 196 - 205 డి) 260 - 270
43. కుక్కకి సుమారు ఎన్ని ఎముకలు ఉంటాయి?
ఎ) 220 - 225 బి) 290 - 296
సి) 319 - 321 డి) 200 - 206
44. ఎక్కువ జీవిత కాలాన్ని కలిగి ఉన్న జంతువు?
ఎ) టర్టిల్ బి) ఏనుగు సి) తిమింగలం డి) పులి
45. పులి జీవితకాలం ఎన్ని సంవత్సరాలు?
ఎ) 30 బి) 10 సి) 45 డి) 12
46. కింది ఏ జంతువు జీవితకాలంలో దంతాలు ఒకసారి మాత్రమే ఏర్పడతాయి?
ఎ) కుక్క బి) మానవుడు సి) ఎలుక డి) పైవన్నీ
47. కింది ఏ జంతువులో రథనికలు, అగ్ర చర్వణకాలు ఉండవు?
ఎ) కుందేలు బి) గేదె సి) ఎలుక డి) పైవన్నీ
48. ఒకే రకమైన దంతాలను కలిగి ఉన్న జంతువు?
ఎ) కుక్క బి) కుందేలు సి) మానవుడు డి) డాల్ఫిన్
49. దంతాలు లేని సరీసృపం?
ఎ) తాబేలు బి) బల్లి సి) టర్టిల్ డి) తాబేలు, టర్టిల్
50. కింది వాటిలో కీటకం?
ఎ) సిల్వర్ ఫిష్ బి) డాగ్ ఫిష్
సి) డేవిల్ ఫిష్ డి) ఏదీకాదు
51. కింది వాటిలో క్షీరదం?
ఎ) గబ్బిలం బి) డాల్ఫిన్ సి) డుడాంగ్ డి) పైవన్నీ
52. జతపరచండి.
1. ఉల్లి ఎ. కొమ్ము
2. బంగాళదుంప బి. లశునం
3. అల్లం సి. దుంపకాండం
డి. కందం
ఎ) 1-ఎ, 2-బి, 3-డి బి) 1-బి, 2-సి, 3-ఎ
సి) 1-బి, 2-సి, 3-డి డి) 1-ఎ, 2-సి, 3-డి
53. కింది వాటిలో సరైన జత కానిది?
మొక్క - క్రోమోజోముల సంఖ్య
1. ఉల్లి - 16
2. వరి - 24
3. యాపిల్ - 34
ఎ) 1, 3 బి) 2, 3 సి) 3 డి) ఏదీకాదు
54. కుంకుమ పువ్వును మొక్కలోని ఏ భాగం నుంచి సేకరిస్తారు?
ఎ) పుష్పం బి) వేరు సి) బెరడు డి) ఫలం
55. కింది ఏ జంతువు నీరు తాగకుండా ఎక్కువ రోజులు ఉంటుంది?
ఎ) గుర్రం బి) ఏనుగు సి) ఒంటె డి) గేదె

సమాధానాలు

1) ఎ	9) సి	17) డి	27) సి	37) ఎ	47) సి
2) డి	10) ఎ	18) ఎ	28) ఎ	38) డి	48) డి
3) సి	11) బి	19) సి	29) సి	39) బి	49) డి
4) డి	12) బి	20) సి	30) ఎ	40) ఎ	50) ఎ
5) బి	13) బి	21) బి	31) బి	41) బి	51) డి
6) బి	14) బి	22) ఎ	32) డి	42) ఎ	52) బి
7) ఎ	15) ఎ	23) డి	33) బి	43) సి	53) డి
8) బి	16) సి	24) సి	34) సి	44) ఎ	54) ఎ
		25) సి	35) ఎ	45) ఎ	55) సి
		26) ఎ	36) సి	46) సి	

అడ్మిషన్స్

ఉస్మానియా యూనివర్సిటీ

ఉస్మానియా యూనివర్సిటీ వర్కింగ్ ఎగ్జిక్యూటివ్స్ కోసం నిర్వహించే ఎంబిఏ కోర్సులో ప్రవేశానికి ప్రకటనను విడుదల చేసింది.
ఆఫర్ చేస్తున్న కోర్సులు: ఎంబిఏ (టెక్నాలజీ మేనేజ్‌మెంట్- ఈవెనింగ్ సెషన్)
ప్రవేశం: రాత పరీక్ష ద్వారా
ఎంబిఏ (ఈవెనింగ్-పార్ట్‌టైమ్)
ప్రవేశం: టిఎస్‌ఐసెట్-2017 ద్వారా
దరఖాస్తుకు చివరి తేదీ: ఆగస్టు 11, 2017
రాత పరీక్ష తేదీ: ఆగస్టు 13, 2017
వెబ్‌సైట్: http://www.ouadmissions.com/

సరోజినీ దేవి నేత్ర వైద్యశాల

సరోజినీ దేవి నేత్ర వైద్యశాల-హైదరాబాద్, డిప్లొమా ఇన్ ఆప్టోమెట్రీ కోర్సులో ప్రవేశానికి దరఖాస్తులు కోరుతోంది.
అర్హత: ఇంటర్మీడియెట్ (బయాలజీ/మేథ్స్, ఫిజికల్ సైన్స్)
వయసు: 17-25 సంవత్సరాలు
దరఖాస్తు: సూపరింటెండెంట్, సరోజినీ దేవి నేత్ర వైద్యశాల-హైదరాబాద్ పేరిట రూ.100 డిడిని తీసి నిర్దేశిత చిరునామాకు పంపి దరఖాస్తును పొందొచ్చు. కవర్ మీద అభ్యర్థి వివరాలు రాయాలి.
దరఖాస్తుకు చివరి తేదీ: ఆగస్టు 16, 2017
చిరునామా: సూపరింటెండెంట్, సరోజినీ దేవి నేత్ర వైద్యశాల-హైదరాబాద్,
పిన్: 500028.

బార్క్‌లో డిప్లొమా

బాబా అటామిక్ రీసెర్చ్ సెంటర్ (బార్క్) డిప్లొమా ఇన్ రేడియోలాజికల్ ఫిజిక్స్ కోర్సులో ప్రవేశానికి దరఖాస్తులను ఆహ్వానిస్తోంది.
సీట్ల సంఖ్య: 30
అర్హత: 60 శాతం మార్కులతో మాస్టర్ డిగ్రీ (ఫిజిక్స్)
వయసు: 26 సంవత్సరాలు
దరఖాస్తు: ఆన్‌లైన్ ద్వారా
దరఖాస్తుకు చివరి తేదీ: ఆగస్టు 21, 2017
రాత పరీక్ష తేదీ: సెప్టెంబర్ 3, 2017
వెబ్‌సైట్: http://www.barc.gov.in/

జెఎన్‌టియు

జవహర్‌లాల్ నెహ్రూ టెక్నాలజికల్ యూనివర్సిటీ (జెఎన్‌టియు)-హైదరాబాద్, ఎంబిఏ కోర్సులో ప్రవేశానికి నోటిఫికేషన్ విడుదల చేసింది.
సీట్ల సంఖ్య: 20
అర్హత: 55 శాతం మార్కులతో ఏదైనా నాలుగేళ్ల డిగ్రీ
దరఖాస్తు: ఆఫ్‌లైన్ ద్వారా
దరఖాస్తు ఫీజు: రూ.1,000
ప్రవేశం: రాత పరీక్ష ద్వారా
దరఖాస్తుకు చివరి తేదీ: ఆగస్టు 10, 2017
వెబ్‌సైట్: http://jntuh.ac.in/admissions
చిరునామా: డైరెక్టరేట్ ఆఫ్ ఎగ్జామినేషన్, జెఎన్‌టియూ, కూకట్‌పల్లి, హైదరాబాద్-85.

స్కాలర్‌షిప్

రాష్ట్రీయ శాన్‌స్క్రిట్ సంస్థాన్

న్యూఢిల్లీలోని రాష్ట్రీయ శాన్‌స్క్రిట్ సంస్థాన్ - సంస్కృత విద్యాభివృద్ధిలో భాగంగా ఉద్దేశించిన **'మెరిట్ స్కాలర్‌షిప్స్'**నకు ప్రకటన విడుల చేసింది. ఇందుకు ఎంహెచ్‌ఆర్‌డి సహకారాన్ని అందిస్తోంది.
శాన్‌స్క్రిట్/ పాళి/ ప్రాకృత్‌లను మెయిన్/ ఆప్షనల్ సబ్జెక్టులుగా శాన్‌స్క్రిట్ పాఠశాల/ శాన్‌స్క్రిట్ మహావిద్యాలయ/ శాన్‌స్క్రిట్ విశ్వవిద్యాలయాల్లో చదువుతున్నవారు అర్హులు. పూర్వ మాధ్యమ(ప్రథమ సంవత్సరం)/ తొమ్మిదో తరగతి పూర్వ మాధ్యమ (రెండో సంవత్సరం)/ పదోతరగతి ఉత్తర మాధ్యమ, ప్రక్షస్త్రీ(మొదటి సంవత్సరం), పదకొండో తరగతి ఉత్తర మాధ్యమ, ప్రక్షస్త్రీ(రెండో సంవత్సరం), పన్నెండో తరగతి శస్త్రీ, బిఏ/ ఆచార్య ఎమ్మే/ విద్యావారధి/ పిహెచ్‌డి చదువుతున్నవారు దరఖాస్తు చేసుకోవచ్చు.
విద్యా సంస్థల ఆన్‌లైన్ రిజిస్ట్రేషన్‌కు ఆఖరు తేదీ: ఆగస్టు 30
అభ్యర్థుల స్కాలర్‌షిప్ రిజిస్ట్రేషన్‌కు ఆఖరు తేదీ: సెప్టెంబరు 10
వెబ్‌సైట్: www.sanskrit.nic.in, www.scholarship.rsks.in

రామాలయ నిర్మాణానికి భూమిపూజ



చిట్వేలి : మండల పరిధిలోని కందులవారిపల్లెలో శుక్రవారం రూ.40 లక్షలతో నిర్మించ నున్న శ్రీ సీతా రామ ఆలయానికే భూమి పూజ చేశారు. ఆధ్యాత్మిక చింత నతోనే ప్రశాంతత చేకూరుతుందని టీడీపీ నేత ఏదోటి రాజశేఖర్‌నా యుడు, మాజీ ఎంపీపీ కందులగుండయ్యానాయుడులు అన్నారు. కార్యక్రమంలో రెడ్డ య్య, బాలాజి, హరిబాబు, గుండయ్య, వెంకటనారాయణ, నవీన్, హరికృష్ణ పాల్గొన్నారు.

నంద్యాల ఉప ఎన్నిక పరిశీలకుడిగా వెంకటరమణ


లింగుట్ల వెంకటరమణ

పుల్లంపేట : నంద్యాల శాసన సభ ఉప ఎన్నిక సందర్భంగా తెలుగుదేశం పార్టీ పరిశీలకుడి గా పుల్లంపేట టీ డీ పీ మండల అధ్యక్షుడు లింగుట్ల వెంకట రమణను నియమిస్తూ పార్టీ కార్యాలయం నుంచి ఆదేశాలు అందాయి. ఆమేరకు వెంకటరమణ మాట్లాడుతూ పార్టీ ఆదేశానుసారం సోమవారం నంద్యాలకు వెళుతున్నానని పార్టీ తమపై ఉంచుకున్న నమ్మకాన్ని వమ్ముచేయకుండా ఉప ఎన్నికల్లో తెలుగుదేశం పార్టీ అభ్యర్థి గెలుపుకు విశేష కృషి చేస్తానన్నారు. పార్టీ అధినాయకత్వానికి ధన్యవాదాలు తెలిపారు.

ఎరువుల దుకాణాల్లో నగదు బదిలీ తప్పనిసరి


ఎరువులదుకాణదారులకు ఈపాస్‌మిషన్లను పంపిణీచేస్తున్న అధికారులు

రైల్వేకోడూరు: ఎరువుల దుకాణయజమానులు నగదుబదిలీ ద్వారా విక్రయాలు చేయాలని కోడూరు వ్యవసాయశాఖ సహాయ సంచాలకుడు సుబ్రమణ్యం సూచించారు. శుక్రవారం వ్యవసాయశాఖ కార్యాలయంలో ఎరువులదుకాణదారులకు ఈపాస్‌మిషన్లు పంపిణీచేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఈపాస్‌మిషన్ల ద్వారానే ఎరువుల విక్రయాలు నిర్వహించాలని దుకాణయజమాలను ఆదేశించారు. ఈపాస్‌మిషన్ల ద్వారా విక్రయాలు చేయడంద్వారా బ్లాక్ మార్కెట్‌ను అరికట్టవచ్చని, అన్ని క్రయవిక్రయాలు పారదర్శకంగా ఉండాలని ప్రభుత్వం ఈపాస్‌మిషన్లను ఏర్పాటుచేసిందన్నారు. రైతులకు అందించే ఎరువులు కల్తీలేకుండా చేయాలని ప్రభుత్వ సంకల్పమన్నారు. మండల పరిధిలోఉన్న రైతులందరు ఎరువుల దుకాణాలకు వారి ఆధార్‌కార్డులను తప్పనసరిగా తీసుకువెళ్లి కొనుగోలుచేసుకోవాలని తెలిపారు. కార్యక్రమంలో వ్యవసాయశాఖ అధికారిణి మల్లిక, కడప సహాయ సంచాలకుల కార్యాలయం నుంచి ఏడీఏ జయరాణి, ఏవో ప్రభాకర్‌రెడ్డి, ఏవో రమేష్, విస్తరణాధికారి ప్రవీణ్, ఎరువులదుకాణదారులు సుబ్బారావు, ఓంనమశివాయ, పెడబల్లెశరత్ పాల్గొన్నారు.

భూసమస్యల పరిష్కారానికే
రెవెన్యూ గ్రామసభలు

కోడూరు తహశీల్దార్ చంద్రాయుడు,
సెల్‌నెం.9959667606



రైల్వేకోడూరు: భూసమస్యల పరిష్కారానికే ప్రభుత్వం రైతుసేవలో రెవెన్యూ గ్రామసభలు ఏర్పాటుచేసిందని రైల్వేకోడూరు తహశీల్దార్ చంద్రాయుడు తెలిపారు. ఆంధ్రజ్యోతి ఇంటర్వ్యూలో ఆయన మాట్లాడుతూ రైతుసేవలో రెవెన్యూ శాఖ ద్వారా వారానికి రెండు పంచాయితీల్లో గ్రామసభలు నిర్వహించి రైతు సమస్యలపై వినతులు తీసుకుని పరిష్కారానికి కృషిచేస్తున్నామని తెలిపారు.

ప్రశ్న: మీకోసంలో ఎన్ని దరఖాస్తులు వచ్చాయి? ఎన్ని పరిష్కారంచేశారు?

జవాబు: 882 దరఖాస్తులు రాగా ఇందులో 532 పరిష్కరించాం. 350 సమస్యలు పరిష్కారించాల్సిఉంది.

ప్రశ్న: భూసమస్యలు పరిష్కరించడంలో ఎలాంటిచర్యలుతీసుకుంటున్నారు?

జవాబు: భూసమస్యలు రైల్వేకోడూరు మండలంలో ఎక్కువగానే ఉన్నాయి. వీటిని సున్నితంగా పరిష్కరించాల్సిఉంది.

ప్రశ్న: ప్రభుత్వభూముల కబ్జాల విషయంలో ఎలాంటి చర్యలుతీసుకున్నారు?

జవాబు: కబ్జాలు చేసినప్పుడు వాటిని పరిశీలించి నోటీసులు ఇచ్చి స్వాధీనంచేసుకుంటున్నాం.

ప్రశ్న: ప్రజాపంపిణీవ్యవస్థలో క్యాష్‌లెస్ జరుగుతున్నదా?

జబాబు: క్యాష్‌లెస్ పంపిణీకి అన్ని రకాలచర్యలుతీసుకుంటున్నాం. లబ్ధిదారులకు బ్యాంకులో అకౌంటు ఆధార్‌తోఅనుసంధానం అయిఉండాలి.

ప్రశ్న: సిబ్బంది కొరత ఉందా?

జవాబు: సీనియర్ అసిస్టెంట్, ఎన్నికల డిప్యూటి అధికారి లేరు.

ప్రశ్న: ప్రభుత్వభూములు గుర్తుంచారా?

జవాబు: గుర్తించి ప్రభుత్వంకు నివేదికలు పంపాం.

ప్రశ్న: ఈపాస్‌పుస్తకాలు మంజూరుచేశారా?

జవాబు: ఇప్పటివరకు 926 మంజూరు చేశాం.

ప్రశ్న: సర్వేలు ఆలస్యమవుతున్నాయా?

జవాబు: సర్వేలు ఆలస్యం లేకుండా చేస్తున్నాము. కీలకంగా ఉన్నవి పై అధికారుల ఆదేశాలతో చేయిస్తున్నాం.

ప్రశ్న: జన్మభూమివచ్చిన వినతులు పరిష్కారమయ్యాయా?

జవాబు: చాలావరకు పరిష్కారంచేస్తున్నాం.

అదనపు కట్నం కేసులో భర్తకు జైలు

చిట్వేలి : చిట్వేలి మండలం ఎం.గొల్లపల్లె దళితవాడకు చెందిన కోనేటి లీనాహారతి తనను అదనపు కట్నం కోసం వేధిస్తున్నారంటూ పెట్టిన కేసులో భర్త కోనేటి ఆదికిరణ్‌కుమార్‌కు 10నెలల జైలు శిక్ష, 5వేలు రూపాయలు జరిమానా విధించినట్లు చిట్వేలి హెడ్‌కానిస్టేబుల్ శ్రీనివాసులు తెలిపారు. ఎం.గొల్లపల్లె దళితవాడకు చెందిన కోనేటి ఆదికిరణ్‌కుమార్‌కు, లీనాహారతికి వివాహ సందర్భంగా వరకట్నం కింద 85వేల రూపాయల నగదు, 65గ్రాముల బంగారు ఇచ్చినట్లు తెలిపారు. కొన్నాళ్లు భార్య, భర్తల కాపురం సఖ్యతగా సాగించారని ఆ తరువాత అదనపు కట్నం కోసం భర్తతో పాటు అత్త వెంకటసుబ్బమ్మ, మామ శంకరయ్య, బావ రత్నాకర్‌లు తనను వేధిస్తున్నారంటూ 2015 సెప్టెంబర్ 18న చిట్వేలి పోలీసు స్టేషన్‌లో ఆమె ఫిర్యాదు చేసింది. ఆ మేరకు పూర్వపరాలను పరిశీలించిన రాజంపేట జీఎఫ్‌సీఎం కోర్టు జడ్జి ఫైజున్నీషా శుక్రవారం నింధితుడు ఆదికిరణ్‌కుమార్‌కు 10నెలల జైలు, 5వేలు జరిమానా విధించారు. ఏపీపీ ఉమాదేవి ఫిర్యాదు తరపున వాదించారు. హెచ్‌సీ శ్రీనివాసులు, కోర్టు కానిస్టేబుల్ విజయ్ కుమార్‌రెడ్డిలు పై విషయాలను వెల్లడించారు.

కిడ్నీ బాధితురాలు శంకరమ్మకు సాయం


బాధితురాలికి సాయమందిస్తున్న వైఏఎస్‌ఎఫ్ సభ్యులు

రైల్వేకోడూరు: కిడ్నీ బాధితురా లు శంకరమ్మకు తరచూ దాతలు సాయంచేస్తున్నారు. అయ్యోపాపం శంకరమ్మ అన్నవార్త ఆంధ్ర జ్యోతిదినపత్రికలో ప్రచురితం కావడంతో దాతలు సాయం చేయడానికి ముందుకువస్తున్నారు. శుక్రవారం బీడబ్ల్యూఎఫ్(బిగోవరల్డ్‌వైడ్‌ఫ్రెండ్స్) నిర్వాహకులు రాకేష్, వాసు, నితీష్, సురేష్, పవన్‌లు తదితర సభ్యులు రూ.45 వేలు సాయంచేశారు. శంకరమ్మ త్వరగా కోలుకోవాలని మంచి ఆస్పత్రిలో చికిత్సలు చేయించుకోవాలని కోరారు. వారందరికి రుణపడిఉన్నామని బాధితురాలు శంకరమ్మ తెలిపింది.

పక్కా గృహాల కోసం దరఖాస్తు చేసుకోండి


పక్కా గృహాల కోసం అర్జీలు తీసుకుంటున్న ఎంపీడీవో

పుల్లంపేట : నిరుపేదలు పక్కా గృహాల కోసం దరఖాస్తు చేసుకోవాలని ఎంపీడీవో ఎస్‌ఎండీ హుస్సేన్ తెలిపారు. శుక్రవారం అనంతసముద్రం వత్తలూరు గ్రామ పంచాయతీల్లో పక్కా గృహాల మంజూరుపై గ్రామసభ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పీఎంఏవైజీ కింద పక్కా గృహాలు ప్రభుత్వం మంజూరు చేస్తోందని, ఒక్కొక్క ఇంటికి రెండు లక్షల రూపాయలు రుణమిస్తారన్నారు. తహశీల్దార్ గౌరీశంకర్ మాట్లాడుతూ పక్కా గృహాల కోసం దరఖాస్తు చేసుకోవాలని పూర్తి చేసిన దరఖాస్తులను వీఆర్వోకు గానీ, తహశీల్దార్ కార్యాలయంలోగానీ అందజేయాలని తెలిపారు.

డిగ్రీ కళాశాలల్లో వసతులు కల్పించాలి


కాలేజీల నివేదికలను పారదర్శకంగా ఇవ్వాలని వినతిపత్రం ఇస్తున్న ఏబీవీపీ నేతలు

రైల్వేకోడూరు: డిగ్రీ కళాశాలల్లో మౌలిక సదుపాయాలు కల్పించేలా అధికారులు పారదర్శకంగా నివేదికలను ప్రభుత్వానికి ఇవ్వాలని ఏబీవీపీ రాష్ట్రసంయుక్తకార్యదర్శి జి.సుబ్బరాజు కోరారు. శుక్రవారం సాయిడిగ్రీకాలేజీలో యూనివర్శిటీస్థాయి అధికారులు తనిఖీలు చేశారు. ఈ సందర్భంగా ఏబీవీపీ నాయకులు అధికారులను కలసి మౌలికమైన సదుపాయాలు లేకుంటే కాలేజీల అనుమతిని రద్దుచేయాలని డిమాండుచేస్తూ వినతిపత్రం సమర్పించారు. జిల్లా వ్యాప్తంగా ఉన్న కాలేజీలను అధికారులు పరిశీలిస్తున్నా మౌలిక వసతుల్లేని వాటిపై ఎందుకు చర్యలు తీసుకోలేదని ప్రశ్నించారు. డిగ్రీకాలేజీల్లో నియమనింబధనలు పాటించడంలేదని, తనిఖీలుచేసేప్పుడు అద్దెపుస్తకాలు, అద్దె అధ్యాపకులలు తీసుకువచ్చి యూనివర్శిటీ స్థాయి అధికారులను మభ్యపెడుతున్నారని ఆరోపించారు. అధికారులు పారదర్శకంగా తనిఖీలు నిర్వహిస్తే జిల్లాలోని కాలేజీలు చాలా మూతపడతాయని తెలిపారు. సాయి డిగ్రీకాలేజిపై గతంలో చాలాఆరోపణలు వచ్చాయని, దీనిపై అధికారులు ఎందుకు చర్యలు తీసుకోలేదని ప్రశ్నించారు. కాలేజిల్లో ఖచ్చితంగా పాస్‌చేయిస్తామని విద్యార్థులకు మాయమాటలుచెప్పి మోసాలుచేస్తున్నారని ఆరోపించారు. ఇప్పటికైనా కాలేజిల్లో మౌలికమైన వసతులులేనివి, విద్యార్థులను మోసంచేస్తున్న కాలేజిలపై ప్రభుత్వం నిఘాపెట్టి వెంటనే చర్యలుతీసుకోవాలని డిమాండుచేశారు. కార్యక్రమంలో ఏబీవీపీ నాయకులు శివ, హరి, నరేంద్ర, గిరిధర్, నవీన్ తదితరులు పాల్గొన్నారు.

ట్రావెల్స్ నిర్వాహకులు తప్పులుచేస్తే సహించం: సీఐ


ట్రావెల్స్‌నిర్వాహకులకు కౌన్సెలింగ్ ఇస్తున్న సీఐ సాయినాథ్

రైల్వేకోడూరు: ట్రావెల్స్ నిర్వాహకులు తప్పులుచేస్తే సహించమని రైల్వేకోడూరు సీఐ సాయినాథ్ హెచ్చరించారు. శుక్రవారం స్థానిక సీఐ కార్యాలయంలో ట్రావెల్స్ ఏజెం ట్లను పిలిపించి కౌన్సెలింగ్ ఇచ్చారు. ఈ సందర్భంగా సీఐ మాట్లాడుతూ ట్రావెల్స్ నిర్వాహకులకు అనుమతులు తప్పనిసరిగా ఉండాలని, మహిళలను మోసం చేస్తే కేసులు నమోదుచేసి జైలుకు పంపుతామని హెచ్చరించారు. ట్రావెల్స్ నిర్వాహకులు లైసెన్సులు తీసుకుని నడుపుకోవాలన్నారు. ఎస్సైలు వెంకటేశ్వర్లు, భక్తవత్సలం పాల్గొన్నారు.

సిద్దవరం సాయిబాబాకు వెండి కిరీటం బహూకరణ



పెనగలూరు : ఎగువ సిద్దవరంలోని సాయిబాబా మూలవిరాట్‌కు కొండూరు గ్రామ పంచా యతీలోని ఉప్పరపల్లెకు చెందిన నూకారెడ్డి పార్వతమ్మ, వెంకటరెడ్డి, సంపూర్ణమ్మ దంపతులు వెండికిరీటాన్ని బహూకరించారు. ఈ సందర్భంగా వెండికిరీటం బహుకరిస్తున్న సందర్భంగా దాతలు మాట్లాడుతూ తమ ఇష్టదైవమైన బాబాకు వెండికిరీటం సమర్పించుకున్నామన్నారు. ఈ కార్యక్రమంలో సిద్దవరం రమణారెడ్డి, బుజ్జమ్మ భక్తులు పాల్గొన్నారు.

పల్లె సీమలను పరిశుభ్రంగా ఉంచుకోవాలి





ఒంటిమిట్టలో జరిగిన సమావేశంలో మాట్లాడుతున్న ఎంపీడీవో వెంకటప్రసాద్, పాల్గొన్న సర్పంచ్‌లు, కార్యదర్శులు, ఉపాధి సిబ్బంది

ఒంటిమిట్ట : పల్లె సీమలను పరిశుభ్రంగా ఉంచుకోవాలని ఎంపీడీవో వెంకటప్రసాద్ సూచించారు. మండల పరిషత్ సభాభవనంలో శుక్రవారం సర్పంచ్‌లు, పంచాయతీ కార్యదర్శులు, ఉపాధి సిబ్బందికి పంచాయతీల పరిశుభ్రతపై సమావేశం జరిగింది. ఈ సందర్భంగా ఎంపీడీఓ మాట్లాడుతూ ప్రతి పంచాయతీలోనూ చెత్త సేకరణ కేంద్రాలు ఏర్పాటు చేయాలని ప్రభుత్వం నిర్ణయించిం దన్నారు. ఈ కేంద్రాల ఏర్పాటుకు అన్ని పంచాయతీల్లో స్థలాలను గుర్తించి పంచాయతీల ఆమోదం ప్రతిపాదనలు తయారు చేయాలని చెప్పారు. రాష్ట్ర కల్లుగీత కార్మిక సంస్థ డైరెక్టర్ కొమరా వెంకటనరసయ్య మాట్లాడుతూ గ్రామాల్లోని చెత్తను కేంద్రాలకు తరలించినప్పుడే పంచాయతీల్లో పరిశుభ్రత నెలకొంటుందని చెత్తసేకరణ కేంద్రాల ఏర్పాటు పనులను ఉపాధి హామీ పథకం కింద చేపడబబతారని చెప్పారు. సమావేశంలో ఈవోపీఆర్‌డీ సుబ్బరాయుడు, ఏపీవో పార్థసారధి, టీడీపీ నాయకులు బొడ్డే సుబ్బానాయుడు పాల్గొన్నారు.

డంపింగ్‌యార్డ్‌లు ఏర్పాటు చేసుకోవాలి



సమావేశానికి హాజరైన అధికారులతో ఎంపీడీవో ఎస్ఎండీ హుస్సే న్

పుల్లంపేట : మండలంలోని అన్ని పంచాయతీల్లో సర్పంచ్‌లు డంపింగ్‌యార్డ్‌లు ఏర్పాటు చేసుకొని పంచాయతీల అభివృద్ధికి సహకరించాలని ఎంపీడీవో ఎస్ఎండీ హుస్సేన్ తెలిపారు. శుక్రవారం స్థానిక ఎంపీడీవో సభాభవనంలో సర్పంచ్‌లు, కార్యదర్శులతో ఆయన సమావేశమై ఉపాధి హామీ నిధులతో డంపింగ్‌యార్డ్‌ల నిర్మాణం చేపట్టడం జరుగుతుందన్నారు. సేకరించిన చెత్త నుంచి సేంద్రీయ ఎరువులు తయారు చేసి రైతులకు అమ్మడం వల్ల లాభాలు పొందవచ్చునన్నారు. డంపింగ్‌యార్డ్ వల్ల కూలీలకు ఉపాధి దొరకడమే కాకుండా పంచాయతీలు కూడా ఆరోగ్యంగా బలోపేతం సాధించవచ్చన్నారు. గ్రామ పంచాయతీల్లో డంపింగ్‌యార్డ్‌ల నిర్మాణానికి అనువైన స్థలాన్ని కేటాయిస్తామని తహశీల్దార్ గౌరీశంకర్ సూచించారు. ఈ కార్యక్రమంలో ఈవోఆర్‌డి నాగార్జునరావు, ఏపీవో చంద్రకళ, సర్పంచ్‌లు, గ్రామకార్యదర్శులు పాల్గొన్నారు.

గ్రామ పంచాయతీలను అభివృద్ధి పరచండి



ఉపాధి హామీ కార్యాలయంలో రికార్డులు తనిఖీ చేస్తున్న డీపీవో సుబ్రమణ్యం

పెనగలూరు : గ్రామ పంచాయతీలను అభివృద్ధి పథంలో నడిపించాలని జిల్లా పంచాయతీ అధికారి సీసీహెచ్ సుబ్రమణ్యం అధికారులు, సిబ్బందిని ఆదేశించారు. మండల పరిషత్ కార్యాలయాన్ని శుక్రవారం సాయంత్రం ఆయన ఆకస్మిక తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఆయన ముందుగా కార్యాలయ ప్రాంగణంలోని ఉపాధి హామీ పనితీరును అడిగి తెలుసుకున్నారు. ఉపాధి హామీ ఏపీవో ఉమామహేశ్వర్‌రావు, సాంకేతిక నిపుణులు రామయ్య, శ్రీనివాసులు, ఈసీ సుబ్బరాయుడులతో ఆయన కూలీల పనితీరు వాకబు చేశారు. కూలీలకు త్వరితగతిన కూలి చెల్లింపులు జరిగేందుకు కృషి చేయాలని ఆదేశించారు.

అనంతరం ఎంపీడీవోతో గ్రామ కార్యదర్శులతో సమావేశమై గ్రామా ల్లో పారిశుధ్యం, తాగునీరు తదితర విష యాలపై చర్చలు జరిపారు. అనంతరం ఆయన అధికారులతో మాట్లాడుతూ జిల్లా కలెక్టర్ బాబురావునాయుడు ఏ క్షణంలో నైనా పెనగలూరు మండల పర్యటన చేపట్టవచ్చని అధికారులకు సూచించారు. అనంతరం పెనగలూరు మండల పరిషత్ సిబ్బంది తొలిసారిగా తనిఖీకి విచ్చేసిన జిల్లా పంచాయతీ అధికారిని ఘనంగా సన్మానించారు.

పోలీసుల అదుపులో గుట్కా నిందితులు

-నాలుగు రోజులైనా కోర్టుకు హాజరు పరచని వైనం

నందలూరు : మండలంలో పోలీసులు ఇటీవల మెరుపు దాడులు చేసి అక్రమంగా గుట్కా ప్యాకెట్టులను విక్రయిస్తున్న వారిని అరెస్ట్ చేసి గుట్కాప్యాకెట్లు స్వాధీనం చేసుకున్నారు. కానీ నాలుగు రోజుల క్రితం ఓ సూపర్‌మార్కెట్‌పై దాడి చేసి అరెస్ట్ చేసినా ఇంత వరకు నిందితులను కోర్టుకు హాజరు పరచకపోవడంపై పలు విమర్శలు వినిపిస్తున్నాయి. కడప-చెన్నై ప్రధాన రహదారిలోని వైఎస్ విగ్రహం సమీపంలోని ఓ సూపర్ మార్కెట్‌పై నాలుగు రోజుల క్రితం పోలీసులు దాడి చేసి లక్షల విలువ చేసే గుట్కా ప్యాకెట్లను స్వాదీనం చేసుకొని నిందితులను కూడా అదుపులోనికి తీసుకున్నారు. కానీ నాలుగు రోజులు అవుతున్నా వారిపై కేసు నమోదు చేయకపోవడం, కోర్టుకు హాజరు పరచకపోవడంపై పోలీసులు చేతి వాటం ప్రదర్శిస్తున్నారని స్థానిక ప్రజలు అంటున్నారు. అంతకుముందు నాగిరెడ్డిపల్లెకు చెందిన ఓ వ్యక్తిని అరెస్ట్ చేసి, గుట్కా ప్యాకెట్లు స్వాధీనం చేసుకొని కేసు నమోదు చేసి కోర్టుకు హాజరు పరిచారు. కానీ వారిపై కేసు నమోదు చేయకపోవడంపై పలు విమర్శలు వినిపిస్తున్నాయి. అంతేకాక ఇంకా కొంత మంది గుట్కాలు అక్రమంగా అమ్ముతున్న బడాబాబులను చూసి చూడనట్లు వదిలేయడం ఏంటని స్థానిక ప్రజలు ప్రశ్నిస్తున్నారు. ఇప్పటికైనా అధికారులు స్పందించి గుట్కాల అక్రమ రవాణాను అరికట్టాలని స్థానిక ప్రజలు కోరుతున్నారు.

రైతు సేవలో నాలుగు అర్జీలు

పుల్లంపేట : మండల పరిధిలోని దళవాయి పల్లె, కేతరాజుపల్లె గ్రామాల్లో శుక్రవారం నిర్వహించిన రైతు సేవలో రెవెన్యూ శాఖ గ్రామసభలకు నలుగురు రైతులు తహశీల్దార్ గౌరీశంకర్‌కు అర్జీలు సమర్పించారు. రెవెన్యూ సమస్యలు పరిష్కరించుకునేందుకు మీ గ్రామానికి రావడం జరిగిందని, తహశీల్దార్ రైతులకు సూచించారు.

16వ రోజుకు చేరిన దీక్షలు

రాజంపేట టౌన్ : ఎస్సీ వర్గీకరణ కోసం మందకృష్ణమాదిగ పిలుపు మేరకు ఎంఆర్‌పీఎస్ నాయకులు చేస్తున్న దీక్ష శుక్రవారానికి 16వ రోజుకు చేరింది. ఈ సందర్భంగా ఎంఆర్‌పీఎస్ నాయకులు మాట్లాడుతూ ఇప్పటికైనా ఎస్సీ వర్గీకరణ బిల్లును ప్రవేశపెట్టాలన్నారు. కార్యక్రమంలో పట్టణాధ్య క్షుడు తాడిపత్రి తిరుపాలు, పెంచలయ్య మాదిగ, సుబ్బరాయుడు పాల్గొన్నారు.

వైభవంగా సామూహిక వరలక్ష్మీవ్రతం



సామూహిక వరలక్ష్మీవ్రతం దృశ్యం

పుల్లంపేట : మండల పరిధిలోని అప్పయ్యరాజుపేట కోదండరామాలయంలో శుక్రవారం సామూహిక వరలక్ష్మీవ్రతాన్ని మహిళలు వైభవంగా నిర్వహించారు. ఈ సందర్భంగా లక్ష్మీదేవికి కలశస్థాపన చేసి ప్రత్యేక పూజలు చేశారు. గ్రామంలోని పలువురు మహిళలు ఈ సామూహిక వరలక్ష్మీ వ్రతాన్ని భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. అనంతరం లక్ష్మీనారాయణ కల్యాణాన్ని శాస్త్రోక్తంగా వేదపండితుల మంత్రోచ్ఛారణల మధ్య నిర్వహించారు. అనంతరం భక్తులకు అన్నదాన కార్యక్రమాన్ని నిర్వహించారు.

పెనగలూరులో ఘనంగా వరలక్ష్మీ వ్రతం

పెనగలూరు : మండలంలో శుక్రవారం మహిళలు వరలక్ష్మీవ్రతాన్ని ఘనంగా జరుపుకున్నారు. మహిళలు ఉదయం నుంచి దేవాలయానికి వెళ్ళి తమ ఇష్టదైవాలను దర్శించుకున్నారు. ఇదిఇలా ఉండగా చాలా మంది మహిళలు తమ ఇళ్ళలోనే వరలక్ష్మీ వ్రత కార్యక్రమాన్ని ఘనంగా జరుపుకున్నారు. ఇరుగుపొరుగు వారికి చీర, రవిక, పసుపుకుంకుమ, పూలు, పండ్లు తదితర వస్తువులను వాయనం పలుకుతూ పంపిణీ చేశారు.

అన్నమాచార్య కళాశాలలోక్యాంపస్ ఇంటర్వ్యూలు

రాజంపేట రూరల్ : స్థానిక అన్నమాచార్యఇంజనీరింగ్ కళాశాలలో 3వ సంవత్సరం చదువుతున్న విద్యార్థులకు హైదరాబాదుకు చెందిన ఓ ప్రైవేటు కంపెనీ వారు క్యాంపస్ ఇంటర్వ్యూలు నిర్వహించారు. హైదరాబాద్ ప్రైవేటు కంపెనీలచే నిర్వహిస్తున్న వివిద పోటీ పరీక్షల్లో విద్యార్థులు ప్రతిభ కనబరిచారు. మొదట, రెండవ అర్హత పరీక్షలను కళాశాల నిర్వహించి విద్యార్థులను ఎంపిక చేయడం జరిగిందని ప్రిన్సిపాల్ నారాయణ తెలిపారు. ఈ రెండు పరీక్షల్లో అర్హత సాధించిన విద్యార్థులకు త్వరలో హైదరాబాద్‌లో వారికి చివరి పరీక్ష నిర్వహించి ఉద్యోగ అవకాశాలు కల్పించనున్నట్లు ఆ సంస్థ ప్రతినిధులు తెలిపారు. తమ కళాశాల విద్యార్థులు ప్రతిభ కనబరచడం పట్ల కళాశాల యాజమాన్యం హర్షం వ్యక్తం చేశారు.

జగన్ నోరు అదుపులో పెట్టుకో...

రాజంపేట టౌన్ : వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి నోరు అదుపులో పెట్టుకొని మాట్లాడాలని టీఎన్ఎస్ఎఫ్ జిల్లా అధ్యక్షుడు వేణుగోపాల్ అన్నారు. శుక్రవారం టీడీపీ కార్యాలయంలో టీఎన్ఎస్ఎఫ్ సభ్యులతో కలిసి ఆయన మాట్లాడుతూ నంద్యాల ఎన్నికల సభలో ప్రతిపక్ష నేత వైఎస్ జగన్ మోహన్‌రెడ్డి ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడుని నడిరోడ్డులోకాల్చి చంపాలని అనడం ఆయన రౌడీ ఇజానికి నిదర్శనమన్నారు. జగన్‌కు పదవి వ్యామోహం తప్ప మరొకటి లేదన్నారు. ఈ కార్యక్రమంలో టీఎన్ఎస్ఎఫ్ నాయకులు శివకృష్ణ, మహేష్, సాయి, సునీల్ పాల్గొన్నారు.

భవనంపై నుంచి పడి కూలీకి తీవ్రగాయాలు

నందలూరు : మండలంలోని నాగిరెడ్డిపల్లె గ్రామ పంచాయతీ ఆర్.ఎస్.రోడ్డులో నిర్మాణంలో ఉన్న ఓ భవనంపై నుంచి కూలీ కింద పడి తీవ్రగాయాలపాలైన సంఘటన శుక్రవారం చోటు చేసుకుంది. నాగిరెడ్డిపల్లె గ్రామం రజక వీధికి చెందిన రేగళ్ళ చంద్ర(35) భవన నిర్మాణ కూలీ ఆర్.ఎస్.రోడ్డులో నిర్మాణంలో ఉన్న ఓ భవనంలో శుక్రవారం ఉదయం ఇంటికి నీరు పడుతూ పైపు కాలికి అడ్డు తగిలి ప్రమాదవశాత్తు రెండవ అంతస్తుపై నుంచి కింద పడ్డాడు. ఈ సంఘటనలో చంద్ర కాలు విరగడంతో పాటు, నోటి వద్ద తీవ్రగాయాలయ్యాయి. వెంటనే స్థానికులు గాయపడిన వ్యక్తిని స్థానిక ప్రైవేటు నర్సింగ్ హోమ్ నందు ప్రధమ చికిత్స చేయించి మెరుగైన వైద్యం కోసం తిరుపతికి తరలించారు.

సినిమాగైడ్

రైల్వేకోడూరు

లక్ష్మీప్యారడైజ్:నిన్నుకోరి
సిద్ధేశ్వర : ఫిదా

ఏఎస్ఆర్ :వాసుకి
శ్రీక్రిష్ణ : గౌతంనంద
లవ: దువ్వాడజగన్నాథం(డీజే)

దినఫలాలు

అదృష్టసంఖ్యలు : 5, 8

మేషరాశి: (మార్చి21-ఏప్రిల్20): చిన్నారుల విషయాలపై దృష్టి సారిస్తారు. సృజనాత్మకంగా వ్యవహరించి వృత్తి, వ్యాపారాల్లో లక్ష్యాలు సాధిస్తారు. ఉన్నత పదవులు అందుకుంటారు. పిల్లల విజయం ఆనందం కలిగిస్తుంది.

వృషభరాశి: (ఏప్రిల్21-మే20): కుటుంబ సభ్యులతో ప్రయాణాలు ఉల్లాసం కలిగిస్తాయి. చర్చలు, సమావేశాలకు ఏర్పాట్లు చేస్తారు. విద్యార్థులకు శుభప్రదం. ఇంట్లో ఆహ్లాదకర వాతావరణం నెలకొంటుంది. సంకల్పం నెరవేరుతుంది.

మిథునరాశి:(మే21-జూన్21): పూర్వ మిత్రులను కలుసుకుంటారు. పెట్టుబడులకు సంబంధించిన సమాచారం సేకరిస్తారు. మ్యూచువల్ ఫండ్స్, బీమా వ్యవహారాలు ఒక కొలిక్కి వస్తాయి. ఆర్థిక విషయాల్లో సోదరీ, సోదరుల సహకారం లభిస్తుంది.

కర్కాటకరాశి:(జూన్22-జూలై23): స్పెక్యులేషన్లు లాభిస్తాయి. ఆర్థిక విషయాల్లో భాగస్వామి సహకారం అందుకుంటారు. జన సంబంధాలు విస్తరిస్తాయి. ప్రియతముల కోసం విలువైన వస్తువులు కొనుగోలు చేస్తారు. ఆర్థిక పరిస్థితి ప్రోత్సాహకరం.

సింహరాశి:(జూలై24-ఆగస్టు23): వ్యవసాయ, పరిశ్రమల రంగాల వారు కీలక నిర్ణయాలు తీసుకుంటారు. ఆరోగ్యం పట్ల శ్రద్ధ చూపిస్తారు. కొత్త పనుల ప్రారంభానికి అనుకూలం. కొత్తగా ఆలోచించి వృత్తి, వ్యాపారాల్లో వికాసం సాధిస్తారు.

కన్యారాశి: (ఆగస్టు24-సెప్టెంబర్23): దూరంలోఉన్న ప్రియతముల నుంచి సంతోషకరమైన సమాచారం అందుకుంటారు. ఉన్నత విద్యకు అవసరమైన నిధులు సమకూరుతాయి. రాజకీయ, సినీ రంగాల వారికి కొత్త ఆలోచనలు స్ఫురిస్తాయి.

తులారాశి: (సెప్టెంబర్24-అక్టోబర్23): బంధుమిత్రులతో ఇంట్లో సందడి వాతావరణం నెలకొంటుంది. ప్రియతముల ప్రవర్తనలో మార్పు గమనిస్తారు. రియల్ ఎస్టేట్, గృహ నిర్మాణ రంగాల వారికి ఆర్థికంగా ప్రోత్సాహకరం.

వృశ్చికరాశి: (అక్టోబర్24-నవంబర్22): ఇంటర్వ్యూలలో విజయం సాధిస్తారు. విద్యార్థులకు లక్ష్య సాధనలో పెద్దల సహకారం లభిస్తుంది. స్టేషనరీ, ఏజెన్సీ, రవాణా రంగాల వారికి శుభప్రదం. సోదరీ, సోదరుల విషయాల్లో శుభపరిణామాలు సంభవం.

ధనూరాశి: (నవంబర్23-డిసెంబర్21): ఆదాయం పెంపొందించుకునేందుకు కొత్త వ్యూహాలు ఆలోచిస్తారు. సంకల్పం నెరవేరుతుంది. పెట్టుబడులు, పొదుపు పథకాల గురించి సమాచారం సేకరిస్తారు. ప్రయాణాలు, సమావేశాలకు అనుకూలం.

మకరరాశి: (డిసెంబర్22-జనవరి21): పెట్టుబడుల గురించి ఆరా తీస్తారు. బీమా, పింఛన్, మ్యూచ్యువల్ ఫండ్స్ వ్యవహారాలకు అనుకూలం. సంస్మరణల్లో పాల్గొంటారు. ఇన్‌స్టాల్ మెంట్స్‌పై వస్తువులు కొనుగోలు చేస్తారు.

కుంభరాశి: (జనవరి22-ఫిబ్రవరి18): ఉన్నత విద్య, విదేశీ వ్యవహారాలకు అనుకూలం. బంధుమిత్రులతో ప్రయాణాలు ఉల్లాసం కలిగిస్తాయి. జన సంబంధాలు విస్తరిస్తాయి. శ్రీవారు, శ్రీమతి అంతరంగం తెలుసుకుని మసలుకుంటారు.

మీనరాశి: (ఫిబ్రవరి19మార్చి20): ఆర్థిక విషయాల్లో సహోద్యోగుల సహకారం అందుకుంటారు. బంధుమిత్రులతో విందు, వినోదాల్లో పాల్గొంటారు. బ్యాంకులు, ఆర్థిక సంస్థలు, సహకార సంఘాల వారు లక్ష్యాలు సాధిస్తారు.

-బిజుమళ్ళ బిందుమాధవ శర్మ

వసతులు కల్పిస్తే మెరుగైన విద్య

● పాఠశాలల అభివృద్ధికి పూర్వపు విద్యార్థులు, దాతలు ముందుకు రావాలి ● రాయలసీమ ఐజీ షేక్ మహమ్మద్ ఇక్బాల్





మెడికల్ క్యాంపు ప్రారంభిస్తున్న ఐజీ షేక్ మహమ్మద్ ఇక్బాల్, మొక్కలు నాటుతున్న ఐజీ, మాట్లాడుతున్న ఎస్పీ బాబూజీ

కడప, క్రైం : ప్రభుత్వ పాఠశాలలో సరైన మౌలిక వసతులు కల్పిస్తే పాఠశాలల్లో ఉత్తమ విద్య సమకూరుతుందని రాయలసీమ ఐజీ షేక్ మహమ్మద్ ఇక్బాల్ అన్నారు. కడప నగరపాలక ఉర్దూ ఉన్నత పాఠశాలలో విద్యార్థులతో కలిసి ఆయన శుక్రవారం ఆత్మీయ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఐజీ మాట్లాడుతూ రాయలసీమలో ప్రభుత్వ పాఠశాలలో పిల్లల సంఖ్య తగ్గుతుందన్నారు. ప్రభుత్వ పాఠశాలల్లో పనిచేసే ఉపాధ్యాయులు ఉన్నత చదువులు చదవడంతో పాటు అనుభవమున్న వారని, ప్రైవేటు పాఠశాలల్లో అర్హత లేని వారు సైతం పనిచేస్తున్నారన్నారు. సీఎం చంద్రబాబు నాయుడు, డీజీపీ సాంబశివరావు ఆదేశాల మేరకు బడిరుణం తీర్చుకోవాలనే కార్యక్రమం నిర్వహిస్తున్నామన్నారు. పాఠశాలల్లో కేవలం చిన్న చిన్న మౌలిక వసతుల కారణంగానే ప్రైవేటు పాఠశాలల్లో పిల్లలను చేర్పిస్తున్నారని ప్రభుత్వ పాఠశాలల్లో చదివిన వారు ఉన్నత స్థాయిలో వున్నారన్నారు. పూర్వపు విద్యార్థులు, దాతలు, ప్రజల సహకారంతో మౌలిక వసతులు, విద్య, వైద్యం అందించేందుకు తమ పోలీసు శాఖ ముందుకు వస్తుందన్నారు. ప్రతిఒక్కరూ తమ కడుపును నింపుకోకుండా పది మంది కడుపు నింపేలా వుండాలన్నారు. తానా అధ్యక్షుడు వేమన సతీష్ పాఠశాల అభివృద్ధికి ముందుకు వస్తున్నారన్నారు. మంచి స్థాయిలో వున్న వారు తాము చదివిన పాఠశాలను దత్తత తీసుకోవాలని కోరారు. ఈ సందర్భంగా ఎస్పీ అట్టాడ బాబూజీ మాట్లాడుతూ విద్యార్థికి లక్ష్యం వుంటేనే జీవితంలో ఏ పనైనా సాధించగలరన్నారు. పిల్లల మనసు ఎంతో సున్నితమైందని తల్లిదండ్రులు, ఉపాధ్యాయుల మాటలు వింటూ వారు ఎంచుకున్న లక్ష్యం చేరేందుకు కృషి చేయాలన్నారు. విద్యార్థి దశలో తప్పు చేస్తే తీవ్రంగా నష్టపోతారని, మంచి మార్గాన్ని ఎంచుకొని అటు తల్లిదండ్రులు, ఉపాధ్యాయులు, జిల్లాకు మంచి పేరు తేవాలన్నారు. ముందుగా ఐజీ, ఎస్పీ స్కూల్‌లో ఏర్పాటు చేసిన మెడికల్ క్యాంపును ప్రారంభించారు. అనంతరం స్కూలు ఆవరణలో మొక్కలు నాటారు. విద్యార్థులకు క్రీడా సామగ్రిని అందించారు. విద్యార్థులు చేసిన కరాటేను ఐజీ, ఎస్పీలు వీక్షించారు. ఈ కార్యక్రమంలో కడప డీఎస్పీ షేక్ మాసుంబాష, ఎస్‌బీ డీఎస్పీ రాజగోపాల్‌రెడ్డి, సీఐలు, ఎస్‌ఐలు, వివిధ సంఘాల నేతలు, పూర్వ విద్యార్థులు పాల్గొన్నారు.

తన ఫిర్యాదుపై పోలీసులు నిర్లక్ష్యం చేస్తున్నారు

తన భర్త ఇంటి నుంచి రెండు నెలల క్రితం మరో మహిళతో కలిసి వెళ్లాడని ఈ విషయం రాయచోటి పోలీసు స్టేషన్‌లో ఫిర్యాదు చేస్తే అధికారులు స్పందించడం లేదంటూ ఐజీ షేక్ మహమ్మద్ ఇక్బాల్, ఎస్పీ అట్టాడ బాబూజీకి రాయచోటి పెద్దకాలువపల్లె గ్రామానికి చెందిన వీరబల్లి లక్ష్మీ శుక్రవారం ఫిర్యాదు చేసింది. తనకు న్యాయం చేయాలని అధికారులను వేడుకుంది.




తైక్వాండో ప్రదర్శనను చూస్తున్న ఐజీ, హాజరైన విద్యార్థులు

నేరనైజాన్ని బయటపెట్టుకున్న జగన్

● నంద్యాలలో అభివృద్ధి.. అభివృద్ధి నిరోధకుల మధ్య పోటీ
● వైసీపీకి ఘోర పరాభవం తప్పదు
● టీడీపీ జిల్లా అధ్యక్షుడు వాసు

కడప, సెవెన్‌రోడ్స్ : ముఖ్యమంత్రిని చంపాలని వ్యాఖ్యానించి ప్రతిపక్షనేత జగన్ తన క్రిమినల్ మనస్థత్వాన్ని మరోసారి బయటపెట్టుకున్నారు. ఆయన వాడిన భాష చట్టాన్ని ధిక్కరించినట్లు స్పష్టమైంది. ప్రజాస్వామ్యాన్ని ఖూనీ చేసే విధంగా ప్రవర్తిస్తున్న జగన్‌పై చట్టరీత్యా చర్యలు తీసుకోవాలని టీడీపీ జిల్లా అధ్యక్షుడు ఆర్.శ్రీనివాసరెడ్డి డిమాండ్ చేశారు. ఈ మేర ఆయన ఒక ప్రకటన విడుదల చేశారు. జగన్ ప్రతిపక్ష నేత హోదాను మరచిపోయి ఫ్యాక్షనిస్టులా బహిరంగ సభలో చంపాలని వ్యాఖ్యానించడం దుర్మార్గమన్నారు. ముఖ్యమంత్రినే చంపాలని కోరుకునే జగన్ నంద్యాల ప్రజలను బతకనిస్తాడా అని ప్రశ్నించారు. ఆవు చేలో మేస్తే దూడ గట్టున మేయదన్న సామెతగా మాకు మెజార్టీ వస్తేనే మగవాళ్లం లేదంటే ఆడవాళ్లమని శిల్పా చక్రపాణి రెడ్డి మాట్లాడి స్త్రీజాతిని అవమానించారన్నారు. మహిళలను చులకన చేసి మాట్లాడిన చక్రపాణి రెడ్డి భేషరతుగా మహిళలకు క్షమాపణ చెప్పాలన్నారు. జగన్ కుట్రల ముందు తీవ్రవాది అబూఅజాద్ కుట్రలు ఒక లెక్కలోకి రావని ఎద్దేవా చేశారు. 2014లో ముస్లింల ఓట్లు వేయించుకొని కేసుల కోసం బీజేపీతో విబేధాలు లేవని ప్రకటించి మైనార్టీలకు వెన్నుపోటు పొడిచిన కుట్రదారుడు జగన్ అన్నారు. ఆయన తండ్రి వైఎస్ అప్పట్లో చెన్నారెడ్డిని గద్దె దించేందుకు హైదరాబాద్‌లో మతకలహాలు సృష్టించి వందలాది మంది ప్రాణాలు తీసిన సంగతి జగన్ తెలుసుకోవాలన్నారు. శాసన మండలి ఛైర్మన్‌కు రాజీనామా పత్రం పంపకుండా చక్రపాణి రెడ్డి ఆ రాజీనామా పత్రాన్ని జగన్‌కు ఇవ్వడం డ్రామా కాదా అని ప్రశ్నించారు. గృహ నిర్మాణశాఖ మంత్రిగా పనిచేసిన శిల్పామోహన్‌రెడ్డి నంద్యాలకు ఏం ఒరగబెట్టారో ప్రజలకు వివరించాలన్నారు. మంత్రిగా వుండి 14.5 లక్షల ఇళ్లు నిర్మించకుండానే నిర్మించినట్లు చూపి 4వేల కోట్ల కుంభకోణానికి పాల్పడ్డారని ఆరోపించారు. క్రిష్ణానదిలో మిగులు జలాలను కోరబోమని బ్రిజేష్‌కుమార్ ట్రిబ్యునల్‌కు వైఎస్ ప్రభుత్వం లేఖ ఇచ్చి రాయలసీమ గొంతు కోసింది వాస్తవమా కాదా అని ప్రశ్నించారు. సీమలోని ప్రాజెక్టులు చేపట్టింది, పూర్తి చేస్తున్నది టీడీపీ ప్రభుత్వమేనని మూడేళ్లలో నంద్యాలలో జరిగిన అభివృద్ధి ఆ ప్రాంత ప్రజలకు తెలుసన్నారు. రైల్వేకోడూరులో బలిజ నాయకుడిని వేటాడి చంపింది జగన్ కుటుంబమేనని తెలిపారు. జగన్ చెప్పేవి నవరత్నాలు కాదు నకిలీ రాళ్లు మాత్రమేనని ఎద్దేవా చేశారు. అబద్ధాలు, అవినీతిలో జగన్ చక్రవర్తి అని, ఆయన 2019లో జైలుకెళ్లడం తథ్యమని, అభివృద్ధి చేసే తెలుగుదేశం పార్టీకి నంద్యాల ప్రజలు ఘన విజయం చేకూర్చిపెట్టడం తథ్యమని జోష్యం చెప్పారు.

మోడల్ స్కూల్ టీచర్లకు జీతాలు విడుదల చేయండి

● ప్రభుత్వ ప్రధాన కార్యదర్శికి ఎమ్మెల్సీ వినతి

కడప, ఎర్రముక్కపల్లె: మోడల్ స్కూలులో పనిచేస్తున్న ఉపాధ్యాయులకు మే నెల నుంచి రావాల్సిన జీతాలు చెల్లించాలని ఉపాధ్యాయ ఎమ్మెల్సీ కత్తి నరసింహారెడ్డి డిమాండ్ చేశారు. సచివాలయంలో ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి దినేష్‌కుమార్‌ను కలిసి వినతిపత్రం సమర్పించారు. ఆయన మాట్లాడుతూ 2015 ఏప్రిల్ నుంచి కేంద్రం నిధులు నిలిపివేసినందున విద్యాశాఖ బడ్జెట్ నుంచి జీతాలు చెల్లించాలని కోరారు. కార్యక్రమంలో ఉపాధ్యాయ సంఘం రాష్ట్ర అసోసియేట్ అధ్యక్షుడు మోహన్‌రెడ్డి పాల్గొన్నారు.


సాంఘిక సంక్షేమ టీచర్లకు 60 ఏళ్ల జీవో

సాంఘిక సంక్షేమ గురుకుల పాఠశాలల్లో పనిచేస్తున్న ఉపాధ్యాయులకు పదవీ విరమణ వయసు 60 ఏళ్లకు పెంచుతూ ఆర్థిక శాఖ కార్యదర్శి రాములు గురువారం ఉత్తర్వులు విడుదల చేశారని ఎమ్మెల్సీ తెలిపారు.

అప్‌గ్రేడ్ పోస్టులకు పదోన్నతులు కల్పించాలి

పాఠశాల విద్యశాఖ పరిధిలో అప్‌గ్రేడ్ అయిన పండిట్, పీఈటీ పోస్టులన్నీ పదోన్నతుల ద్వారా భర్తీ చేయాలని ఎమ్మెల్సీ ప్రభుత్వాన్ని కోరారు.

దారి కనుక్కోండి



సూక్తి

కోపం తెచ్చుకునే హక్కు ఎవరికైనా ఉండొచ్చు.. కానీ ఆ కోపంలో క్రూరంగా ప్రవర్తించే హక్కు మాత్రం ఎవరికీ లేదు.

టంగ్ ట్విస్టర్స్



1. If you're keen on stunning kites and cunning stunts,buy a cunning stunning stunt kite.
2. Sounding by sound is a sound method of sounding sounds.
3. Real rock wall, real rock wall, real rock wall

ప్రేమతో ముద్దిచ్చే తోడేళ్లు





'పోలార్ పార్క్'లోకి అడుగుపెట్టగానే.. ముఖ్య అతిథిపై పూల వర్షం కురిపించినట్లు...వెన్నెల్లాంటి మంచు జల్లులా కురుస్తుంది. చాలా రోజుల తర్వాత కలిసినా ఆత్మీయుల్లా క్రూర మృగాలు ఆలింగనం చేసుకుంటాయి. ఎంతో ప్రేమతో ముద్దిస్తాయి. స్నేహితుల్లా కలిసిపోతాయి. వాటిని వదిలిపోతుంటే. దీనంగా చూస్తుంటాయి.. ఈ పార్కుకు మీకు వెళ్లాలనుందా? అయితే చలో నార్వే!

పోలార్ పార్కు దీన్నే 'పోలార్ జూ'గా కూడా పిలుస్తారు. ఇది 'ట్రోమ్స్' అనే చిన్న దేశంలో ఉంది. నార్వేలోని ప్రసిద్ధ పార్కుగా పేరు పొందింది. ఈ పార్కును 1994, జూన్ 18న ప్రారంభించారు. ఎలుగు బంట్లు, నక్కలు, తోడేళ్లు, పెద్ద అడవి పిల్లి(శివంగి), ధ్రువపు జింకలు, మూస్(లేడి వంటి జంతువు), ఎరుపు జింక, బ్రౌన్ ఎలుగుబంటి జంతువులు ఈ పార్కులో స్వేచ్ఛగా తిరుగాడుతుంటాయి. 112 ఎకరాల్లో ఉన్న ఈ పార్కుల్లో 'తోడేళ్ల క్యాంప్' ప్రత్యేక ఆకర్షణ. ఈ పార్కుకు 12 కిలోమీటర్ల దూరంలోనే 'రోహ్‌కున్ బొర్రి నేషనల్ పార్కు' ఉంది.

సెల్ఫీలకు పోజులు!

ఇక్కడి పార్కులోని తోడేళ్లు మనుషుల్ని చూసి భయపడవు. మనుషుల సమక్షంలో అవి ఆనందంగా గడుపుతాయి. సందర్శకులు తోడేళ్లతో ఎంచక్కా ఆడుకోవచ్చు. మనుషులతో అవి ఇట్టే కలిసిపోతాయి. ప్రేమతో ముద్దులు కూడా ఇస్తాయి. చుట్టూ చేరి తెగ సందడి చేస్తాయి. సెల్ఫీ తీస్తుంటే.. అందమైన పోజులిస్తాయి. అమ్మ ఒడిలో పడుకున్నట్లు.. వాటిపై హాయిగా పడుకున్నా అవి ఏమనవు. మిగతా జంతువులు కూడా సందర్శకులను ఏమీ చేయవు. సందర్శకులు వీటిని మచ్చిక చేసుకోవడానికి తోడేళ్ల ఎన్‌క్లోజర్‌లో గంటపాటు గడపవచ్చు. ఒక రోజు మొత్తం కూడా వాటిలో ఉండొచ్చు. మీతో పాటు తోడేళ్ల శిక్షకులు కూడా ఉంటారు. వాటితో ఎలా మెలగాలో, ఎలా మచ్చిక చేసుకోవాలో వారు సూచిస్తారు. అత్యుత్సాహంతో వాటిని బెదరకొట్టకూడదు. అవి దగ్గరికి వచ్చినప్పుడు నిండైన ఆత్మవిశ్వాసంతో ఉండాలి. ఎందుకంటే అవి భయాన్ని పసిగడతాయి. ఒక్కసారి మచ్చిక అయితే పెంపుడు జంతువుల్లా ఉంటాయి.



మొబైల్ రైడ్..

ప్రకృతి ప్రేమికులకు ఈ పార్కు వీనుల విందే. పార్కులో ఎటూ చూసినా అందాలే. మంచు దుప్పటి కప్పుకున్న పర్వతాలను,రకరకాల జంతువులను చూస్తూ... ఎరుపెక్కిన సూరీడు అందాల మాటున స్నో మొబైల్ వ్యానులో షికారు భలేగా ఉంటుంది.

ఎన్నో అరుదైన జంతువుల మధ్యలో హాయిగా గడపడం..ఓ అనిర్వచనీయమైన అనుభూతి. ఈ పార్కుకు వెళ్లాలంటే ఒకే ఒక్క కండీషన్. అదేంటంటే 15 సంవత్సరాల వయసు దాటిని వారినే ఇందులోకి అనుమతిస్తారు.

రంగులు వేయండి



నవ్వుల్ నవ్వుల్



తండ్రి : ఏరా! ఎన్నిసార్లు ఫోన్ మోగుతున్నా ఎత్తడం లేదు ఎందుకని?
బన్ను : నాన్నా! నన్ను డాక్టర్ బరువులు ఎత్తొద్దని చెప్పారు. అందుకనే!
తండ్రి : !!!!!!!!

=======

టీచర్ : టీవీ వల్ల హింసలు పెరుగుతున్నాయిట నిజమేనా?
చిన్ను : అవును టీచర్ నిజమే! నేను ఎప్పుడు టీవీ ఆన్ చేసినా మా నాన్న నన్ను కొట్టినంత పని చేస్తున్నారు.

చెప్పగలరా?

కూడులో ఉన్నా కానీ గూడులో లేను

తుదిలో ఉన్నా కానీ ఆదిలో లేను

రుచిలో ఉన్నా కానీ శుచిలో లేను

అయితే ఇంతకీ నేనెవర్నో చెప్పగలరా?

జంతర్‌మంతర్

ఈ కింది పదాలను సరిచేయండి


1. హాఆరం ▸ ....
2. ధుమరం ▸ ....
3. చాతిమం ▸ ....

జంబ్లింగ్ వర్డ్స్

ఈ కింది పదాలను సరిచేయండి

1. DSIE ▸ ....
2. FODO ▸ ....
3. RPEO ▸ ....

బొమ్మ గీయండి



మీకు తెలుసా?



సిగరెట్ లైటర్‌ని అగ్గిపుల్ల కంటే ముందే కనిపెట్టారు.

ఔనా!

స్టార్ ఫిష్‌కు మెదడు ఉండదు.

జవాబులు

చెప్పగలరా? : కూతురు

జంతర్‌మంతర్ :
1. ఆహారం
2. మధురం
3. చామంతి

జంబ్లింగ్ వర్డ్స్ :
1.SIDE
2.FOOD
3.ROPE

చుక్కలు కలపండి



తిరుమల సమాచారం

తిరుమలకు వెళ్లి శ్రీవేంకటేశ్వరస్వామిని దర్శించుకునేందుకు ముందస్తుగా కడప టీటీడీ దేవస్థాన ఈ-దర్శన్ ద్వారా దర్శనం టిక్కెట్లు, వసతి (రూములు) పొందవచ్చు. శుక్రవారం సాయంత్రం 5.30 గంటలకు అందిన సమాచారం మేరకు తిరుమలలో వసతి, దర్శనం టిక్కెట్ల ఖాళీలు ఇలా వున్నాయి.

● **రూ.300 దర్శనం టిక్కెట్లు**

ఆగస్టు 20న 220, 21న 1100, 22న 1690, 23న 1430, 25న 630 టిక్కెట్లు ఖాళీగా వున్నాయి.

● **రూ.50 రూములు**

ఆగస్టు 24న 57రూములు ఖాళీగావున్నాయి.

● **రూ.100 రూములు**

సెప్టెంబర్ 12న 2, 13న 41, 14న 77, 18న 23, 19న 122 రూములు ఖాళీగా వున్నాయి.

● **రూ.500 రూములు**

సెప్టెంబర్ 12న 8, 13న 34, 14న 36, 18న 50, 19న 48 రూములు ఖాళీగా వున్నాయి.

● **రూ.200 రూములు**

(శ్రీనివాసం) తిరుపతిలో

ఆగస్టు 23న 12, 24న 11, 28న 8, 29న 6, 31న 21 గదులు ఖాళీగా ఉన్నాయి.

● టీటీడీ కల్యాణమండపాలు బుకింగ్ చేసుకునేందుకు సంప్రదించాల్సిన నెంబరు 9059948220.

టీటీడీ కార్యాలయం పనిచేయు వేళలు

● ప్రతి మంగళవారం సెలవు

● సోమ, బుధ, గురు, శుక్ర, శనివారాల్లో ఉదయం 9 గంటల నుంచి 1 గంట వర కు మధ్యాహ్నం 3 నుంచి 6 గంటల వరకు, ఆదివారం ఉదయం 9 గంటల నుంచి మధ్యాహ్నం 1.30 గంటల వరకు తిరిగి మధ్యాహ్నం 2 నుంచి రాత్రి 7 గంటల వరకు తెరిచి ఉంటాయి. ఆ సమయంలో దర్శనం టిక్కెట్లతో పాటు వసతి కోసం రూములను బుక్ చేసుకోవచ్చు.

గమనిక : ఈదర్శన టిక్కెట్లకు వచ్చే వారు గుర్తింపు కార్డులు తెచ్చుకోవాలి ఆధార్, రేషన్‌కార్డు, ఓటర్‌కార్డు, పాన్‌కార్డు, డ్రైవింగ్ లైసెన్స్ తదితర ఏదో ఒక గుర్తింపు కార్డు తెచ్చుకోవాలి.

వరాలిచ్చే కల్పవల్లి వరలక్ష్మీతల్లి

భక్తిశ్రద్ధలతో జిల్లావ్యాప్తంగా వరలక్ష్మీ వ్రతం

కడప, మారుతీనగర్ : జిల్లావ్యాప్తంగా మహిళలు వరలక్ష్మీవ్రతం భక్తిశ్రద్ధలతో చేపట్టారు. ఆ మేరకు జిల్లాలోని వివిధ దేవాలయాలలో జరిగిన వరలక్ష్మీవ్రతంలో పెద్దఎత్తున మహిళలు సామూహికంగా పాల్గొని అమ్మవారి సేవలో తరించారు.

శ్రీవిజయదుర్గాదేవి ఆలయంలో..

నగర బిల్టప్ సమీపంలో గల శ్రీవిజయదుర్గాదేవి ఆలయంలో వరలక్ష్మీవ్రత వేడుకలు కన్నుల పండువగా జరిగాయి. పెద్దసంఖ్యలో మహిళలు తరలివచ్చి అమ్మవారిని దర్శించుకొని ప్రత్యేక ప్రార్థనలు నిర్వహించారు.



అమ్మవారిశాలలో వ్రతం చేస్తున్న మహిళలు

ఆలయ ప్రధాన అర్చకులు ఫణిభూషణశర్మ భక్తుల చేత సుమంగళి పూజ, వరలక్ష్మీదేవి వ్రతాన్ని చేయించారు. తదనంతరం ఆలయ నిర్వాహకులు దుర్గామల్లికార్జునరావు అమ్మవారి ప్రసాదాలను భక్తులకు అందించారు. సాయంత్రం అమ్మవారికి పల్లకీసేవ, పవళింపుసేవ చేయించారు.

వాసవీ కన్యకాపరమేశ్వరీ దేవస్థానంలో..

శ్రావణ శుద్ధ ద్వాదశిసందర్భంగా శ్రీఆర్యవైశ్య సంఘం ఆధ్వర్యంలో ఆర్యవైశ్య మహిళా మండలి ఎ.శ్రీకాంతమ్మ పర్యవేక్షణలో మహిళా భక్తులు సామూహిక వరలక్ష్మీవ్రత నోములను శ్రీనివాస కన్యకపరమేశ్వరీదేవి దేవస్థానంలో అంగరంగ వైభవంగా నిర్వహించారు. ఈ సందర్భంగా అమ్మవారి ప్రత్యేక అలంకారం చేశారు. సాయంత్రం 6 గంటలకు మహిళా భక్తులు సామూహిక కుంకుమార్చన చేశారు.



ప్రత్యేక అలంకరణలో విజయదుర్గాదేవి అమ్మవారు

ఇందులో 108 మంది ముత్తయిదువులు సహస్రనామ కుంకుమార్చన లక్ష్మీదేవి విగ్రహాలకు పసుపుకుంకుమలతో సహస్రనామ అష్టోత్తర శతనామావళితో ప్రత్యేక పూజలు నిర్వహించారు.

సోమేశ్వరస్వామి దేవస్థానంలో..

తిరుమల తొలిగడప దేవునికడపలోని శ్రీసోమేశ్వరస్వామి దేవస్థానంలో సామూహికంగా మహిళా భక్తులు వరలక్ష్మీవ్రతం నిర్వహించారు.

శ్రీరాజరాజేశ్వరిదేవి ఆలయంలో..

నగర మున్సిపల్ స్టేడియం వద్ద గల శ్రీరాజరాజేశ్వరిదేవి ఆలయంలో ప్రధాన అర్చకులు పిడతల గోపాలక్రిష్ణశర్మ, మురళీక్రిష్ణశర్మ, ఆలయ ఈవో శ్రీధర్ ఆధ్వర్యంలో అమ్మవారికి కుంకుమార్చన, పంచామృతాభిషేకం కార్యక్రమాలు నిర్వహించారు. మహిళా భక్తులు అధిక సంఖ్యలో హాజరై అమ్మవారిని దర్శించుకున్నారు.



ప్రత్యేక అలంకరణలో అమ్మవారి ఉత్సవ విగ్రహం



విజయదుర్గాదేవి ఆలయంలో పూజలు చేస్తున్న మహిళలు

హౌసింగ్‌బోర్డు కోదండరామాలయంలో..

నగర హౌసింగ్‌బోర్డు కోదండరామాలయంలో నిర్వాహకులు వరలక్ష్మీ వ్రతం నిర్వహించారు. మహిళలు పెద్ద సంఖ్యలో హాజరై అమ్మవారికి ప్రత్యేక పూజలు చేశారు. తదుపరి భక్తులకు తీర్థప్రసాదాలు అందించారు.

గాయత్రీమాత ఆలయంలో..

నగర రామచంద్రయ్య కాలనీలోని గాయత్రిమాత ఆలయంలో భక్తులు వరలక్ష్మీవ్రతం నిర్వహించారు. శ్రావణమాసం శుక్రవారం సందర్భాన్ని పురస్కరించుకొని భక్తులు మహిళలు సంయుక్తంగా వ్రతాన్ని నిర్వహించారు.



కడప విజయదుర్గాదేవి ఆలయంలో అమ్మవారి దర్శనానికి క్యూ కట్టిన భక్తులు

పాఠశాలల్లో కొనసాగుతున్న టీకా మందు

మైదుకూరు : ప్రాణాంతకరమైన తట్టు, రూబెల్లా వ్యాధుల నివారణకు సంబంధించిన ఎమ్మార్ టీకా మందు కార్యక్రమం కొనసాగుతోంది. వైద్యాధికారులు శుక్రవారం పట్టణంలోని వివిధ ప్రభుత్వ, ప్రయివేటు పాఠశాలలకు చేరుకొని విద్యార్థులకు టీకా మందు వేశారు. గత మంగళవారం నుంచి సెప్టెంబర్ 8వ తేది వరకు 9 నెలల పిల్లల నుంచి 15 ఏళ్ల వయస్సుగల చిన్నారులకు టీకా వేయనున్నారు. ఒకే టీకాతో న్యూమోనియా, అతిసారం, అంధత్వం, వినికిడి లోపం, బుద్ధి మాంద్యం, పుట్టుకతోనే గుండె సంబంధిత వ్యాధులను నివారించవచ్చని వైద్య సిబ్బంది పాఠశాలల్లో అధ్యాపకులకు, విద్యార్థులకు సూచిస్తూ మందులు వేస్తున్నారు.

ప్రతి అర్జిదారుడి సమస్య పరిష్కరించాలి.. కలెక్టర్



అర్జీని పరిశీలిస్తున్న కలెక్టర్ బాబూరావునాయుడు

దువ్వూరు: గ్రామాల్లో నెలకొన్న భూ సమస్యలను సత్వరమే పరిష్కరించాలని, ప్రతి అర్జిదారుని సమస్య సకాలంలో పరిష్కరించినప్పుడే అధికారులపై నమ్మకం ఉంటుందని కలెక్టర్ బాబూరావునాయుడు పేర్కొన్నారు. శుక్రవారం మండల పరిధిలోని జిల్లేళ్ల గ్రామం లో నిర్వహించిన రైతు సేవలో రెవెన్యూ సదస్సు కార్యక్రమాన్ని ఆకస్మికంగా కలెక్టర్ పరిశీలించారు. ఈ సందర్భంగా గ్రామానికి చెందిన పలువురు రైతులు ఇచ్చిన అర్జీలను పరిశీలించారు. అధికంగా ఆన్‌లైన్ సమస్యలు పెండింగ్‌లో ఉండటాన్ని గమనించిన కలెక్టర్ తహసీల్దారు రవిశంకర్‌రెడ్డికి సమస్యను సత్వరం పరిష్కరించాలని ఆదేశించారు. అనంతరం సభ ఆవరణలో ఉన్న విద్యార్థులతో మాట్లాడి ప్రభుత్వ విద్య ఏవిధంగా అందుతోందని విద్యార్థులను పరీక్షించారు. కలెక్టర్ అడిగిన ప్రశ్నలకు విద్యార్థులు స్పందించకపోవడంతో కలెక్టర్ సంబందిత ఉపాధ్యాయులకు సక్రమంగా విద్యను బోదించాలని సూచించారు. కార్యక్రమంలో సర్వేయర్ నాగరాజు, ఆర్ఐ బాలనారాయణస్వామి, గ్రామస్థులు పాల్గొన్నారు.

రెగ్యులర్ చేసేంతవరకు పోరాడుతాం



మాట్లాడుతున్న వెంకట సుబ్బయ్య

మైదుకూరు : వివిధ మండలాల్లో భవిత కేంద్రాల్లో ఉన్న ఐఈఆర్‌టి ఉద్యోగులను ప్రభుత్వం రెగ్యులర్ చేసేంతవరకు పోరాడుతామని సంబంధిత రాష్ట్ర గౌరవాధ్యక్షుడు కె.వెంకటసుబ్బయ్య పేర్కొన్నారు. పట్టణంలోని భవిత కేంద్రం ఆవరణలో శుక్రవారం నియోజకవర్గంలోని సిబ్బందితో సమావేశం నిర్వహించారు. మొదటగా ప్రత్యేక అవసరాలు కలిగిన పిల్లలకు వినూత్న విద్యావిధానంతో భోదించుట, ఆధునిక పరికరాలతో బోధన తదితర అంశాలను ప్రస్తావించారు. అనంతరం ఐఈఆర్‌టి సిబ్బంది పడుతున్న సమస్యలపై చర్చించారు. ప్రభుత్వం వెట్టి చాకిరి చేపించుకుంటూ కనీసం ఉద్యోగ భద్రత కల్పించటం లేదని, వెంటనే ఉద్యోగులను రెగ్యూలర్ చేసేంత వరకు ప్రభుత్వంపై వత్తిడి తేవాలని నిర్ణయించారు. విద్యార్థులకు ఇబ్బందులు కలుగకుండా శిక్షణ ఇస్తూనే ప్రభుత్వంపై పోరాడాలని ఆయన పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో నాయకులు వి.భాను ప్రకాష్, చంద్రమోహన్ తదితరులు పాల్గొన్నారు.

వ్యర్థాల నుంచి ఆదాయం



మాట్లాడుతున్న ఏపీడీ సురేంద్రనాథ్

దువ్వూరు: గ్రామ పంచాయతీల్లో పడవేసే చెత్తచెదారంతో ఆదాయం సమకూర్చుకునేందుకు ప్రభుత్వం ఉపాధి హామీ పథకం ద్వారా కార్యక్రమాన్ని రూపొందిస్తున్నట్లు ఏపీడీ రాఘవేంద్రనాథ్ పేర్కొన్నారు. శుక్రవారం మండల కేంద్రంలోని ఎంపీడీవో సభాభవనంలో మండలంలోని 23గ్రామ సర్పంచులకు, ఉపాధి హామీ సిబ్బంది, పంచాయతీ కార్యదర్శులు, వీఆర్వోలకు అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గ్రామ పంచాతీల్లో సేకరిస్తున్న కసువు, చెత్తాచెదారంతో ఆదాయ మార్గాలను చేకూర్చుకునేందుకు ప్రభుత్వం ఈనెల 16 నుంచి చర్యలు తీసుకుంటోందన్నారు. ప్రతి గ్రామ పంచాయతీలో తడి, పొడి చెత్తద్వారా కంపోస్టు ఎరువును, మరికొన్ని అమ్మకాలకు వీలున్న పదార్థాలను తయారు చేసేందుకు ఉపయోగపడుతుందన్నారు. కార్యక్రమంలో సర్పంచ్, ఆయా శాఖల అధికారుల సహకారంతో విజయవంతంగా పూర్తి చేసుకోవాలన్నారు. డంపింగ్ యార్డు కేంద్రాల వద్ద ఉపాధి హామీ పథకం ద్వారా షెడ్డు నిర్మాణం, చెత్తలో వ్యర్థాలను ఏరివేసేందుకు నిధులను విడుదల చేస్తుందన్నారు. కార్యక్రమంలో ఎంపీడీవో ఎ.వి.రమణారెడ్డి, తహసీల్దారు రవిశంకర్‌రెడ్డి, గ్రామ సర్పంచులు, ఉపాధి సిబ్బంది పాల్గొన్నారు.

11 మంది పేకాటరాయుళ్ళ అరెస్టు

మైదుకూరు : ముళ్ల పొదల్లో పేకాట ఆడుతున్న వారిపై పోలీసులు దాడి చేసి 11మందిని అరెస్టు చేసి, వారి వద్ద నుండి 13,290 రూపాయలను స్వాధీనం చేసుకున్న సంఘటన శుక్రవారం సాయంత్రం మైదుకూరులో చోటు చేసుకుంది. అందిన సమాచారం మేరకు ఎస్ఐ రామకృష్ణ తమ సిబ్బందితో కలసి సీతారామాంజనేయ నగర్ సమీపంలోని మైదానంలోగల కంపచెట్ల పొదల్లో పేకాట ఆడుతున్న వారిపై దాడి చేశారు. ఈదాడిలో జగన్నాదం పుల్లయ్య, నాగన్న, సుబ్బన్న, రమణయ్య, శ్రీరాముల వెంకటయ్య, పెద్ద వెంకటయ్య, పేనుడి మధు, పాల బయన్న, మర్రిబోయిన భాస్కర్, మదిరే గంగన్న, వనం నాగేంద్రలను అరెస్టు చేసి వారి వద్ద ఉన్న 13,290 రూపాయలను స్వాధీనం చేసుకున్నారు. కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ రామకృష్ణ పేర్కొన్నారు.

మాదిగలకు మోసం చేసిన ముఖ్యమంత్రి



తహసీల్దార్ కార్యాలయం వద్ద దీక్షలు చేస్తున్న ఎమ్మార్పీఎస్ నాయకులు

బ్రహ్మంగారిమఠం : సీఎం చంద్రబాబునాయుడు మాదిగలను మోసం చేశారని జిల్లా ఎమ్మార్పీఎస్ యువసేన అధ్యక్షుడు ఎస్‌ఆర్ క్రిష్ణ ఆవేదన వ్యక్తం చేశారు. శుక్రవారం స్థానిక తహసీల్దార్ కార్యాలయం వద్ద చేపట్టిన రిలేదీక్షలు 5వ రోజుకు చేరుకున్నాయి. ఈ సందర్భంగా దీక్షల్లో ఎస్‌ఆర్ క్రిష్ణ మాట్లాడుతూ ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు ఎస్సీ వర్గీకరణ బిల్లును అమలు చేస్తానని చెప్పి మాదిగలను మోసం చేశారన్నారు. ఎస్సీ వర్గీకరణ బిల్లుకు పార్లమెంట్‌లో చట్టబద్ధత కల్పించాలని, లేని పక్షంలో దళితులు వచ్చే ఎన్నికల్లో తమసత్తా ఏమిటో చూపిస్తామన్నారు. ఈ రిలే దీక్షల్లో ఎమ్మార్పీఎస్ మండల అధ్యక్షుడు ఎన్ చెన్నయ్య, ఎస్.రామయ్య, ఎస్. ఈశ్వర్, ఎస్.ఓబులేసు, వై.జోజప్ప, హరిబాబు, ఎస్. భాస్కర్, చెంద్రాయుడు, జిల్లా నాయకులు ఫీటర్, తదితరులు పాల్గొన్నారు.

ప్రభుత్వం గ్యాస్ సబ్సిడీని ఎత్తివేస్తామనడం దారుణం



బి.మఠంలో ధర్నా నిర్వహిస్తున్న సీపీఎం నేతలు

బ్రహ్మంగారిమఠం: కేంద్ర ప్రభు త్వం గ్యాస్‌పై సబ్సిడీ ఎత్తివేస్తామంటూ చెప్పడం దారుణమైన విషయమని సీపీఎం మండల కార్యదర్శి వై.గురివిరెడ్డి పేర్కొన్నారు. మండల కేంద్రంలోని 5రోడ్ల కూడలిలో సీపీఎంమండల కమిటీ ఆధ్వర్యంలో ధర్నా చేపట్టారు. ధర్నా ను ఉద్దేశించి గురివిరెడ్డి మాట్లాడుతూ గ్యాస్‌కు ప్రభుత్వ సబ్సిడీ లేకపోతే ఎంతో మంది పేద, నిరుపేదల కుటుంబాలపైన ఈ భారం పడుతుందని, వెంటనే ప్రభుత్వం ఈనిర్ణయాన్ని వెనక్కు తీసుకోవాలని ఆయన కోరారు. ఈధర్నాలో గండి గుర్రయ్య, భాస్కర్, రమణ, ఓబులేసు, సాయి, ప్రసాదు, మేరి పాల్గొన్నారు.

తాగునీటి సమస్య పరిష్కారం

గోపవరం : తాగునీటి సమస్య పరిష్కారం కోసం కొత్తగా బోర్లు ఏర్పాటు చేసి మోటార్లు దించుతున్నట్లు ఎంపీడీఓ ప్రభాకర్‌రెడ్డి తెలిపారు. మండలంలో పలుగ్రామాల్లో కొత్తగా వేసిన బోర్లకు మోటార్లను శుక్రవారం ఏర్పాటు చేశారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ మండలంలోని ఏ గ్రామంలో కూడా తాగునీటిసమస్య రాకుండా ఎప్పటికప్పుడు చర్యలు చేపడుతున్నామన్నారు. కొంత నిధుల కొరత ఉన్నప్పటికీ ప్రత్యామ్నాయ మార్గాల్లో బోర్లను ఏర్పాటు చేస్తున్నామన్నారు. అన్ని గ్రామా ల్లో ప్రస్తుతం తాగునీటి సమస్యలేదన్నారు. కార్యక్రమంలో ఆర్‌డబ్ల్యూఎస్ఏఇ శ్రీహరి, ఏపీఓ నరసింహులు, సర్పంచ్ లక్ష్మీదేవి, మాజీ ఎంపీటీసీ వెంకటేశ్వర్లు, ఉపసర్పంచ్ భర్త రవీంద్రనాయుడు, తదితరులు పాల్గొన్నారు.

రోడ్డు ప్రమాదంలో గుర్తు తెలియని వ్యక్తి మృతి



మృతిచెందిన గుర్తు తెలియని వ్యక్తి

దువ్వూరు: మండల పరిధిలోని మీర్జఖాన్‌పల్లె వద్ద కడప-కర్నూలు జాతీయ రహదారిపై శుక్రవారం గుర్తు తెలియని వాహనం ఢీకొని గుర్తు తెలియని వ్యక్తి మృతి చెందాడు. గ్రామ సమీపంలో సాయిబాబా ఆలయం ఎదురుగా రోడ్డుపై సుమారు 40 సంవత్సరాలు వయస్సు కలిగిన వ్యక్తి తెల్లవారుజామున వాహనం ఢీకొనడంతో అక్కడిక్కడే మృతిచెందాడు. విషయం తెలుసుకున్న దువ్వూరు పోలీసులు మృతుని వివరాలు తెలుసుకునేందుకు ప్రయత్నించగా ఎలాంటి ఆధారాలు దొరకలేదు. పోస్టుమార్టం నిమిత్తం ప్రొద్దుటూరు ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ విద్యాసాగర్ పేర్కొన్నారు.

మైదుకూరులో ఓ మోస్తరు వర్షం

మైదుకూరు : మైదుకూరు పట్టణంలో శుక్రవారం సాయంత్రం ఓ మోస్తారు వర్షం కురిసింది. ఆకాశం మేఘాలు కమ్ముకొంటున్న గత వారం రోజులుగా వర్షం పడటం లేదు. పగలు, రాత్రి ఉక్కపోతతో జనం ఇబ్బందులు పడ్డారు. వర్షం రాక కోరం రైతన్నలు ఎదురు చూస్తూ వస్తున్నారు. కాగా శుక్రవారం సాయంత్రం 25 నిమిషాల పాటు ఓ మోస్తరు వర్షం కురిసింది. కాగా ఈ వర్షం దాటికి పొట్టి శ్రీరాముల సర్కిల్ వద్ద ప్రధాన రహదారిపై నీళ్లు నిలిచాయి. అలాగే గాంధీనగర్, అరుదంతీనగర్, చిలుంగారి వీధి, వెంకటేశ్వర థియేటర్ తదితర ప్రధాన వీధుల్లో వర్షపు నీరు నిలిచింది.

ఎంఆర్ వ్యాక్సిన్ వేయడం ద్వారా రెండు జబ్బులు దూరం



టీకాలు వేస్తున్న వైద్యులు కిరణ్‌కుమార్

దువ్వూరు: ప్రభుత్వం తట్టు, రూబె ల్లా నివారణకు ఎంఆర్ వ్యాక్సిన్‌ను వేయడం జరుగుతుందని, 9 నెలల నుండి 15 సంవత్సరాలలోపు పిల్లలందరూ ఈ వ్యాక్సిన్ వేయించుకోవాలని దువ్వూరు ప్రాథమిక ఆరోగ్య కేంద్ర వైద్యులు డాక్టర్ కిరణ్‌కుమార్ పేర్కొన్నారు. శుక్రవారం మండల పరిధిలోని గుడిపాడు గ్రామంలోని శ్రీగురుశంకరాచార్య ఇంగ్లీషుమీడియం స్కూలు, ఆదర్శ హైస్కూలులో 1290 మంది విద్యార్థులకు టీకాలు వేశారు. అంతకుముందుగా వ్యాక్సిన్ ప్రారంభోత్సవ కార్యక్రమంలో గ్రామ సర్పంచ్ తుమ్మల వెంకటకొండారెడ్డి పాల్గొని విద్యార్థులు టీకాలు వేశారు. పాఠశాల కరస్పాండెంట్ రామ్మోహన్‌రెడ్డి, వెంకటరాజు, ఆరోగ్య విస్తరణాధికారులు శివరామయ్య, వెంకటేశ్వర్లు, మునిస్వామి, సూర్యకాంతమ్మ, వైద్య సిబ్బంది పాల్గొన్నారు.

ఫార్మసీ కళాశాలపై చర్యలు తీసుకోవాలి

ప్రొద్దుటూరు టౌన్: నిబంధనలు పాటించని శ్రీలక్ష్మీవెంకటేశ్వర ఫార్మసీ కళాశాలపై చర్యలు తీసుకోవాలని సీమాంధ్ర స్టూడెంట్స్ యూనియన్ రాష్ట్ర అధ్యక్షుడు రాము డిమాండ్ చేశారు. శుక్రవారం ప్రెస్‌క్లబ్‌లో నిర్వహించిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ ఫార్మా విద్యార్థులకు 350 పడకలు ఉన్న ప్రభుత్వ ఆస్పత్రిలో ప్రాక్టికల్స్ నిర్వహించాల్సి ఉందన్నారు. పట్టణానికి 80 కి.మీ. దూరంలో ఉన్న పోరుమామిళ్లలోని అవర్ లేడీ ఆఫ్ ఫాతిమా ఆస్పత్రిలో ప్రాక్టికల్స్ నిర్వహిస్తున్నారని, అది చిన్న ఆస్పత్రి అన్నారు. ఎస్ఎస్‌యూ రాష్ట్ర ఉపాధ్యక్షుడు నరేష్, జిల్లా అధ్యక్షుడు ప్రసాద్, బహుజన ఐక్యవేదిక రాష్ట్ర అధ్యక్షుడు వెంకటసుబ్బయ్య, కార్యదర్శి శివకృష్ణ పాల్గొన్నారు.

కలసికట్టుగా పని చేస్తేనే ఆర్టీసీకి లాభాలు

ప్రొద్దుటూరు కల్చరల్: కార్మికులు, డిపో మేనేజర్‌లు కలసికట్టుగా పని చేసి ప్రొద్దుటూరు డిపోను లాభాల బాటలో నడిపించాలని ఆర్టీసీ రీజనల్ మేనేజర్ చెంగల్‌రెడ్డి కోరారు. శుక్రవారం స్థానిక డిపోలో కార్మికులనుద్దేశించి ఆర్ఎం చెంగల్‌రెడ్డి మాట్లాడుతూ గత మూడు మాసాల నుంచి ఆర్టీసీ లాభాల బాటలో నడుస్తోందన్నారు. రాష్ట్ర స్థాయిలో రూ.210కోట్ల నష్టాల నుండి రూ.60కోట్లకు తగ్గిందన్నారు. ప్రొద్దుటూరు డిపో రూ.రూ.2.39కోట్ల నుండి రూ.1.16కోటి నష్టం తగ్గిందన్నారు. కార్మికులు సంఘటితంగా కలిసి పని చేయడం వల్లనే ఆర్టీసినష్టాల బాట నుండి తగ్గుతోందన్నారు. ప్రొద్దుటూరు డిపోకు ఐదు నూతన లగ్జరీ బస్సులు వచ్చాయన్నారు. అదనంగా కొద్ది రోజుల్లో 10నూతన బస్సులు వస్తాయన్నారు. బస్సు సామర్థ్యంతో పాటు కంటికి ఇంపుగా ఆహ్లాదకరంగా ఉండాలన్నారు. గతంలో ప్రొద్దుటూరుడిపో జిల్లాలో నే లాభాల బాటలో పయనించేదని అలాంటి పూర్వవైభవాన్ని కార్మికులు, డిఎం కలిసి కృషి చేయాలని ఆశించారు. కార్మికుల మధ్య పోటీతత్వం ఉందన్నారు. లాభాల బాటలో పయనించేందుకు కార్మికులసలహాలను, అభిప్రాయాలను తీసుకుంటామన్నారు.

పాస్‌లను విరివిగా అందించాలి

సబ్సిడీ పాస్‌లను విరివిగా విక్రయించడం వల్ల ఆర్టీసీకి సబ్సిడీ నిధులు వస్తాయన్నారు. దివ్యాంగులు జిల్లాలో 46వేల మంది ఉండగా 10వేలమందికి మాత్రమే పాస్‌లను మంజూరు చేశామన్నారు. విద్యార్థిలందరికి బస్సు పాసులను ఇవ్వాలన్నారు. దీని వలన సంస్థకు సబ్సిడీ నిధులను ప్రభుత్వం ఇస్తుందన్నారు. జిల్లాలో విద్యార్థులకై 37బడి బస్సుల ట్రిప్పులను నడుపుతున్నట్లు ఆర్ఎం చెప్పారు. అవసరమైతే మరిన్ని బస్సులను ఏర్పాటు చేస్తామన్నారు. ఈకార్యక్రమంలో ఆర్టీవో అబ్దుల్‌రవూఫ్, సిటిఎం ఇబ్రహీం, డిఎం హరి, ట్రాఫిక్‌కంట్రోలర్ మహేశ్వరరెడ్డి, కార్మిక నాయకులు టివిఆర్‌రెడ్డి, మాచయ్య తదితరులు పాల్గొన్నారు.


కార్మికులనుద్దేశించి మాట్లాడుతున్న ఆర్ఎం చెంగల్‌రెడ్డి

ఐదు నూతన బస్సులను ప్రారంభం- స్థానిక డిపోకు ఐదు సూపర్ లగ్జరీ బస్సులను ఆర్టీవో అబ్దుల్‌రవూఫ్‌తో కలసి ఆర్ఎం చెంగల్‌రెడ్డి ప్రారంభించారు. నూతన బస్సులను శబరిమలై, షిర్డిలాంటి ప్రాంతాలకు అద్దె ప్రాతిపదికన ఇస్తామని ఆర్ఎం చెప్పారు. ఈబస్సులను విజయవాడ, హైదరాబాద్, చెన్నై లాంటి దూరప్రాంతాలకు నడుపుతామన్నారు.

అవీ.. ఇవీ

గృహ నిర్మాణ సంఘం అక్రమాలపై విచారణ

ప్రొద్దుటూరు పుట్టపర్తి సర్కిల్: ప్రొద్దుటూరు సహకార గృహ నిర్మాణ సంఘంలో జరిగిన అవినీతిపై పాలకవర్గ సభ్యులు, ఉద్యోగులను శుక్రవారం విచారణాధికారి ప్రొద్దుటూరు సహకార శాఖ అసిస్టెంట్ రిజిస్ట్రార్ మహమ్మద్‌రఫి విచారించారు. బసిరెడ్డి ప్రసాద్‌రెడ్డి, కుమార్ తదితరులను ఆయన కార్యాలయంలో విచారణ జరిపారు. వారి స్టేట్‌మెంట్స్‌ను రికార్డు చేశారు. ఈనెల 9న మిగతావారిని విచారణకు రావాల్సిందిగా సమన్ నోటీసు ఇచ్చారు. ఇందులో కీలకమైన మినిట్స్ బుక్ మాయంపై థర్డ్‌పార్టీ రిజిస్ట్రేషన్లపై, కార్యాలయం మరమ్మతుల వ్యయంపై విచారణ జరిపారు. ఈ విచారణకు హాజరవ్వాల్సిన మాజీ కార్యదర్శి రామచంద్రారెడ్డి వ్యక్తిగత పనులపై బయటకు వెళుతున్నందున అందుబాటులో ఉండడం లేదంటూ అనుమతికోరుతూ గురువారం లేఖ పంపారు.

రోటరీక్లబ్ ఆధ్వర్యంలో క్రికెట్ కిట్ వితరణ


ఐజీ, ఎస్పీల చేతుల మీదుగా
క్రికెట్ కిట్ అందుకుంటున్న విద్యార్థులు

ప్రొద్దుటూరు క్రైం : ప్రభుత్వ ఉర్దూ జూనియర్ కళాశాల విద్యార్థులకు రోటరీ క్లబ్ వారు క్రికెట్ కిట్‌ను వితరణగా అందించారు. ఆ కళాశాలలో జరిగిన ఆత్మీయ సమ్మేళన కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా హాజరైన ఐజీ మహమ్మద్ ఇక్బాల్, ఎస్పీ అట్టాడ బాబుజీ చేతుల మీదుగా రోటరీ క్లబ్ వారు విద్యార్థులకు క్రికెట్ కిట్‌ను అందజేశారు. ఆటలతో పాటు చదువులోను రాణించాలని ఐజీ, ఎస్పీలు విద్యార్థులతో అన్నారు. కార్యక్రమంలో రోటరీ క్లబ్ అధ్యక్షులు అయూబ్‌ఖాన్, డాక్టర్ రాజారామ్మోహన్‌రెడ్డి తదితరులు ఉన్నారు.

రేపు ప్రభుత్వాసుపత్రిలో రక్తదాన శిబిరం

ప్రొద్దుటూరు టౌన్: మెగాస్టార్ చిరంజీవి 62వ జన్మదినం సందర్భంగా 6వ తేదీ ఆదివారం జిల్లా ప్రభుత్వ ఆస్పత్రిలో రక్తదాన శిబిరం ఏర్పాటు చేసినట్లు మెగా పవర్‌స్టైలిష్‌స్టార్ రామ్ చరణ్ ఫ్రెండ్స్ యూనిట్ అధ్యక్షుడు విక్రం, ఉపాధ్యక్షుడు రామారావులు ఒక ప్రకటనలో తెలిపారు. చిరంజీవికి జన్మదినం, సినిమా పరిశ్రమలోకి వచ్చి 40 సంవత్సరాలు పూర్తయిన సందర్భంగా ప్రపంచ వ్యాప్తంగా 400 రక్తదాన శిబిరాలు ఏర్పాటు చేశామన్నారు. ఆదివారం 9 గంటలకు రక్తదాన శిబిరం ప్రారంభం అవుతుందని, చిరంజీవి అభిమానులు పాల్గొని విజయవంతం చేయాలని కోరారు.

దళితుల మధ్య చిచ్చుపెట్టడానికి వర్గీకరణకు మద్దతు

ప్రొద్దుటూరు టౌన్: కొందరు రాజకీయ నిరుద్యోగులు దళితుల మధ్య చిచ్చుపెట్టడానికి ఎస్సీ వర్గీకరణకు మద్దతు ప్రకటిస్తున్నారని మాలమహానాడు జిల్లా అధ్యక్షుడు ఆర్.ఇమ్మానుయల్ విమర్శించారు. ప్రెస్‌క్లబ్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ మాజీ బీజేపీ నాయకుడు ఒంటరు శ్రీనివాసులరెడ్డి ఎస్సీ వర్గీకరణకు మద్దతు తెలుపడం నీతిమాలిన చర్య అన్నారు. ఎస్సీ వర్గకరణను సుప్రీం కోర్టు కొట్టివేసిందని, కోర్టు తీర్పును దిక్కరించే విధంగా ఎస్సీ వర్గీకరణకు మద్ధతు తెలుపడం దారుణమన్నారు. దళితుల మధ్య చిచ్చుపెడుతున్న ఒంటేరు శ్రీనివాసులరెడ్డిని ఉపాధ్యా సంఘాలు బహిష్కరించాలని కోరారు. మాలమహానాడు పట్టణాధ్యక్షుడు కుమార్, రాష్ట్ర ప్రధాన కార్యదర్శి శ్రీరామ ఓబులేసు, జిల్లా కార్యదర్శి సుధాకర్, పట్టణాధ్యక్షుడు ప్రభాకర్‌లు పాల్గొన్నారు


ప్రెస్‌క్లబ్‌లో మాట్లాడుతున్న దృశ్యం

ఉర్దూ డిగ్రీకళాశాల ఏర్పాటుకు సహకరించండి


ఐజీకి వినతిపత్రం ఇస్తున్నదృశ్యం

ప్రొద్దుటూరు క్రైం : ప్రభుత్వ ఉర్దూ జూనియర్ కళాశాలకు అనుబంధంగా ఉర్దూ డిగ్రీ కళాశాల ఏర్పాటుకు సహకరించాలని రాయలసీమ ఐజీ మహమ్మద్ ఇక్బాల్‌కు పలువురు ముస్లిం నేతలు విజ్ఞప్తి చేశారు. ఈ మేరకు స్థానిక ప్రభుత్వ ఉర్దూ జూనియర్ కళాశాలలో ఆత్మీయ సమ్మేళనానికి ముఖ్య అతిథిగా హాజరైన ఐజీ మహమ్మద్ ఇక్బాల్‌కు ముస్లిం నేతలు వడ్ల దాదాపీర్, నూర్ మహమ్మద్, ఖాజామోహిద్దీన్, టప్పా మహబూబ్‌బాషలు వినతిపత్రం అందించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ మోడంపల్లిలో వక్ఫ్‌బోర్డుకు సంబంధించి స్థలం ఉందని, అక్కడ ఉర్దూ డిగ్రీ కళాశాల ఏర్పాటు చేస్తే ఇక్కడ ఇంటర్మీడియట్ పూర్తి చేసిన విద్యార్థులకు ఎంతో మేలు జరుగుతుందన్నారు. ఈ విషయమై అనుమతి కోసం సహకరించాలని వారు ఐజీ ఇక్బాల్‌ను కోరగా సానుకూలంగా స్పందించారు. అంతకు ముందు ఐజీ ఇక్బాల్‌ను సత్కరించారు.

వైభవంగా వరలక్ష్మీ వ్రతం

ఎర్రగుంట్ల: ఎర్రగుంట్ల ఏరువాక గంగమ్మ ఆలయంలో శుక్రవారం రాత్రి సామూహిక వరలక్ష్మీ వ్రతం వైభవంగా నిర్వహించారు. మహిళలు భారీగా పాల్గొని భక్తిశ్రద్ధలతో పూజలు నిర్వహించారు. ఆలయ కమిటీ అన్ని ఏర్పాట్లు చేశారు. అనంతరం భక్తులకు ప్రసాదాలు పంపిణీ చేశారు.

10న రాష్ట్రవ్యాప్త విద్యాసంస్థల బంద్



ప్రొద్దుటూరు టౌన్: విద్యారంగ సమస్యల పరిష్కారం కోసం 10వ తేదీ రాష్ట్రవ్యాప్తంగా విద్యాసంస్థలు బంద్ నిర్వహిస్తున్నట్లు పీడీఎస్‌యూ జిల్లా అధ్యక్షుడు రమేష్, జిల్లా కార్యదర్శి ఓబులేసులు తెలిపారు. సీపీఎం కార్యాలయంలో శుక్రవారం నిర్వహించిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ ప్రైవేటు, కార్పొరేట్ విద్యాసంస్థల దోపిడీకి వ్యతిరేకంగా విద్యాసంస్థలో సెల్ఫ్‌ఫైనాన్స్ కోర్సులు ఏర్పాటు చేయడానికి నిరసనగా బంద్ నిర్వహిస్తున్నట్లు తెలిపారు. టీడీపీ ప్రభుత్వం కార్పొరేట్ వి ద్యాసంస్థలకు కొమ్ము కాస్తోందన్నారు. ఏఐఎస్ఎఫ్ నాగరాజు మాట్లాడుతూ ప్రైవేటు విద్యాసంస్థల్లో ఇష్టారాజ్యంగా ఫీజులు వసూలు చేస్తున్న విద్యాశాఖ అధికారులు నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నారన్నారు. ఎస్ఎఫ్ఐ డేవిడ్‌రాజు మాట్లాడుతూ ప్రభుత్వం పాఠశాలలు, హాస్టల్స్ మూసివేతను నిలిపివేయాలని డిమాండ్ చేశారు.

స్వాహా చేసిన నిధుల చెల్లింపు

ప్రొద్దుటూరు కల్చరల్: ప్రొద్దుటూరు మండల పరిధిలో మృతి చెందిన వారి పేర్లతో పింఛన్లను స్వాహా చేశారనే ఆరోపణలపై పలువురు పంచాయతీ కార్యదర్శులకు డీఆర్‌డీఏ అధికారులు నోటీసులు జారీ చేశారు. గతంలో ఉపాధిహామీ పథకం అమలులో భాగంగా సోషల్ ఆడిట్ సిబ్బంది విచారణలో కొందరు పంచాయతీ కార్యదర్శులు కొన్ని నెలల పాటు వారికి ఉన్న అథ్లంటికేషన్(గుర్తింపుముద్ర)ను ఉపయోగించి స్వాహా చేశారని సామాజిక సర్వే చేసిన సిబ్బంది ఆరోపించారు. ఈమేరకు డిఆర్‌డిఏ అధికారులు పంచాయతీ కార్యదర్శులు వారు వసూలు చేసిన సొమ్మును చెల్లించాలని షో కాజ్ నోటీసులను ఎంపీడీవో సుబ్రమణ్యంకు పంపించారు. ఈనిధులను చెల్లించని పక్షంలో చర్యలు తీసుకుంటామన్నారు. ఈనేపథ్యంలో గోపవరం పంచాయతీ కార్యదర్శి ఆనందరావు తొమ్మిది నెలల పాటు పింఛను డబ్బుస్వాహా చేశారని లక్షా 8వేల 500 రూపాయలను, చెన్నమరాజుపల్లె, చౌటపల్లె, కామనూరు పంచాయతీ కార్యదర్శిగా పని చే స్తున్న రవి రూ22వేలు, ధనుంజయబాబు రూ.12వేలు, శీతంపల్లెలో పింఛన్లు పంపిణీ చేస్తున్న సాక్షరభారత్ కో ఆర్డినేటర్ రూ.2వేలు వసూలు చేశారని ఆరోపించారు. తాళ్ళమాపురం పంచాయతీలో కూడా రూ.26వేలను స్వాహా చేసినట్లు నోటీసులను జారీ చేశారు. దీంతో వారు శుక్రవారం ఆ మొత్తం చెల్లించి రశీదులను ఎంపీడీవోకు అందజేశారు. అయితే తాళ్ళమాపురంలో స్వాహా అయిన నిధులను మాత్రం చెల్లించలేదని ఎంపీడీవో తెలిపారు.

పారిశుధ్య కార్మికుల సమస్యలను పరిష్కరించాలి

ప్రొద్దుటూరు టౌన్: రాష్ట్రవ్యాప్తంగా మున్సిపాలిటీల్లో ఉన్న పర్మినెంట్ పారిశుధ్య కార్మికుల సమస్యలు పరిష్కరించాలని ఏఐటీయూసీ ఏపీ మున్సిపల్ వర్కర్స్ యూనియన్ జిల్లా కార్యదర్శి సుబ్బరాయుడు అన్నారు. శుక్రవారం ప్రెస్‌క్లబ్‌లో నిర్వహించిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ 2016 డిసెంబరు నాటి మెడికల్ బిల్లులు ప్రొద్దుటూరు మున్సిపల్ అధికారులు ఇంతవరకు చేయలేదన్నారు. కార్మికులకు చెప్పులు ఇవ్వడంలేదని అడిగితే అతీగతి లేదన్నారు. రాష్ట్ర ప్రభుత్వ బాండ్లను రెన్యువల్‌కు పంపకుండా కార్మికుల డబ్బులను మురిగిపోయేలా చేస్తున్నారని విమర్శించారు. మెడికల్ బిల్లులు చేయడం చేతకాని క్లర్కులు విధులు నిర్వహిస్తున్నారని, ఇంక్రిమెంట్లు చేయ డం చేతగాని సిబ్బందిపై చర్యలు తీసుకోవాలన్నారు. మున్సిపల్ వర్కర్స్ యూనియన్ జిల్లా నాయకులు పక్కీరయ్య, వెంకటలక్షుమ్మ, భాస్కర్, పట్టణ కార్యదర్శి కుమార్, చైతన్య, ఓబులేసు, రూబెన్, నిర్మలా పాల్గొన్నారు.



ఐటీఐ సర్కిల్‌లో...

కొత్త హంగులు

● ఆకట్టుకుంటున్న గాంధీపార్కు


గాంధీ విగ్రహం

కడప, ఎర్రముక్కపల్లె: పాదచారులు నడిచేందుకు ఫుట్‌పాత్ లేదు. ఏ వాహనం ఎటు నుంచి వస్తుందో తెలియని పరిస్థితి. డివైడర్స్ అంతంతే... సర్కిల్లోకి రావాలంటేనే భయం. ఇదీ కడప ఐటీఐసర్కిల్ దుస్థితి. ఇప్పుడు ఓ అందమైన గాంధీ మండపం, ఆకట్టుకుంటున్న గాంధీ పార్కు, సాయంత్రం విశ్రాంత ఉద్యోగులు, వృద్ధులు, కూర్చుని సేద తీరేందుకు చక్కని బెంచీలు ఇదీ ప్రస్తుత ఐటీఐ సర్కిల్ పరిస్థితి. బాధ్యత కలిగిన పౌరుడి సంకల్పం మొత్తం ఐటీఐసర్కిల్ రూపు రేఖలనే మార్చేసింది. స్థానికులను ఎంతగానో ఆకర్షిస్తుంది.

కడప నగరపాలక సంస్థ పరిధిలోని ఐటీఐసర్కిల్ ఆధునీకరణ నిమిత్తం కార్పొరేషన్ రూ.2.40 లక్షలు మంజూరు చేసింది. అయితే ఈ నిధులు ఎందుకూ సరిపోవు. గాంధీ మండపం వెనుకభాగంలో నిరూపయోగంగా ఒక వాటర్ ట్యాంకు ఉంది. దానిని తొలగించి ఆ స్థానంలో ఓ చక్కని పార్కు నిర్మాణం చేస్తే స్థానికులకు ఎంతో ఉపయోగకరంగా ఉంటుంది. అయితే కార్పొరేషన్ మంజూరు చేసిన నిధులు గాంధీ మండపం ఆధునీకరించేందుకే సరిపోతుంది. మరి పార్కు పరిస్థితి ఎలా అన్న ప్రశ్న ఉత్పన్నమైంది. ఒక బాధ్యత గల పౌరుడిగా స్థానిక కార్పొరేటర్ బి.పార్వతి భర్త 44వ డివిజన్ టీడీపీ ఇన్‌చార్జి బి.రాజశేఖర్‌రెడ్డి ఆ భారాన్ని తన బుజాలపై ఎత్తుకున్నారు. ఎంత ఖర్చు అయినా ప్రజలకు శాశ్వతంగా ఉపయోగపడే విధంగా ఒక చక్కని పార్కుని నిర్మించాలని నిర్ణయం తీసుకున్నారు. పనులు ప్రారంభించారు. ప్రస్తుతానికి నిర్మాణ పనులు పూర్తయిపోయాయి. పార్కులో చక్కని మొక్కలు, పచ్చని గడ్డి, కూర్చునేందుకు చక్కని బెంచీలు ఏర్పాటు చేశారు. ప్రస్తుతం రంగులు దిద్దుకుంటుంది.

ఏదో చేయాలనే తపన

ఎంతో నమ్మకంతో గెలిపించారు. వారికి ఏదైనా మంచి చేయాలనే తపన ఉంది. ప్రతి రోజు ఉదయం వార్డు సమస్యలు తెలుసుకుంటారు. పార్టీలకతీతంగా ఎవరి సమస్య అయినా పరిష్కరించేందుకు కృషి చేస్తారు. అయితే 44వ డివిజన్‌లో తనదైన ముద్ర వేయాలని అందరి మన్ననలు పొందాలని డివిజన్ టీడీపీ ఇన్‌చార్జి బి.రాజశేఖర్‌రెడ్డి తలచారు. పార్కు నిర్మాణానికి సొంత నిధులు రూ.10.40 లక్షలు అదనంగా ఖర్చు చేసి నిర్మాణం చేశారు.



గాంధీపార్కు ముఖ ద్వారం

ఆగస్టు 15న ప్రారంభోత్సవం

స్వాతంత్ర్య దినోత్సవం సందర్భంగా ఆగస్టు 15వ తేదిన జిల్లా ఇన్‌చార్జి మంత్రి సోమిరెడ్డి, జిల్లాకు చెందిన మంత్రి ఆదినారాయణరెడ్డి, టీడీపీ జిల్లా అధ్యక్షుడు శ్రీనివాసరెడ్డి చేతుల మీదుగా ప్రారంభిస్తున్నట్లు బి.రాజశేఖర్‌రెడ్డి తెలియజేశారు.


బి.రాజశేఖర్‌రెడ్డి, టీడీపీ డివిజన్ ఇన్‌చార్జి


ముస్తాబైన బెంచీలు


చూడచక్కని గార్డెన్


గాంధీ మండపం

ఉన్మాదిలా మారిన జగన్

● టీడీపీ జిల్లా ప్రధాన కార్యదర్శి బి.హరిప్రసాద్



విలేకర్లతో మాట్లాడుతున్న హరిప్రసాద్

కడప, సెవెన్‌రోడ్స్: అధికార దాహంతో కన్నూమిన్నూ కానరాక ప్రతిపక్షనేత జగన్ ఉన్మాదిలా మారారని, ఏకంగా సీఎంను చంపాలని పిలుపునివ్వడం ఆయన మానసిక స్థితిని తేటతెల్లం చేస్తున్నదని టీడీపీ జిల్లా ప్రధాన కార్యదర్శి బి.హరిప్రసాద్ అన్నారు. ఆయన శుక్రవారం టీడీపీ జిల్లా కార్యాలయంలో విలేకరులతో మాట్లాడారు. మేనిఫెస్టోలో పొందుపరచిన హామీలే కాక ఇతర అభివృద్ధి, సంక్షేమ పథకాలను ప్రజలకు అందిస్తూ రాష్ట్రాన్ని వేగవంతంగా అభివృద్ధి దిశలో తీసుకెళుతున్న ముఖ్యమంత్రికి రాష్ట్రవ్యాప్తంగా ప్రజలు నీరాజనం పలుకుతుంటే జగన్ చూసి ఓర్చుకోలేకపోతున్నారన్నారు. తాత, తండ్రి లాగానే ఫ్యాక్షనిజంతో రాజకీయం చేయాలనుకుంటే ప్రజలు తిప్పికొడతారన్నారు. ఇప్పటికైనా జగన్ తన శైలిని మార్చుకొని అభివృద్ధికి సహకరించాలని సూచించారు. ఈ సమావేశంలో కడప మార్కెట్ కమిటీ చైర్మన్ ఐ.శివారెడ్డి, టీడీపీ జిల్లా ఉపాధ్యక్షుడు జి.మల్లేష్, టీడీపీ నేతలు జి.నాగరాజు, రెడ్డిప్రసాద్, సి.నాగరాజులు పాల్గొన్నారు.

పుట్టిన పిల్లలకు అమ్మపాలే అమృతం

● రిమ్స్ డైరెక్టర్ డాక్టర్ శశిధర్

కడప, స్పోర్ట్స్: పుట్టిన పిల్లలు 12 నెలల వయసు వచ్చేంత వరకు తల్లిపాలు అమృతంతో సమానమని రిమ్స్ డైరెక్టర్ డాక్టర్ శశిధర్ తెలిపారు. శుక్రవారం రిమ్స్‌లో రోటరీ క్లబ్ ఆధ్వర్యంలో ప్రపంచ తల్లిపాల వారోత్సవాల సందర్భంగా కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ తల్లిపాలు బిడ్డలు సులభంగా జీర్ణం చేసుకుంటారని అలాంటి సమయంలో జీర్ణకోశ సంబంధిత వ్యాధులు రాకుండా సంపూర్ణ ఆరోగ్యంగా వుంటారని పేర్కొన్నారు. రోటరీక్లబ్ కార్యదర్శి డాక్టర్ వారణాసి ప్రతాపరెడ్డి మాట్లాడుతూ తల్లిపాలు ఇవ్వడం వల్ల పిల్లలకే కాకుండా బాలింతలలో కూడా మానసిక ఒత్తిడి తగ్గి రక్తస్రావం తగ్గుతుందన్నారు. బాలింతల్లో పాల ఉత్పత్తికి మెంతులు చాలా ఉపయోగపడతాయన్నారు. మెంతికూర, కషాయం, మెంతిపప్పు ఎక్కువగా ఇవ్వడం వల్ల పాల ఉత్పత్తి పెరుగుతుందన్నారు. ఓట్స్, సాల్మన్, ఫిష్, క్యారెట్, కీర, వెల్లుల్లి, దంపుడుబియ్యం, ఆవుపాలు, మునగాకు, మునగకాయలు, బాదంపాలు, గంజిగడ్డ, మటన్, చికెన్ పదార్థాలు బాలింత సమయంలో తల్లికి చాలా మంచిదన్నారు. అనంతరం గోడపత్రం ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో రిమ్స్ సూపరింటెండెంట్ గిరిధర్, ఆర్ఎంవో వెంకటశివ, రోటరీక్లబ్ మాజీ అధ్యక్షుడు అనిల్, సుబ్రమణ్యం, సభ్యులు మాధవరెడ్డి, తాజుద్దీన్, పవన్, వైద్యులు, సిబ్బంది పాల్గొన్నారు.


బాలింతలకు అవగాహన కల్పిస్తున్న వైద్యులు

పక్కా గృహాల కోసం దరఖాస్తు చేసుకోండి

లక్కిరెడ్డిపల్లె: ఇళ్లు లేని నిరుపేదలు పక్కా గృహాల కోసం దరఖాస్తు చేసుకోవాలని ఎంపీడీవో రవికుమార్‌రెడ్డి పేర్కొన్నారు. శుక్రవారం మద్దిరేవుల పంచాయతీలో సర్పంచ్ భువనేశ్వర్‌రెడ్డి ఆధ్వర్యంలో గ్రామ సభ నిర్వహించి ఇళ్లు లేని నిరుపేదలను గుర్తించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పల్స్ సర్వేలో లేనివారు పక్కా గృహాల కోసం దరఖాస్తు చేసుకోవచ్చని, ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలన్నారు. కార్యక్రమంలో హౌసింగ్ ఏఈ రెడ్డెయ్య, సిబ్బంది పాల్గొన్నారు.

గ్రామసభలతోనే లబ్ధిదారుల ఎంపిక

గాలివీడు: మండలంలోని అన్ని గ్రామ పంచాయతీల్లో గ్రామ సదస్సులు నిర్వహించి పక్కా గృహాల లబ్ధిదారులను ఎంపిక చేయడం జరుగుతుందని తహసీల్దార్ భవానీ, ఎంపీడీవో వెంకటసుబ్బయ్య తెలిపారు. శుక్రవారం తహసీల్దార్ ఆధ్వర్యంలో కొర్లకుంట, తలముడిపి గ్రామ పంచాయతీల్లో, ఎంపీడీవో ఆధ్వర్యంలో పందికుంట, నూలివీడు గ్రామ పంచాయతీల్లో గ్రామసభలు జరిగాయి. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ కొర్లకుంటలో 66, తలముడిపిలో 13, పందికుంటలో 26, నూలవీడులో 298 మంది లబ్ధిదారులను పల్స్ సర్వే ద్వారా గుర్తించడం జరిగిందన్నారు. కార్యక్రమంలో టీడీపీ జిల్లా కార్యాలయ కార్యదర్శి వెంకటశివారెడ్డి, సర్పంచ్‌లు ప్రసాద్‌రెడ్డి, శంకర్‌రెడ్డి, రఘునాధరెడ్డి, ఉమాపతిరెడ్డి, జెడ్పీటీసీ ఈశ్వరమ్మ, రమణ, పార్వతమ్మ, వర్క్ఇన్‌స్పెక్టరు బ్రహ్మానంద రెడ్డి, సిబ్బంది పాల్గొన్నారు.

పేకాటరాయుళ్లపై మెరుపుదాడి

- 11 మంది అరెస్టు
- 21,620 నగదు స్వాధీనం

సంబేపల్లె: మండలంలో జూదమాడుతున్న పేకాటరాయుళ్లపై ఎస్ఐ సయ్యద్ హాషం సిబ్బందితో కలిసి మెరుపుదాడి నిర్వహించారు. ఈ దాడుల్లో వేర్వేరు చోట్ల 11 మంది పేకాటరాయుళ్లను పట్టుకున్నారు. వారి వద్ద నుంచి రూ.21,620 నగదును స్వాధీనం చేసుకున్నట్లు తెలిపారు. దేవపట్ల, శెట్టిపల్లె గ్రామం చెరుకువాండ్లపల్లె ప్రాంతాల్లో జూదమాడుతున్నట్లు సమాచారం రావడంతో సిబ్బందితో కలిసి దాడులు నిర్వహించి పేకాటరాయుళ్లను పట్టుకున్నారు. వీరిపై కేసు నమోదు చేసి కోర్టుకు పెట్టనున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో హెడ్‌కానిస్టేబుల్ చంద్రనారాయణ, పలువురు పోలీసు సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

'జగన్ వ్యాఖ్యలను వక్రీకరించిన టీడీపీ నేతలు'



మాట్లాడుతున్న వైసీపీ కౌన్సిలర్లు, నాయకులు

రాయచోటిటౌన్: నంద్యాల బహిరంగ సభలో వైఎస్ఆర్‌సీపీ అధ్యక్షుడు జగన్‌మోహన్ రెడ్డి మాట్లాడిన మాటలను టీడీపీ నాయకులు వక్రీకరించి చెబుతున్నారని వైసీపీ జిల్లా అధికార ప్రతినిధి, కౌన్సిలర్ ఫయాజుర్ రెహమాన్, కోఆప్షన్ సభ్యుడు సల్లావుద్దీన్, సర్పంచుల సంఘం జిల్లా అధ్యక్షుడు శ్రీనివాసుల రెడ్డి, వైసీపీ నాయకులు చెన్నూరు అన్వర్‌బాషా, ఫయాజ్ అహమ్మద్, సంజీవరెడ్డి, అక్రమ్‌బాషా, కిశోర్ పేర్కొన్నారు. శుక్రవారం స్థానిక వైసీపీ కార్యాలయంలో వారు విలేకరులతో మాట్లాడుతూ టీడీపీ మూడు సంవత్సరాల పాలనలో జరుగుతున్న అరాచకాలు, అన్యాయాల మీద చర్చ జరగకుండా నంద్యాల ఎన్నికలను ఎజెండాగా మార్చడానికి ఆ పార్టీ నేతలు నానా రకాల ప్రయత్నాలు చేస్తుండడం దుర్మార్గమన్నారు. నంద్యాల సభలో దుర్మార్గానికి, సన్మార్గానికి మధ్య ప్రజాక్షేత్రంలో జరిగే యుద్ధమని జగన్ పేర్కొన్నారన్నారు. ఎమ్మెల్సీ శిల్పాచక్రపాణిరెడ్డి టీడీపీకి, పదవికి రాజీనామా చేసిన తరువాతనే వైసీపీలో చేరారనే విషయాన్ని తెలుసుకోవాలన్నారు. వైసీపీకి చెందిన 21 మంది ఎమ్మెల్యేలను అడ్డగోలుగా చంద్రబాబు కొనుగోలు చేసి వారి దగ్గర రాజీనామాలు చేయించకుండా కొందరికి మంత్రి పదవులు ఇవ్వడం సిగ్గుచేటన్నారు. టీడీపీ నాయకులు సాకులు వెతుక్కుంటూ రాజకీయ విలువలకు తిలోదకాలు ఇస్తున్నారని ఆరోపించారు. టీడీపీ రాష్ట్రంలో ఆటవిక పాలన సాగిస్తోందని, ఇకనైనా అసత్య ప్రచారాలు మానుకోకపోతే ప్రజలే గుణపాఠం చెబుతారన్నారు.

జీఐఎస్ సర్వేతో అక్రమాలకు చెక్



మాట్లాడుతున్న ఏడీ వెంకటేశ్వర్ రెడ్డి

రాయచోటిటౌన్: మున్సిపాలిటీ పరిధిలోని 31 వార్డుల్లో ప్రస్తుతం ఉన్న ఇళ్లకు జియాలజికల్ ఇన్‌ఫర్‌మేషన్ సిస్టమ్ (జీఐఎస్) సర్వేతో అక్రమాలకు చెక్ పెట్టవచ్చునని ఏడీ వెంకటేశ్వర్‌రెడ్డి, మున్సిపల్ కమిషనర్ శివప్రసాద్‌రాజు పేర్కొన్నారు. జీఐఎస్ సర్వేపై శుక్రవారం స్థానిక మున్సిపల్ కార్యాలయంలో చైర్‌పర్సన్ నసిబున్‌ఖానం అధ్యక్షతన కౌన్సిలర్లకు అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ప్రస్తుతం పట్టణంలోని పలువార్డుల్లో పక్కా గృహాలకు సరైన ఇంటి నెంబర్లు లేకపోవడంతో పరిస్థితి గందరగోళంగా ఉందన్నారు. జీఐఎస్ సర్వే చేపట్టడం ద్వారా పాతనెంబర్ల స్థానంలో ప్రతి ఇంటికి కొత్త నెంబర్‌ను ఏర్పాటు చేయడం వల్ల శాలిలైట్ సిస్టమ్ ద్వారా ఇంటి కొలతలు, నిర్మాణాలను, పరిసరాల భౌగోళిక పరిస్థితులను తెలుసుకోవచ్చునన్నారు. దీనివలన ప్రస్తుతం ఉన్న ఇళ్లకు పన్నులు పెరగడం కానీ, తగ్గడం కానీ తేడాలు ఉండవన్నారు. కౌన్సిలర్లు ఆయా వార్డుల ప్రజలకు అవగాహన కల్పించి జీఐఎస్ సర్వేకి సహకరించాలని కోరారు. కార్యక్రమంలో కోఆప్షన్ సభ్యుౖ సల్లావుద్దీన్, పర్యావరణ ఇంజనీరు రవి, ఆర్‌వో రామక్రిష్ణ, ఆర్ఐ మాసుమ్‌బాషా, కౌన్సిలర్లు పాల్గొన్నారు.

అధ్వానంగా గ్రామీణ రోడ్లు

- కంకర లేచిన చెరువుముందరపల్లె రోడ్డు



కంకర లేచి గుంతలు ఏర్పడ్డ చెరువు ముందరపల్లె రోడ్డు

అధ్వాన స్థితిలో చెరువుముందరపల్లె రోడ్డు

రామాపురం: మండలంలోని చిట్లూరు పంచాయతీ చెరువుముందరపల్లెకు వెళ్లే రోడ్డు చాలా అధ్వానంగా ఉందని గ్రామస్తులు వాపోతున్నారు. చిత్తూరు-కర్నూలు జాతీయ రహదారి నుంచి చెరువుముందరపల్లె మీదుగా లక్కిరెడ్డిపల్లె వరకు ఉన్న రహదారిలో సుమారు 6 కిలోమీటర్ల పొడవునా రోడ్డు కంకర లేచి గుంతలు ఏర్పడి నడవడానికి, ఎడ్లబండ్లు, వాహనాలు వెళ్లాలన్నా దుర్భరంగా మారిందని గ్రామస్తులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఈ రహదారి మరమ్మతుల విషయమై పలుమార్లు పాలకులు, అధికారుల దృష్టికి తీసుకెళ్లినా పట్టించుకోలేదని ఆరోపిస్తున్నారు. నిత్యం లక్కిరెడ్డిపల్లె మండలం ఈడిగపల్లె, చవటపల్లె, వడ్డెపల్లె, గంగమ్మజాతర తదితర గ్రామాల నుంచి కడప... ఇలా పట్టణాలకు కూరగాయలు తీసుకెళ్లాలంటే కష్టంగా ఉందని వాపోతున్నారు. అత్యవసర పరిస్థితుల్లో, ప్రసవాలను వెళ్లాలన్నా అంబులెన్స్ వచ్చే పరిస్థితి కూడా లేదన్నారు. సంబంధిత అధికారులు వెంటనే రోడ్డు మరమ్మతులు చేపట్టాలని గ్రామస్తులు కోరుతున్నారు.

కూలీల సంఖ్య పెంచాలి



పనులను పరిశీలిస్తున్న ఏపీడీ శివప్రసాద్

లక్కిరెడ్డిపల్లె: వర్షాలు సకాలంలో కురవడం లేదని, కూలీల సంఖ్య పెంచి వారికి పనులు కల్పించాలని ఏపీడీ శివప్రసాద్ పేర్కొన్నారు. శుక్రవారం లక్కిరెడ్డిపల్లె, దేవళంపల్లె, దిన్నెపాడు జెడ్పీబాలుర పాఠశాలల్లో ఆట స్థలాల పనులను పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ త్రోబాల్, కబడ్డీ, బ్యాడ్మింటన్ ఆటల కోసం ప్రతి ఒక్క పాఠశాలకు రూ.2 లక్షల చొప్పున మంజూరైందని, వీటిని తొందరలో పూర్తి చేయాలని ఉపాధి సిబ్బందిని ఆదేశించారు. అలాగే లక్కిరెడ్డిపల్లె మండలంలో 2 వేలకు పైగా ఫారంపాండు పనులు లక్ష్యంగా పెట్టుకున్నామని, ప్రస్తుతం 1500కుపైగా పూర్తి చేశామన్నారు. ఆరు వారాల నుంచి బిల్లులు రాలేదని కూలీలు ఏపీడీని అడుగగా నిధులు లేవని, వారం లోపు బిల్లులు మొత్తం చెలిస్తామని కూలీలకు తెలిపారు. కార్యక్రమంలో టీఏ నాగభూషణ్, ఎఫ్ఏ బాబ్‌జాన్ పాల్గొన్నారు.

సంపద సృష్టి కేంద్రాలను వెంటనే ఏర్పాటు చేయాలి

చిన్నమండెం: ప్రతి పంచాయతీలో చెత్త నుంచి సంపద సృష్టి కేంద్రాలను వెంటనే ఏర్పాటు చేయాలని ఎంపీడీఓ వెంకటరమణారెడ్డి, తహశీల్దార్ మల్లికార్జున పేర్కొన్నారు. చిన్నమండెం ఎంపీడీఓ కార్యాలయ సభాభవనంలో శుక్రవారం మండలంలోని అన్ని పంచాయతీల కార్యదర్శులకు, ఉపాధి సిబ్బందికి సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ మండలంలో ప్రతి పంచాయతీ చెత్తను తడిచెత్త, పొడి చెత్తలుగా సేకరించి వాటి నుంచి ఆదాయం తీసే మార్గాలను వెతకాలన్నారు. ఇందుకు ఎస్‌డబ్ల్యూఎం కేంద్రాలకు స్థలాల సమస్య ఉందని, రెవిన్యూ అధికారులు స్థలాలు చూపడం లేదని పంచాయతీ కార్యదర్శులు ఆరోపించారు. త్వరగా స్థలం కేటాయిస్తే సంపద తయారీ కేంద్రాలు ఏర్పాటు చేస్తామన్నారు. కార్యక్రమంలో ఈఓపీఆర్‌డీ పద్మావతమ్మ, పంచాయతీ కార్యదర్శులు, వీఆర్వోలు, సర్పంచ్‌లు, ఉపాధి సిబ్బంది, తదితరులు పాల్గొన్నారు.

10, 11వ తేదీల్లో కార్పొరేషన్ రుణాలకు ఇంటర్వ్యూలు

రామాపురం: మండలంలో ఈనెల 10, 11వ తేదీల్లో ఎస్సీ, ఎస్టీ, బీసీ, కాపు కార్పొరేషన్ల రుణాలకు ఇంటర్వ్యూలు నిర్వహిస్తున్నట్లు ఎంపీడీవో అబ్దుల్ రహీం తెలిపారు. 10న ఉదయం బండపల్లె, కుమ్మరపల్లె పంచాయతీల్లో ఎస్‌బీఐ రాయచోటి బ్రాంచ్, మధ్యాహ్నం 2 గంటల నుంచి ఏపీజీబీ రామాపురం పరిధిలోని నల్లగుట్టపల్లె, సరస్వతీపల్లె, రాచపల్లె, చిట్లూరు, హసనాపురం, సుద్దమళ్ల, 11న ఎస్‌బీఐ రామాపురం బ్రాంచ్ పరిధిలోని గువ్వలచెరువు, కల్పనాయునిచెరువు, కసిరెడ్డిగారిపల్లె, గోపగుడిపల్లె అభ్యర్థులకు ఇంటర్వ్యూలు ఉంటాయన్నారు. దరఖాస్తు చేసుకున్న అభ్యర్థులు తమ ఒరిజినల్ సర్టిఫికెట్లతో హాజరుకావాలని కోరారు.

వ్యర్థ పదార్థాలతో సంపద సృష్టించుకోవచ్చు

రామాపురం: ఘన వ్యర్థ పదార్థాలతో గ్రామ పంచాయతీలు సంపద సృష్టించుకోవచ్చునని డ్వామా ఏపీడీవో శివప్రసాద్ అన్నారు. స్థానిక ఎంపీడీవో కార్యాలయంలో శుక్రవారం సర్పంచ్‌లు, ఉపాధి సిబ్బందితో సమావేశం నిర్వహించారు. ఈ సమావేశంలో ఆయన మాట్లాడుతూ పంచాయతీల్లో తప్పక డంపింగ్‌యార్డు షెడ్లు నిర్మించుకోవాలన్నారు. ఇందుకోసం పంచాయతీ పరిధిలో స్థల సేకరణ చేసుకోవాలన్నారు. డంపింగ్‌యార్డు నిర్మాణంలో ఉపాధి హామీ సిబ్బంది సహకారం అందజేస్తారన్నారు. కార్యక్రమంలో ఎంపీడీవో అబ్దుల్‌రహీం, ఈవోపీఆర్‌డీ శ్రీనివాసరెడ్డి, ఏపీవో పెంచలయ్య, సర్పంచ్‌ల సంఘం అధ్యక్షుడు నాగభూషణ్‌రెడ్డి, సర్పంచులు, ఈసీలు, టీఏలు, ఎఫ్‌ఏలు పాల్గొన్నారు.

ఎంఆర్ టీకా విద్యార్థులకు ఆరోగ్య ప్రదాయణి

గాలివీడు: ఎంఆర్ టీకా విద్యార్థులకు ఆరోగ్య ప్రదాయణిలా పని చేస్తాయని రాయలసీమ పాఠశాల ప్రధానోపాధ్యాయుడు సుబ్బారెడ్డి పేర్కొన్నారు. శుక్రవారం ఆరోగ్య సిబ్బంది పాఠశాల విద్యార్థులకు ఎంఆర్ టీకాలు వేశారు. మిజిల్స్, రుబెల్లా వ్యాధులు రాకుండా ప్రభుత్వం ఎంఆర్ టీకా కార్యక్రమం చేపట్టడం అభినందనీయమని హెచ్‌యం పేర్కొన్నారు. కార్యక్రమంలో పాఠశాల గౌరవ సలహాదారు నరసింహారెడ్డి, ఆరోగ్య సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

రెవెన్యూ గ్రామసభను సద్వినియోగం చేసుకోండి

గాలివీడు: ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన రైతు సేవలో రెవెన్యూశాఖ కార్యక్రమాన్ని రైతులు సద్వినియోగం చేసుకోవాలని తహసీల్దార్ భవానీ పేర్కొన్నారు. శుక్రవారం ఎగువగొట్టివీడు గ్రామ పంచాయతీ కార్యాలయంలో రెవెన్యూ గ్రామ సభను నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ చుక్కల పట్టాల భూములకు ప్రభుత్వం మీసేవ ద్వారా సవరణకు చర్యలు చేపట్టిందన్నారు. రెవెన్యూ భూ సమస్యలపై రైతులు కార్యాలయాల చుట్టూ తిరగకుండా అధికారులు రైతుల చెంతకు వచ్చి సమస్యలు పరిష్కరించడం జరుగుతుందన్నారు. కార్యక్రమంలో ఆర్ఐ వినీత్‌కుమార్‌రెడ్డి, సర్వేయర్ బాలాజీ, వీఆర్‌వో శ్రీనివాసులు, మీసేవ నిర్వాహకులు సుధాకర్ రెడ్డి, తదితరులు పాల్గొన్నారు.


సాయివిద్యానికేతన్ హైస్కూలులో ఎంఆర్ వ్యాక్సిన్ వేస్తున్న డిప్యూటీ డీఎంహెచ్ఓ నాగరాజు

గుంతలమయమైన రోడ్లు.. వెలగని వీధి లైట్లు

ఈదుళ్లపల్లె ఎస్సీ కాలనీలో పేరుకుపోయిన సమస్యలు

పోరుమామిళ్ల : ఆ కాలనీలో దాదాపు 200 కుటుంబాలకుపైగా దళితులు నివాసం ఉంటున్నారు. కొన్ని వీధుల్లో సిమెంట్ రోడ్లు, డ్రైనేజీకాలువలు లేకపోవడంతో రోడ్లన్నీ గుంతలమయమయ్యాయి. కనీసం వీధిలై ట్లు కూడా లేవని ఆ కాలనీ వాసులు వాపోతున్నారు. దమ్మనపల్లె పంచాయతీ పరిధిలోని ఈదుళ్లపల్లె ఎస్సీకాలనీలో ప్రాథమిక పాఠశాల ఉన్న వీధిలో రోడ్లులేక పోవడంతో ఆ ప్రాంతమంతా గుంతలమయమైంది. వర్షం వస్తే గుంతల్లో మోకాళ్లలోతు నీరు నిల్వ ఉంటోందని వాపోతున్నారు. కనీసం డ్రైనేజీ కాలువలు కూడా లేకపోవడంతో మురుగునీరు వెళ్లే అవకాశం లేక వీధుల్లో నిలుస్తోందని ఆ కాలనీకి చెందిన మహిళలు వాపోతున్నారు. తమ వీధిలో వేసే వీధిలైట్లు కూడా వెలగడం లేదంటున్నారు. ఇప్పటికైనా పంచాయతీ అధికారులు స్పందించి కాలనీలో నెలకొన్న సమస్యలను పరిష్కరించాలని కోరుతున్నారు.



అధ్వానంగా ఉన్న ఈదుళ్లపల్లె ఎస్సీకాలనీ రోడ్డు, డ్రైనేజీ కాలువలు లేకపోవడంతో నీరు నిల్వ ఉన్న ప్రాంతం

బాల్యానికి భరోసా ఎంఆర్ వ్యాక్సిన్

బద్వేలు టౌన్ : తట్టు, రూబెల్లా వంటి ప్రాణాంతకరమైన వ్యాధుల నుంచి చిన్నారులకు పూర్తిరక్షణ కల్పించే ఎంఆర్ వ్యాక్సిన్ బాల్యానికి భరోసా అని డిప్యూటీ డీఎంహెచ్ఓ నాగరాజు అన్నారు. శుక్రవారం పట్టణంలోని సాయివిద్యానికేతన్ హైస్కూలులో 1600 మంది విద్యార్థినీ విద్యార్థులకు ఎంఆర్ వ్యాక్సిన్ అందించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ తట్టు, రూబెల్లా వ్యాధులను దూరం చేయాలంటే తప్పనిసరిగా ఎంఆర్‌టీకా వేయించుకోవాలన్నారు. కార్యక్రమంలో తొట్టిగారిపల్లె ప్రాథమిక వైద్యాధికారి చంద్రహాస్‌రెడ్డి, డాక్టర్ ప్రశాంతి, వెంకటయ్య, సాయివిద్యానికేతన్ కరెస్పాండెంట్ శంకర్‌రెడ్డి, డైరెక్టర్ విజితారెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

ఎంఆర్‌టీకాను ప్రతి చిన్నారికి వేయాలి

గోపవరం : ప్రాణాంతక వ్యాధుల నుంచి రక్షణ కల్పించేందుకు రాష్ట్ర ప్రభుత్వం ఎంఆర్ టీకాను ప్రవేశపెట్టిందని మండల వైద్యాధికారి డాక్టర్ ప్రశాంతి పేర్కొన్నారు. శుక్రవారం గోపవరం గ్రామంలో 9నెలల నుంచి 15సంవత్సరాలలోపు పిల్లలందరికీ ఎంఆర్‌టీకాను వేసే కార్యక్రమాన్ని నిర్వహించారు. కార్యక్రమంలో హెల్త్‌సూపర్‌వైజర్ ఉదయ్‌భాస్కర్, వైద్య సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

ఎంఆర్‌టీకా ఉపయోగకరం

బి.కోడూరు : మండల పరిధిలోని విద్యార్థులందరికీ ఎంఆర్‌టీకా వేస్తున్నామని, దీని వలన తట్టు, రూబెల్లా వంటి ప్రాణాంతకరమైన వ్యాధులు దరిచేరవని వైద్యాధికారి శివక్రిష్ణ పేర్కొన్నారు. శుక్రవారం మండల పరిధిలోని కస్తూర్బాగాంధీ పాఠశాలలో విద్యార్థినులకు ఎంఆర్ టీకాలు వేశారు. అనంతరం విద్యార్థినులతో ర్యాలీ నిర్వహించారు. కార్యక్రమంలో పాఠశాల ప్రిన్సిపాల్ అనూష, ఎంపీహెచ్ఓ నరసింహారెడ్డి, అంగన్వాడీ కార్యకర్తలు, ఆశాకార్యకర్తలు, వైద్య సిబ్బంది పాల్గొన్నారు.

రెవెన్యూ సమస్యలు పరిష్కరించండి


రెవెన్యూ సదస్సులో మాట్లాడుతున్న జడ్పీటీసీ శారదమ్మ

పోరుమామిళ్ల : వచ్చే రెవెన్యూ సదస్సులకైనా రైతుల సమస్యలను పరిష్కరించాలని జడ్పీటీసీ సభ్యురాలు దేశాయి శారదమ్మ పేర్కొ న్నారు. శుక్రవారం మండలంలోని చిన్నఎరసాలలో గ్రామ రెవెన్యూ సద్సు నిర్వహించారు. సదస్సులో రైతులు తమ సమస్యలను పరిష్కరిచండలో రెవెన్యూ అధికారులు నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నారన్నారు. రేషన్‌కార్డులు మంజూరైనా అవిపూర్తిస్థాయిలో అమలు కావడం లేదన్నారు. ఆన్‌లైన్‌కు సంబంధించి కార్యాలయం చుట్టూ తిరుగుతున్నా అధికారులు పట్టి ంచుకోవడం లేదని ప్రజలు తమ నిరసన గళాన్ని వెలిఉచ్చారు. ఈసం దర్భంగా జడ్పీటీసీ శారదమ్మ మాట్లాడుతూ రెవెన్యూ సదస్సులు రైతుల సమస్యల పరిష్కారం కోసం ఏర్పాటు చేశారని, ఎన్నిసార్లు సదస్సులు జరిగినా రైతుల సమస్యలు పరిష్కారం కాకపోవడం శోచనీయమన్నారు. ఇప్పటికైనా రెవెన్యూ అధికాధికారులు సమస్యలను పరిష్కరించాలన్నారు.

పోరుమామిళ్లలో తేలికపాటి వర్షం

పోరుమామిళ్ల : పట్టణంలో శుక్రవారం తేలికపాటి వర్షం కురిసింది. శుక్రవారం 3.30 గంటల సమయంలో కురసి ఈ వర్షానాకి గాండ్లవీధి, ముస్లింకోటవీధి, కొత్తవీధి, మహాత్మగాంధీ విగ్రహం సర్కిల్, వెంకటేశ్వరస్కూలు తదితర ప్రాంతాల్లో వర్షపునీరు చేరి బాటసారులకు ఇబ్బంది కలిగించింది. మంచి పదునైన వర్షం కుసి ఉంట బాగుండేదని రైతులు పేర్కొన్నారు.

ప్రజా సమస్యలను వెంటనే పరిష్కరించాలి


సమావేశంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే జయరాములు

బద్వేలు : గ్రామాల్లో నెలకొన్న ప్రజాసమస్యలను వెంట నే పరిష్కరించాలని, అధికారులు నిర్లక్ష్యం వహిస్తే చర్యలు తప్పవని ఎమ్మెల్యే జయరాములు ఆగ్రహం వ్యక్తం చేశారు. శుక్రవారం పట్టణంలోని ఆర్అండ్‌బీ అతిథిగృహంలో కొన్ని గ్రామాలకు సంబంధించిన ప్రజలు తమ గ్రామాల్లో నెలకొన్న సమస్యలను ఎమ్మెల్యే దృష్టికి తెచ్చారు. మన్యంవారిపల్లెలో 45రోజుల నుంచి తాగునీరు అం దించాలని అధికారులకు విన్నవించుకున్నా ఫలితం లేదన్నారు. తిరువెంగళాపురంలో నీటి బోరుకు మోటారును అమర్చాలని 40రోజుల నుంచి అధికారులకు తెలియజేసినప్పటికీ పట్టించుకోవడం లేదని ఎమ్మెల్యేకు విన్నవించుకున్నారు. ఇందుకు స్పందించిన ఎమ్మెల్యే అధికారుల తీరుపై మండిపడ్డారు. నీటి సమస్యను పరిష్కరించలేనప్పుడు ఎందుకు ఉద్యోగాలు చేస్తున్నారని, ప్రజలు మీ వద్దకు సమస్యలు తెచ్చినప్పుడు ఇన్ని రోజులు అవుతున్నా ఉలుకూ పలుకూ లేకుండా ఉండటం సరైన పద్ధతి కాదన్నారు. రెండు మూడు రోజుల్లో నీటి సమస్యను పరిష్కరించాలని, లేకుంటే సహించేది లేదని ఆయన ఆగ్రహం వ్యక్తం చేశారు. కాగా మున్సిపాలిటీ తెలియకుండా రూములను ఎవరికీ వేలం వేయడం సరైంది కాదని, అందరినీ కలిసే విధంగా రూములకు వేలం పాటలు వేయాలని ఎమ్మెల్యే ఎంపీడీఓకు సూచించారు. కార్యక్రమంలో టీడీపీ నాయకులు కొంకుల రాంబాబు, మునిరెడ్డి, రవి, వేణు, పుష్పరాజు, తదితరులు పాల్గొన్నారు.

గ్రామసభలను సద్వినియోగం చేసుకోవాలి


రైతు సమస్యలు తెలుసుకుంటున్న తహసీల్దార్ మాధవక్రిష్ణారెడ్డి

బద్వేలు టౌన్ : గ్రామాల్లో నిర్వహిస్తున్న రెవిన్యూ గ్రామసభలను రైతులు సద్వినియోగం చేసుకోవాలని తహసీల్దార్ మాధవక్రిష్ణారెడ్డి అన్నారు. శుక్రవారం మండల పరిధిలోని తిరువేంగళాపురం గ్రామంలో రైతుసేవలో రెవెన్యూశాఖ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ రైతుల భూముల వివరాల్లో తప్పులు సవరించుకోవాలన్నారు. వెబ్‌ల్యాండ్‌లో ఉన్న భూమి వివరాల్లో తప్పులు సరిచేసుకునేందుకే రైతుసేవలో రెవిన్యూ కార్యక్రమం ఎంతగానో ఉపయోగపడుతుందన్నారు.

ఇంటిస్థలాల కోసం దరఖాస్తు చేసుకోండి

పోరుమామిళ్ల : ఇంటిస్థలాలు లేని నిరుపేదలు ఇంటిస్థలం కోసం దరఖాస్తులు చేసుకోవాలని పోరుమామిళ్ల తహసీల్దార్ శేషారాంసింగ్, ఆర్ఐ దక్షణామూర్తి తెలిపారు. ఇంటిస్థలం కోసం దరఖాస్తు చేసుకునే వారు స్థానిక తహసీల్దార్ కార్యాలయంలో దరఖాస్తులు అందజేయాలన్నారు. శుక్రవారం ఎరసాల పంచాయితీలో జరిగిన రెవెన్యూ సదస్సులో ప్రజల నుంచి 46మంది రైతులు తమ సమస్యలకు సంబంధించి దరఖాస్తులు చేసుకున్నారన్నారు. వాటిని పరిశీలించి పరిష్కారం చేస్తామని వారు తెలిపారు.

సినిమా గైడ్

బద్వేలు	
శేఖర్	: గౌతమ్‌నంద
నౌషాద్	: ఫిదా
లక్ష్మీనరసింహ	: నిన్నుకోరి
పోరుమామిళ్ళ	
వెంకటేశ్వర	: ఫిదా
దేశాయి	: గౌతమ్‌నంద

బద్వేలు ప్రభుత్వాసుపత్రి కమిటీ చైర్మన్‌గా అశోక్‌కుమార్‌రాజు

బద్వేలు : బద్వేలు ప్రభుత్వాసుపత్రి కమిటీ చైర్మన్‌గా గౌనిపురం అశోక్‌కుమార్‌రాజును నియమించారు. ఈ మేరకు కలెక్టర్ బాబూరావునాయుడు నుంచి ఉత్తర్వులు జారీ చేశారు. ఈసందర్భంగా అశోక్ కుమార్ రాజు మాట్లాడుతూ నాపై ఎంతో నమ్మకంతో ఈ పదవికి ఎంపిక చేసినందుకు ఆసుపత్రి అభివృద్ధికి శక్తివంచన లేకుండా కృషి చేస్తానన్నారు. ఆదివారం రోజు కమిటీ ప్రమాణస్వీకారం ఉంటుందని ఆయన తెలిపారు.



పేద విద్యార్థులకు చేయూతనిద్దాం



మాట్లాడుతున్న రాయలసీమ ఐజీ మహ్మద్ ఇక్బాల్, ఎస్పీ



నృత్యం చేస్తున్నవిద్యార్థిని, తిలకిస్తున్న విద్యార్థినులు

- దాతలు ముందుకు రావాలి
- సామాజిక సేవలో పోలీసు పాత్ర
- ఐజీ షేక్ మహమ్మద్ ఇక్బాల్

రాజుపాళెం: పేద విద్యార్థుల భవిష్యత్తుకు చేయూత, మౌలిక వసతులు కల్పనకు దాతలు ముందుకు రావాలని రాయలసీమ ఐజీ షేక్ ఇక్బాల్ పిలుపునిచ్చారు. శుక్రవారం వెల్లాల గ్రామంలోని ఏపీ సంక్షేమ గురుకుల పాఠశాలలో ఆయన విద్యార్థులతో ముచ్చటించారు. ఈ సమావేశంలో ఆయన మాట్లాడుతూ పేద విద్యార్థులు వారి ఎదుగుదలకు సహాయ సహకారాలు అందించాలని దాతలు, ప్రముఖులు అందరూ సామాజిక సేవ చేయాలని తెలిపారు. ప్రభుత్వ పాఠశాలలు, వసతి గృహాలు, వాటి అభివృద్ధి కొరకు ప్రతి ఒక్కరం కృషి చేయాలన్నారు. గతంలో ఈ పాఠశాలను సందర్శించినప్పుడు దాత లయన్ గుర్విరెడ్డి వాటర్ ప్లాంట్, కంప్యూటర్లు అందించారని సభాముఖంగా తెపారు. గురివిరెడ్డి ఐజీకి తెలియజేస్తూ ప్రతి ఏడాది మౌళిక వసతులకు లక్ష రూపాయలు అందిస్తానని ఆయనకు తెలిపారు. దీంతో గురువిరెడ్డి, సహకారాలు అందించిన స్థానిక ప్రజాప్రతినిధులకు అభినందనలు తెలిపారు. పోలీసులు అంటే శాంతి భద్రతలు, రక్షణే కాకుండా సామాజిక సేవ చేయాలని సూచించారు. ఎస్పీ అట్టాడా బాబూజీ మాట్లాడుతూ అమ్మాయిలు చదవడం ద్వారా గౌరవంతోపాటు దేశభవిష్యత్తు స్త్రీశక్తిపై ఆధారపడి ఉంటుందన్నారు. రెసిడెన్షియల్ పాఠశాలలో విద్యను అభ్యసించడం ద్వారా సమాజంలో కలిసి మెలసి ఉండడం, మంచి లక్షణాలు వస్తాయని, 5వ తరగతి నుంచి ఇంటర్ వరకు ఇక్కడ చదవడం ద్వారా విద్యార్థులు మంచి స్టాండెండ్ ఉంటుందన్నారు. విద్యార్థులకు ఒక క్లాస్‌టీచర్ మాదిగా మంచి మాటలు చెబుతూ వారి ఉత్తేజ పరిచారు. ముందుగా ఐజీ, ఎస్పీకి డప్పు వాయిద్యాలతో విద్యార్థులకు ఘనస్వాగతం పలికారు. మైదానంలో వారు మొక్కలు నాటారు. అనంతరం విద్యార్థులకు క్రీడలకు సంబందించిన కిట్లను అందించారు. ఈ కార్యక్రమంలో డీఎస్పీ భక్తవత్సలం, ప్రిన్సిపల్ శ్రీనివాసశాస్త్రి, సీఐ ఓబులేసు, ఎస్ఐలు శ్రీనివాసులు, శివరాం, పోలీసు సిబ్బంది పాల్గొన్నారు.

సినిమా గైడ్

ప్రొద్దుటూరు

సుధ :	గౌతమ్‌నంద
వెంకటేశ్వర :	నక్షత్రం
బీవీఎస్:	దువ్వాడ జగన్నాథమ్
ఆరవేటి:	నక్షత్రం
అర్చన :	సతీలీలావతి
చాంద్ :	అంధగాడు
సినీ హబ్: స్ర్కీన్-1:	ఫిదా
స్ర్కీన్ -2 :	దువ్వాడ జగన్నాథం
స్ర్కీన్ -3 :	వాసుకి

హలో.. ఆంధ్రజ్యోతి

Hello Andhra Jyothi

- మీకు సమస్యలుంటే ఈ కింది నంబర్లకు ఫోన్ చేసి సమాచారం ఇవ్వగలరు.
- ప్రొద్దుటూరు - 9985411190
- పుట్టపర్తి సర్కిల్, - 9000885325
- క్రైం - 9490633105
- కల్చరల్ - 9966349431
- టౌన్ - 9866885470
- ప్రొద్దుటూరు అర్బన్ -8341751401
- రాజుపాళెం - 9642093626

దొంగలను సంఘాల్లో కొనసాగిస్తారా-ఎండీ

ప్రొద్దుటూరు అర్బన్: ఎస్ఎల్ఎఫ్‌ల నుంచి లక్షలకు లక్షలు అడ్డదారుల్లో వాడుకున్న దొంగలను సంఘాల్లో ఎలా కొనసాగిస్తారని, తిరిగి మళ్లీ రుణాలు ఎలా మంజూరు చేశారని మెప్మా ఎండీ చిన్నతాతయ్య మెప్మా జిల్లా అధికారులపై ఆగ్రహించారు. శుక్రవారం ప్రొద్దుటూరులో మెప్మా జిల్లాస్థాయి సమీక్ష సమావేశంలో చిన్నతాతయ్య మున్సిపాలిటీల వారీగా వారి పురోగతిపై సమీక్షించారు. కడపలో 4 ఎస్ఎల్ఎఫ్‌లలో లక్షల రూపాయలు అక్రమాలు చోటు చేసుకున్నా ఒక్క రూపాయి కూడా వసూలు చేయకుండా ఒక్క కేసు కూడా ఆర్‌పీ సభ్యురాళ్లపై నమోదు చేయకుండా అంతా కుమ్మక్కయ్యారా అన్నారు. నాలుగేళ్లుగా పీడీగా ఉన్న వెంకటసుబ్బయ్య నీవు ఏం చేశావని ప్రశ్నించారు. స్త్రీనిధి ఎండీ ఎం.సి. అనితాదీప్తిపై కూడా తాతయ్య ఆగ్రహించారు. వారందరిపై క్రిమినల్ కేసులు పెట్టి జైలుకు పంపాలని కలెక్టరును కోరారు. ఐబి రమణ జిల్లాలో జీవనోపాదులను పెంచకుండా మాటలు చెప్పుకుని బతికి వెళ్లిపోయాడన్నారు. స్వయం ఉపాధి శిక్షణలో కూడా జిల్లాలోని 9 మున్సిపాలిటీల్లో పురోగతి లేదన్నారు. లైవ్‌లీహుడ్ యూనిట్ 44 వేలు జిల్లాలోని 9 మున్సిపాలిటీలకు టార్గెట్ ఇస్తే ఒక్క మున్సిపాలిటీలో కూడా చేయకపోవడం దారుణమన్నారు. నైట్‌షెల్టర్స్ ఏర్పాటులో కడప, ప్రొద్దుటూరు తప్ప మిగతా చోట్ల ఇంకా ప్రారంభించకపోవడంపై తీవ్రంగా తప్పుపట్టారు. కొత్తపీడీ రామ్మోహన్‌రెడ్డి చాలా కష్టపడాలన్నారు. అయితే ఈ సమీక్ష సమావేశానికి మెప్మా మాజీ పీడీ వెంకటసుబ్బయ్య పాల్గొనడంపై సిబ్బందితో పలు అనుమానాలు రేగుతున్నాయి. ఈ సమీక్షలో ఎండీ తాతయ్య కూర్చోపెట్టడంపై చర్చ జరుగుతుంది.

ప్రభుత్వ పథకాలు అర్హులకే అందాలి-బీజేపీ

ప్రొద్దుటూరు క్రైం: జన్మభూమి కమిటీలను రద్దు చేసి అధికారులతో విచారణ చేయించి అర్హులకే సంక్షేమ ఫలాలు అందేలా చర్యలు తీసుకోవాలని భారతీయ జనతాపార్టీ జిల్లా అధ్యక్షుడు శ్రీనాథరెడ్డి అన్నారు. శుక్రవారం స్థానిక వసంతపేటలోని శ్రీ చౌడేశ్వర కల్యాణ మండపంలో బీజేపీ సమావేశం జరిగింది. ఈ సందర్భంగా ఆయన మాట్లడుతూ ప్రభుత్వం జన్మభూమి కమిటీలను పునర్వ్యవస్తీకరించాలని తీసుకున్న నిర్ణయం సరికాదన్నారు. సమావేశంలో ఆ పార్టీ జిల్లా ప్రధాన కార్యదర్శి ద్వారం మహేష్‌రెడ్డి మాట్లాడుతూ ఇసుక విధానం లోపభూయిష్టంగా ఉందని, అక్రమంగా ఇసుక తరలించుకుపోతున్నారన్నారు. దీంతో భూగర్భజలాలు అడుగంటిపోతున్నాయన్నారు. రాష్ట్ర ప్రభుత్వం ఇసుకపై స్పష్టమైన విధానం తీసుకురావాలన్నారు.

ఉచితంగా కంటి చికిత్స

ఎర్రగుంట్ల: ఎర్రగుంట్ల ఐసీయల్ ఆధ్వర్యంలో 184మందికి ఉచితంగా కింటి పరీక్షలు శుక్రవారం నిర్వహించారు. 75మందికి కాటరాక్టు కంటి ఆపరేషన్లు చేసినట్లు అధికారులు తెలిపారు. అలాగే 109 మందికి వీపీ ఎంఆర్‌సింగ్ కంటి అద్దాలను సాయంత్రం ఉమామహేశ్వరాలయంలో పంపిణీ చేశారు.జీఎం సుబ్రమణ్యం,ఏజీఎం మున్వర్ పాల్గొన్నారు.

వరద కక్షసాధింపు ధోరణే కాలువకు అడ్డంకి-ఎమ్మెల్యే

ప్రొద్దుటూరుఅర్బన్: వరదరాజులరెడ్డి ప్రొద్దుటూరు ప్రజలకు నీళ్ల తేవడం కంటే ఆయన ప్రత్యర్థులను దెబ్బతీయడానికే వరద కాలువను వినియోగించుకుని కక్షసాధింపు దోరణితో వ్యవహరించడంవల్లే కాలువకు అడుగడుగునా అడ్డంకులు ఎదురవుతున్నాయని ఎమ్మెల్యే రాచమల్లు ప్రసాద్‌రెడ్డి తెలిపారు. శుక్రవారం స్థానిక వైసీపీ కార్యాలయంలో ఎమ్మెల్యే విలేకరులతో మాట్లాడుతూ వరదరాజులరెడ్డి ఆరోపించినట్లు రైతులతో కోర్టులో కేసు వేయించాననడం పచ్చి అబద్ధమన్నారు. ఇందుకోసం నా బిడ్డల మీద కూడా ప్రమాణానికి సిద్దమన్నారు. వరదరాజులరెడ్డి రాజకీయ ఆర్థిక ప్రయోజనాలకు రైతుల ఆర్థిక నష్టానికి మధ్య జరుగుతున్న వైరంగా కుందూ పెన్నా కాలువను అభివర్ణించారు. ప్రజలకు నీళ్లివ్వాలని దివంగత ముఖ్యమంత్రి వైఎస్ మంజూరు చేసిన పథకం కుందూ-పెన్నా వరద కాలువ అన్నారు. ఆ కాలువకు తాను వ్యతిరేకించలేదని వరదరాజులరెడ్డి తన రాజకీయ ప్రయోజనాలకోసం కాలువ అలైన్‌మెంట్ మార్చడం వల్లే రైతుల్లో నమ్మకం కోల్పోయి వ్యతిరేకిస్తున్నారన్నారు. వరద కాలువ టెండర్లలో ఆనాడు, ఈనాడు వరదరాజులరెడ్డే దక్కించుకున్నాడన్నారు. నీళ్లురాని కాలువకు కాంట్రాక్టరు నీవే కాలువ ద్వారా ఆదాయం వచ్చినా నీళ్ల వచ్చినా నీకే మేలు జరిగేది. కాలువ ఆగిపోతే అది మాపై దొబ్బి తప్పించుకుంటావా అని ఎద్దేవా చేశారు. నాలుగు రూకలకోసం నాలుగు ఓట్ల కోసం కక్కుర్తిపడేవాన్ని కాదని, నేను చూడని డబ్బు కాదు, నేను చూడని పదవి కాదు అని వరదరాజులరెడ్డి తెలుసుకుంటే మంచిదన్నారు.

భక్తిశ్రద్ధలతో వరలక్ష్మీవ్రతం

ప్రొద్దుటూరు టౌన్: వరలక్ష్మివ్రతం సందర్భంగా పట్టణంలోని ఆలయాల్లో వరలక్ష్మివ్రతంను వైభవంగా నిర్వహించారు. శ్రీవాసవీ కన్యకాపరమేశ్వరి దేవి ఆలయంలో అమ్మవారిని బంగారు చీరతో అలంకరించారు. ఆర్యవైశ్య మహిళలు వరలక్ష్మివ్రతం ఆచరించి అమ్మవారికి మంగళహారతులు, పసుపుకుంకుమ, దీపాలు, నైవేద్యంతో అర్చించారు. తమను సుమంగళిగా చూడాలని, కోరిన కోర్కెలు తీర్చాలని వేడుకున్నారు. అధిక సంఖ్యలో ఆర్యవైశ్య మహిళలు వరలక్ష్మీవ్రతంలో పాల్గొన్నారు.

● వైఎంఆర్ కాలనీలోని సరస్వతి విద్యామందిరంలో సామూహిక వరలక్ష్మివ్రతం నిర్వహించారు. వరలక్ష్మీవ్రతం వల్ల కలిగే శుభాలు గురించి వ్రత విశిష్టత గురించి అర్చకులు వివరించారు.

రాజుపాళెంలో...

ప్రముఖ పుణ్యక్షేత్రమైన శ్రీ చెన్నకేశవ, సంజీవరాయస్వామి జ్ఞాన మందిరంలో శుక్రవారం వరలక్ష్మివ్రతాన్ని వైభవంగా నిర్వహించారు. అమ్మవారికి పూలతో ప్రత్యేక అలంకరణలు చేసి అర్చకుల వేద మంత్రాలతో ఈ వరలక్ష్మి వ్రతాన్ని నిర్వహించారు. చుట్టుపక్కల గ్రామాల నుంచి అధిక సంఖ్యలో మహిళలు పాల్గొన్నారు. ఈ కార్యక్రమంలో ఈవో మద్దిలేటి, చైర్మన్ దుద్యాల చంద్రశేఖర్‌రెడ్డి, గోపల్లె సుబ్బిరెడ్డి, రామసుబ్బారెడ్డి తదితరులు పాల్గొన్నారు.



బంగారు చీరలో వాసవీమాత



రాజుపాళెంలో వరలక్ష్మీ వ్రతం

రైతు సమస్యలను పరిష్కరించండి

రాజుపాళెం: రైతు భూ సమస్యలను సత్వరమే పరిష్కరించాలని జిల్లా కలెక్టర్ బాబూరావునాయుడు ఆదేశించారు. శుక్రవారం టంగుటూరు గ్రామంలోని రైతు సేవలో రెవెన్యూ శాఖ గ్రామసభలో ఆయన పాల్గొన్నారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ రైతులు సమస్యలను వెంటనే పరిష్కరించాలని సూచించారు. హౌసింగ్ పల్స్ సర్వేను త్వరగా పూర్తి చేసి లబ్ధిదారుల జాబితాను అందించాలని హౌసింగ్‌వారికి ఆదేశించారు.

సీఎంపై జగన్ వ్యాఖ్యలు అహంకారపూరితం-వరద

ప్రొద్దుటూరు పుట్టపర్తి సర్కిల్: సీఎం చంద్రబాబునాయుడుపై నంద్యాల బహిరంగ సభలో ప్రతిపక్షనేత వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి చేసిన వ్యాఖ్యలు అహంకారపూరితంగా ఉన్నాయని ప్రొద్దుటూరు నియోజకవర్గం తెలుగుదేశం పార్టీ ఇన్‌ఛార్జి, స్థానిక మాజీ ఎమ్మెల్యే నంద్యాల వరదరాజులరెడ్డి శుక్రవారం ఒక పత్రికా ప్రకటనలో ఖండించారు. రాజకీయాల్లో, ప్రజాస్వామ్యంలో ఇటువంటివి తగదన్నారు. సాక్షాత్తు రాష్ట్ర ముఖ్యమంత్రిని పట్టుకుని నడిరోడ్డులో కాల్చిచంపాలని జగన్ పిలుపునివ్వడం ఆయన హత్యా రాజకీయలను వెల్లడిస్తోందన్నారు. సీఎం హత్యకు జగన్ కుట్ర పన్నాడన్నారు. సీఎం పదవి కోసం జగన్ ఎంతకైనా తెగిస్తాడన్నారు.

అక్రమార్కులకు అడ్డా.. పాత ఐవోసీ ప్రాంగణం

● పట్టించుకోని అధికారులు, పోలీసులు



ఖాళీ మద్యం బాటిళ్లు



ఐవోసీ లోపల వున్న భవనం

కడప, ప్రకాష్‌నగర్ : ఆ దారిన వెళ్లాలంటే మహిళలు భయభ్రాంతులకు గురవుతున్నారు. నిత్యం మద్యంబాబులు, మట్కా నిర్వాహకులు, ప్రేమజంటలు అధికంగా కనిపిస్తుంటారు. ఈ దారిలో వీధిలైట్లు లేకపోవడంతో మద్యంబాబులకు విడిదిగా ఏర్పాటైంది. ప్రశ్నించే వారు లేకపోవడంతో అక్రమార్కులకు కలిసొచ్చింది. దీంతో గత రెండేళ్లుగా ఈ ప్రాంతం ఆకతాయిలకు అక్రమార్కులకు అడ్డాగా మారిందని చెప్పవచ్చు.

కడప రైల్వేస్టేషన్ పక్కనే వున్న పాత ఐవోసీ ప్రాంగణం అక్రమాలకు నిలయంగా మారింది. గత రెండేళ్ల క్రితం ఐవోసీ, హెచ్‌పీసీఎల్ కంపెనీలు సిద్ధవటం పరిధిలో భాకరాపేట, చిత్తూరు జిల్లాకు మార్చడం జరిగింది. దీంతో పాత ఐవోసీ ప్రాంగణం భారీగా వున్నది. అధికారులు ఆ ప్రాంగణాన్ని నిర్లక్ష్యంగా వదిలేయడంతో అక్రమార్కులకు నిలయంగా మారింది. మద్యం సేవించాలన్నా, మట్కా స్లిప్పులు రాయాలన్నా, గంజాయి దమ్ము బిగించాలన్నా, ప్రేమికులు సరదాగా గడపాలన్నా అక్కడికి చేరుకుంటారు. పచ్చని చెట్లు, విశాలమైన ప్రదేశం, చుట్టూ ప్రహారీగోడ



పాత ఐవోసీ ప్రాంగణం

వుండడం అన్ని వ్యసనాలకు విడిదిగా మారింది. రైల్వేస్టేషన్ పక్కనే వుండడంతో ప్రయాణికులు ఈదారిలోనే అనేక మంది వెళుతుంటారు. ఇండస్ట్రియల్ ఎస్టేట్, శివానందపురం, రామాంజనేయపురం, సరోజనీనగర్, పుట్లంపల్లె గ్రామాల నుంచి రైల్వేస్టేషన్‌కు రావాలంటే ఈ దారిలోనే వెళ్లాల్సి వుంది. చెట్ల కింద, ప్రహారీగోడ లోపలి ప్రాంతంలో ఆకతాయిలు, మద్యంబాబులు నిత్యం దర్శనమిస్తుంటారు. ఏ సమయంలో ఏ అఘాయిత్యం జరుగుతుందోనని ప్రజలు భయభ్రాంతులకు గురవుతున్నారు. మేరీ నగర్ నుంచి రైల్వేస్టేషన్ వరకు వీధిలైట్లు లేకపోవడంతో ఆ ప్రాంతమంతా అంధకారంగా మారింది. రైల్వే అధికారులు స్టేషన్ ప్రాంగణం వద్ద వాహనాలు వెళ్లకుండా కమ్మీలు బిగించారు. దీంతో ద్విచక్ర వాహనాలు తప్ప ఆ ప్రాంతంలోకి పెద్ద వాహనాలు వెళ్లేందుకు వీలులేదు. దీంతో పోలీసు వాహనాలు కూడా వెళ్లేందుకు వీలు లేకుండా పోయింది. దీంతో ఆకతాయిలు ఆడిందే ఆట పాడిందే పాటగా మారింది. అధికారులు, పోలీసులు కానీ పట్టించుకోవడం లేదన్న విమర్శలు వినవస్తున్నాయి. ఇప్పటికైనా రైల్వే, పోలీసు అధికారులు ప్రయాణికులు సమస్యలను దృష్టిలో వుంచుకొని ఆకతాయిల, మద్యంబాబుల భరతం పడితే ప్రయాణికులు ఎలాంటి సమస్యలు లేకుండా గమ్యస్థానాలకు చేరుకుంటారు. లేనిపక్షంలో ఏదో ఒకరోజు అఘాయిత్యం జరగకపోదు.

10న నిధి ఆప్‌కేనికట్

కడప, అర్బన్: ప్రావిడెంట్ ఫండ్ పెన్షనర్లకు సంబంధించి సమస్యల పరిష్కారానికి అనునిత్యం ఉద్యోగుల భవిష్యనిధి ప్రయత్నిస్తోంది. ఇందులో భాగంగా ప్రతి నెల 10వ తేదీన నిధి ఆప్‌కే నికట్ కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నట్లు రీజనల్ పీఎఫ్ కమిషనర్-2 బాలక్రిష్ణనాయక్ ఒక ప్రకటనలో తెలిపారు. సబ్‌స్ర్కైబర్ల కోసం ఉదయం 10.30 నుంచి మధ్యాహ్నం 1 గంట వరకు, ఎంప్లాయర్ల కోసం మధ్యాహ్నం 3 నుంచి సాయంత్రం 4 వరకు, ఎస్టాబ్లిష్‌మెంట్ ఎంప్లాయర్ల కోసం సాయంత్రం 4 నుంచి 5 గంటల వరకు నిర్వహిస్తున్నట్లు పేర్కొన్నారు. ఇందులో రీజనల్ కమిషనర్ -2 ఆఫీసర్ ఇన్‌ఛార్జి స్వయంగా ఫిర్యాదులు స్వీకరించి ప్రాధాన్యత క్రమంలో పరిష్కరిస్తారని పేర్కొన్నారు.

కానిస్టేబుల్ అభ్యర్థులు 6న హాజరుకావాలి

● ఎస్పీ అట్టాడ బాబూజీ

కడప, క్రైం: శిక్షణకు వెళ్లేందుకు ఎంపికైన కానిస్టేబుళ్ల అభ్యర్థులు ఈ నెల 6వ తేదీ ఉదయం 9 గంటలకు జిల్లా పోలీసు కార్యాలయంలో హాజరుకావాలని ఎస్పీ అట్టాడ బాబూజీ ప్రకటనలో పేర్కొన్నారు. అభ్యర్థులు సర్టిఫికెట్లతో పాటు తమ లగేజీలను తీసుకుని రావాలన్నారు. అభ్యర్థులకు కడప నుంచే శిక్షణ కేంద్రానికి తరలించనున్నట్లు పేర్కొన్నారు.

ఏపీపీఎస్‌సీ గ్రూప్-3 పరీక్షలకు

కట్టుదిట్టమైన ఏర్పాట్లు : డీఆర్‌ఓ

కడప, అర్బన్: ఈ నెల 6న (ఆదివారం) ఏపీ పబ్లిక్ సర్వీస్ కమిషన్ గ్రూప్-3 పరీక్షలలో ఎటువంటి పొరపాట్లు జరగకుండా కట్టుదిట్టమైన ఏర్పాట్లు చేయాలని డీఆర్‌వో నరసింహారావు అధికారులను ఆదేశించారు. ఆయన శుక్రవారం తన ఛాంబరులో పరీక్ష నిర్వహణపై సమీక్షించారు. పరీక్ష ఉదయం, మధ్యాహ్నం రెండు దఫాలుగా వుంటుందని, ఉదయం 9.30 నుంచి మధ్యాహ్నం 12.30 గంటల వరకు, మధ్యాహ్నం 3 నుంచి సాయంత్రం 5.30 గంటల వరకు నిర్వహిస్తున్నట్లు పేర్కొన్నారు. జిల్లాలో కడప, ప్రొద్దుటూరు, రాజంపేట, పులివెందులలో 15 పరీక్షా కేంద్రాలను ఏర్పాటు చేసినట్లు పేర్కొన్నారు. 2520 మంది అభ్యర్థులు పరీక్షకు హాజరుకానున్నట్లు చెప్పారు. పరీక్ష సమయానికంటే అభ్యర్థులు గంట ముందు కేంద్రానికి చేరుకొని బయోమెట్రిక్ ద్వారా హాజరు వేయించుకోవాలన్నారు. పరీక్ష సమయంలో కంప్యూటర్ హ్యాంగ్ అయినా ఇతర సాంకేతిక పర సమస్యలు వచ్చినా అభ్యర్థులు ఎలాంటి ఆందోళన చెందాల్సిన అవసరం లేదని అవసరమైతే పరీక్ష సమయాన్ని పొడిగిస్తామని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఏవో శ్రీనివాసులు, ఏపీపీఎస్‌సీ అధికారులు కుమార్‌రాజు, సాయిప్రకాష్, శేఖర్, డిప్యూటీ తహసీల్దార్లు, ప్రిన్సిపాల్స్, అధికారులు పాల్గొన్నారు.

మహిళలు వంటింట్లో జాగ్రత్తలు వహించాలి

పులివెందుల టౌన్: మహిళలు వంటింట్లో గ్యాస్ స్టౌ వద్ద జాగ్రత్తలు వహించాలని అగ్నిమాపక శాఖ అధికారి వెంకటచలపతి పేర్కొన్నారు. శుక్రవారం సీయోనుపురంలో ఆశవర్కర్లకు, డ్వాక్రా మహిళలకు అగ్నిప్రమాదాలపై అవగాహన చేపట్టారు. కార్యక్రమంలో ఆయన మాట్లాడుతూ వంటింట్లో గ్యాస్ స్టౌ వద్ద అదనపు నిండు సిలిండర్‌ను ఉంచరాదన్నారు. గ్యాస్ స్టౌ వద్ద వెలుతురు ఉండేలా చూసుకోవాలన్నారు. వంట అయిపోగానే సిలిండర్‌ను ఆఫ్ చేయాలన్నా రు. ఇంట్లో విద్యుత్, కిరోసిన్ స్టౌలు వెలిగించేటపుడు జాగ్రత్తలు పాటించాలన్నారు.

● వైభవోపేతంగా వరలక్ష్మీవ్రతం

వరాలు ఇచ్చే కల్పవల్లి.. వరలక్ష్మీ తల్లి...



వీరభద్రాలయంలో వరలక్ష్మి వ్రతం నిర్వహిస్తున్న ఆలయ ఈవో దంపతులు, హాజరైన మహిళలు

రాయచోటిటౌన్: హిందూ సంస్కృతి, సంప్రదాయాల్లో అత్యంత ముఖ్యమైన, ప్రధానమైన వరలక్ష్మి వ్రతాన్ని శుక్రవారం దక్షిణకాశీగా పిలువబడే భద్రకాళీ సమేత వీరభద్రాలయంలో వైభవోపేతంగా నిర్వహించారు. 800 మంది మహిళలతో సామూహికంగా నిర్వహించిన ఈ వరలక్ష్మి వ్రతంలో వరాలు ఇచ్చే కల్పవల్లి వరలక్ష్మిదేవి తల్లి అంటూ ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆలయ ప్రాంగణంలో ఏర్పాటు చేసిన ప్రత్యేక వేదికపై వేదపండితుల మంత్రోచ్చారణల మధ్య వరలక్ష్మి వ్రతాన్ని సాంప్రదాయబద్ధంగా నిర్వహించారు. ముందుగా ఆలయ ఈవో మంజుల దంపతులు వరలక్ష్మిదేవిని పుష్పాలు, బంగారు ఆభరణాలు, నగదుతో ప్రత్యేకంగా అలంకరించి పూజలు చేశారు. అలాగే వరలక్ష్మి వ్రతానికి హాజరైన మహిళలకు ఆలయ కమిటీ ఆధ్వర్యంలో మంగళసూత్రంతో పాటు జాకెట్టు, పసుపు, కుంకుమ, తీర్థప్రసాదాలను అందజేశారు. ఈ వ్రతంలో జిల్లా ఐదవ అదనపు జడ్జి తిరుమలరావు సతీమణితో పాటు బ్రాహ్మణ కార్పొరేటర్ మహిళా ట్రెజరర్ సుధారాణి, ధర్మకర్తల మండలి ట్రస్ట్ మాజీ ప్రతినిధి మడితాటి రెడ్డెమ్మ తదితరులు పాల్గొని అమ్మవారికి పూజలు నిర్వహించారు. అలాగే వరలక్ష్మి వ్రతంతో పాటు నాగులచవితి పండుగను పురష్కరించుకుని పట్టణంలోని ఉమామహేశ్వర ఆలయంతో పాటు పాతరాయచోటి శివాలయం, చెన్నముక్కపల్లె శివాలయం, రెడ్డీస్‌కాలనీ రామాలయం, శిబ్యాల, దిగువ అబ్బవరం, పెమ్మాడపల్లె తదితర ప్రాంతాల్లోని ఆలయాల్లో ప్రత్యేక పూజలు చేశారు. నాగుల పుట్ట వద్ద నాగేంద్రుడికి పాలు పోసి మొక్కులు తీర్చుకున్నారు.

సర్వమంగళకరం.. వరలక్ష్మి వ్రతం...

గాలివీడు: ప్రతియేటా శ్రావణమాసంలో వచ్చే వరలక్ష్మి వ్రతం ఆచరించిన వారికి సర్వమంగళకరంగా సకల సంపదలు సిద్ధిస్తాయని వేదపండితులు నాగఫణికిశోర్‌శర్మ పేర్కొన్నారు. శుక్రవారం వరలక్ష్మి వ్రతం పండుగను పురష్కరించుకుని స్థానిక ఆగ్రోస్ సూర్యనారాయణరెడ్డి స్వగృహంలో శ్రీవరలక్ష్మి అమ్మవారి స్వరూపాన్ని నెలకొల్పి ప్రత్యేక పూజలు చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ శ్రావణమాసం శుద్ధత్రయోదశి శుక్రవారం నాడు శ్రీవరలక్ష్మి అమ్మవారిని ఆరాదించడంతో అష్టలక్ష్ముల ఆశీర్వాదం లభించి ఆయా కుటుంబాలు అష్టైశ్వర్యాలతో తులతూగుతాయన్నారు. ఈ వరలక్ష్మి వ్రతం నిర్వహించిన వారు అన్నదానం కూడా చేయాలన్నారు. కార్యక్రమానికి హాజరైన భక్తులందరికీ తీర్థప్రసాదాలతో పాటు సంహపంక్తి భోజనం ఏర్పాటు చేశారు. మండలంలోని అన్ని ప్రముఖ ఆలయాల్లో వరలక్ష్మి వ్రతం పూజలు చేశారు.

రామాపురంలో...: శ్రావణ శుద్ధ పౌర్ణమికి ముందుగా వచ్చే శుక్రవారం రోజున వరలక్ష్మి వ్రతాన్ని చాతుర్వర్ణాల వారు భక్తి సాంప్రదాయకంగా చేసుకుంటారు. శుక్రవారం మండలంలోని పలు ఆలయాల్లోను, గృహాల్లోను వరలక్ష్మి వ్రతం ఘనంగా జరుపుకున్నారు. అలాగే మాజీ ఎమ్మెల్యే గడికోట ద్వారకనాధరెడ్డి స్వగృహంలో వరలక్ష్మి వ్రతం నిర్వహించారు. పలు ఆలయాల్లో కూడా ఈ వ్రతాన్ని నిర్వహించి అమ్మవారికి 5 రకాల పిండి వంటలు, తీర్థప్రసాదాలు, పూజలు చేసి నివేదన సమర్పించారు. కార్యక్రమంలో సర్పంచుల సంఘం అధ్యక్షుడు నాగభూషణ్‌రెడ్డి, పార్టీ రాష్ట్రశాఖ యువజన విభాగం కార్యదర్శి వెంకటసుబ్బారెడ్డి, సుబ్బారెడ్డి, రాఘవేంద్ర, హరినాధరెడ్డి, రవిశంకర్‌రెడ్డి (బాబు), భద్రారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

సంబేపల్లెలో...: వరాల తల్లి వరలక్ష్మి మాత అంటూ మహిళలు భక్తి ఉపవాసాలతో శుక్రవారం వరలక్ష్మి వ్రతం పాటించారు. మండలంలోని శెట్టిపల్లె గ్రామం అడవికమ్మపల్లెలో శ్రీదేవి, భూదేవి సమేత వెంకటేశ్వర ఆలయంలో, శ్రీనల్లగంగమ్మ ఆలయంలో వరలక్ష్మి వ్రతం ఆచరించారు. కువైట్ అభిమాన సంఘం సభ్యులు ప్రజలకు పసుపు, కుంకుమ, పూలతో పాటు జాకెట్లను పంపిణీ చేశారు.


గాలి వీడులో...


రామాపురంలో...


సంబేపల్లెలో...



జాతీయ తైక్వాండో పోటీలకు రాయచోటి క్రీడాకారులు

రాయచోటిరూరల్: ఈనెల 4 నుంచి 6వ తేదీ వరకు ఆగ్రాలోని కమలానగర్‌లో వున్న శాంట్ ఎన్‌డ్ర్యూస్‌లో స్కూల్ జరగనున్న మూడో క్యాడెట్ బాలబాలికల జాతీయ స్థాయి తైక్వాండో పోటీలకు రాయచోటి నుంచి ఇద్దరు క్రీడాకారులు వెళ్లినట్లు తైక్వాండో రాష్ట్ర అధ్యక్షుడు అచ్చుత్‌రెడ్డి, ఎగ్జిక్యూటీవ్, జిల్లా అధ్యక్షుడు సింగర సాంబశివయ్య ఒక ప్రకటనలో తెలిపారు. ఈ పోటీల్లో రాయచోటికి చెందిన ఏ. సాయిరాం అండర్-61 కేజీల విభాగంలో, షాహిద్ హుస్సేన్ ఓవర్-65 కేజీల విభాగంలో పాల్గొననున్నట్లు తెలిపారు. ఈ జాతీయ స్థాయి తైక్వాండో పోటీలకు వెళ్లిన క్రీడాకారులకు ఎస్‌ఐ రమేష్‌బాబు రూ.3 వేల ఆర్థిక సహాయం అందజేశారు.


జాతీయస్థాయి తైక్వాండోకు ఎంపికైన రాయచోటి క్రీడాకారులు

లక్షకోట్ల అవినీతి పరుడు జగన్‌ను ఎన్నిసార్లు కాల్చాలి

● టీడీపీ జిల్లా అధికార ప్రతినిధి, మార్కెట్ కమిటీ చైర్మన్ గాజుల ఖాదర్‌బాషా

రాయచోటిటౌన్: వైఎస్ రాజశేఖర్‌రెడ్డి హయాంలో లక్షల కోట్లు అవినీతి అక్రమాలకు పాల్పడి అనేక కేసుల్లో ముద్దాయిగా ఉన్న వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డిని ఎన్నిసార్లు కాల్చిచంపాలో ప్రజలే ప్రకటించాలని టీడీపీ జిల్లా అధికార ప్రతినిధి, మార్కెట్ కమిటీ చైర్మన్ గాజుల ఖాదర్‌బాషా పేర్కొన్నారు. శుక్రవారం ఆయన స్థానిక మార్కెట్‌యార్డులో విలేకరులతో మాట్లాడుతూ రాష్ట్రాన్ని దేశంలోనే నెంబర్-1 స్థానంలో నిలిపేందుకు అన్ని రకాలుగా అభివృద్ధి కార్యక్రమాలు చేపడుతూ ప్రజల మన్ననలు పొందుతున్న ముఖ్యమంత్రి చంద్రబాబును నడిరోడ్డుపై కాల్చినా తప్పు లేదంటూ ప్రతిపక్ష నేత వైఎస్ జగన్ బహిరంగ సభలో మాట్లాడడం ఆయన నేర ప్రవృత్తికి అద్దం పడుతోందని ఆరోపించారు. ఇలాంటి వ్యాఖ్యలు నేరాలకు, అవినీతి అక్రమాలకు పాల్పడే వారే మాట్లాడతారన్నారు. రాష్ట్రంలో శాంతి భద్రతలకు విఘాతం కలుగకుండా బాధ్యతాయుతంగా వ్యవహరించాల్సిన ప్రతిపక్ష నేత ఈ తరహా దిగజారుడు ప్రకటనలకు పూనుకోవడం ప్రజాస్వామ్యాన్ని అపహాస్యం చేయడమేనన్నారు. అధికారం లేని సమయంలోనే హింసాత్మక ధోరణిలో ప్రజలను రెచ్చగొడుతున్న జగన్ పొరపాటున అధికారంలోకి వస్తే ప్రజల పరిస్థితి ఎలా ఉంటుందో ఊహించుకోవాలన్నారు. కార్యక్రమంలో న్యామత్, నసిరుద్దీన్‌షా, ఫయాజ్, బాషావలీ, కలీల్ తదితరులు పాల్గొన్నారు.


మాట్లాడుతున్న గాజుల ఖాదర్‌బాషా, తదితరులు

మున్సిపల్ పారిశుధ్య కార్మికులపై వివక్ష తగదు

రాయచోటిటౌన్: మున్సిపాలిటీలో పనిచేస్తున్న పారిశుధ్య కార్మికులపై ప్రభుత్వం వివక్ష చూపడం తగదని మున్సిపల్ వర్కర్స్ యూనియన్ అధ్యక్షుడు (సీఐటీయూ) చెన్నయ్య పేర్కొన్నారు. శుక్రవారం రాష్ట్ర జేఏసీ పిలుపు మేరకు పట్టణ పురవీధుల్లో పారిశుధ్య కార్మికులు నల్లరిబ్బన్లను మూతికి కట్టుకుని మౌన ప్రదర్శన, ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రాష్ట్రంలో 40 వేల మంది పారిశుధ్య కార్మికులను తొలగించి వారి స్థానంలో ప్రజలపై వేసే అధిక మొత్తాల పన్నుల నుంచి మిషనరీలు కొని పట్టణాలను, కార్మిక జీవితాలను అస్తవ్యస్థం చేయడానికి జీవో నెంబర్-279 అమలుకు ప్రభుత్వం సిద్దమవుతోందని ఆరోపించారు. గత పీఆర్‌సీ ప్రకారం ఒక్కొక్క కార్మికునికి రూ.15,432 ఇవ్వాల్సి ఉండగా కేవలం రూ.11 వేలతో సరిపెట్టి ప్రస్తుతం వారిని ఏకంగా ఇంటికి పంపించే పనిలో ప్రభుత్వం ఉందన్నారు. సుప్రీం కోర్టు తీర్పు ప్రకారం సమాన పనికి సమాన వేతనం ఇవ్వాలని, పౌరసేవలను ప్రైవేటు సంస్థలకు అప్పజెప్పరాదని, కార్మికులకు వేతనాలు సకాలంలో ఇవ్వాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో సీఐటీయూ నియోజకవర్గ అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు ఓబులమ్మ, రామాంజులు, కోశాధికారి భోగీశ్వరయ్య, యూనియన్ నాయకులు అగ్గిరాముడు, రాంబాబు, సిద్దయ్య, తిరుపాల్ తదితరులు పాల్గొన్నారు.



మూతికి నల్లబ్యాడ్జీలు కట్టుకుని మౌనప్రదర్శన నిర్వహిస్తున్న మున్సిపల్ కార్మికులు

సినిమా గైడ్

రాయచోటి	
ప్రసాద్	: ఫిదా
గౌతమ్	: గౌతమ్‌నంద
సాయి	: డీజే-దువ్వాడ జగన్నాథం
సోనీరాజ్	: ట్యూబ్‌లైట్
గాలివీడు	
పావని	: బాహుబలి-2

వైభవం...వరలక్ష్మీదేవి వ్రతం

భక్తులతో పోటెత్తిన ఆలయాలు ● భక్తిశ్రద్ధలతో పూజలు


ప్రత్యేక అలంకరణలో అమ్మవారు


బద్వేలు అమ్మవారిశాలలో వరలక్ష్మీదేవి వ్రతం చేస్తున్న మహిళలు

బద్వేలు : బద్వేలు నియోజకవర్గ వ్యాప్తంగా వివిధ ఆలయాల్లో శ్రావణ శుక్రవారం వరలక్ష్మీవ్రత పూజలను వైభవంగా నిర్వహించారు. మహిళలు ఉపవాసాలతో, భక్తిశ్రద్ధలతో పూజా కార్యక్రమాల్లో పాల్గొన్నారు. భక్తులు అధిక సంఖ్యలో తరలిరావడంతో ఆలయాలు పోటెత్తాయి. శ్రావణ శుక్రవారం, వరలక్ష్మీ వ్రతం రెండూ ఒకే రోజు రావడంతో బద్వేలు పట్టణంలో అమ్మవారి ఆలయాలు మహిళలతో కిటకిటలాడాయి. శ్రీవాసవీ కన్యకాపరమేశ్వరీదేవిని ఆర్యవైశ్య మహిళాసంఘం వారి ఆధ్వర్యంలో అమ్మవారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. మహిళలు పెద్దసంఖ్యలో విచ్చేసి వరలక్ష్మీవ్రతం చేశారు. లక్ష్మీపాలెంలోని ప్రసన్న వెంకటేశ్వరస్వామి, పోరుమామిళ్లరోడ్డులోని సరస్వతీ శిశుమందిరం, మహాలక్ష్మీదేవి, పోలీస్ క్వార్టర్స్‌లో శ్రీకనకదుర్గాదేవి, మైదుకూరు రోడ్డులోని పోలేరమ్మ, నెల్లూరురోడ్డులోని శ్రీదేవి, భూదేవి సమేత కల్యాణ వేంకటేశ్వరస్వామి ఆలయంలో శ్రావణ శుక్రవారం పూజలు నిర్వహించారు. అనంతగిరి క్షేత్రంలోని శ్రీకనకదుర్గాదేవి, రూపరాంపేట శివాలయాల్లోనూ భక్తులు పెద్ద ఎత్తున వ్రతాలు చేశారు. ప్రత్యేక పూజలు చేశారు. నిర్వాహకులు భక్తులకు ప్రసాదాలు పంపిణీ చేశారు.

పోరుమామిళ్ల మండలంలో : వరలక్ష్మీదేవి పర్వదినాన్ని పురస్కరించుకొని పోరుమామిళ్లలోని పలు ఆలయాల్లో ప్రత్యేకపూజలు నిర్వహించారు. శుక్రవారం పట్టణంలోని బాలత్రిపుర సుందరీదేవి, రామలింగేశ్వరస్వామి, వేణుగోపాలస్వామి, శ్రీవాసవీకన్యకాపరమేశ్వరీదేవి, వేంకటేశ్వరస్వామి ఆలయాల్లో మహిళలు భక్తిశ్రద్ధలతో వరలక్ష్మీదేవి వ్రతాన్ని నిర్వహించారు. బాలాత్రిపురసుందరీదేవి ఆలయంలో పురోహితులు మధుశర్మ అమ్మవారిని ప్రత్యేకంగా అలంకరించారు.

కలసపాడు మండలంలో..: మండల వ్యాప్తంగా శ్రావణ శుక్రవారం సందర్భంగా వరలక్ష్మీ వ్రతాలు నిర్వహించారు. మండల కేంద్రమైన కలసపాడులో మహిళలు దేవాలయాల్లో పెద్ద సంఖ్యలో హాజరై ప్రత్యేక పూజలు నిర్వహించారు. అలాగే ఎగువరామాపురం, చెన్నారెడ్డిపల్లె, పిట్టికుంట అవదూత కాశిరెడ్డినాయన జ్యోతి క్షేత్రంలో మహిళలు భక్తిశ్రద్ధలతో వరలక్ష్మీ వ్రతం ఆచరించారు.

బి.కోడూరు మండలంలో : మండలంలో పాయలకుంట్ల, బి.కోడూరు, గోవిందాయపల్లె, రాజుపాలెం, మేకవారిపల్లె, మున్నెళ్లి తదితర గ్రామాల్లో శుక్రవారం ఘనంగా వరలక్ష్మీదేవి వ్రతం నిర్వహించారు. ఉదయాన్నే మహిళలు అన్ని దేవాలయాల్లో విరివిగా పాల్గొని అమ్మవారికి పూజలు నిర్వహించారు.


పూజలు అందుకుంటున్న అమ్మవారు


పోరుమామిళ్లలో వరలక్ష్మీదేవి వ్రతంలో పాల్గొన్న మహిళలు

ప్రజాధనం దుర్వినియోగం


నీరు-చెట్టు పనులను పరిశీలిస్తున్న సీపీఐ బృందం

గోపవరం : నీరు - చెట్టు, చెరువుల పూడికతీత పనుల్లో అక్రమాలు చోటు చేసుకున్నాయని, నీటిపారుదల శాఖ అధికారుల పర్యవేక్షణ లేకపోవడంతోనే ప్రజాధనం దుర్వినియోగం అయిందని సీపీఐ నాయకులు ఆరోపించారు. శుక్రవారం మండలంలో జరిగిన పనులను సీపీఐ బృందం పరిశీలించింది. ఈ సందర్భంగా సీపీఐ ఏరియా, పట్టణ కార్యదర్శులు వీరశేఖర్, చంద్రశేఖర్‌లు మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం ఎంతో ప్రతిష్టాత్మకంగా భూగర్భజలాల పెంపునకు చేపట్టిన పనుల్లో లక్షలాది రూపాయల పనులు కేవలం అధికారపార్టీ నాయకులకు భోజ్యంగా మారాయన్నారు. కార్యక్రమంలో ఏరియా కార్యవర్గ సభ్యులు చంద్రమోహన్‌రాజు, బాబు, రంతుల్లాఖాన్, సంజీవ్, పెంచలయ్య, అనిల్, తదితరులు పాల్గొన్నారు.

భూ సమస్యలను పరిష్కరించుకోవాలి

గోపవరం : అపరిష్కృతంగా ఉన్న రెవెన్యూ సమస్యల పరిష్కారం కోసం నిర్వహిస్తున్న గ్రామసభల ద్వారా పల్లెల్లోని భూసమస్యలను పరిష్కరించుకోవాలని తహసీల్దార్ నరసింహులు పేర్కొన్నారు. శుక్రవారం మండలంలోని గోపవరంలో రైతుసేవలో రెవిన్యూశాఖ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమంలో భూ సమస్యలకు సంబంధించి 49అర్జీలు వచ్చాయన్నారు. వచ్చిన ప్రతి అర్జీకి రసీదు ఇచ్చి ఇందుకు సంబంధించిన పూర్తి వివరాలను ఉన్నతాధికారుల దృష్టికి పంపడం జరుగుతందన్నారు. ఈ కార్యక్రమంలో డిప్యూటీ తహసీల్దార్ దస్తగిరి, ఆర్‌ఐ హరి, సర్వేయర్ ఓబయ్య, ఏఎస్‌ఓ అర్జున్‌రావు, వీఆర్వో జగదీశ్వరరెడ్డి, పంచాయితీ కార్యదర్శి విజయకుమార్, రవీంద్రనాయుడు, మాజీ ఎంపీటీసీ వెంకటేశ్వర్లు తదితరులు పాల్గొన్నారు.

శిథిలావస్థలో గ్రంథాలయం


శిథిలావస్థకు చేరుకున్న గ్రంథాలయం

అట్లూరు : మండల కేంద్రంలో పాఠకుల కోసం ఏర్పాటు చేసిన గ్రంథాలయం శిథిలావస్థకు చేరుకుంది. ప్రతి నిత్యం విద్యార్థులు, ప్రజలు గ్రంథాలయానికి వెళుతుంటారు. ఎప్పుడు కూలుతుంతోనని పాఠకులు భయాందోళనలకు గురవుతున్నారు. వర్షాకాలం వచ్చిందంటే గ్రంథాలయంలో ఉన్న విలువైన పుస్తకాలన్నీ తడిసిముద్ద అవుతాయని గ్రంథాలయాధికారి చెబుతున్నారు. ఈ విషయం పలుమార్లు పాఠకులు, గ్రంథాలయ అధికారి అధికారుల దృష్టికి తీసుకెళ్లినా పట్టించుకోవడం లేదని ఆవేదన చెందుతున్నారు.

పక్కాగృహాలకు దరఖాస్తులు చేసుకోండి

గోపవరం : మండలంలోని అర్హులైన నిరుపేదలు పక్కా గృహాలకు దరఖాస్తులు చేసుకోవాలని తహసీల్దార్ నరసింహులు పేర్కొన్నారు. దరఖాస్తులను సోమవారం సాయంత్రంలోపు అన్ని ఆధారాలతో తహసీల్దార్ కార్యాలయంలో అందజేయాలన్నారు. అర్హులైన నిరుపేదలందరికీ పక్కాగృహాలు అందించడమే లక్ష్యంగా రాష్ట్ర ప్రభుత్వం ప్రణాళికలు సిద్దం చేసిందన్నారు. దరఖాస్తులు చేసుకున్న వారి వివరాలను ఉన్నతాధికారులకు పంపించి అర్హులందరికీ పక్కాగృహాలు అందేలా చూస్తామని ఆయన పేర్కొన్నారు. ఆధార్‌కార్డు, బ్యాంక్ అకౌంట్ జిరాక్స్ కాపీలను దరఖాస్తుకు జతచేసి తహసీల్దార్ కార్యాలయంలో ఇవ్వాలన్నారు.

ఉచితంగా జిప్సం, జింక్ పంపిణీ

ముద్దనూరు: స్థానిక వ్యవసాయక్షేత్రం వద్ద శుక్రవారం రైతులకు ఉచితంగా సూక్ష్మపోషకాలైన జిప్సం, జింక్ పంపిణీ చేశారు. ఈ సందర్భంగా వ్యవసాయాధికారి చంద్రశేఖర్‌రెడ్డి మాట్లాడుతూ 2017 సంవత్సరంలో భూసార పరీక్షలు చేయించుకుని, వేరుశనగ, పత్తి, వరి పంటలు సాగు చేసిన రైతులకు మాత్రం జిప్సం, జింక్ పంపిణీ చేస్తున్నామన్నారు. మండలానికి 21 టన్నుల జిప్సం, 5టన్నుల జింక్ వచ్చిందన్నారు. సూక్ష్మపోషకాలు అవసరమైన రైతులు భూసార పరీక్ష పత్రాలు, ఆధార్ కార్డు తీసుకొని రావాలని ఏఓ తెలిపారు.

ఆక్రమణలో తహసీల్దార్ కార్యాలయ స్థలం





ఆక్రమణకు గురైన రెవెన్యూ స్థలం, కార్యాలయం చుట్టూ నాపరాళ్లను పాతిన దృశ్యం

జమ్మలమడుగు: నగర పంచాయతీ పరిధిలోని తాడిపత్రి రోడ్డులో తహసీల్దారు కార్యాలయానికి చెందిన లక్షల రూపాయలు విలువగల స్థలం ఆక్రమణలకు గురైంది. పట్టణ నడిబొడ్డున ఉన్న రెవెన్యూ స్థలంలో టీ దుకాణం, దీక్షా శిబిరం, తోపుడు బండ్లు తదితర వ్యాపారాలు వెలిసాయి. కొందరైతే దుకాణాల వద్ద ఏకంగా నాపరాళ్లతో చప్పట బండలు కూడా ఏర్పాటు చేసుకున్నారు. అక్రమంగా దుకాణాలు ఏర్పాటు చేసిన వారు మున్సిపాలిటీకి పన్నులు చెల్లిస్తున్నారా, రెవెన్యూ వారికి చెల్లిస్తున్నారా, అనుమతులు ఇచ్చిన నాయకులకు చెల్లిస్తున్నారా అన్న విషయం తెలియరాలేదు. పైగా దుకాణాదారులు వారి అంగళ్ల వద్ద ఎవరైన తమ ద్విచక్ర వాహనాలను పార్కింగ్ చేస్తే అక్కడి నుంచి తొలగించాలని ఆజ్ఞాపిస్తున్నారు. ఆక్రమణలకు గురైన స్థలాన్ని వ్యక్తుల ప్రయోజనాలకు కూడా ప్రభుత్వ ప్రయోజనాలకు ఉపయోగించాలని ఈ సందర్భంగా ప్రజలు కోరుతున్నారు.

ఆ స్థలం రెవెన్యూకు చెందిందే

తహసీల్దారు కార్యాలయం ఎదురుగా ఉన్న స్థలం సబ్‌జైలు వరకు రెవెన్యూ శాఖకు చెందిందేననితహసీల్దారు చంద్రశేఖర్‌రెడ్డి అన్నారు. గురువారం తహసీల్దారు చంద్రశేఖర్‌రెడ్డి ఆయన కార్యాలయంలో 'ఆంధ్రజ్యోతి'తో మాట్లాడుతూ కార్యాలయం ఎదురుగా ఉన్న ఖాళీ స్థలంలో ఏర్పాటు చేసిన దుకాణాలను, దీక్షా శిబిరాన్ని ఎత్తివేయాలని ఆజ్ఞాపించామన్నారు. దుకాణాలను ఎత్తివేసి తహసీల్దారు కార్యాలయ బోర్డును ఏర్పాటు చేయుచున్నట్లు తెలిపారు. కార్యాలయ ఆవరణలోకి పనుల అవసరం లేనివారు రాకుండా నిలువెత్తు బండలు పాతించామన్నారు. కార్యాలయ ఆవరణం చుట్టూ మొక్కలను పంచి పరిసరాలను, వాతావరణాన్ని పరిశుభ్రంగా ఉంచనున్నట్లు తెలిపారు.

అవీ.. ఇవీ

అర్హులైన వారందరికీ పక్కా గృహాలు



పోట్లదుర్తిలో మాట్లాడుతున్న ఎంపీడీవో శివకుమారి

ఎర్రగుంట్ల: అర్హులైన వారిందరికీ నూతన ఇళ్లు మంజూరు చేసేందుకు కలెక్టర్‌కు నివేదికనుపంపుతున్నట్లు ఎంపీడీవో కే.శివకుమారి తెలిపారు. పోట్లదుర్తిలో 262 కుటుంబాలకు ప్రజా సాధికార సర్వేలో గృహాలు లేవని తేలాయన్నారు. ఈ లబ్దిదారుల జాబితాను పోట్లదుర్తిలో శుక్రవారం జరిగిన గ్రామసభలో చదివి వినిపించారు. ఎవరూ అభ్యంతరాలు తెలపకపోవడంతో గ్రామసభ ఆమోదించింది. మంజూరు కోసం ఈజాబితాను కలెక్టర్‌కు పంపుతున్నట్లు ఎంపీడీవో శివకుమారి తెలిపారు. సర్పంచి వెంకటరంగయ్యయాదవ్, ఎంపీటీసీ ఓబులేసు, ఏఈ బాలిరెడ్డి, కార్యదర్శి కరీముల్లా, వర్క్‌ఇన్స్‌స్పెక్టర్ శ్రీనివాసులు, లబ్దిదారులు పాల్గొన్నారు.

ఘనవ్యర్థ పదార్థాలనుంచి సంపద తయారీ



సమావేశంలో మాట్లాడుతున్న ఎంపీడీవో, తహసీల్దార్

ఎర్రగుంట్ల: ఘనవ్యర్థపదార్థాల నుంచి సంపదను తయారు చేసే కేంద్రాలను ప్రతి గామంలో ఏర్పాటు చేసేందుకు కృషిచేయాలని ఎంపీడీవో శివకుమారి తెలిపారు. ఘనవ్యర్థపదార్థాల నిర్వహణకు సంబంధించి సమావేశం శుక్రవారం ఎంపీడీవో కార్యాలయంలో నిర్వహించారు. ఎర్రగుంట్ల మండలంలో చెత్త నుంచి సంపద తయారు చేసేందుకు ఉపాధిహామీ పథకంలో ఆరు గ్రామాలను మంజూరు చేసినట్లు తెలిపారు. మొదటగా స్థలాన్ని ఎంపికచేసి తహసీల్దార్ అనుమతి తీసుకోవాలన్నారు. అంచనాలు తయారుచేసి షెడ్ల నిర్మాణం చేసేందుకు ఉపక్రమించాలన్నారు. స్థలాన్ని సమకూరుస్తామని తహసీల్దార్ బి.మహేశ్వరరెడ్డి తెలిపారు. ఉపాధి ఏపీఓ హరిక్రిష్ణ, ఈసీ జగన్, సర్పంచులు, కార్యదర్శులు, ఉపాధిహామీ టీఏలు పాల్గొన్నారు.

వర్గీకరణకు చట్టబద్ధత కల్పించాలి



మైలవరంలో రిలే నిరాహార దీక్షలు చేస్తున్న దృశ్యం

మైలవరం: ఎస్సీ వర్గకరణకు చట్టబద్ధత కల్పించాలని ఎమ్మార్పీఎస్ నాయకులు డిమాండ్ చేశారు. శుక్రవారం మైలవరం తహసీల్దారు కార్యాలయం ఎదురుగా చేస్తున్న ఎమ్మార్పీఎస్ రిలే నిరాహార దీక్ష 8వ రోజుకు చేరింది. ఈ సందర్భంగా ఎమ్మార్పీఎస్ నాయకులు ఓబులేసు, దస్తగిరి, విజయకుమార్, వెంకటేష్, సుబ్బయ్య తదితరులు దీక్షలో కూర్చున్నారు.

ఆర్యవైశ్య కార్పొరేషన్ ప్రకటనపై హర్షం

ప్రొద్దుటూరు కల్చరల్: ఆర్యవైశ్య కార్పోరేషన్ ఏర్పాటు ప్రకటనపై ఆర్యవైశ్య సభ అధ్యక్షుడు బుశెట్టి రామ్మోహన్‌రావు హర్షం వ్యక్తం చేశారు. నంద్యాల బహిరంగ సభలో జగన్ మాట్లాడుతూ ఆర్యవైశ్య కార్పోరేషన్ ఏర్పాటు చేస్తామని ప్రకటించడం హర్షించదగ్గ విషయమన్నారు.

తల్లిపాలు బిడ్డకు శ్రేష్టం

మైలవరం: సృష్టిలో కలుషితం కాకుండా ఉన్నవి తల్లిపాలు ఒకటేనని, బిడ్డకు చాలా శ్రేష్ఠమైనవి తల్లిపాలు మాత్రమేనని అంగన్వాడీ పర్యవేక్షకురాలు మౌలాలమ్మ పేర్కొన్నారు. తల్లిపాల వారోత్సవాల్లో భాగంగా శుక్రవారం మండల పరిదిలోని బి.జంగాలపల్లెలో తల్లిపాలు వారోత్సవాలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ బిడ్డకు పాలు ఇవ్వడం వలన తల్లి అందం పెరగడంతోపాటు బిడ్డ ఆరోగ్యంగా ఉంటారన్నారు. తల్లిపాలు తాగడం వలన బిడ్డకు వ్యాధి నిరోధక శక్తి పెరుగుతుందన్నారు. పుట్టిన బిడ్డకు ఆరు నెలల వర కు తల్లిపాలు ఇవ్వాలని సూచించారు. అంగన్వాడీ సిబ్బంది పాల్గొన్నారు.

కొరవడిన పర్యవేక్షణ

ప్రొద్దుటూరు కల్చరల్: ఉపాధి హామీ పథకం అమలులో పర్యవేక్షణ పెరగాలని డ్వామా అదనపు పీడీ సురేష్ తెలిపారు. స్థానిక ఎంపీడీవో కార్యాలయంలో ఉపాధి హామీ పథకం ఫీల్డ్ అసిస్టెంట్లు, టెక్నికల్ సిబ్బందిత సమావేశానికి నిర్వహించారు. ఈ సందర్భంగా అదనపు పీడీ సురేష్ మాట్లాడుతూ ప్రతి శనివారం ఎంపీడీవో ఎం.బుక్కులను తనిఖీ చేయాలన్నారు. ప్రతి పనికి రికార్డులను ఉంచాలని, ప్రతి 15 రోజులకు ఒక సారి టెక్నికల్ అసిస్టెంట్లు, ఫీల్డ్ అసిస్టెంట్ల రిజిష్టర్లను పరిశీలించాలని, ప్రతి పంచాయతీలో ఫీల్డ్ అసిస్టెంటు వద్ద ఏడు రిజిష్టర్లను తప్పక కలిగి ఉండాలన్నారు. ఈ సమావేశంలో ఏపీఎం జగదీష్‌రెడ్డి పాల్గొన్నారు.

9న ఇంటర్వ్యూలు

ప్రొద్దుటూరు కల్చరల్: ప్రొద్దుటూరు మండల పరిధిలో 2017-18 ఆర్థిక ఏడాదికి చెందిన సబ్సీడీ రుణాలకు దరఖాస్తు చేసుకున్న వారికి 9వ తేదీ ఇంటర్వ్యూలను నిర్వహిస్తున్నట్లు ఎంపీపీ మల్లెల ఝాన్సీ, ఎంపీడీవో సుబ్రమణ్యంలు ఒక ప్రక టనలో తెలిపారు. బీసీ, ఎస్సీ, ఎస్టీ, ముస్లిం, క్రిస్టియన్ మైనార్టీ, కాపు కార్పోరేషన్లకై దరఖాస్తు చేసుకున్నవారందరూ ఉదయం 10 గంటలకు ఎంపీడీవో కార్యాలయానికి హాజరుకావాలని వారు కోరారు. బ్యాంకు మేనేజర్లు ఇంటర్వ్యూకు హాజరవుతారన్నారు.

భూ సమస్యలను పరిష్కరించేందుకే గ్రామసభలు



తలమంచిపట్నంలో గ్రామసభ నిర్వహిస్తున్న దృశ్యం

మైలవరం: భూ సమస్యలు పరిష్కరించేందుకే రైతన్న సేవలో రెవెన్యూ శాఖ కార్యక్రమం ద్వారా ప్రభుత్వం గ్రామసభలు నిర్వహించడం జరుగుతుందని ఇన్‌ఛార్జి తహసీల్దారు చంద్రశేఖర్‌రెడ్డి పేర్కొన్నారు. శుక్రవారం మండల పరిధిలోని తలమంచిపట్నం గ్రామంలో నిర్వహించి గ్రామసభలో 1బి రికార్డులు లేకుండానే గ్రామసభ నిర్వహించారు. సోలార్ భూములకు సంబంధించి తలమంచిపట్నం 1బి అడంగల్ జమ్మలమడుగు ఆర్డీవో కార్యాలయానికి గతంలో మైలవరం రెవెన్యూ అధికారులు ఆర్డీవో కార్యాలయంలో అప్పగించారు. గ్రామ సభలు పెడుతుండడంతో రెవెన్యూ అధికారులు 1బి అడంగల్ కావాలని ఆర్డీవోకార్యాలయానికి వెళ్లి అధికారులను అడిగినా పట్టించుకోవడంలేదని విమర్శలు ఉన్నాయి. అయితే గ్రామసభలో మాత్రం తలమంచిపట్నంకు సంబంధించి పురాతన రికార్డులను తీసుకురావడంతో అందులో రైతులకు సంబంధించిన పూర్తి వివరాలు లేకపోవడంతో రైతులు నిరాశకు గురయ్యారు. కనీసం గ్రామసభలకు అయినా ఆర్డీవో కార్యాలయం నుంచి భూ రికార్డులను అధికారులు తెచ్చుకుంటే తమ భూములు మా పేరుమీద ఉన్నాయో, వేరేవారి పేరు మీద ఉన్నాయో, ఏ సర్వే నంబర్లలో ఉన్నాయో చూసుకోవచ్చునని గ్రామసభలకు వచ్చిన రైతులకు నిరాశే ఎదురైందని రైతులు అంటున్నారు. కొత్త రికార్డులు పూర్తి వివరాలతో రైతులకు సంబంధించిన సమాచారం ఉంటుందనుకుని వచ్చామని కొందరు రైతులు తెలిపారు. అధికారులు మాత్రం ఉన్న రికార్డులతో రైతులకు సంబంధించిన వివరాలు తెలిపారు.

రికార్డులు లేకపోవడంతో ఇబ్బందులు

రైతుల భూ సమస్యలు పరిష్కరించేందుకు ఏర్పాటు చేసిన గ్రామసభలకు పాత రికార్డులు తీసుకురావడంతో ప్రస్తుతం ఉన్న పేర్లు సర్వే నంబర్లు సరిగా లేక ఇబ్బంది పడాల్సి వస్తోంది. నాకున్న భూ సమస్య ఇప్పటికి పరిష్కారం కాలేదు.

- సుబ్బారెడ్డి, రైతు

కార్యక్రమంలో ఆర్ఐ రామకృష్ణారెడ్డి, సర్వేయరు ఇంద్రజ, వీఆర్వోలు ప్రభాకర్‌నాయుడు, చైతన్య, రమేష్, హుస్సేన్‌రెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

నిరుద్యోగ యువతకు బ్యాంకర్లు సహకరించాలి



సమావేశంలో మాట్లాడుతున్న ఎంపీపీ కళావతి

ముద్దనూరు: ఏ ఆధారం లేని నిరుద్యోగ యువత స్వశక్తితో అభివృద్ధి చెందాలని ప్రభుత్వం సబ్సిడీపై బ్యాంక్ రుణాలు అందిస్తుంటే బ్యాంకర్లు నిరుద్యోగ యువతను నిరుత్సాహ పరుస్తున్నారని, వారికి బ్యాంకర్లు సహకరించాలని ఎంపీపీ అగుడూరు కళావతి అన్నారు. స్థానిక గ్రామ పంచాయతీ కార్యాలయంలో శుక్రవారం 2017-18 సబ్సిడీ రుణాల సంబంధించి బ్యాంకర్లు, ఉపాధి కూలీలతో సమావేశం ఏర్పాటు చేశారు. అందులో భాగంగా ఎంపీపీ మాట్లాడుతూ ప్రభుత్వం సబ్సిడీ రుణాలకు లబ్ధిదారులను ఎంపి చేసి సబ్సిడీని లబ్ధిదారుల ఖాతాలో జమ చేయడంలో బ్యాంకర్లు నిర్లక్ష్యం వహిస్తున్నారన్నారు. బ్యాంకర్లు ఏర్పాటు చేసిన సర్వీస్ ఏరియాలో పంపిణీ స్పష్టత లేని కారణంగా ప్రజలు, లబ్ధిదారుల చాలా ఇబ్బందులు పడుతున్నారని, స్పష్టంగా తెలియజేయాలన్నారు. సబ్సిడీ బ్యాంక్ ఖాతాలో జమ అయిన వెంటనే రుణాలు అందించాలన్నారు. ఉపాధి కూలీల పట్ల బ్యాంకర్లు నిర్లక్ష్యం వహించకూడదన్నారు. బ్యాంకర్లు ప్రజలకు, నిరుద్యోగ యువతకు, ఉపాధి కూలీలకు సహకరించకుంటే, అంటువంటి బ్యాంకర్ల పై మంత్రి ఆదినారాయణరెడ్డికి ఫిర్యాదు చేస్తామని హెచ్చరించారు. ఎంపీడీఓ మనోహర్‌రాజు, బ్యాంక్ అధికారులు, ఏపీఓ నాగసులోచన, ఉపాధి ఈసీ పీర్‌భాషా, టీఏలు, ఎఫ్ఏలు పాల్గొన్నారు.

9న ఇంటర్వ్యూలు

ప్రొద్దుటూరు కల్చరల్: ప్రొద్దుటూరు మండల పరిధిలో 2017-18 ఆర్థిక ఏడాదికి చెందిన సబ్సిడీ రుణాలకు దరఖాస్తు చేసుకున్న వారికి 9వ తేదీ ఇంటర్వ్యూలను నిర్వహిస్తున్నట్లు ఎంపీపీ మల్లెల రూన్సీ, ఎంపీడీవో సుబ్రమణ్యంలు ఒక ప్రకటనలో తెలిపారు. బీసీ, ఎస్సీ, ఎస్టీ, ముస్లిం, క్రిస్టియన్ మైనార్టీ, కాపు కార్పొరేషన్లకై దరఖాస్తు చేసుకున్నవారందరూ ఉదయం 10 గంటలకు ఎంపీడీవో కార్యాలయానికి హాజరు కావాలని వారు కోరారు. బ్యాంకు మేనేజర్లు ఇంటర్వ్యూకు హాజరవుతారన్నారు.

కౌరవ సామ్రాజ్యాన్ని తలపిస్తున్న వైసీపీ

- దుర్యోధనుడిలాగానే జగన్‌కు పతనం తప్పదు
- టీడీపీ రాష్ట్ర కార్యనిర్వాహక కార్యదర్శి రెడ్యం



విలేకర్లతో మాట్లాడుతున్న రెడ్యం

కడప, సెవెన్‌రోడ్స్ : వైసీపీని చూస్తుంటే కౌరవ సామ్రాజ్యాన్ని తలపిస్తున్నదని, కురుక్షేత్రంలో దుర్యోధనుడికి పట్టిన గతే జగన్‌కు పడుతుందని ఆయన పతనం తప్పదని టీడీపీ రాష్ట్ర కార్యనిర్వాహక కార్యదర్శి రెడ్యం వెంకటసుబ్బారెడ్డి జోష్యం చెప్పారు. ఆయన శుక్రవారం టీడీపీ జిల్లా కార్యాలయంలో విలేకరులతో మాట్లాడారు. నంద్యాలలో జగన్ మాట్లాడుతూ సీఎంను చంపాలని పిలుపునివ్వడం ఆయన దుర్మార్గపు ఆలోచనలను బయటపెట్టిందన్నారు. ప్రతిపక్ష నేతగా వుండగానే ఆయన ఇలాంటి వ్యాఖ్యలు చేస్తున్నారంటే పొరపాటున సీఎం అయితే రాష్ట్రాన్ని రావణకాష్టం చేస్తారన్నారు. 11 కేసులు, 16 నెలల జైలు, వేలకోట్లు జప్తు, లక్షల కోట్లు దోపిడీ చేసిన జగన్ నీతి నిజాయితీ గురించి మాట్లాడడం ఎబ్బెట్టుగా వుందన్నారు. మైనార్టీ సంక్షేమానికి ఉమ్మడి రాష్ట్రంలో వైఎస్ రూ.150 కోట్లు కేటాయిస్తే 13 జిల్లాల ఏపీకి సీఎం చంద్రబాబు రూ.850 కోట్లు కేటాయించారని ఈ ఒక్క ఉదాహరణే మైనార్టీల పట్ల సీఎంకు వున్న గౌరవం స్పష్టం చేస్తున్నదన్నారు. సీఎంను చంపాలని పిలుపునిచ్చిన జగన్‌పై చట్టరీత్యా చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. ఈ సమావేశంలో టీడీపీ జిల్లా ఉపాధ్యక్షుడు శివరాం, కడప మార్కెట్ కమిటీ చైర్మన్ ఐ.శివారెడ్డి, టీడీపీ నేతలు బి.చంద్రశేఖర్, సుధాకర్, రెడ్యం చంద్రశేఖర్ రెడ్డి, ఫిరోజ్‌ఖాన్, గంగాధర్ తదితరులు పాల్గొన్నారు.

ప్రశాంతంగా లాంగ్వేజీ పండిట్ల పదోన్నతుల కౌన్సెలింగ్

- 25 మందికి పదోన్నతులు





కౌన్సెలింగ్ నిర్వహిస్తున్న డీఈవో, ఏడీలు, హాజరైన లాంగ్వేజీ హిందీ పండిట్లు

కడప, ఎర్రముక్కపల్లె : లాంగ్వేజీ పండిట్ల కౌన్సెలింగ్ ప్రశాంతంగా జరిగింది. 25 మందికి పదోన్నతులు లభించాయి. డీఈవో కార్యాలయంలో శుక్రవారం లాంగ్వేజీ పండిట్లకు సంబంధించి పదోన్నతుల కౌన్సెలింగ్ జరిగింది. పండిట్లు తెలుగు (ప్రభుత్వ) 2 ఎల్‌పీ కింద (జడ్పీ) 20 ఉర్దూ (జడ్పీ)కి మొత్తం 25 మందికి పదోన్నతులు కల్పించారు.

ఎల్‌పీల పదోన్నతుల కౌన్సెలింగ్ వాయిదా

లాంగ్వేజీ పండిట్లు జడ్పీ పదోన్నతుల కౌన్సెలింగ్ వాయిదా పడింది. రోస్టర్‌పాయింట్‌కు సంబంధించి 2011లో సీనియారిటీ జాబితాలో 57 వరకు నిర్వహించారు. 2013లో 58 నుంచి రోస్టర్ ప్రారంభించాల్సి వుండగా తిరిగి 1 నుంచి నిర్వహించారు. ఇందులో దీన్ని బట్టి పదోన్నతుల కౌన్సెలింగ్ నిర్వహించాలని కమిషనర్‌కు డీఈవో కోరినట్లు సమాచారం. కమిషనర్ సూచనల మేరకు శనివారం పదోన్నతుల కౌన్సెలింగ్ జరిగే అవకాశముంది. పదోన్నతులు ఎప్పుడు జరిగినా అందరికీ ఒక తేదీన ఆర్డర్ ఇచ్చేందుకు డీఈవో సుముఖత వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో ఏడీ వరలక్ష్మి, ఎంఈవో సీవీ ప్రసాద్, డీఈవో కార్యాలయం సిబ్బంది పాల్గొన్నారు.

అహంకారంతోనే జగన్ ఉన్మాది వ్యాఖ్యలు

- దిష్టిబొమ్మ దహనంలో టీడీపీ నగర కమిటీ నేతలు



జగన్ దిష్టిబొమ్మను దహనం చేస్తున్న టీడీపీ నేతలు

కడప, సెవెన్‌రోడ్స్: స్వార్థం, అహంకారంతోనే జగన్ ఉన్మాదిలా మారి దుర్మార్గపు వ్యాఖ్యలు చేస్తున్నారని టీడీపీ నగర కమిటీ అధ్యక్షుడు జిలానీ బాషా, ప్రధాన కార్యదర్శి విశాస్‌హరిలు అన్నారు. వారి ఆధ్వర్యంలో శుక్రవారం సాయంత్రం కోటిరెడ్డిసర్కిల్‌లో జగన్ దిష్టిబొమ్మను దహనం చేశారు. అనంతరం వారు మాట్లాడుతూ ప్రతిపక్ష నేతగా వుండి హుందాగా వ్యవహరించకుండా సీఎంను చంపాలని ఒక ముఠా నాయకుడిగా, వీధి రౌడీలా వ్యాఖ్యానించడం రాష్ట్ర ప్రజల దురదృష్టకరమన్నారు. కార్యక్రమంలో శాప్ డైరెక్టర్ జయచంద్ర, మైనార్టీ ఫైనాన్స్ కార్పొరేషన్ డైరెక్టర్ అన్వర్ హుసేన్, టీడీపీ నేతలు ఆచారి, బుఖారి, కార్యకర్తలు పాల్గొన్నారు.

మున్సిపల్ కార్మికులకు 279 జీఓ శాపం

కడప, అర్బన్: మున్సిపల్ వర్కర్స్‌కు శాపంగా మారిన జీవో 279ను వెంటనే రద్దు చేసి వేతనాలు పెరిగిన జీవో 151ను అమలు చేయాలని సీఐటీయూ జిల్లా నగర ప్రధాన కార్యదర్శులు మనోహర్, వెంకటసుబ్బయ్యలు డిమాండ్ చేశారు. సీఐటీయూ ఆధ్వర్యంలో శుక్రవారం ఏపీ మున్సిపల్ వర్కర్స్ ఎంప్లాయిస్ యూనియన్ నగర కమిటీ ఆధ్వర్యంలో నోటికి రిబ్బన్లు ధరించి పాతబస్టాండు నుంచి వన్‌టౌన్ వరకు మౌన ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ మున్సిపల్ ఉద్యోగుల పట్ల ప్రభుత్వం, మంత్రి నారాయణ కక్ష కట్టారన్నారు. ఏళ్ల నుంచి పనిచేస్తున్న మున్సిపల్ వర్కర్లను తొలగించడానికి ప్రభుత్వం ప్రయత్నం చేయడం దుర్మార్గమన్నారు.

ఈ కార్యక్రమంలో సీఐటీయూ నగర అధ్యక్షురాలు లక్ష్మీదేవి, యూనియన్ నాయకులు చెన్నయ్య, విజయ్, కేశవ్, గోపీ, ఆనంద్ తదితరులు పాల్గొన్నారు.

కరువు పట్ల కనికరించని ప్రభుత్వాలు

- ఏపీ రైతు సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షుడు నారాయణ



మాట్లాడుతున్న రైతు సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షుడు నారాయణ

కడప, అర్బన్: జిల్లాలోని 40 మండలాల్లో తీవ్ర వర్షాభావ పరిస్థితులు నెలకొన్నాయని అన్ని విధాలుగా రైతులను ఆదుకోవాలని ఏపీ రైతు సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షుడు నారాయణ డిమాండ్ చేశారు. కడప రైతు సంఘం జిల్లా కార్యాలయంలో శుక్రవారం ఆయన పాత్రికేయులతో మాట్లాడారు. గత 40 ఏళ్లుగా జిల్లాలో కరువు రక్కసికి రైతాంగం విలవిల్లాడుతుందన్నారు. 2017 ఖరీఫ్ సీజన్‌లో అక్కడక్కడ వేసిన వేరుశనగ పంట ఎండదశకు చేరుకున్నదన్నారు. లక్ష 50 వేల హెక్టార్లలో పంటలు వేయాల్సి వుంటే ఈ ఖరీఫ్‌లో 13 వేల హెక్టార్లలో మాత్రమే పంటలు వేశారని దీన్ని బట్టి చూస్తే వర్షం ఎంత లోటు వుందో అర్థమవుతుందన్నారు.

కరువు పట్ల పాలక ప్రభుత్వాలు కనికరించకపోతే ప్రజా ఉద్యమానికి శ్రీకారం చుడతామని హెచ్చరించారు. ఈ సమావేశంలో జిల్లా కార్యదర్శి దస్తగిరి తదితరులు పాల్గొన్నారు.

రాష్ట్రపతి అవార్డుకు ఎంపికైన సాయిబాబా స్కౌట్ విద్యార్థులు



రాష్ట్రపతి అవార్డుకు ఎంపికైన సాయిబాబా స్కౌట్ విద్యార్థులు

కడప, ఎర్రముక్కపల్లె : 2016-2017 విద్యాసంవత్సరంలో జరిగిన తృతీయ సోపాన్ టెస్టింగ్, రాజ్య పురస్కార్ క్యాంపస్‌లో కడప జిల్లాలోని అన్ని పాఠశాలల నుంచి 200 మంది విద్యార్థులు పాల్గొన్నారు. ఇందులో 11 మంది సాయిబాబా విద్యార్థులు రాష్ట్రపతి అవార్డుకు ఎంపికయ్యారు. వీరందరినీ సాయిబాబా విద్యాసంస్థల అధినేత రామచంద్రారెడ్డి అభినందించారు. కార్యక్రమంలో పాఠశాల స్కౌట్ మాస్టర్ బి.రామమనోహర్‌రెడ్డి పాల్గొన్నారు.

సినిమా గైడ్

కడప సినిమాలు

మురళి	: గౌతమ్‌నంద
రవి	: ఫిదా
సుధ	: నాకునేనే
ప్రతాప్	: వాసుకి
అమీర్	: దండుపాళ్యం-2
రమేష్	: గౌతమ్‌నంద
తాహెర్	: ముబారకన్
అప్సర	: శమంతకమణి
రాజా	: డీజే
ఎస్ఆర్	: నిన్నుకోరి

విద్యారంగ సమస్యను పరిష్కరించండి

- ధర్నాలో ఎస్ఎన్ఎస్ఎఫ్ జిల్లా అధ్యక్షుడు బాబు

కడప, మారుతీనగర్ : విద్యారంగ సమస్యలను పరిష్కరించడంలో రాష్ట్ర ప్రభుత్వం పూర్తిగా విఫలమైందని నవనిర్మాణ్ స్టూడెంట్స్ ఫెడరేషన్ జిల్లా అధ్యక్షుడు ఎం.బాబు ఆగ్రహం వ్యక్తం చేశారు. పాలక ప్రభుత్వం విద్యార్థుల సమస్యలను గాలికి వదిలేసిందన్నారు. కార్పొరేట్, ప్రైవేటు విద్యాసంస్థలలో ఫీజుల దోపిడీ అరికట్టాలని, మౌలిక సదుపాయాలు కల్పించాలని డిమాండ్ చేస్తూ ఎన్ఎన్ఎస్ఎఫ్ జిల్లా కమిటీ ఆధ్వర్యంలో శుక్రవారం ఆర్టీసీ బస్టాండు సమీపంలోని అంబేద్కర్ విగ్రహం వద్ద ధర్నా నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ కార్పొరేట్ వ్యవస్థకు పాలక ప్రభుత్వం అమ్ముడు పోయిందన్నారు. ధరలకు అనుగుణంగా హాస్టల్స్ విద్యార్థులకు మెస్, కాస్మోటిక్ ఛార్జీలు పెంచాలన్నారు. లేకుంటే కలెక్టరేట్ ముట్టడిస్తామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో ఎన్ఎన్ఎస్ఎఫ్ జిల్లా కార్యదర్శి విశ్వ, మనోజ్, వాసు, శ్యామ్, సిద్ధు, మహేష్, నాగార్జున, విద్యార్థులు పాల్గొన్నారు.

రైతులకు పెంచిన జిప్సం, జింక్ మోతాదులు

సింహాద్రిపురం: వందశాతం సబ్సిడీతో రెండురోజులుగా పంపిణీ చేస్తున్న జిప్సం, జింక్ మోతాదులను పెంచినట్లు ఏఓ బాలగంగాధర్‌రెడ్డి తెలిపారు. గతంలో రెండు ప్యాకెట్ల జిప్సం, ఒక ప్యాకెట్ జింక్ రైతులకిచ్చేవారు. ప్రస్తుతం ఆ మోతాదును పెంచుతూ నాలుగు ప్యాకెట్ల జిప్సం లేదా రెండు ప్యాకెట్ల జింక్‌ను రైతులు పొందవచ్చన్నారు. భూసార పరీక్ష కార్డు, ఆధార్ జిరాక్సు తప్పనిసరిగా తీసుకొచ్చి రైతులు ఈ వందశాతం సబ్సిడీతో ప్రభుత్వం ఇచ్చే జిప్సం, జింక్‌లను తీసుకెళ్లాలని ఏఓ తెలిపారు. కార్యక్రమంలో ఏఈఓ భార్గవ రెడ్డి, ఎంపీఈఓలు పాల్గొన్నారు.

జగన్‌కు పరుష పదజాలం తగదు

వేంపల్లెలో జగన్ దిష్టిబొమ్మ దహనం

వేంపల్లె: ప్రతిపక్ష నేతకు పరుష పదజాలం తగదని రాష్ట్ర మైనార్టీ సెల్ మాజీ కార్యదర్శి షబ్బీర్, జిల్లా అధికార ప్రతినిధి నంద్యాల హేమాద్రిరెడ్డి, మార్కెట్ యార్డు వైస్‌ఛైర్మన్ దొంతు సుబ్బారావు, కులశేఖర్‌రెడ్డి హితవు పలికారు. శుక్రవారం వారు విలేకరులతో మాట్లాడుతూ ప్రతిపక్షనేత వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి అధికార దాహంతో ముఖ్యమంత్రి చంద్ర బాబునాయుడుపై పరుష పదజాలాన్ని ఉప యోగించడంతో ప్రజలు భయాందోళనలకు గురవుతున్నారన్నారు. దివంగతనేత వైఎస్ కూడా ఇంతటి పరుష పదజాలం ఎప్పుడూ ఉపయోగించలేదన్నారు. దీన్ని బట్టి చూస్తుంటే జగన్ నిరాశ నిస్పృహలతో ఇష్టమొచ్చినట్లు మాట్లాడుతున్నారన్నారు. వైసీపీ రోజురోజుకూ బలహీనపడుతుండడంతో వైఎస్ జగన్ ఇలాంటి వ్యాఖ్యలు చేస్తున్నారని తెలిపారు.

జగన్ దిష్టిబొమ్మ దహనం

ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడుపై వైఎస్ జగన్ చేసిన వ్యాఖ్యలను నిరసిస్తూ వేంపల్లెలో జగన్ దిష్టిబొమ్మను దహనం చేశారు. నాలుగురోడ్ల కూడలిలో టీడీపీ నేత మాజీ గ్రంథాలయ ఛైర్మన్ మునిరెడ్డి, తెలుగు యువత ప్రధాన కార్యదర్శి శేషారెడ్డి, కుమ్మరాంపల్లె బాస్కర్‌రెడ్డి, దేవస్థాన ఛైర్మన్లు రాజారావు, ఎద్దల కొండ్రాయుడు, సభ్యులు జగన్ దిష్టిబొమ్మను దహనం చేసి జగన్‌కు వ్యతిరేకంగా నినాదాలుచేశారు. కార్యక్రమంలో టీడీపీ నాయకులు సాంబశివారెడ్డి, పివి రమణ, శ్రీనివాసులు, రత్నం, ప్రభాకర్‌రెడ్డి, ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.



విలేకరులతో మాట్లాడుతున్న షబ్బీర్, హేమాద్రిరెడ్డి తదితరులు

ముందురోజే గండి చేరుకున్న భక్తులు

నేడు రెండవ శ్రావణ శనివారం



శుక్రవారమే గండి చేరుకున్న భక్తులు

చక్రాయపేట: శ్రావణమాసోత్సవాల్లో భాగంగా శుక్రవారమే భక్తులు గండికి పోటెత్తారు. నేడు రెండవ శ్రావణ శనివారం మొదటి వారం భక్తులతో కిక్కిరిసిపోయింది. రెండో వారం కూడా అదే రీతిలో భక్తులు గండికి వస్తారన్న ఉద్దేశంతో గండి అంజన్నను దర్శించుకునేందుకు వీలుగా భక్తులు ముందు రోజే గండి చేరుకున్నారు. దీంతో అధికారులు భక్తుల కోసం తగు ఏర్పాట్లు చేశారు. సహాయ కమిషనర్ గురుప్రసాద్, ఛైర్మన్ రాజారావు పనులను పరిశీలించారు. శుక్రవారం గండి చేరుకున్న భక్తులు శనివారం వేకువనే అంజన్నను దర్శించుకుంటారు. ఇందుకు క్యూలైన్లు, ప్రసాదాలు, తాగునీరు, స్నానపు ఘట్టాల ఏర్పాట్లు పూర్తయ్యాయి. భక్తుల కాలక్షేపం కోసం వినోద కార్యక్రమాలు కూడా ఏర్పాటు చేశారు. రెండోవారం వైభవంగా నిర్వహించేందుకు ముమ్మర ఏర్పాట్లు చేస్తున్నారు. అన్నదానం చేసేందుకు పలువురు దాతలు గండికి చేరుకున్నారు. భక్తులకు ప్రసాదాలు తక్కువ రాకుండా తయారు చేస్తున్నారు. చలువపందిళ్లు ఏర్పాటుచేశారు.

ప్రతి ఒక్కరూ మొక్కలు నాటాలి



మొక్కలు నాటుతున్న ఛైర్‌పర్సన్ ప్రమీల

పులివెందుల టౌన్: ప్రతి ఒక్కరూ మొక్కలు నాటి వాటిని సంరక్షించే బాధ్యత తీసుకోవాలని మున్సిపల్ ఛైర్‌పర్సన్ వైఎస్ ప్రమీల పేర్కొన్నారు. శుక్రవారం వనం-మనంలో భాగంగా మున్సిపల్ కమిషనర్ మధుసూదన్‌రెడ్డి ఆధ్వర్యంలో 1000 మొక్కలు నాటారు. ఈ సందర్భంగా కడప రోడ్డులో రిలయన్స్ పెట్రోల్ బంక్ నుంచి డివైడర్ల మధ్యలో మొక్కలు నాటిన సందర్భంగా ఆమె మాట్లాడుతూ పర్యావరణాన్ని పరిరక్షించేందుకు ప్రతి ఒక్కరూ మొక్కలు నాటాలన్నారు. ప్రస్తుతం కాలుష్యం ఎక్కువగా ఉందని దానిని అధిగమించేందుకు మొక్కలు నాటాలన్నారు. మొక్కలు పెంచితే వర్షాలు కురుస్తాయన్నారు. కౌన్సిలర్ వైఎస్ మనోహర్‌రెడ్డి, మున్సిపల్ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

చంద్రన్న రైతు క్షేత్రాలుగా మూడు గ్రామాలు ఎంపిక

సింహాద్రిపురం: చంద్రన్న రైతు క్షేత్రాలుగా గురిజాల, బొజ్జాయిపల్లె, తెలికి గ్రామాలు ఎంపికైనట్లు వ్యవసాయాధికారి బాలగంగాధర్‌రెడ్డి తెలిపారు. ఈ గ్రామాల నుంచి ఒక్కో గ్రామంలో ఎంపికకాబడ్డ 10 మంది రైతులకు ఒక్కొక్కరికి ఉచితంగా 10ప్యాకెట్ల జిప్సం, 2.50కిలోల ట్రైకోడెర్మవిరిడే, వేపపిండి ఇస్తారన్నారు. కాగా ఎంపికైన రైతులు ఇప్పటికే వేరుశనగ సాగుచేసి ఉండాలన్నారు.

గండికి ప్రత్యేక బస్సులు

పులివెందుల టౌన్: పులివెందుల ఆర్టీసీ డిపో నుంచి ప్రముఖ పుణ్యక్షేత్రం గండికి ఎనిమిది ప్రత్యేక బస్సులను నడుపుతున్నట్లు ఆర్టీసీ డీఎం అజ్మతుల్లా పేర్కొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ భక్తులు ప్రైవేటు వాహనాలు ఆశ్రయించకుండా ఆర్టీసీలోనే ప్రయాణించి సురక్షితంగా గండి ఆంజనేయస్వామిని దర్శించుకోవాలని ఆకాంక్షించారు. ఈ అవకాశాన్ని ప్రయాణికులు, భక్తులు సద్వినియోగం చేసుకుని ఆర్టీసీకి ఆదాయం వచ్చేలా కృషిచేయాలని ఆయన విజ్ఞప్తి చేశారు. ఆర్టీసీ ప్రయాణం సురక్షిత ప్రయాణమన్నారు.

గ్రామసభల్లో లబ్ధిదారుల గుర్తింపు



బలపనూరులో హౌసింగ్ లబ్ధిదారుల ఎంపిక గ్రామసభ దృశ్యం

సింహాద్రిపురం: మండలంలోని నాలుగు గ్రామాల్లో హౌసింగ్ లబ్ధిదారుల అర్హులు, అనర్హుల జాబితాను అధికారులు ప్రకటించారు. ఈ సందర్భంగా ఎంపీడీఓ సోమశేఖర్ రెడ్డి అధ్యక్షతన కోవరంగుట్టపల్లె, కాంబల్లెల్లో గ్రామసభలు జరిగాయి. తహసీల్దార్ సుబ్బరామయ్య అధ్యక్షతన బలపనూరు, బొజ్జాయిపల్లెలో గ్రామసభలు జరిగాయి. ఈ సందర్భంగా హౌసింగ్ ఏఈ రమణారెడ్డి సమాచారం మేరకు బలపనూరులో 280 మందిని అర్హులుగా గుర్తించామన్నారు. కోవరంగుట్టపల్లెలో 87 మంది అర్హులుగా, బొజ్జాయిపల్లెలో 52 మంది, కాంబల్లెలో 31 మంది అర్హులుగా గుర్తించినట్లు తెలిపారు. సిబ్బంది పాల్గొన్నారు.

అటవీ అభివృద్ధికి బాధ్యతగా పనిచేయండి

రేంజ్ అధికారి స్వామివివేకానంద

వేంపల్లె: అటవీ అభివృద్ధికి సిబ్బంది బాధ్యతగా పనిచేయాలని వేంపల్లె అటవీశాఖ రేంజర్ స్వామి వివేకానంద సూచించారు. స్థానిక అటవీశాఖ కార్యాలయంలో శుక్రవారం ఫారెస్టు బీట్ ఆఫీసర్లు, అసిస్టెంట్ ఫారెస్టు బీట్ ఆఫీసర్లు, కార్యాలయ సిబ్బందితో నిర్వహించిన సమావేశంలో అటవీ అభివృద్ధికి చేపడుతున్న చర్యలు అక్రమాల నిరోధానికి చేపడుతున్న చర్యలు, తనిఖీలు ఇతర విషయాలపై సమీక్షించారు. ఆయా బీట్ల పరిధిలో సిబ్బంది ఎప్పటి సమాచారం అప్పుడే అధికారులకు తెలియజేస్తుండాలని తెలిపారు. ఎర్రచందనంపై ప్రత్యేక నిఘా ఉంచాలని బీట్ అధికారులను ఆదేశించారు. ఆయన విలేకరులతో మాట్లాడుతూ వర్షం వస్తూనే మొక్కలు పంపిణీకి సిద్ధం చేశామన్నారు. సీడ్‌బాల్స్ తయారు చేసి మొక్కలు లేనిచోట పెంచేందుకు చర్యలు చేపడుతున్నామని తెలిపారు. వీఆర్వో శ్రీనివాసులు, సెక్షన్ ఆఫీసర్ లక్ష్మీకుమారి తదితరులు పాల్గొన్నారు.



విలేకరులతో మాట్లాడుతున్నరేంజ్ అధికారి స్వామివివేకానంద

సినిమా గైడ్

పులివెందుల	
మారుతి	: ఫిదా
లక్ష్మీ	: నక్షత్రం
రాఘవేంద్ర	: వైశాఖం
శ్రీనివాస	: గౌతంనంద
సుజాత	: దర్శకుడు
వేంపల్లె	
తిరుమల	: నిన్నుకోరి
వెంకటేశ్వర	: ఫిదా
నూర్జహాన్	: గౌతంనంద

సీసీరోడ్డును ప్రారంభించిన సర్పంచు విష్ణు



రోడ్డును ప్రారంభిస్తున్న సర్పంచు విష్ణు

వేంపల్లె: వేంపల్లె సమగ్రాభివృద్ధికి కృషిచేస్తున్నట్లు వేంపల్లె సర్పంచు సింగారెడ్డి విష్ణువర్ధన్‌రెడ్డి పేర్కొన్నారు. వేంపల్లెలోని గండిరోడ్డులో రోడ్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్ నిధులతో ఏర్పాటుచేసిన సిమెంటు రోడ్డును శుక్రవారం సర్పంచు విష్ణువర్ధన్‌రెడ్డి ప్రారంభించారు. స్థానిక పెద్దమసీదు నుంచి చింతలమడుగుపల్లె రోడ్డు వరకు వేసిన సిమెంటు రోడ్డును పరిశీలించారు. కొత్తగా నిర్మాణ దశలో ఉన్న మురుగు కాల్వను పరిశీలించి ఈఓ నాగభూషణంరెడ్డికి సూచనలిచ్చారు. వేంపల్లె పంచాయితీ పరిధిలో సతీష్‌రెడ్డి సహకారంతో వీధివీధిలో సిమెంటు రోడ్లు వేసేందుకు అన్ని చర్యలు చేపట్టామన్నారు.

కార్యక్రమంలో తెలుగుయువత జిల్లా ప్రధాన కార్యదర్శి ఎద్దుల శేషారెడ్డి, ఉపసర్పంచు మునీర్, కుమ్మరాంపల్లె భాస్కర్‌రెడ్డి, జిల్లా కార్యదర్శి మోహన్‌రెడ్డి, పివి రమణ, గండి ఛైర్మన్ రాజారావు, ఆర్ఎంఎస్ షౌకత్, పసుపులేటి బాబు, చౌడం కొండయ్య, మైనార్టీ నేతలు మహబూబ్ షరీఫ్, గౌస్‌బాషా, రమణ తదితరులు పాల్గొన్నారు.

ఆంధ్రాబ్యాంకు మేనేజర్‌గా సుధాకర్‌రావు



బ్రహ్మంగారిమఠం : మండల కేంద్రంలోని స్థానిక ఆంధ్రాబ్యాంకు మేనేజర్‌గా కె.సుధాకర్ రావు శుక్రవారం బాధ్యతలు చేపట్టారు. బి.మఠంలో పనిచేస్తున్న మేనేజర్ కర్నూలు జిల్లా నంద్యాలకు బదిలీ అయ్యారు. ప్రస్తుత మేనేజర్‌గా ఇంజిమూరు మండలం నుంచి బి.మఠానికి బదిలీపై వచ్చారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఖాతాదారులకు మెరుగైన సేవలను అందించడమే తమ లక్ష్యమని పేర్కొన్నారు.

వైభవం...వరలక్ష్మీ వ్రతం



దువ్వూరు : ప్రత్యేక అలంకరణలో అమ్మవారు



వరలక్ష్మీ వ్రతంలో పాల్గొన్న మహిళలు





చాపాడు : వేదమంత్రాలు చదువుతున్న పురోహితులు, వరలక్ష్మీ వ్రతంలో పాల్గొన్న మహిళలు



ఖాజీపేట : అమ్మవారిశాలలో వరలక్ష్మీవ్రతంలో పాల్గొన్న భక్తులు

దువ్వూరు : మండల పరిధిలోని పెద్దజొన్నవరం గ్రామంలో వైభవంగా వరలక్ష్మీ వ్రతం నిర్వహించారు. సమరసత సేవా ఫౌండేషన్ ఆధ్వర్యంలో గ్రామంలోని అమ్మవారిశాలలో సామూహిక వరలక్ష్మీ వ్రతం చేశారు. ఈ సందర్భంగా అమ్మవారికి ప్రత్యేక అలంకరణ గావించారు. అర్చకులు నరసింహయ్య మాట్లాడుతూ వరలక్ష్మీ వ్రతం చేయడం ద్వారా మహిళలు సౌభాగ్యవంతులు అవుతారని, తాము ఎదుర్కొంటున్న కష్టాలు తొలగి మంచి వరాలు పొందుతారన్నారు. అనంతరం గ్రామానికి చెందిన మహిళలు సామూహిక వరలక్ష్మీ వ్రతంలో పాల్గొని పూజలు నిర్వహించారు. సమరసత ఫౌండేషన్ ధర్మ ప్రచారక్ ఓబులేసు, మండల కన్వీనర్ ఆవుల ప్రసాద్, మహిళలు పాల్గొన్నారు.

● కోదండరామస్వామి దేవస్థానంలో

పాత దువ్వూరులోని కోదండ రామస్వామి దేవాలయంలో ఘనంగా వరలక్ష్మీ వ్రతం నిర్వహించారు. ఈ సందర్భంగా దువ్వూరు, చుట్టుపక్కల గ్రామాలకు చెందిన మహిళలు అధిక సంఖ్యలో వ్రతంలో పాల్గొన్నారు. ఆలయ చైర్మన్ గురప్ప, తదితరులు పాల్గొన్నారు.

బ్రహ్మంగారిమఠంలో...

బ్రహ్మంగారిమఠం : మండల కేంద్రంలోని స్థానిక కన్యకాపరమేశ్వరి అమ్మవారిశాలలో శుక్రవారం భక్తిశ్రద్ధలతో వరలక్ష్మీ వ్రతం నిర్వహించారు. అమ్మవారిశాల అధ్యక్షుడు ముచ్చర్ల చిన్నవెంకటసుబ్బయ్య, కార్యదర్శి ముచ్చర్ల శేషయ్య, పర్యవేక్షణలో భక్తులకు సౌకర్యాలను కల్పించారు. మహిళలు, ఆర్యవైశ్యలు అధిక సంఖ్యలో పాల్గొని అమ్మవారికి ప్రత్యేక పూజలు, కుంకుమార్చనలు నిర్వహించారు. అనంతరం కమిటీ సభ్యులు తీర్థప్రసాదాలను అందజేశారు. కార్యక్రమంలో పబ్బతి నాగేశ్వరరావు, మాకం గుర్రయ్య, సూర్యనారాయణ, శ్రీనివాసులు తదితరులు పాల్గొన్నారు.

చాపాడులో...

చాపాడు : మండలంలోని అల్లాడుపల్లె వీరభద్రస్వామి దేవాలయంలో, చాపాడులోని మారెమ్మ గుడిలో శుక్రవారం వరలక్ష్మీ వ్రతం ఘనంగా నిర్వహించారు. లక్ష్మీదేవి అమ్మవారి చిత్రపటానికి పూలమాలలు వేసి ప్రత్యేకంగా పూజలు చేశారు. అల్లాడుపల్లె, భద్రిపల్లె, కేతవరం, సీతారామపురం, లక్ష్మీపేట, చాపాడు తదితర గ్రామాల నుంచి వచ్చిన మహిళలు పూజా కార్యక్రమాల్లో పాల్గొన్నారు. ఆదేవస్థానం చైర్మన్ గోసుల వీరారెడ్డి, ఈవో వెంకటరమణారెడ్డి, పోగ్రెసివ్ ఫౌండేషన్ అధ్యక్షుడు చాపాటి రామసుధాకర్‌రెడ్డి, ఆధ్వర్యంలో వరలక్ష్మి వ్రతం నిర్వహించారు. భక్తులకు అన్నదానం నిర్వహించారు.

ఖాజీపేటలో...

ఖాజీపేట : శ్రావణ శుక్రవారానికి ప్రత్యేకత వుంది. అందులో వరలక్ష్మీ వ్రతం కావడంతో అమ్మవారిని భక్తిశ్రద్ధలతో పూజిస్తే సకల సౌకర్యాలు సిద్దిస్తాయని భక్తుల నమ్మకం. తెల్లవారుజామునే ఇంటిని శుభ్రం చేసి మామిడి తోరణలు, కట్టి అందంగా అలంకరించుకున్నారు. అమ్మవారిని ప్రత్యేక అలంకారంలో చేసి పూజించారు. స్థానిక అమ్మవారిశాలలో వరలక్ష్మి వ్రతం ఘనంగా జరిపారు. దుంపలగట్టులోని రామాలయంలో సత్యనారాయణ వ్రతం చేశారు. సాయిబాబా, శ్రీవెంకటేశ్వరస్వామి ఆలయం, శివాలయంలో భక్తుల సందడి నెలకొంది.

12 నుంచి వర్షం కోసం పూజలు

చాపాడు: మండలంలోని అల్లాడుపల్లె వీరభద్రస్వామి దేవాలయంలో ఈనెల 12 నుంచి 14వ తేదీ వరకు వర్షం కోసం శివునికి ప్రత్యేక పూజలు నిర్వహిస్తున్నట్లు ఆ దేవస్థానం చైర్మన్ గోసుల వీరారెడ్డి, ఈవో వెంకటరమణారెడ్డి తెలిపారు. 14న సహస్ర ఘటాభిషేకం ఉంటుందని చెప్పారు. దేవాదాయ శాఖ, హిందూధర్మ పరిరక్షణ ట్రస్టు ఆధ్వర్యంలో ఈ కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నామన్నారు. అన్ని గ్రామాల ప్రజలు ఈ కార్యక్రమంలో పాల్గొనాలని కోరారు.

నేడు జలసిరి లబ్ధిదారులకు సమావేశం

దువ్వూరు : మండల పరిధిలో జలసిరి పథకం ద్వారా బోర్లు వేసుకున్న లబ్ధిదారులకు ఎంపీడీవో సభాభవనంలో సమావేశం నిర్వహిస్తున్నట్లు ఎంపీడీవో ఏపీ రమణారెడ్డి పేర్కొన్నారు. గత ఏడాది ఉపాధి హామీ పథకం కింద జలసిరి పథకం ద్వారా బోర్లు వేసుకున్న రైతులందరూ సమావేశానికి హాజరు కావాలన్నారు. సోలార్ పంపు సెట్లు ఏర్పాటు చేసుకునేందుకు, వాటిని గురించి వివరించేందుకు ఏపీడీ రామవేంద్రనాథ్ సమావేశానికి హాజరువుతారని, లబ్ధిదారులు తప్పక హాజరుకావాలన్నారు.

8న నిరుద్యోగులకు ఇంటర్వ్యూలు

చాపాడు: ఈనెల 8న మంగళవారం ఉదయం నుంచి సబ్సిడీ బ్యాంకు రుణాల కోసం ఇంటర్వ్యూలు నిర్వహిస్తున్నట్లు ఎంపీడీవో రామదాసు తెలిపారు. ఉదయం ఎస్సీ, ఎస్టీలకు, మైనార్టీలకు, మధ్యాహ్నం కాపులకు, బీసీలకు ఇంటర్వ్యూలు నిర్వహిస్తామన్నారు. నిరుద్యోగులు ఒరిజినల్ సర్టిఫికెట్లు తీసుకురావాలని ఆయన తెలిపారు.

విద్యుత్ షాక్‌తో గేదె మృతి

ఖాజీపేట: మండల పరిధిలోని ఆంజనేయకొట్టాలు గ్రామానికి చెందిన మంద నరసింహులు అనే రైతుకు చెందిన గేదె శుక్రవారం మేతకోసం వెళ్లి విద్యుత్ షాక్‌తో మృతి చెందింది. ఆంజనేయ కొట్టాలు సమీపంలోని రోడ్డు ప్రక్కన డిష్‌వైర్ తెగి కిందికి వేలాడుతూ వుండేది. ఆ డిష్‌వైరుకు విద్యుత్ సరఫరా జరుగుతుండడంతో మేతకు వెళ్లిన గేదెకు తగిలి అక్కడికక్కడే మృతిచెందిందని బాధితుడు నరసింహులు తెలిపారు. దాదాపు రూ.80వేలు వరకు నష్టం వాటిల్లిందని ఆయన తెలిపారు.

పిల్లల సంపూర్ణ ఆరోగ్యానికి ఎంఆర్‌టీకా తప్పనిసరి



పిల్లలకు టీకా వేస్తున్న డాక్టర్ మేరీసుజాత

బ్రహ్మంగారిమఠం : పిల్లలు సంపూర్ణ ఆరోగ్యంగా ఉండటానికి ఇటీవల ప్రభుత్వం ప్రవేశపెట్టిన ఎంఆర్‌టీకాను తప్పక వేయించాలని బి.మఠం వైద్యాధికారిణి మేరీసుజాత తెలిపారు. ఈ సందర్భంగా ఆమె పీహెచ్‌సీలో మాట్లాడుతూ 8 అంగన్వాడీ కేంద్రాల్లో 400మందికి ఎంఆర్ టీకాలు వేయాల్సి ఉండగా, 364మందికి వేశామని తెలిపారు. 9నెలల నుంచి 15సంవత్సరాలలోపు పిల్లలకు టీకాను వేయించాలన్నారు. కార్యక్రమంలో సూపర్‌వైజర్లు సుకన్య, రమణయ్య, హెల్త్‌అసిస్టెంట్లు రమణ, క్రిష్టఫర్, స్టాఫ్‌నర్స్ జీవమ్మ, ఏఎన్ఎం బుజ్జమ్మ, అంగన్వాడీ టీచర్లు ఎం.అనురాధ తదితరులు పాల్గొన్నారు.

వ్యర్థపదార్థాల గిడ్డంగులు ఏర్పాటు చేయాలి



మాట్లాడుతున్న ఎంపీడీఓ జగదీశ్వరరెడ్డి

బ్రహ్మంగారిమఠం : మండలంలోని 11పంచాయితీల్లో చెత్త చెదారం, వర్థపదార్థాలను సేకరించే గిడ్డంగులను ఏర్పాటు చేయాలని మండలాధ్యక్షుడు దేవర్ల చక్రవర్తి పేర్కొన్నారు. శుక్రవారం ఎంపీడీఓ కార్యాలయంలో సర్పంచ్‌లు, పంచాయతీ సెక్రటరీలకు, ఉపాధి సిబ్బందికి ఎంపీడీఓ జగదీశ్వరరెడ్డి పర్యవేక్షణలో అవగాహన సదస్సును చేపట్టారు. ఈ సందర్భంగా ఎంపీపీ చక్రవర్తి, ఎంపీడీఓలు మాట్లాడుతూ గ్రామాల్లో చెత్తను ఎక్కడంటే అక్కడ వేయకుండా, చెత్త సేకరన గిడ్డంగులను ఏర్పాటు చేసి, తద్వారా వర్మీ కంపోస్టులు ఎరువులు తయారుచేసి రైతులకు సంపదను కల్పించడమే లక్ష్యమన్నారు. ఈఓపీఆర్డీ రామచంద్రారెడ్డి, ఉపాధి ఏపీఓ రవీంద్రారెడ్డి, ఆర్‌డబ్ల్యుఎస్ ఏఇ బాలక్రిష్ణ, ఉపాధి సిబ్బంది, టెక్నికల్ అసిస్టెంట్లు, సర్పంచ్‌లు, పంచాయతీ సెక్రటరీలు పాల్గొన్నారు.

వర్మీ కంపోస్టుతో గ్రామాల అభివృద్ధి



మాట్లాడుతున్న ఎంపీడీవో రామదాసు

చాపాడు: వర్మీ కంపోస్టుతో తయారైన సేంద్రియ ఎరువులు గ్రామాల అభివృద్ధికి ఉపయోగపడుతాయని ఎంపీడీవో రామదాసు అన్నారు. ఎంపీడీవో కార్యాలయంలో శుక్రవారం వర్మీ కంపోస్టుపై సమావేశం నిర్వహించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ గ్రామంలో ఉన్న చెత్త, ఇతర వ్యర్థాలను సేంద్రియ ఎరువుగా తయారు చేసుకోవచ్చన్నారు. ఇందుకు ప్రభుత్వ స్థలాలను ఏర్పాటు చేస్తున్నట్లు చెప్పారు. గ్రామాలు పరిశుభ్రంగా ఉండేందుకు సర్పంచులు సహకరించాలని కోరారు. డిప్యూటీ తహసీల్దారు మనోహర్‌రెడ్డి, ఈవోపీఆర్డీ వెంకటసుబ్బారెడ్డి, ఏపీవో పార్వతమ్మ, ఈసీ రాదాకుమారి, ఫీల్డ్ అసిస్టెంట్లు పాల్గొన్నారు.

ఆసుపత్రిలో మౌలిక వసతులు సమకూర్చాలి

మైదుకూరు : ప్రభుత్వ వైద్యశాలలో రోగులకు సరిపడ కనీస మౌలిక వసతులు కల్పించాలని సీపీఐ నాయకులు వైద్యాధికారి వెంకటేశ్వర్లును కోరారు. స్థానిక ఆసుపత్రిలో శుక్రవారం నాయకులు ఏవి రమణ, శ్రీరాములు, సుబ్బరాయుడు, శ్రీనివాసులు తదితరులు కలసి వైద్య సిబ్బందిని భర్తీ చేయాలని, 24 గంటల పాటు వైద్యులను ఉంచాలని, తగిన మౌలిక సదుపాయాలు కల్పించాలని వినతి పత్రంలో పేర్కొన్నారు. తగిన చర్యలు తీసుకోక పోతే ఆందోళన చేస్తామని హెచ్చరించారు.

మానవత సేవలను మరింత విస్తరిస్తాం

ఎర్రగుంట్ల: మానవత సేవలు మరింత విస్తరించి చిత్తశుద్ధితో సేవలు అందిస్తామని ఆ సంస్థ వ్యవస్థాపకుడు రామచంద్రారెడ్డి పేర్కొన్నారు. ఎర్రగుంట్లలో శుక్రవారం నిర్వహించిన కార్యక్రమంలో రామచంద్రారెడ్డి ముఖ్యఅతిథిగా పాల్గొని ప్రసంగించారు. మానవసేవే మాధవసేవగా భావించి ప్రతిఒక్కరూ తమ శక్తిమేరకు సహకారం అందించి సేవలకు తోడ్పాటునందించాలన్నారు. ఈ సందర్భంగా నూతన కమిటీని ప్రకటించారు. కార్యక్రమంలో రఘురామిరెడ్డి, మునిరెడ్డి, మడకామునెయ్య, సూర్యనారాయణరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

నేటి నుంచి చివరి విడత కౌన్సెలింగ్

ప్రొద్దుటూరు పుట్టపర్తి సర్కిల్: ఈ ఏడాది ఏపీ ఎంసెట్ కౌన్సిలింగ్‌లో జిల్లాలోని సుమారు 11 ఇంజనీరింగ్ కళాశాలల్లోని 29 కోర్సుల్లో 0-10లోపు మాత్రమే విద్యార్థులు ప్రవేశాలు పొందారు. దీంతో ఈ ఇంజనీరింగ్ కళాశాలల్లో ఆ కోర్సులను మూసివేసే పరిస్థితులు ఏర్పడ్డాయి. కడపలోని రెండు కాలేజీల్లో ప్రొద్దుటూరు సమీపంలోని ఒక కాలేజీలో, రాజంపేటలోని రెండు కాలేజీల్లో, బద్వేలులోని ఒక కాలేజీలో కొన్ని కోర్సుల్లో సున్నా అడ్మిషన్లు వచ్చాయి. ఆ కాలేజీల్లో మొత్తం 9 కోర్సుల్లో కనీసం ఒక్క అడ్మిషన్ కూడా రా లేదు. జిల్లాలోని మరో అయిదు ఇంజనీరింగ్ కాలేజీల్లోని 20 కోర్సుల్లో 10 మందిలోపు మాత్రమే విద్యార్థులు ప్రవేశాలు తీసుకున్నారు. ప్రొద్దుటూరు, రాయోటి, కడప, బద్వేలు, రాజంపేలోని కాలేజీలు ఉన్నాయి. జాబితాను ఏపీ ఎంసెట్ వెబ్‌సైట్‌లో అధికారులు పెట్టారు.

రెండు వార్డుల్లో డ్రైనేజీ ఏర్పాటు

ఎర్రగుంట్ల: రూ.30లక్షల స్టేట్ ఫైనాన్స్ కార్పొరేషన్ నిధులతో 10,11వార్డుల్లో డ్రైనేజీని ఏర్పాటు చేసేందుకు అధికారులు శుక్రవారం మార్కింగ్ ఇచ్చారు. నిధులు వెనక్కివెళతాయనే ఉద్దేశంతో ఎట్టకేలకు డ్రైనేజీని నిర్మించేందుకు సన్నదమవుతున్నారు. పోలీసుస్టేషన్ వెనుకవైపు, పక్కసందుల్లో 10,11 వార్డుల్లో ఈ పనులు చేసేందుకు రోడ్డు ఆక్రమణలు అడ్డవస్తున్నాయి. దీంతో శుక్రవారం ఏఈ సురేంద్రబాబు, టౌన్‌ప్లానింగ్ అధికారి ఇందిరలు సిబ్బందితో కలిసి ఆయా వీదుల్లో మార్కింగ్ ఇచ్చారు. 12అడుగులు సీసీ రోడ్డు ఉండాల్సివుండగా కేవలం 9అడుగులు మాత్రమే ఉందని వారు తెలిపారు. మార్కింగ్ ఇచ్చిన చోట్టుకు వారంలోపు యజమానులు స్వచ్ఛందంగా తొలగించుకోవాలని,లేదంటే తామే తొలగిస్తామని ఏఈ తెలిపారు.

ముంపువాసుల పూర్తి సమాచారం ఇవ్వండి



సమావేశంలో మాట్లాడుతున్న జిల్లా జాయింట్ కలెక్టర్ శివారెడ్డి, హాజరైన తహసీల్దారు

జమ్మలమడుగు రూరల్: గండికోట ముంపువాసులకు సంబంధించి సర్వే చేసిన పూర్తి సక్రమమైన జాబితాను తహసీల్దార్లు ఇవ్వాలని కడపజిల్లా జాయింట్ కలెక్టర్-2 శివారెడ్డి సూచించారు. శుక్రవారం సాయంత్రం ఆయన జమ్మలమడుగు ఆర్డీవో కార్యాలయ సభాభవనంలో డివిజనల్‌స్థాయిలోని తహసీల్దార్లతో సమావేశం అయ్యారు. సమావేశంలో గతంలో జరిగిన అవకతవకలు, అక్రమాలపై చర్చించినట్లు తెలుస్తోంది. గత ఆర్డవో చేసిన అక్రమాలపై తహసీల్దార్లతో ఆయన చర్చించినట్లు సమాచారం. జమ్మలమడుగులో గత ఆర్డీవో వద్ద సీసీగా పని చేసిన ఉద్యోగిపై సిబ్బంది, అటెండర్లు, మరో కట్టుబడిపై అడిగినట్లు తెలుస్తోంది.

5వ తేదీ కడపలో జిల్లా కలెక్టర్ బాబూ రావునాయుడు ఆర్అండ్ఆర్ ప్యాకేజీకి సంబంధించి సమావేశం ఏర్పాటు చేస్తున్నట్లు అందుకు ముం దుగానే పూర్తిసమాచారం కోసం తహసీ ల్దార్లతో ఆయన సమావేశం అయినట్లు తెలుస్తోంది. ఏది ఏమైనా గతంలో పనిచేసిన ఆర్డీవోపై చర్చిం చుకోవడం ఈ సమావేశంలో సంతరిం చుకున్నట్లు తెలుస్తోంది. ఈ కార్యక్రమంలో డివిజన్‌లోని తహసీల్దార్లు, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

స్కూటరిస్టుకు తీవ్రగాయాలు

జమ్మలమడుగు రూరల్ : జమ్మలమడుగు మండలంలోని పి.సుగుమంచిపల్లె నాపరాళ్ల గనుల వద్ద ప్రధాన రోడ్డులో శుక్రవారం సాయంత్రం లారీ స్కూటరుకు ఢీకొని చల్లా సుదర్శన్‌రెడ్డి (32) అనే వ్యక్తికి తీవ్ర గాయాలు అయ్యాయి. బాధితుని వివరాల మేరకు దేవగుడి గ్రామానికి చెందిన సుదర్శన్ రెడ్డి వ్యవసాయం చేసి జీవనం సాగిస్తున్నారు. స్కూటరులో పనిమీద ప్రొద్దుటూరుకు బయల్దేరాడు. ఎదురుగా వచ్చిన లారీ ఢీకొందని, బాధితుడు తెలిపారు. ఘటనా స్థలంలో పడిపోయిన వెంటనే కళ్లకు మబ్బురావడంతో పక్కనే ఉన్న గనిగుంతల్లోకి వెళ్లి పడిపోయానని తెలిపారు. స్థానికులు తెలుసుకుని తాళ్లతో బయటకు తీసి 108లో జమ్మలమడుగు ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. మెరుగైన చికిత్స కోసం ప్రొద్దుటూరు ఆస్పత్రికరి తరలించారు. ఈ మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు.

279 జీవోను ఉపసంహరించుకునేవరకు పోరాడతాం

ప్రొద్దుటూరు అర్బన్: 279 జీవోను పూర్తిగా ఉపసంహరించుకునేవరకు పోరాటం తప్పదని సీఐటీయూ కార్యదర్శి సత్యనారాయణ మున్సిపల్ వర్కర్స్ యూనియన్ అధ్యక్షులు విజయ్‌కుమార్ ప్రభుత్వాన్ని హెచ్చరించారు. శుక్రవారం స్థానిక మున్సిపల్ కార్యాలయం వద్ద సీఐటీయూ అనుబంధ మున్సిపల్ వర్కర్స్ యూనియన్ ఆధ్వర్యంలో కార్మికులు ధర్నా చేపట్టారు. వర్కర్స్ యూనియన్ నేతలు ప్రమీలమ్మ, సాల్‌మన్, నీతమ్మ, గురమ్మ, రమణమ్మ, అన్నపూర్ణ, రమాదేవి, జాకోబ్, మరియమ్మలు పాల్గొన్నారు.

వసతులు లేని డిగ్రీ కళాశాలలపై చర్యలు తీసుకోండి

జమ్మలమడుగు రూరల్: కడపజిల్లా యోగివేమన విశ్వవిద్యాలయం అనుబం ధంగా ఉన్న డిగ్రీ కళాశాలల్లో ఎలాంటి వస తులు లేవని, జిల్లాస్థాయి అధికారులు తనిఖీలు చేసి చర్యలు తీసుకోవాలని ఏబీ వీపీ పట్టణ సెక్రటరి ఆవుల మధు హేమంత్ కుమార్‌రెడ్డి డిమాండ్ చేశారు. కళా శాలల్లో కనీస వసతులు కూడా సక్రమంగా లేవని, ద్విచక్ర వాహనాలు పెట్టుకోవడానికి కూడా ఇబ్బందికరంగా ఉందన్నారు. కళా శాలల్లో మైదానాలు లేకున్నా, రేకుల షెడ్లు ఉన్నా అనుమతులు ఇచ్చారని తెలిపారు. ఇప్పటికైనా అధికారులు కళాశాలలపై చర్యలు తీసుకోవాలని కోరుతున్నారు.

సమస్యలు సత్వరమే పరిష్కరిస్తాం

పెద్దముడియం: గ్రామాల్లో రెవెన్యూ సంబంధించిన సమస్యలు ఏవైనా ఉంటే రైతులు తమ దృష్టకి తీసుకొస్తే పరిష్కరిస్తామని ఇన్‌ఛార్జి తహసీల్దారు షఫి అన్నారు. మండల పరిధిలోని కల్వటాల, పాపాయపల్లె గ్రామాల్లో రైతు సేవలో రెవెన్యూ శాఖ కార్యక్రమం శుక్రవారం జరిగింది. ఈ సందర్భంగా ఆయా గ్రామాల్లో రైతులు అధికారుల దృష్టికి పలు సమస్యలు తెచ్చారు. అడంగల్‌లో సరిగా నమోదు లేవని, తప్పులు దొర్లాయని, ఇలా పలు సమస్యలను అధికారుల దృష్టికి తేగా పరిష్కరించేందుకు చర్యలు తీసుకుంటామని ఇన్‌ఛార్జి తహసీల్దారు రైతులకు హామీ ఇచ్చారు. ఈ సందర్భంగా షఫి మాట్లాడుతూ భూములకు సంబంధించిన సమస్యలు తమ దృష్టికి తెస్తే పరిష్కరిస్తామన్నారు. ప్రస్తుతం జరుగుతున్న రైతు సేవలో రెవెన్యూ శాఖ కార్యక్రమాన్ని ప్రజలందరూ సద్వినియోగం చేసుకోవాలని ఆయన కోరారు. కార్యక్రమంలో సర్వేయర్ హరిప్రసాద్, వీఆర్వో మల్లికార్జున, ఇతర రెవెన్యూ సిబ్బంది, రైతులు పాల్గొన్నారు.

ఘనంగా వరలక్ష్మీ వ్రతం

మైలవరం: మండలంలోని పలు గ్రామాల్లో, వేపరాలలోని శ్రీ సరస్వతి విద్యామందిరంలో సామూహిక శ్రీవరలక్ష్మి వ్రతాన్ని శుక్రవారం ఘనంగా నిర్వహించారు. అధిక సంఖ్యలో మహిళలు పాల్గొని పూజా కార్యక్రమాలు నిర్వహించారు. పాఠశాల అధ్యక్షుడు నాగప్ప మాట్లాడుతూ లక్ష్మిదేవి అష్టైశ్వర్య స్వరూపిణి అని, ఆమె 8 రూపాల ఏకస్వరూపం వరలక్ష్మి దేవి అన్నారు.





వైభవంగా లక్ష పుష్పార్చన

ప్రొద్దుటూరు టౌన్: స్థానిక పాత మార్కెట్‌లోని శ్రీ లలితాదేవి శ్రీరతనాల వెంకటేశ్వర స్వామి ఆలయంలో శుక్రవారం రాత్రి లక్ష పుష్పార్చనను ఘనంగా నిర్వహించారు. వరలక్ష్మివ్రతం సంధ్భంగా మహిళలు అధిక సంఖ్యలో పాల్గొని అమ్మవారి నామస్మరణ చేస్తూ పూజలు చేశారు. పూజల అనంతరం భక్తులకు తీర్థప్రసాదాలు పంపిణీ చేశారు. మహిలలు అమ్మవారికి కాయాకర్పూరం సమర్పించి అమ్మవారి ఆశీస్సులు పొందారు.

ఆరు గ్రామాలకు సాలీడ్ హెల్త్ మేనేజ్‌మెంట్ మంజూరు

జమ్మలమడుగు రూరల్: జమ్మలమడుగు మండలంలోని ఆరు గ్రామాలకు సాలీడ్ హెల్త్ మేనేజ్‌మెంట్ మంజూరైనట్లు ఏపీడీ ఉషారాణి తెలిపారు. శుక్రవారం సా యంత్రం జమ్మలమడుగు మండలంలోని గూడెం చెరువు గ్రామ పంచాయతీలో సమావేశం నిర్వహించారు. ఆమె మాట్లాడుతూ గ్రా మాల్లో శుభ్రత పాటించాలని, వ్యర్థప దార్థాలను ఎక్కడపడితే అక్కడ పడ వేయకుండా చెత్తకుండీల్లో వేయాలన్నారు. త్వరలో ఈ పథకం ప్రారంభిస్తామన్నారు. అందులో పెద్దదండ్లూరు, ఎస్.ఉప్పలపాడు, గొరిగెనూరు, దేవగుడి, సున్నపురాళ్లపల్లె, మోరగుడి గ్రామాలకు మంజూరైందని, మిగ తా ఏడు పంచాయతీలకు నివేదిక పంపించామ న్నారు. ఈ కార్యక్రమంలో ఎంపీడీవో మల్ల య్య, ఈవోపీఆర్డీ రషీద్, ఏపీవో మోహన్, సర్పంచులు, ఫీల్డ్ అసిస్టెంట్లు, టెక్నికల్ అసి స్టెంట్లు, ఈసీలు తదితరులు పాల్గొన్నారు.

సినిమా గైడ్

జమ్మలమడుగు

టీపీఆర్:	దండుపాళ్యం
టీఎన్ఆర్:	ఫిదా
సాయిరాం :	దువ్వాడ జగన్నాథమ్

వైభవంగా వరలక్ష్మీదేవి సామూహిక వ్రతాలు



లక్ష్మీదేవి అలంకారంలో మహాలక్ష్మి

ఎర్రగుంట్ల: శ్రావణ శుక్రవారం పురస్కరించుకుని ఎర్రగుంట్ల మండలంలోని వివిధ ఆలయాల్లో వరలక్ష్మీదేవి సామూహిక వ్రతాలు ఘనంగా నిర్వహించారు. కొన్ని ఆలయాల్లో ఉదయం నిర్వహించగా మరికొన్ని ఆలయాల్లో సాయంత్రం సామూహిక వరలక్ష్మీదేవి వ్రతాలు అత్యంత వైభవంగా నిర్వహించారు. చిలమకూరు శ్రీ వేంకటేశ్వర స్వామి ఆలయంలో శుక్రవారం సాయంత్రం సామూహిక వరలక్ష్మివ్రతం వందలాది మంది మహిళలతో నిర్వహించారు. శ్రీవరలక్ష్మీదేవి వ్రతాన్ని శ్రీలక్ష్మీదేవి అమ్మవారి సిన్నిదిలో కుంకుమార్చన, అభిషేకాదికార్యక్రమాలు నిర్వహించారు. ఈ వ్రతంవలన స్త్రీలకు సౌభాగ్యం కలుగుతుందని, సర్వసంపదలు కలుగుతాయని నమ్మకంతో ఈ పూజలు అత్యంతవైభవంగా భక్తిశ్రద్దలతో మహిళలు చేశారు. వేదమంత్రాలతో శాస్త్రోక్తంగా ఆలయ అర్చకులు మహిళలతో ఈ కార్యక్రమాన్ని రాత్రి 9గంటల వరకు పూజాకార్యక్రమాలను నిర్వహించారు.

● అలాగే ఎర్రగుంట్ల సాయిబాబాఆలయంలోను, అమ్మవారి శాలలోను ఈ సామూహిక వ్రతాలు చేశారు.

● ఆర్టీపీపీలోని ఫౌంటేన్ వద్దనున్న రావి చెట్టు, వేపచెట్టు వద్దకూడా వెంకటయ్య ఆధ్వర్యంలో ప్రత్యేక పూజా కార్యక్రమంలో నిర్వహించారు. కుంకమార్చన, అమ్మవారికి ప్రత్యేక అలంకరణ చేశారు.

గంగమ్మ హుండీ ఆదాయం రూ.2.84 లక్షలు

సీకేదిన్నె: గంగమ్మ హుండీ ఆదాయం రూ.2.84లక్షలు వచ్చినట్లు దేవాదాయశాఖ ఇన్‌స్పెక్టర్ శ్రీనివాసులురెడ్డి తెలిపారు. గంగమ్మ ఆలయంలో భక్తులు, అధికారుల సమక్షంలో శుక్రవారం హుండీ లెక్కించారు. ఈ సందర్భంగా వచ్చిన ఆదాయాన్ని ఆలయంపేరుతో బ్యాంకులో జమచేస్తామన్నారు. కార్యక్రమంలో ఈవో వెంకటసుబ్బయ్య, శంకర్‌రెడ్డి, పుల్లయ్య, సుబ్బారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

పర్యావరణ పరిరక్షణ అందరి బాధ్యత - జేసీ

● కొప్పర్తి పారిశ్రామికవాడలో రైతుల అభిప్రాయ సేకరణ
● పర్యావరణానికి విఘాతం లేకుండా పరిశ్రమలు ఏర్పాటు చేయాలన్న ప్రజలు


మాట్లాడుతున్న జేసీ శ్వేతా తెవతీయ, హాజరైన ప్రజలు

సీకేదిన్నె: పర్యావరణ పరిరక్షణ అందరి బాధ్యత అని, అందుకు ప్రతి ఒక్కరు కృషి చేయాలని జిల్లా జాయింట్ కలెక్టర్ శ్వేతా తెవతీయ తెలిపారు. మండలంలోని కొప్పర్తి పారిశ్రామికవాడలో శుక్రవారం రైతులకు పర్యావరణంపై ప్రజాభిప్రాయ సేకరణ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ప్రభుత్వం సేకరించిన 6553 ఎకరాలలో పరిశ్రమల ఏర్పాటుకు కృషి చేయడం జరుగుతుందన్నారు. పారిశ్రామికవేత్తలు పర్యావరణానికి విఘాతం కలగకుండా పరిశ్రమలు ఏర్పాటు చేసేవిధంగా ఏపీఐసీసీ తగిన చర్యలు తీసుకుంటుందన్నారు. రైతులకు ఇబ్బందులు లేకుండా చూస్తామన్నారు.

కాలుష్యం లేకుంటే ఒకే...

పర్యావరణంపై ప్రజల అభిప్రాయ సేకరణలో కాలుష్యం లేని పరిశ్రమలు కోరుతున్నట్లు వెల్లడైంది. ప్రజాభిప్రాయ సేకరణలో ప్రజలు పాల్గొని తమ అభిప్రాయాలు వ్యక్తం చేశారు. మొదట కొప్పర్తికి చెందిన జనార్ధన్‌రెడ్డి మాట్లాడగా అనంతరం అంబవరం ఓబుల్‌రెడ్డి, తాడిగొట్ల ఓబుల్‌రెడ్డి, తాడిగొట్ల సుబ్బారెడ్డి, కొప్పర్తి లక్ష్మీనారాయణరెడ్డి, కొప్పర్తి అశోక్‌రెడ్డి, విశ్వనాధరెడ్డి ప్రజల పక్షాన తమ అభిప్రాయాలు తెలిపారు. కాలుష్యం లేని పరిశ్రమలు ఏర్పాటు చేస్తే తమకు ఎటువంటి ఇబ్బందులు వుండవన్నారు. తాగు, సాగునీటికి అవసరమైన చెరువులు కాలుష్యం కాకుండా చూడాలని కోరారు.

2వేల ఎకరాలకు అందనిపరిహారం

పీవోటీ భూములకు 2వేల ఎకరాలకు పరిహారం అందలేదని జేసీ దృష్టికి తీసుకువచ్చారు. ఇక ఎదురుచూడలేమని, తమ భూములు రిజిస్టర్ చేయించుకుంటామని, అందుకు అధికారులు ఇబ్బందులు పెట్టకుండావుండాలని కోరారు. జేసీ సమాధానమిస్తూ రైతుల సమస్యలు ప్రభుత్వం దృష్టికి తీసుకుపోయి పరిష్కరిస్తామన్నారు. కార్యక్రమంలో ఏపీఐఐసీ జడ్‌ఎం ఎ.విజయలక్ష్మి, జీఎం ఉమామహేశ్వరరావు, పర్యావరణ ఇంజనీరు శివారెడ్డి, ఇంజనీరు నరేంద్ర, సీకేదిన్నె,పెండ్లిమర్రి, వల్లూరు మండలాల తహసీల్దార్లు, వీఆర్‌వోలు పాల్గొన్నారు.

28 పరిశ్రమలు వచ్చే అవకాశం

కొప్పర్తి మెగా ఇండస్ట్రియల్ పార్కులో దాదాపు 28 పరిశ్రమలు వచ్చే అవకాశం వున్నట్లు అధికారులు అంచనా వేశారు. అందులో ఫార్మా రంగానికి సంబంధించి సింథటిక్ ఆర్గానిక్ పరిశ్రమ, పెయింట్, డైస్ ఇంటర్మీడియేట్, పెట్రో కెమికల్ సంబంధించినవి ఆర్‌అండ్‌డీ యూనిట్స్, టెక్స్‌టైల్స్, ఆహారపరిశ్రమ, సాఫ్ట్ డ్రింక్స్, మిల్క్, డెయిరీ, ఆగ్రోబేస్‌డు, గ్లాస్, ఆటోమొబైల్, ఎలక్ట్రికల్ మెషిన్స్, మెటలర్జికల్, లెడ్ బ్యాటరీస్, వేస్ట్ ఆయిల్, లూబ్రీ కౌంటింగ్‌ఆయిల్, సిమెంట్ తదితర పరిశ్రమలు వచ్చే అవకాశాలు వున్నట్లు అంచనా వేస్తున్నారు.

దశ తిరగనున్న కొప్పర్తి

దాదాపు పదేళ్ల తరువాత కొప్పర్తి పారిశ్రామికవాడల్లో పరిశ్రమల ఏర్పాటు కాబోతుండడంపై ప్రజలు హర్షం వ్యక్తం చేస్తున్నారు. ఇక్కడ పరిశ్రమలు ఏర్పాటు చేస్తే ఎంతోమందికి ఉపాధి లభించడంతో పాటు ఈ ప్రాంతం బాగా అభివృద్ధి చెంది జిల్లాలో ఒక ముఖ్య కేంద్రంగా ఏర్పాటయ్యే అవకాశం వుంది. ఈ ప్రాంతానికి బస్సు సౌకర్యంతో పాటు రైల్వే, విమాన సౌకర్యాలు కూడా కూతవేటు దూరంలో వుండడం గమనార్హం.

వరాలిచ్చే కల్పవల్లి.. వరలక్ష్మీదేవి

● ఇంటింటా వ్రతాలు, పూజలు

చెన్నూరు: సిరిసంపదలనిచ్చే శ్రీలక్ష్మిని శ్రావణమాసం రెండో శుక్రవారం రోజున వరలక్ష్మిగా, వరాలిచ్చే కల్పవల్లిగా పూజించారు. వరలక్ష్మీ వ్రతాన్ని ప్రజలు మండల వ్యాప్తంగా భక్తిశ్రద్ధలతో జరుపుకున్నారు. పలు రకాల పుష్పాలు, ఫలాలను, ప్రసాదాలను నైవేద్యంగా సమర్పించారు. కలశంలోకి వరలక్ష్మీదేవిని ఆవాహనం చేసి పూజలు చేశారు. వరలక్ష్మీవ్రతాలతో మండలవ్యాప్తంగా ఇళ్లల్లో మహిళల హడావుడి, చిన్నారుల సందడి కనిపించింది. మహిళలకు నాగులచవితి పూజలు, కార్తీకమాస కేదారనోముల తరువాత అత్యంత భక్తిగా నిర్వహించుకునే పూజ వరలక్ష్మీవ్రతమేనని చెప్పవచ్చు.

పెండ్లిమర్రిలో...: మండల పరిధిలోని


పెండ్లిమర్రిలో వ్రతం నిర్వహిస్తున్న దృశ్యం

పొలతల మల్లేశ్వరస్వామి సన్నిధిలో అలాగే వెయ్యినూతలకోన లక్ష్మీనరసింహస్వామి సన్నిధిలో శుక్రవారం నిర్వహించిన సామూహిక వరలక్ష్మీవ్రతానికి మహిళలు పెద్దఎత్తున హాజరయ్యారు. వేద పండితుల మంత్రోచ్ఛరణల మధ్య వ్రతం వైభవంగా జరిగింది. ఈ కార్యక్రమానికి ఈవో క్రిష్ణానాయక్, ఆలయ చైర్మన్ శంకర్‌రెడ్డిలు హాజరై పర్యవేక్షించారు.

వల్లూరులో...: మండల పరిధిలోని గ్రామాల్లో శ్రావణ శుక్రవారం సందర్భంగా మహిళలు తమ గృహాల్లో భక్తిశ్రద్ధలతో వరలక్ష్మీవ్రతం నిర్వహించారు. మహిళలు వాయినాలు ఇచ్చిపుచ్చుకున్నారు.


పూజలు చేస్తున్న దృశ్యం

పుట్టగొడుగుల్లో ఔషధ విలువలు : ఏడీఆర్


పుట్టగొడుగుల పెంపకంపై యువతనుద్దేశించి మాట్లాడుతున్న జేడీఏ ఠాగూర్‌నాయక్

సీకేదిన్నె: పుట్టగొడుగుల్లో అనేక ఔషధ గుణాలు వున్నాయని, వాటిని ఉపయోగించుకొని యాంటికేన్సర్, హైపోలిపిడిమిక్, హైపోకొలిస్టిరమిక్, యాంటి హైపర్ టెన్షన్ వంటి జబ్బులను నయం చేసుకోవచ్చని ఏడీఆర్ చిన్నమునిస్వామినాయుడు, జేడీఏ ఠాగూర్‌నాయక్ తెలిపారు. కృషి విజ్ఞాన కేంద్రంలో శుక్రవారం పుట్టగొడుగుల పెంపకంపై శిక్షణా కార్యక్రమం జరిగింది. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడుతూ పుట్టగొడుగుల్లో అనేక పోషక విలువలు వున్నాయన్నారు. వరి, గోధుమలో కన్నా అధిక ప్రొటీన్లు వున్నాయన్నారు. పీచు పదార్థం కూడా అధికంగావుందన్నారు. వ్యవసాయ పరిశోధన కేంద్రం శాస్త్రవేత్త కరుణాసాగర్, ఆత్మా పీడీ మైకేల్ రాజు పుట్టగొడుగుల ఉపయోగాలను వివరించారు. కార్యక్రమంలో కేవీకే శాస్త్రవేత్త రామలక్ష్మీదేవి, తదితరులు పాల్గొన్నారు. ఈ శిక్షణకు జిల్లాలోని వివిధ ప్రాంతాల నుంచి యువతీయువకులు హాజరయ్యారు.

ప్రజల తీర్పుతోనే రాజకీయ అధికారం

చెన్నూరు: ఎన్నికల సమయంలో ప్రజలిచ్చే తీర్పుతోనే రాజకీయ అధికారం వస్తుందని, అంతే తప్ప ఏ నాయకుడు కూడా తానే కాబోయే ముఖ్యమంత్రిని అని చెప్పుకుంటే రాదని టీడీపీ జిల్లా అధికార ప్రతినిధి ఆమూరి బాలదాసు అన్నారు. చెన్నూరులో శుక్రవారం ఆయన మాట్లాడుతూ రాష్ట్రంలో వైసీపీ సమావేశాల్లో మాట్లాడే ప్రతిపక్షనేత జగన్‌మోహన్‌రెడ్డి ముఖ్యమంత్రి కావాలని కంటున్న కలలు కల్లలేనన్నారు. పైగా 30ఏళ్లు తానే సీఎం అని మాట్లాడడం ఆయనకు రాజకీయ పరిణితి ఏమాత్రం వుందో తెలుస్తోందన్నారు. ముఖ్యమంత్రి తరువాత ప్రతిపక్షనేత బాధ్యత ఎంతో విలువైనదన్నారు. ఐదుకోట్ల మంది ప్రజలు వేసిన ఓట్లతో గెలిచిన ఎమ్మెల్యేల ద్వారా సీఎం పదవి అర్హులకు దక్కుతుందన్నారు. అలాంటి పదవిలో ఏ నేతలు వుంటారో వారిని గౌరవించాల్సిన బాధ్యత అందరికీ వుందన్నారు. ప్రతిపక్ష నేత జగన్ జీర్ణించుకోలేని మాటలు మాట్లాడడం తగదన్నారు. దేశరాజకీయాల్లో ఎంతో గొప్ప నేతగావున్న ముఖ్యమంత్రి ఎప్పటికీ సీఎంగానే వుంటారన్నారు. ఇప్పటికైనా ప్రతిపక్ష నేత తన పద్ధతి మార్చుకుని రాష్ట్రాభివృద్ధిలో సహకరిస్తే ప్రజలు ఆయనకు తగిన గౌరవమిస్తారని సూచించారు.

'రైతు సేవకే రెవెన్యూశాఖ పని చేస్తోంది'

చెన్నూరు: రైతు సేవకు రెవెన్యూశాఖ పూర్తిస్థాయిలో ముందుంటుందని తహసీల్దార్ సత్యానందం అన్నారు. రైతు సేవలో రెవెన్యూశాఖ కార్యక్రమం శుక్రవారం మండలంలోని శాటిలైట్ సిటీ, చిన్నమాచుపల్లెలో జరిగింది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రైతుల చెంతనే రెవెన్యూ అధికారులు వున్నారని, వీలైనంత వరకు వారి భూములకు సంబంధించిన అన్ని సమస్యలు తీర్చుకోవాలన్నారు. ప్రతి భూమి వివరాలు ఆన్‌లైన్‌లో వుంటాయన్నారు. అనంతరం మాజీ జడ్పీ ఉపాధ్యక్షుడు జి.లక్ష్మీరెడ్డి తన భూ సమస్యపై తహసీల్దార్‌కు వినతిపత్రం ఇచ్చారు. కార్యక్రమంలో సర్వేయర్ నాగభూషణరెడ్డి, ఆర్‌ఐ రవి, వీఆర్‌వోలు పాల్గొన్నారు

సినిమాగ్రేడ్

కమలాపురం	
ప్రదీప్	: ఫిదా
చెన్నూరు	
కృష్ణ	: నిన్ను కోరి

లబ్ధిదారులకు సహకరించాలి

యూనిట్లు బాగా నిర్వహిస్తేనే పూర్తి రుణమన్న బ్యాంకు అధికారులు


బ్యాంకు అధికారులతో మాట్లాడుతున్న ప్రత్యేక అధికారి

చెన్నూరు: ఎస్సీ, ఎస్టీ, కాపు, బీసీ, మైనార్టీ రుణాల కోసం దరఖాస్తు చేసుకున్న లబ్ధిదారులు అర్హులుగా ఎంపికైతే బ్యాంకు అధికారులు సహకరించాలని, వారికి సకాలంలో పూర్తిగా రుణం అందించాలని మండల ప్రత్యేక అధికారి, స్టెప్ సీఈవో మమత అన్నారు. ఈనెల 10వ తేదీన జరగబోయే లబ్ధిదారుల ఎంపికకై ముందుగానే స్క్రీనింగ్ ఎలా చేయాలన్న విషయమై స్థానిక ఎంపీడీవో సభాభవనంలో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ లబ్ధిదారులు ఎక్కడ యూనిట్లు ఏర్పాటు చేస్తారో వెళ్లి పరిశీలించినా మంచిదేనన్నారు. చెన్నూరు ఎస్‌బీఐ, ఏపీజీబీ, రామనపల్లె ఏపీజీబీ మేనేజర్లు మాట్లాడుతూ యూనిట్ కొన్ని ఇళ్లల్లో కనిపించడం లేదన్నారు. రెండు లక్షల వరకు వున్న యూనిట్‌కు ఎలాంటి ష్యూరిటీ తీసుకోవడం లేదన్నారు. ఎస్టీలకు ట్రాక్టర్ రుణంగా ఇస్తామని చెప్పిన ప్రభుత్వం సబ్సిడీ కేవలం లక్ష, బ్యాంకు రుణం రూ.7 లక్షలు వుందన్నారు. అలాంటప్పుడు బ్యాంకు ష్యూరిటీ లేకుండా ఇవ్వడం కుదరదన్నారు. పాడి రైతులు ఆవుల కోసం దరఖాస్తు చేసుకున్నారని, ఇక్కడ జిల్లాలో గేదెలు మాత్రమే అవకాశం వుందన్నారు. బర్రెలు కావాలంటే ఇతర రాష్ట్రాల్లో, గొర్రెలు కావాలంటే ఇతర జిల్లాల్లో కొనుగోలు చేయాలన్నది నిబంధన అన్నారు. ఎంపీడీవో మహబూబ్‌బీ మాట్లాడుతూ మొత్తం 341 దరఖాస్తులు వచ్చాయని, అన్నింటినీ ముందుగానే బ్యాంకులకు ఇస్తున్నట్లు తెలిపారు. సమావేశంలో ఎంపీపీ బాలమ్మ, మండల నేతలు బుజ్జన్న, అస్రత్, చీర్ల సురేష్‌యాదవ్, పశువైద్యాధికారి డాక్టర్ శ్రీకాంత్‌రెడ్డి పాల్గొన్నారు.

మహిళలు వంటింట్లో జాగ్రత్తలు వహించాలి

పులివెందుల టౌన్: మహిళలు వంటింట్లో గ్యాస్ స్టౌ వద్ద జాగ్రత్తలు వహించాలని అగ్నిమాపక శాఖ అధికారి వెంకటచలపతి పేర్కొన్నారు. శుక్రవారం సీయోనుపురంలో ఆశ వర్కర్లకు, డ్వాక్రా మహిళలకు అగ్నిప్రమాదాలపై అవగాహన చేపట్టారు. కార్యక్రమంలో ఆయన మాట్లాడుతూ వంటింట్లో గ్యాస్ స్టౌ వద్ద అదనపు నిండుసిలిండర్‌ను ఉంచరాదన్నారు. గ్యాస్ స్టౌ వద్ద వెలుతురు ఉండేలా చూసుకోవాలన్నారు. వంట అయిపోగానే సిలిండర్‌ను ఆఫ్ చేయాలన్నారు. ఇంట్లో విద్యుత్, కిరోసిన్ స్టౌలు వెలిగించేటపుడు జాగ్రత్తలు పాటించాలన్నారు.

వరాలీయవే మాయమ్మా...



సింహాద్రిపురంలో ప్రత్యేక అలంకరణలో లక్ష్మిదేవి అమ్మవారు, వేంపల్లెలో వ్రతం చేస్తున్న మహిళలు, పులివెందులలో ప్రత్యేక అలంకరణ..

పులివెందుల టౌన్: శ్రావణ మాసం రెండో శుక్రవారం వరలక్ష్మీ వ్రతం. ప్రతి ఇంటా అమ్మవారిని కొలువుదీర్చి మహిళలు వరాలు కోరుకుంటారు. వేకువ నుంచి ఇళ్లలో పూజా మండపాల్లో బియ్యంపిండితో ముగ్గులు వేసి కలశాలలు ఏర్పాటు చేశారు. కలశాలలో బంగారు, వెండితో తయారు చేసిన వరలక్ష్మి అమ్మవారిని ఉంచి నైవేద్యాలు సమర్పించి ప్రత్యేక పూజలు చేశారు. సాంప్రదాయబద్ధంగా వరలక్ష్మి వేడుకలను ఘనంగా నిర్వహించుకున్నారు. బంగారు, వెండి, డబ్బును పూజా గదిలో ఉంచి ప్రత్యేక పూజలు చేశారు. వివిధ రకాల పూలతో అమ్మవారిని అలంకరించారు. అమ్మవారికి తొమ్మిది రకాల పిండివంటలు తయారు చేసి నైవేద్యంగా పెట్టారు. ముత్తైదువులను ఇంటికి పిలిచి పసుపుకుంకుమ, గాజులు, తాంబూలాలు వాయనం ఇచ్చారు. స్థానిక అంకాళమ్మగుడిలో కమిటీ ఛైర్మన్ గంగాధర్‌రెడ్డి ఆధ్వర్యంలో, బ్రాహ్మణపల్లె రోడ్డులోని సుంకుల పరమేశ్వరి ఆలయంలో వరలక్ష్మీ వ్రతాన్ని ఘనంగా నిర్వహించారు. నారాయణ కళాశాల సమీపంలోని నాగిరెడ్డి ఇంటి వద్ద వరలక్ష్మీ వ్రతాన్ని నిర్వహించారు. సరస్వతి విద్యామందిరంలో వ్రతం పురస్కరించుకుని మహిళలు ప్రత్యేక పూజలు నిర్వహించారు. నలంద పాఠశాల కరస్పాండెంట్ సోమశేఖర్‌రెడ్డి, వెంకటస్వామిరెడ్డి ఆధ్వర్యంలో వరలక్ష్మీ వ్రతాలను ఘనంగా నిర్వహించారు. బాలికలు అష్టలక్ష్ముల వేషధారణల్లో ప్రత్యేకంగా ఆకట్టుకున్నారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు, విద్యార్థుల తల్లిదండ్రులు వరలక్ష్మి వ్రతం చేసుకున్నారు.

వేంపల్లెలో....

వేంపల్లె: వేంపల్లెలో సామూహిక వరలక్ష్మీ వ్రతం వేడుకగా నిర్వహించారు. స్థానిక నాలుగు రోడ్ల కూడలిలోని వేంకటేశ్వరస్వామి ఆలయంలో శ్రావణ శుక్రవారం ఉదయం సామూహిక వరలక్ష్మీ వ్రతం నిర్వహించారు. ఆలయ పూజారి శ్రీనాథ్, శేషాద్రి ఆధ్వర్యంలో వ్రత పూజలు నిర్వహించగా మహిళలు కళశాలు వెంటతెచ్చుకుని పూజల్లో పాల్గొన్నారు.

ఓంశాంతి కార్యాలయంలో...

ఓంశాంతి కార్యాలయంలో వరలక్ష్మీ వ్రతం ఘనంగా నిర్వహించారు. గాంధిరోడ్డులో ఉన్న ప్రజాహిత బ్రహ్మకుమారి ఈశ్వరీయ కార్యాలయంలో శుక్రవారం సాయంత్రం వరలక్ష్మీ వ్రత వేడుకలు నిర్వహించారు.

తొండూరులో...

తొండూరు: శ్రావణ శుక్రవారం పురస్కరించుకుని వరలక్ష్మీ వ్రతం ఘనంగా నిర్వహించారు. మల్లేలలో నాగరాజశర్మ ఆధ్వర్యంలో కుడుముల లోకేష్ ఇంట్లో వరలక్ష్మీ వ్రత పూజలు చేశారు. ఈ సందర్భంగా అమ్మవారిని ప్రత్యేకంగా అలంకరించి, కలశాన్ని స్థాపించి పూజలు చేశారు

సింహాద్రిపురంలో...

సింహాద్రిపురం: నిడివెలగల ఆంజనేయ స్వామి ఆలయంలో గురిజాల అప్పస్వామి ఆలయంలో వరలక్ష్మీ వ్రతాన్ని ఘనంగా నిర్వహించారు. మహిళలు భక్తిశ్రద్ధలతో వరలక్ష్మీ అమ్మవారికి ప్రత్యేక పూజలు చేశారు. ఒక్కో ఇంటి నుంచి ఐదుగురు మహిళలకు పసుపు, కుంకుమ, గాజులు, తాంబూలం, జాకెట్‌పీస్ తదితర వస్తువులు ఇచ్చి వాయనం ఇచ్చి సాగనంపారు. ఎక్కడచూసినా మహిళలు ప్రత్యేక కొత్తదుస్తులతో లక్ష్మిదేవిల్లా వీధుల్లో దర్శనమిచ్చారు. ప్రత్యేక భక్తిశ్రద్ధలతో వరలక్ష్మి వ్రతాన్ని ఘనంగా చేశారు.

ప్రత్యేక శిక్షణకు సురేష్‌బాబు



భువనేశ్వర్‌లో జరుగుతున్న శిక్షణకు హాజరైన వారు

సింహాద్రిపురం: సాంకేతిక నాయకత్వ లక్షణాలపై భువనేశ్వర్‌లో జరిగిన ప్రత్యేక శిక్షణకు సింహాద్రిపురం పాలిటెక్నిక్ కళాశాల సీనియర్ అధ్యాపకుడు సురేష్‌బాబు వెళ్లినట్లు తెలిపారు. ఆయన విలేకరులతో మాట్లాడుతూ యునైటెడ్ కింగ్‌డం, ఇండియా సంయుక్తంగా నిర్వహించిన అఖిలభారత శాస్త్ర సాంకేతిక మండలి న్యూఢిల్లీ ఆధ్వర్యంలో సివి రామన్ కాలేజ్ ఆఫ్ ఇంజనీరింగ్ భువనేశ్వర్‌లో మూడు రోజుల శిక్షణ జరిగిందన్నారు. డూడ్లీ కాలేజ్ బర్మింగ్‌హాం బ్రిటన్ వారు శిక్షణ ఇచ్చారన్నారు. 1043 మంది దరఖాస్తు చేసుకోగా కేవలం వంద మందికి మాత్రమే అవకాశం ఇచ్చారన్నారు. ఏపీ నుంచి సురేష్‌బాబు ఒక్కరే ఎంపిక కావడం విశేషం. ఈ శిక్షణలో 23 రాష్ట్రాల వారు పాల్గొన్నారన్నారు.

రోడ్డుకిరువైపులా మొక్కలు సంరక్షిస్తాం : ఏపీఎం



మొక్కలు నాటేందుకు సర్వే చేస్తున్న ఏపీఎం

వేంపల్లె: రోడ్డుకిరువైపులా మొక్కలు నాటి సంరక్షిస్తామని ఏపీఎం ఖాదర్‌వల్లి పేర్కొన్నారు. వేంపల్లె పట్టణ సమీప గురుకుల పాఠశాల వద్ద కుప్పాలపల్లెకు వెళ్లే రోడ్డులో ఇరువైపులా కిలోమీటర్ పాటు మొక్కలు నాటేందుకు శుక్రవారం సర్వే చేశారు. 400 మొక్కలు నాటేందుకు శ్రీరామ ఎస్‌హెచ్‌జీ సభ్యులు లక్ష్మిదేవి, దేవికి అప్పగించామన్నారు. మూడేళ్ల మొక్కల పెంపకం కోసం ఉపాధి హామీ నుంచి నిధులు సమకూరుతాయని ఏపీఎం తెలిపారు. కార్యక్రమంలో ఏపీఎంలు గురురాజ్, వెంకటేశ్వర్‌రావు, సీసీలు రామలింగయ్య, సదాశివుడు, ఉపాధి హామీ ఫీల్డ్ అసిస్టెంట్ గంగాధర్ తదితరులు పాల్గొన్నారు.

వైభవంగా శ్రీమహాలక్ష్మీ ఆలయ వార్షికోత్సవం

పులివెందుల టౌన్: ముద్దనూరు రోడ్డు టీటీడీ కళ్యాణమండప సమీప శ్రీచక్రసహిత శ్రీమహాలక్ష్మి ఆలయ పంచమ వార్షికోత్సవం వైభవంగా నిర్వహించారు. ఆలయ ఛైర్మన్ తూగుట్ల రామచంద్రారెడ్డి ఆధ్వర్యంలో కన్నులపండువగా నిర్వహించారు. శ్రావణ శుక్రవారం సందర్భంగా అమ్మవారిని ప్రత్యేకంగా అలంకరించి అభిషేకాదిపూజలు నిర్వహించారు. అమ్మవారి మంగళ దివ్య స్వరూపాన్ని దర్శించుకునేందుకు మహిళలు పెద్ద సంఖ్యలో హాజరయ్యారు. అనంతరం కొత్తగా నిర్మించిన ఆస్థాన మంటపం ప్రారంభించారు. భక్తులకు తీర్థప్రసాదాలను పంపిణీ చేశారు.

గ్రామోత్సవం

శ్రీచక్రసహిత శ్రీమహాలక్ష్మి ఆలయ పంచమ వార్షికోత్సవం సందర్భంగా శుక్రవారం సాయంత్రం అమ్మవారిని తమిళనాడు అంబురి శిల్ప కళాకారులు గంధంతో చేయించి ప్రత్యేక వాహనంపై అలంకరించి గ్రామోత్సవం ఘనంగా నిర్వహించారు. ఈ గ్రామోత్సవం ముద్దనూరు రోడ్డు నుంచి శ్రీనివాస థియేటర్, ముత్యాలవారి వీధి, అమ్మవారిశాల వీధి, మెం యిన్ బజార్ మీదుగా నిర్వహించారు. ఈ గ్రామోత్సవం వెంట భక్తులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు. అలాగే శనివారం సాయంత్రం 6 గంటలకు శ్రీమన్నారాయణ స్వామి కళ్యాణం నిర్వహించనున్నట్లు ఆలయ నిర్వాహకులు తెలిపారు. భక్తులు కళ్యాణం చూసి తరించాలని కోరారు.



'వైశ్యుల పట్ల జగన్ ప్రకటన హర్షణీయం'

పులివెందుల టౌన్: తాము అధికారంలోకి రాగానే ఆర్యవైశ్య కార్పొరేసన్ ఏర్పాటు చేస్తానని ప్రతిపక్షనేత వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ప్రకటించడం హర్షణీయమని పులివెందుల ఆర్యవైశ్య నేతలు పేర్కొన్నారు. శుక్రవారం వారు విలేకరులతో మాట్లాడుతూ గురువారం నంద్యాల బహిరంగ సభలో వైఎస్ జగన్ ఆర్యవైశ్య కార్పొరేషన్ ఏర్పాటు చేస్తానని ప్రకటించడం హర్షణీయమన్నారు. ఆర్యవైశ్య కార్పొరేషన్ ఏర్పాటుపై ప్రభుత్వానికి ఇప్పటికే అనేకమార్లు విన్నవించినా ఏమాత్రం పట్టించుకోలేదన్నారు. ఆర్యవైశ్యుల్లో దారిద్ర్యదిగువ జీవిస్తున్న వారిని ఆదుకోవడానికి ప్రత్యేక కార్పొరేషన్ అవసరమన్నారు. కార్యక్రమంలో పులివెందుల ఆర్యవైశ్య సంఘం సెక్రటరీ పట్టాభి రామయ్య, సలహా సంఘ సభ్యులు కరుణాకర్, గంగాధర్, జిల్లా ఆర్యవైశ్య యువజన అధ్యక్షుడు పబ్బతి రాము, కార్యదర్శి చంద్రమౌళి పాల్గొన్నారు.

మండల మీట్ సాధారణం

వేముల: శుక్రవారం స్థానిక ఎంపీడీఓ కార్యాలయ సభాభవనంలో జరిగిన మండల సమావేశం సాదాసీదాగా జరిగింది. ఎంపీపీ లింగాల ఉషారాణి అధ్యక్షతన ఎంపీడీఓ శివప్రసాద్‌రెడ్డి ఆధ్వర్యంలో ఈ సమావేశం జరిగింది. ఈ సందర్భంగా మండల అభివృద్ధి పనులు, తాగునీరు, పారిశుధ్యంపై చర్చించారు. అనంతరం అన్ని శాఖల అధికారులు తమ శాఖల అభివృద్ధి, ప్రణాళికలను చదివి వినిపించారు. తహసీల్దార్ చిన్నయ్య ఎంఈఓ రామ్మోహన్‌రెడ్డి, ఏపీ ఎం గురురాజ్, ఏపీఓ గంగరాజు, ఏఓ శ్రీవాణి, డాక్టర్ శ్రీధర్‌రెడ్డి, హౌసింగ్ ఏఈ శ్రీనివాసులు, ఆర్‌డబ్ల్యూఎస్ ఏఈ శివారెడ్డి, సర్పంచులు పాల్గొన్నారు.

గృహ నిర్మాణాలకు భూమి సర్వేపూర్తి

పులివెందుల టౌన్: పులివెందుల మున్సిపల్ పరిధిలో ప్రధానమంత్రి ఆవాస్‌యోజన పథకానికి సంబంధించి గృహ నిర్మాణాలకు 23.39ఎకరాల భూమి సర్వే పూర్తిచేసినట్లు తహసీల్దార్ ఎల్వీప్రసాద్ పేర్కొన్నారు. శుక్రవారం మున్సిపల్ టీపీఓ కృష్ణాసింగ్‌తో కలిసి పట్టణంలోని రింగు రోడ్డు, న్యాక్‌బిల్డింగ్ సమీపంలో 23.39 ఎకరాల భూమిని గుర్తించి కలెక్టర్ బాబూరావునాయుడుకు నివేదిక పంపినట్లు ఆయన తెలిపారు. అనంతరం కార్యాలయంలో వీఆర్వోలు, సర్వేయర్‌తో సమీక్షించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పులివెందుల పరిధి గ్రామాల్లో చుక్కల భూములను, డీకేటీ, అసైన్‌మెంట్, ప్రభుత్వం ఇళ్లకు ఇచ్చిన భూములకు డి-ఫారంను ఉండేలా చూడాలన్నారు. చుక్కల భూములు ఎక్కడైనా ఉంటే వాటిని గుర్తించి నివేదిక ఇవ్వాలని వీఆర్వోలకు సూచించారు. ప్రభుత్వ భూమి కబ్జాలకు గురైతే వాటిని గుర్తించి నోటీసులు పంపాలన్నారు. ప్రభుత్వ భూముల్లో బోర్డులను ఏర్పాటు చేయాలన్నారు. కార్యక్రమంలో సర్వేయర్ ప్రభాకర్, వీఆర్వోలు పాల్గొన్నారు.

జింక్, జిప్సంలను రైతులు సద్వినియోగం చేసుకోవాలి

తొండూరు: ప్రభుత్వం వందశాతం సబ్సిడీతో ఇస్తున్న జింక్, జిప్సంను రైతులు సద్వినియోగం చేసుకోవాలని ఏఓ కిషోర్‌నాయక్ తెలిపారు. ఈ సందర్భంగా శుక్రవారం 20 మంది రైతులకు జింక్, జిప్సంలను పంపిణీ చేశామని ఏఓ తెలిపారు. 2017లో మట్టి పరీక్షలు చేయించుకున్న రైతులకు మాత్రమే వీటిని సరఫరా చేస్తామన్నారు.